H9551

శ్రీమతే రామానుజాయ నమః



# శ్రీ మాలికా స్తుతి

తొండరడిప్పొడి ఆళ్వారుల తిరుమాలై ప్రబంధముపై
ఆంధ్ర వివరణము

ఆంధ్ర వివరణము
**శ్రీ. ఉ.వే. శ్రీ. న. చ. రఘునాథాచార్యస్వామివారు**

ప్రచురణము
**సత్సంప్రదాయ పరిరక్షణ సభ, వరంగల్ - 2**

ఎనిమిదవ పుష్పం
ప్రతులు 1000
1992

PLACED ON THE SHELF
Date..............................

అన్ని హక్కులు
సత్సంప్రదాయ పరిరక్షణసభ
వరంగల్ వారివి.

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE,
Acc. 49551
Date..............................
TIRUPATI.

ప్రతులకు :

1. గీతాభవనమ్,
జె. పి. యన్. రోడ్, వరంగల్ (ఆం. ప్ర.)

2. శ్రీ రామానుజవాణి.
11-49-136, శివాలయం వీధి.
విజయవాడ - 520 001.

వెల : 20-00

ముద్రణము :


వేంకటరమణ బుక్ ప్రింటర్స్
జె. పి. యన్. రోడ్, వరంగల్.

శ్రీమతే రామానుజాయ నమః



శ్రీ వేంకటాద్రి నిలయః - కమలా కాముకః పుమాన్

**అభంగుర విభూతిర్నః** - తరంగయతు మంగళమ్॥



ఈ "**శ్రీమాలికా స్తుతి**" గ్రంథ ప్రచురణకు రూ. 10,000/-

(పదివేల రూపాయలు) ఆర్థిక సహకారము నందించిన

**తిరుమల తిరుపతి దేవస్థానమువారికి మా హార్దిక కృతజ్ఞతలు**

**శ్రీ. న. చ. రఘునాథాచార్యులు**

సత్సంప్రదాయ పరిరక్షణ సభ, వరంగల్.

# మా మనవి

ప్రియ భాగవతులకు మా చిన్న మనవి. భగవద్రామానుజులు ప్రబోధించిన సత్సంప్రదాయమునకు విపుల ప్రచారము నాపాదించుటకై ఏర్పడిన ఈ సభ మూడు సంవత్సరములుగా అనేక సంప్రదాయ రహస్యములను ఆవిష్కరించిన సద్గ్రంథములను ప్రకటించుచున్న విషయము సుప్రసిద్ధము. జిజ్ఞాసతోను ఆసక్తితోను మా గ్రన్థములను పఠించిన సహృదయులు కొందరు తమ హార్దిక ప్రశంసలను అందజేయుటయే గాక సభ్యత్వమునుగూడ స్వీకరించిరి. మంచిదే.

కాని మాకు ఈ కొద్ది మాత్రముచే సంతోషముగాని తృప్తిగానిలేదు. మాది పేరాస. మా ప్రయత్నము ప్రయాసగూడ పెద్దది. మన మనుభవించవలసిన ఉజ్జీవించవలసిన సంప్రదాయము పవిత్రమైనది విశిష్టమైనది మధురమైనది. ఇట్టి విషయమున మా ప్రయాసకు తగిన సమగ్రమైన ఫలితము కలుగుటలేదే అన్నదే మా ఆవేదన.

మన ఆంధ్ర రాష్ట్రములోని మూడు ప్రాంతములలోను ఆధ్యాత్మికముగా మన శ్రీవైష్ణవ సంప్రదాయముపై విశ్వాసము కలిగిన కుటుంబములు కొన్నివేలు మాత్రమే కాదు లక్షలకు మించి యుండవచ్చును. అందులో పదవవంతువారిలోనైనను మా కృషి పరివర్తనమును కలిగింపలేదే! కేవలము లౌకిక విషయములలోనే ప్రవృత్తిని పెంచుకొని జీవించుచున్న మన సంప్రదాయ కుటుంబము లెన్నియో ఈ మహత్తర సద్విషయముపై తమ అభిమానమును జిజ్ఞాసాపూర్వకమైన హృదయమును కొంచమైనను సాధించుటలేదే! ఇది సంప్రదాయముపై వారికిగల ఉదాసీనతయా? తిరస్కారభావమా? లేక - వీరెవరు మాకు ప్రబోధించుటకని మాపై అనాదరమా? లేక ఇంకను మా కృషిలోనే ఏదైన లోపమున్నదా? ఇవి ఏవైనను హేతువులు కావచ్చును.

శక్తికొలది మా కృషి కొనసాగుచున్నది. ఇందు లోపముగాని స్వార్థముగాని అణుమాత్రము లేదు. కాని మీ ఉదాసీనతయే కారణము. ఒకసారి కొద్ది సమయమిచ్చి ఓపికతో మా గ్రంథములను చదవండి. మన సంప్రదాయములోని ఆశ్చర్యకరమైన విషయములను సదువదేశములను మధుర సందర్భములను రుచి చూడండి. అవశ్యము మీలో సంప్రదాయ శ్రద్ధ ఏర్పడి మంచి మార్పురాగలదని మా ప్రగాఢ విశ్వాసము. ప్రచారములోగాని మా వ్రాతలోగాని ఏవైనా లోపములుంటే నిస్సంకోచముగా ఎత్తి

చూపండి. తగిన సలహాలను ఇవ్వండి. తప్పకుండా స్వీకరిస్తాము. కాని మీ ఉదాసీనతనో తిరస్కారభావమునో భరింపలేము. "న శక్యంత ముపేక్షేయం- ప్రదీప్తం శరణం యథా" అనికదా మహనీయుల అభినివేశము. మీకు ఇందు రుచి ఏర్పడునట్లు ప్రబోధింపవలసిన బాధ్యత మాది. ఎంతో ఆర్తితో చేయు మా ప్రయాసను కనీసముగానైన సహృదయతతో స్వీకరించుట మీ కర్తవ్యము. లౌకిక ప్రవృత్తులపైగల మీ శ్రద్ధను కొంతయైననూ మన పెద్దలు శ్రమకోర్చి నేటివరకు అవిచ్ఛిన్నముగా నందించుచూ నిలబెట్టిన సంప్రదాయముపైగూడ చూపుటలో తప్పేమియులేదు గదా! ఆ శ్రద్ధతో ఒక్కసారి మా గ్రంథాలను చదవండి. ఇదే మా ప్రార్థన. ఆవేదన.

ఇప్పటివరకును పోషకులుగనో అభిమానులుగనో సభ్యత్వమును స్వీకరించిన వారి సంఖ్య వందకుమించలేదే- అని సిగ్గుపడుచున్నాము. సంప్రదాయ విష్ఠులైన ప్రియ భాగవతోత్తములారా! మీరు అర్పించు ధనముకాదు మాకు ముఖ్యము. మీరు చూపవలసిన ఆదరమే మా కృషికి మంచి ఉత్సాహమును మహానందమును ప్రసాదించును. మా కృషికి కీర్తి ప్రతిష్ఠలపైగాని ధనముపైగాని ప్రతిఫలాపేక్ష ఏ మాత్రము లేదని మనస్సాక్షికముగా మరొక మారు నివేదించుచున్నాము. మీరును ఈ సంప్రదాయ సేవలో యథాశక్తిగా అన్వయించి మీవలె ఇతరులకు మార్గదర్శకులు కండు. మహోన్నత శిఖరాగ్రములనందిన మన సంప్రదాయ వైభవమును మీరును ఇతరులకు ప్రబోధించి మా కృషిని ఫలవంతముచేయుడు. మీ భక్తిశ్రద్ధలను ప్రదర్శింపుడు.

శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారి శుభసంకల్పముతో ఆవిర్భవించిన సంస్థ ఇది. నానా ముఖముగా వ్యాపించిన ఆ స్వామివారి మహత్తర ప్రచారములలో ఇదొకమార్గము. ఉపన్యాస- ప్రవచనాదులకంటె ఈ సద్గ్రంథ ప్రచురణము చిరస్థాయియైన ఉత్తమ ప్రచారము. నేడు ఇది బహుధన సాధ్యమైనను అత్యావశ్యకము.

మరియొక మనవి. సంప్రదాయ ప్రబోధకులైన విద్వాంసులు పెద్దలు ఎందరో మనలో ఉన్నారు. లలిత మధురమైన భాషలో పరమార్థమునందించగల లేఖకులుగూడ ఎందరో మనలోకలరు. తామెరిగిన ప్రామాణికములైన సంప్రదాయ రహస్యములను గ్రంథరూపమున వ్రాసి మా కందించినచో అవశ్యము ప్రకటించగలము. ఒకరిద్దరు చేయు కృషి మాత్రమేచాలదు. కనుక రచయితలైన పండితోత్తముల తోడ్పాటును వినమ్రభావముతో మరల ఆహ్వానించుచున్నాము.

ఇప్పుడు ప్రకటితమైన ఈ తిరుమాలై ప్రబంధము పరమ ప్రామాణికులైన మన ఆళ్వారులలో నొకరగు శ్రీ విప్రనారాయణ మునీన్ద్రులు ప్రసాదించినది. మన వంటి పామరులను భక్తిమార్గమున ప్రవర్తించునట్లు ప్రబోధించుటలో వారి అభినివేశము ఆగ్రహము అప్రతిమానమైనది. ఇందలి ప్రతి ఒక్క పాశురము వారి హృదయావేదనకు తీవ్రతర ప్రబోధమునకు ప్రబలసాక్షియని చెప్పుట అతివాస్తవము. విశ్వాససంధేయమైన వారి తత్త్వోపదేశమును లోకమునకు అందించవలెనను సంకల్పముతో ఈ గ్రంథము ఆంధ్ర వివరణముతో ప్రకటింపబడినది. శ్రీరంగనాథునికి ఆప్తులైన ప్రియ భాగవతోత్తములకును ప్రేమోపహారముగా ఈ మా వివరణ గ్రంథము సమర్పితము.

పరమహంస పరివ్రాజకులైన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారి మంగళాశాసనము అనే పవిత్ర దోహదముతో ఈ సత్సంప్రదాయ పరిరక్షణ సత్కాకల్పలత అంకురదశను దాటి పల్లవితమై కుసుమితమై ఫలితమై నానా ముఖములుగా విస్తరించగలదనుటలో సందేహములేదు. ఈ గ్రంథ ప్రచురణకు అనుమతినిచ్చిన శ్రీవారి కృపకు మా సాదరాంజలి బంధముతో కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాము.

గ్రంథ ప్రకటనమునందు హార్దిక సహకారమునందించిన భాగవతుల కందరికిని ధన్యవాదములను తెలుపుచున్నాము.

అచిరకాలములో నిర్దుష్టముగా సుందరముగా గ్రంథమును ముద్రించి యిచ్చిన వేంకటరమణ బుక్ ప్రింటర్స్ వారికి శుభాకాంక్షలను అందజేస్తున్నాము. శుభమస్తు.

ఇట్లు విన్నవించు
భాగవత విధేయుడు
శ్రీ. న. చ. రఘునాథాచార్యులు
సభాధ్యక్షుడు

చూపండి. తగిన సలహాలను ఇవ్వండి. తప్పకుండా స్వీకరిస్తాము. కాని మీ ఉదాసీనతనో తిరస్కారభావమునో భరింపలేము. "న నశ్యంతి ముపేక్షేయం- ప్రదీప్తం శరణం యథా" అనికదా మహనీయుల అభినివేశము. మీకు ఇందు రుచి ఏర్పడునట్లు ప్రబోధింపవలసిన బాధ్యత మాది. ఎంతో ఆర్తితో చేయు మా ప్రయాసను కనీసముగానైన సహృదయతతో స్వీకరింపుట మీ కర్తవ్యము. లౌకిక ప్రవృత్తులపైగల మీ శ్రద్ధను కొంతయైననూ మన పెద్దలు శ్రమకోర్చి నేటివరకు అవిచ్ఛిన్నముగా సందించుచూ నిలబెట్టిన సంప్రదాయముపైగూడ చూపుటలో తప్పేమియులేదు గదా! ఆ శ్రద్ధతో ఒక్కసారి మా గ్రంథాలను చదవండి. ఇదే మా ప్రార్థన. ఆవేదన.

ఇప్పటివరకును పోషకులుగనో అభిమానులుగనో సభ్యత్వమును స్వీకరించిన వారి సంఖ్య వందకుమించలేదే- అని సిగ్గుపడుచున్నాము. సంప్రదాయ నిష్ఠులైన ప్రియ భాగవతోత్తములారా! మీరు అర్పించు ధనముకాదు మాకు ముఖ్యము. మీరు చూపవలసిన ఆదరమే మా కృషికి మంచి ఉత్సాహమును మహానందమును ప్రసాదించును. మా కృషికి కీర్తి ప్రతిష్ఠలపైగాని ధనముపైగాని ప్రతిఫలాపేక్ష ఏ మాత్రము లేదని మనస్సాక్షికముగా మరొక మారు నివేదించుచున్నాము. మీరును ఈ సంప్రదాయ సేవలో యథాశక్తిగా అన్వయించి మీవలె ఇతరులకు మార్గదర్శకులు కండు. మహోన్నత శిఖరాగ్రములనందిన మన సంప్రదాయ వైభవమును మీరును ఇతరులకు ప్రబోధించి మా కృషిని ఫలవంతముచేయుడు. మీ భక్తిశ్రద్ధలను ప్రదర్శింపుడు.

శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారి శుభసంకల్పముతో ఆవిర్భవించిన సంస్థ ఇది. నానా ముఖముగా వ్యాపించిన ఆ స్వామి వారి మహత్తర ప్రచారములలో ఇదొకమార్గము ఉపన్యాస- ప్రవచనాదులకంటె ఈ సద్గ్రంథ ప్రచురణము చిరస్థాయియైన ఉత్తమ ప్రచారము. నేడు ఇది బహుధన సాధ్యమైనను అత్యావశ్యకము.

మరియొక మనవి. సంప్రదాయ ప్రబోధకులైన విద్వాంసులు పెద్దలు ఎందరో మనలో ఉన్నారు. లలిత మధురమైన భాషలో పరమార్థమునందించగల లేఖకులుగూడ ఎందరో మనలో కలరు. తామెరిగిన ప్రామాణికములైన సంప్రదాయ రహస్యములను గ్రంథరూపమున వ్రాసి మాకందించినచో అవశ్యము ప్రకటించగలము. ఒకరిద్దరు చేయు కృషి మాత్రమే చాలదు. కనుక రచయితలైన పండితోత్తముల తోడ్పాటును వినమ్రభావముతో మరల ఆహ్వానించుచున్నాము.

ఇప్పుడు ప్రకటితమైన ఈ తిరుమాలై ప్రబంధము పరమ ప్రామాణికులైన మన ఆళ్వారులలో నొకరగు శ్రీ విప్రనారాయణ మునీన్ద్రులు ప్రసాదించినది. మన వంటి పామరులను భక్తిమార్గమున ప్రవర్తించునట్లు ప్రబోధించుటలో వారి అభినివేశము ఆగ్రహము అప్రతిమానమైనది. ఇందలి ప్రతి ఒక్క పాశురము వారి హృదయావేదనకు తీవ్రతర ప్రబోధమునకు ప్రబలసాక్షియని చెప్పుట అతివాస్తవము. నిత్యానుసంధేయమైన వారి తత్త్వోపదేశమును లోకమునకు అందించవలెనను సంకల్పముతో ఈ గ్రంథము ఆంధ్ర వివరణముతో ప్రకటింపబడినది. శ్రీరంగనాథునికి ఆప్తులైన ప్రియ భాగవతోత్తములకును ప్రేమోపహారముగా ఈ మా వివరణ గ్రంథము సమర్పితము.

పరమహంస పరివ్రాజకులైన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరుస్వామివారి మంగళాశాసనములు అనే పవిత్ర దోహదముతో ఈ సత్సంప్రదాయ పరిరక్షణ సభాకల్పలత అంకురదశను దాటి పల్లవితమై కుసుమితమై ఫలితమై నానా ముఖములుగా విస్తరించగలదనుటలో సందేహములేదు. ఈ గ్రంథ ప్రచురణకు అనుమతినిచ్చిన శ్రీవారి కృపకు మా పాదరాంజలి బంధముతో కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాము.

గ్రంథ ప్రకటనమునందు హార్దిక సహకారమునందించిన భాగవతుల కందరికిని ధన్యవాదములను తెలుపుచున్నాము.

అచిరకాలములో నిర్దుష్టముగా సుందరముగా గ్రంథమును ముద్రించి యిచ్చిన వేంకటరమణ బుక్ ప్రింటర్స్ వారికి శుభాకాంక్షలను అందజేస్తున్నాము. శుభమస్తు.

ఇట్లు విన్నవించు
భాగవత విధేయుడు
శ్రీ. న. చ. రఘునాథాచార్యులు
సభాధ్యక్షుడు

# కొత్తసభ్యుల నామధేయములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ V రామచంద్రరావుగారు (హైద్రాబాద్) | 116-00 |
| 2. | శ్రీ K. కిషన్‌రావుగారు (హైద్రాబాద్) | 116-00 |
| 3. | శ్రీ తిరువేంగడత్తాణ్గారు (సుబేదారి హనుమకొండ) | 116-00 |
| 4. | శ్రీ K. S. N. మూర్తిగారు, అడ్వకేట్ (హైద్రాబాద్) | 116-00 |
| 5. | శ్రీ S. కేశవులురెడ్డిగారు (హైద్రాబాద్) | 116-00 |
| 6. | శ్రీ T. రామచంద్రాచార్యులుగారు (వనస్థలిపురం) | 116-00 |
| 7. | డాక్టర్ G. సంపత్‌గారు (సికింద్రాబాద్) | 116-00 |
| 8. | శ్రీ ఉత్తలూరు శ్యామాచార్యులుగారు (హైద్రాబాద్) | 116-00 |
| 9. | శ్రీ మంత్రరత్నం సింహాచార్యులుగారు (వరంగల్) | 116-00 |
| 10. | శ్రీ కొండకండ్ల జానకిరామాచార్యులుగారు (కొండపాక) | 116-00 |
| 11. | శ్రీ A. రామమోహనరావుగారు | 116-00 |
| 12. | శ్రీ కందాడై శ్రీనివాసాచార్యులుగారు (వనస్థలిపురం) | 116-00 |
| 13. | శ్రీ అతి భాష్యకారాచార్యులుగారు (వనస్థలిపురం) | 116-00 |
| 14. | శ్రీభాష్యం వరదాచార్యులుగారు (హనుమకొండ) | 116-00 |
| 15. | శ్రీ చెక్కా వెంకటసుబ్బారావుగారు (ఒంగోలు) | 116-00 |
| 16. | శ్రీమతి దేవులపల్లి శారదగారు (హైద్రాబాద్) | 116-00 |
| 17. | శ్రీ A. ఆంజనేయులుగారు ,, | 116-00 |
| 18. | శ్రీ K. సోమయ్యగారు ,, | 116-00 |
| 19. | శ్రీ V.V. రంగాచార్యులుగారు ,, | 116-00 |
| 20. | శ్రీ P. రామానుజాచార్యులుగారు ,, | 116-00 |
| 21. | శ్రీమతి చిలకమర్రి అప్పలనర్సమ్మగారు ,, | 116-00 |

## రెండవ వాయిదా చెల్లించినవారు

| | | |
|---|---|---|
| 1 | శ్రీ A. శ్రీధర్‌గారు (వరంగల్) | 220-00 |
| 2 | డాక్టర్ S. S. రామాచార్యులుగారు (చిక్కడపల్లి) | 100-00 |

## మూడవ వాయిదా చెల్లించినవారు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ R. శేషగిరిరావుగారు, B. E. (హనుమకొండ) | 500-00 |

# ప్రతి పాశురమునగల ప్రతిపాద్యార్థ సంగ్రహము

1 పాశురమున నామసంకీర్తన ప్రభావముచే యమూమల తలదన్నితినని తెలిపిరి.

2 ,, ఆ సంకీర్తన మాధుర్యముచే పరమపదముగూడ నాకు వద్దని త్రోసి పుచ్చిరి.

3 ,, ఆ సంకీర్తన కైంకర్యమునకు విరుద్ధమగు ఈ ప్రాకృత జన్మము నాకు వద్దనిరి?

4 ,, క్షత్రబన్ధువువంటి పాపిష్ఠులకే సద్గతినిచ్చిన సంకీర్తనమునుమాని లోకులు చెడిపోవుచున్నారే అనిరి.

5 ,, దీనిని విడచి అల్పాస్థిర విషయములకై అరాటపడు లోకులమూర్ఖతను ఈసడించిరి.

6 ,, వాటి ననుభవించుటకు సాధనములైన దేహేన్ద్రియాదులును అస్థిరములేననిరి.

7 ,, వేదబాహ్యమతములకు లోనైనవారిని గూర్చి శ్రీరాముడే ఆశ్రయణీయ పరదైవమని తెలిపిరి

8 ,, భగవత్తత్త్వమును దూషించు ధూర్తులను చిత్రవధ చేయదగునని ఆగ్రహించిరి.

9 ,, అపేక్షకలవారందరును సర్వసులభుడైన శ్రీకృష్ణుని ఆశ్రయింపుడని బోధించిరి.

10 ,, దేవతాన్తరముల నాశ్రయింపక శ్రీరంగనాధుని సేవింపుడని ఉపదేశించిరి.

11 ,, శ్రీరంగనాధుని సేవకు నోచుకొననివారు గర్భనిర్భాగ్యులనిరి.

12 పాశురమున నరకమునే స్వర్గముగా మార్చగల నామ సంకీర్తనము చేయలేని వారి కష్టములను చూచి జాలిపడిరి.

13 ,, అందరును ఏకముఖముగా సంకీర్తన చేసినచో నరకమున గడ్డి మొలచి పోవుననిరి.

14 ,, తృప్తిగా తామొక్కరే శ్రీరంగనగర వైభవమును కీర్తించిరి.

15 ,, స్వామి తమకు చేసిన పూర్ణానుగ్రహమును ప్రస్తుతించిరి.

16 ,, క్షుద్ర విషయములపై నుండి నా మనస్సును మరల్చి తనపై భక్తిని కలిగించినట్లు చెప్పిరి.

17 ,, రంగనాథుని దివ్య సౌందర్యము నాస్వాదించి తమ నేత్రములు తృప్తినొందినవనిరి.

18 ,, ఆనందాశ్రువులే ప్రవాహమై స్వామి సేవకు అడ్డమైనట్లు వివరించిరి

19 ,, శేషశాయి సౌందర్యమును సేవించి తమ శరీరము పరవశమైనట్లు నిరూపించిరి.

20 ,, ఈ దివ్యావయవ సౌందర్యమును సేవించినవారు దీనిని విడిచి మరలిపోలేరు- అని కీర్తించిరి.

21 ,, ఈ శేషశయన సన్నివేశము మనస్సుతో నూహింపరానంత భోగ్యమైనది- అనిరి.

22 ,, వాక్కులతో వర్ణింపనలవికానిది ఈ మూర్తియనిరి.

23 ,, ఒక్కసారి కావేరి రంగని సేవించినచో ఇక ఎన్నటికిని మరచిపోజాలమని చెప్పిరి.

24 ,, ఆ పరమాత్మునిపై తమకు కలిగిన భక్తి కృత్రిమమేమోనని వెలితిపడిరి.

25 ,, శాస్త్రీయమగు భక్తియోగాదులు తమకు లేవని తెలిపిరి.

26 పాశురమున అందరికిని అర్హతకల అర్చన- స్తోత్రపాఠాదులను గూడ చేయలేకుంటినని సంకోచపడిరి.

27 ,, ఉడతలలో గల సేవాభావము గూడ తమలో లేదని వాపోయిరి.

28 ,, గజేంద్రునికి ఆపదలో కలిగిన ఆర్తి గూడ నాలో లేదనిరి.

29 ,, దివ్య దేశవాస భాగ్యముగూడ నాకు లేదని సంతాపము నొందిరి

30 ,, పై యోగ్యతలు లేకపోగా పశులను హింస పెట్టితిననిరి,

31 ,, నాకు సుఖమిచ్చినవారిని గూడ మోసగించితిననిరి.

32 ,, అయోగ్యుడనై గూడ నీ ముందు సాహసముతో నిలిచిన మూర్ఖుడను నేను అని విన్నవించిరి.

33 ,, అసత్యములనే పలుకుచూ సిగ్గులేక నీముందు నిలిచితినని చెప్పిరి

34 ,, దుష్టుడనగు నా సంబంధముచే స్వామికి దోషములంటునని వెనుకకు మరలిరి.

35 ,, ఐనను తన వాత్సల్యముచే నన్ను తిరిగి స్వామి దగ్గరకు తీసుకున్నాడనిరి.

36 ,, నన్నింకను పూర్ణముగా కటాక్షించి నీ వద్దకు చేర్చుకొనవేల? అని గట్టిగా ఆక్రందన చేసిరి.

37 ,, ఆ యాక్రందనను విని వెంటనే అనుగ్రహింపకుండుటచే స్వామి కరినుడేసుమా యనిరి.

38 ,, అనుగ్రహసూచకమగు స్వామి చిరునవ్వును గమనించి "నావంటి ప్రపన్నులపై ఆయనకెంత ప్రేమయో" అనిరి.

39 ,, జాతినిబట్టి హీనజన్మముగలవారైనను శరణాగతినిష్ఠులైన యెడల అందరికిని వారు పూజ్యులేననిరి.

40 పాశురమున జన్మనుబట్టియేగాక నడతనుబట్టియు వారు హీనులైనను భగవదేక నిష్ఠులేనచో వారికి కర్మఫలము అంటదనిరి

41 ,, ఆ ప్రపన్నులు జాతివృత్తములను బట్టి నిహీనులైనను తమ సంబంధముచే నితరులను పావనము చేయుదురనిరి.

42 ,, భగవంతునివలె ఆ భాగవతులును అందరికిని ఆరాధనీయులేననిరి.

43 ,, వారిని జన్మ వృత్తములనుబట్టి హీనులుగా భావించినచో ఎంత గొప్పవారైనను వెంటనే చండాలత్వమునొందుదురనిరి.

44 ,, బ్రహ్మాదులకును దుర్లభమైన ఫలమును శరణాగతిని చేసిన ఒక జంతువు (గజేంద్రుడు) పొందగలిగెననిరి.

45 ,, తమ ఈ స్తుతికి ఫలము భగవన్ముఖోల్లాసమేనని గ్రన్థమును ముగించిరి.

శ్రీమతే రామానుజాయ నమః

# ఉపోద్ఘాతము

అగాధ భగవద్భక్తి సింధువులు అని చెప్పదగిన ఆళ్వారులలో శ్రీ విప్రనారాయణులు ఒకరు. వీరికే శ్రీవైష్ణవ సంప్రదాయములో "తొండరడిప్పొడి ఆళ్వార్" అని ప్రసిద్ధమైన నామధేయము "భక్తాంఘ్రిరేణువు" అని పై ద్రవిడనామమునకు సరియైన అనువాదము. ఇది తమ వినయ సంపత్తిని భగవద్భాగవతులపై తమకు గల పరిపూర్ణ భక్తిని తెలుపుకొనుటకై ఈ ఆళ్వారులే నిర్ణయించుకున్న నామధేయము. వీరు ప్రసాదించిన 'తిరుప్పళ్ళియెళుచ్చి' (శ్రీరంగనాథ సుప్రభాతము) అను ప్రబన్ధములోను ఈ తిరుమాలై ప్రబన్ధములోను చివరకు "తొండరడిప్పొడి" అని తమ దాస్యనామమును వీరే చెప్పుకొనియున్నారు.

బాహ్య విషయములపైన పూర్ణ వైరాగ్యము, భగవన్నామామృతాస్వాదనమునందు అత్యంతమగు ఉత్కంఠ, భగవద్భాగవత విషయమున ప్రావణ్యము, ఇవి ఈ ఆళ్వారులలో అత్యున్నత స్థాయికి చెందియున్నవి, అను విషయము ఈ చిన్న శ్రీమాలికాస్తుతిలో స్పష్టమగును. నలువదియైదు ద్రవిడ గాథలతో కూడిన ఈ స్తోత్రములో ఎన్నో శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యార్థములు ఇమిడియున్నట్లు ద్రవిడ భాషలో వ్యాఖ్యానమును ప్రసాదించిన వ్యాఖ్యాతృ చక్రవర్తి శ్రీకృష్ణపాదగురువర్యులు (పెరియవాచ్చాంబిళ్ళై) విశదీకరించియున్నారు. ఆ యర్థ విశేషములను ఆన్ధ్ర దేశీయులైన శ్రీవైష్ణవ శిఖామణులగు సహృదయులకు అందించుటయే ఈ ఆన్ధ్ర వివరణమునకు ముఖ్య ప్రయోజనము. శ్రీరంగక్షేత్రమున కావేరీతీరమున ఉద్యానమును పెంచి అందలి పుష్పములతోను తులసితోను మాలికలనల్లి శ్రీరంగనాథునికి సమర్పించుటయే తన కైంకర్యవృత్తికి పరమావధిగా నెంచిన ఈ విప్రనారాయణ మునీన్ద్రులు భక్తి సురభితములైన మధురోక్తులతోగూడ ఒక చిన్న స్తుతిమాలికను కూర్చి ఆ స్వామికి సమర్పించిరి. అదియే తిరుమాలై అనబడు ఈ శ్రీమాలికాస్తుతి: "తిరుమాలై అరియాదవన్ పెరుమాళై అరియాన్" అని ఒక సామెత అరవదేశంలో ప్రచారము నొందినది. ఈ తిరుమాలై ప్రబన్ధమును ఎరుంగనివాడు భగవత్స్వరూపమును ఎరుంగ

జాలడు. అని ఈ సామెతకు అర్థము దీనిని బట్టియే ఈ ప్రబంధమునకు ఎంతటి ప్రచారము జనసామాన్యమున కలదో తెలిసికొనవచ్చును.

వీరికి ఆరాధ్య దైవమైనవాడు శ్రీరంగనాధుడు. కలియుగమున ముఖ్యముగా భగవన్నామానుసంధానమే తరణోపాయమను వాస్తవమును ఆయన వీరి హృదయమున దృఢముగా నాటినాడు దానిని గాఢముగా విశ్వసించిన వీరు నామ సంకీర్తనమే తమ నిత్య జీవనయాత్రగా ఆచరణలో పెట్టుకున్నవారు అట్లు భగవన్నామామృతమును తాము నిత్యము నాస్వాదించుటయేగాక లోకులకును అందు రుచి కలుగుటకై ఆ నామ సంకీర్తన పరిభావమెట్టిదో ఈ ప్రబంధమున ప్రబోధించియున్నారు. శ్రీరంగనాధునుగూడ వీరి ముఖమునుండి తన నామ వైభవమును విని ఆనందించుటకై వీరిచే ఈ స్తుతిని రచింపజేసి తృప్తిగా విన్నాడట. తన భక్తునినోట తన వైభవమును వినుట ఆయనకు సంతోషహేతువు. శ్రీరాముడు తన చరిత్రమునే వాల్మీకి రచింపగా కుశలవులద్వారా విని ఆనందపరవశుడై "మమాపి తద్భూతికరం ప్రచక్షతే" అని ప్రశంసించినాడుగదా.

## ఈ ఆళ్వారుల దివ్య చరిత్రము

భక్తుల జీవితములలో అనూహ్యములు అద్భుతములునైన పరిణామములను కలిగించి వినోదించుట భగవంతునికి పరిపాటి. వారిలోగల ప్రారబ్ధ కర్మశేషమును క్షయింపజేసి తన సన్నిధికి చేర్చుకొనుట అను నెపముతో ముందుగా వారి జీవితములో పరీక్షలనదగిన కొన్ని విచిత్ర సంఘటనములను ఆయన అపాదించును. ఈ విప్రనారాయణునకును ఆ స్థితి తప్పలేదు. భగవంతుని లీల అగమ్యగోచరము

పరమ వైరాగ్యశాలి భగవదేకనిష్ఠులునైన ఈ ఆళ్వారులు ఒకనాడు శ్రీ రంగనాధునికి తులసీ-పుష్ప-మాలికలను సమర్పించి తిరిగి తమ నివాసమగు తులసీవనములోని కుటీరమునకు వచ్చుచుండిరట. రాజసభలో నాట్యమాడి ఎన్నో బహుమతులందుకున్న ఒక అతిలోక సుందరియైన దేవదేవియను వేశ్య అదే సమయమున ఆ మార్గముననే తన సఖితో కలసి ఇంటికి పోవుచూ వీరిని దర్శించి భక్తి పురస్సరముగా ప్రణమిల్లెనట. భగవద్గుణానుభవములో దత్తచిత్తులైన వీరు అది గమనింపలేదు ఆమెను కన్నెత్తియైన చూడలేదు. అట్లు వీరు ముందుకు సాగిపోగా, ఆమెకు ఇది భరింపరాని అవమానమైనది తోక త్రొక్కిన తాచుపామువలె ఆమె ఆగ్రహించినది. ఒక సంవత్సరములోగా ఈ మునీన్ద్రుని తన లీలా విలాసములతో కామపరవశుని గావించి యోగభ్రష్టునిచేయుదునని తన సఖితో ప్రతిజ్ఞచేసినది. ఆ మరు

నటి దినముననే ఆమె కపట సన్యాసినీ వేషమున వచ్చి ఈ స్వామివారిని ఆశ్రయించి దీనాలాపములతో ఒప్పించి ఆశ్రమ సేవకురాలుగా చేరినది. కాయక్లేశమును గూడ లెక్కింపక అతివినయముతో ఘటదాసిగా ఉద్యానపాలికగా నిత్యమును వారికి తోడై సకల పరిచర్యలు చేయుచున్నది.

నిత్యము సన్నిహిత పరిచయము కలిగినను స్వామివారి మనస్సు చలించలేదు. ''వికారహేతౌసతి, విక్రియంతే- యేషాం నచేతాంసి, తఏవ ధీరాః'' అని కాళిదాసు కుమారసంభవమున నిర్వచించినట్లుగా, మనస్సు చలించుటకు హేతువులైన భోగ్య వస్తువులు చెంతనే ఉన్ననూ ఎవరి మనస్సు మార్పును పొందదో అట్టివారే జితేంద్రియులైన దృఢచిత్తులనబడుదురు. ఈ ఆళ్వారును అట్టి మహనీయులే. ఈ దేవదాసి ప్రతిజ్ఞ చేసినపుడు పెట్టిన సంవత్సరపు గడువు సమీపించుచున్నది గాని వీరి మనస్సులో మార్పువచ్చు జాడ అణుమాత్రమైనను కానరాలేదు. ఆమె చూపిన హావభావాదులు నిష్ప్రయోజనమైనవి.

## భగవత్కల్పితమగు కర్మ వ్యవస్థ

బ్రహ్మవేత్తలై ఉపాసన నిష్ఠలగు మహాత్ములకు గూడ జీవితములో దుఃఖానుభవమును ఒక్కొక్కప్పుడు చూచుచున్నాము భగవంతుడు పెట్టిన వ్యవస్థ అల్పజ్ఞులమగు అస్మదాదులకు అగోచరము కర్మ సిద్ధాంతమును వివరించిన వేదవ్యాసుడు ఆ భగవంతుని వ్యవస్థను ''అనారబ్ధకార్యే ఏవతు పూర్వే తదవధేః'' ''భోగే నత్విత రే క్షపయిత్వాథ సంపద్యతే'' అను బ్రహ్మసూత్రములలో సూచించెను. బ్రహ్మవేత్తలకు పరమాత్మ సంచితములైన పూర్వ పుణ్య పాపముల నన్నింటినీ తొలగించును. తాము చేయు ఉపాసన సిద్ధిపర్యంతము జీవించినపుడు వారి శేషాయుష్యములో ప్రామాదికముగా జరుగు ఉత్తరపుణ్యాపాపములను గూడ వారికంటకుండ చేయును. అట్టివారే శేషజీవితములో కొన్ని దుఃఖము లనుభవించుట యేల? ఆ దుఃఖము కలుగుటకు హేతువైన పూర్వ పాపములను భగవంతుడు తొలగించెను గదా! అను సందేహమునకు సమాధానమే పై సూత్రములలో ఉన్నది. పూర్వకృతములైన కర్మలను రెండు వర్గములుగా విభజింపవలెను ఆరబ్ధకార్యములు-అనారబ్ధకార్యములు అని ఆ వర్గముల పేర్లు. ఏ పుణ్య పాపకర్మలు తమ ఫలానుభవములనిచ్చుచూ అమలులోనికి వచ్చియున్నవో అవి ఆరబ్ధ కార్యములు. వాటికి ఫలితముగానే ఈ జన్మమున దేహము వచ్చియున్నది ఇక ఇవిగాక ఉత్తర జన్మలలో అనుభవించుటకై నిల్వలో ఉన్నవి సంచితములై అనేక రాసులుగా నున్నవి అనారబ్ధకార్యములు అనబడును

ఈ రెండవ వర్గమునే పరమాత్మ నశింపజేయునని ''అనారబ్ధకార్యే ఏవతు ...'' ఇత్యాది సూత్రమునకర్థము. ఇక ఆరబ్ధకార్యములై ఆ దేహముతో అనుభవింప బడుతూ అమలులో ఉన్నవి మాత్రము ఎవరికైనను అనుభవించి తీర్చుకొనవలసినదే నని "భోగేనతు ..." ఇత్యాది సూత్రమున కర్థము. ఫలితమునిచ్చుటకు ఆరంభమైన ఆ కర్మశేషమును అనుభవింపజేయుచూ ఆ జన్మముననే దివ్యజ్ఞానమును ప్రసాదించి భగవంతుడు దేహావసానమున ముక్తిని ప్రసాదించునని శాస్త్ర సిద్ధాంతము.

తన జాయమాన కటాక్షముచేత ఈ ఆళ్వారులను పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తి పర్యంతము పైకితెచ్చిన ఆ భగవంతుడు తన ఏకాంత భక్తులైన వీరిచే ప్రారబ్ధ కర్మశేషమును అనుభవింపజేసి తన సన్నిధికి చేర్చుకొనదలచినాడు ప్రకృతి బంధము నుండి విడిపింపదలచినాడు. ఈ భగవత్సంకల్పముతో వీరి జీవితములో గూడ తాత్కాలికముగా అనూహ్యమైన రీతిలో పెద్ద మార్పు వచ్చినది మనస్సు చలించినది.

ఇచట నొక సందేహము ఆళ్వారులను శ్రీ రామానుజాది పూర్వాచార్యులను లోక క్షేమార్థమై భగవంతునిచే అవతరింపచేయబడిన విష్వక్సేనాది నిత్యసూరి వర్గముగా పెద్దలు చెప్పుదురుగదా : ఆ రీతిలో ఈ ఆళ్వారులను విష్ణు వక్షస్థల స్థిత వనమాలాంశసంభూతులుగా నిరూపింతురు అయినపుడు వీరికిని పురాకృతి కర్మశేషము కలదని దానివి పరమాత్మ వీరిచే అనుభవింపజేయదలచినాడని చెప్పుట ఎట్లు పొసగును? సమాధానము- ఈ ఆళ్వారులను భగవద్రామానుజాచార్యాదులను వారివారి ప్రభావ విశేషమునుబట్టి ఆయా నిత్యసూరి స్వరూపులనుగా సంభావించుట జరిగినది. అంతేగాని అది నిర్ణయవచనముగాదు. వారు అనాదిగా ప్రకృతిబద్ధులైన సంసారులై యుండి భగవన్నిర్హేతుక విశేషకటాక్ష లబ్ధ దివ్య జ్ఞానశోభితులైరి. వారే తమతమ ప్రబంధములలో ''మారి మారి పల పిరప్పుం పిరన్దు'' ఇత్యాది గాధలలో తాము ఎన్నెన్నో జన్మముల నెత్తియున్నట్లునూ, తమకు భగవానుడే తన దివ్య జ్ఞానమును ప్రసాదించినట్లునూ చెప్పుకొని యున్నారు గదా: భగవద్విషయాది గ్రన్థావతారికలలో ఈ విషయము స్పష్టము. తిరువిరుత్తమను నమ్మాళ్వారుల ప్రబంధమునకు వ్యాఖ్యానమును ప్రసాదించిన నంబిళ్లై స్వామివారి అవతారికా వాక్యములను పాఠకులు గమనింప ప్రార్థన.

''ఆళ్వార్ ముక్తర్ - ఎన్బర్ శిలర్, అరుళాళప్పెరుమాళెంబెరుమానార్ శ్రీపాదత్తై యాశ్రయిత్తారొరువర్ ముక్తప్రాయ రెన్బర్, అంగుళ్లారిలే యొరువరై 'సీర్ పోత్ పిరవుం' ఎన్నప్పిరన్దారెన్బర్‌కళ్ శిలర్. వంగీపురత్తు నంబి ఎంబెరుమా ౙా

తానే వందవతరిత్తా నెన్బర్. ఇప్పడి శొల్లుగైక్కాడి ఆళ్వారుడైయ ప్రభావ మిరుక్కుంబడి. ముక్తరిలే యొరువరై ఇంగే పోరవిట్టతాగిల్, నాంపోన్దకార్యం ముడిందవారే పోకిరోమెన్ను అఱియిరుక్కక్కూడుమ్. అంగనన్ఱియే "ఇన్నిన్నమ్ఎన్నై ఇనియామురామై" ఎన్నుం- ''పావియేన్నైపలనీ కాట్టిప్పడుప్పాయో" ఎన్నుం- "మారిమారిప్పల పిరప్పుం పిరన్దు" ఎన్నుం- కూప్పిడుగయాలే ఇవర్ సంసారి గళిలే ఒరువరా మిత్తనై. అరాజక మాన దేశత్తిలే పట్టత్తుక్కురియ ఆనై యైక్కణ్ణై కట్టివిట్టాల్ ఎడుత్తుత్తఁ కళత్తిలే వైత్తుక్కొండవఁ రాజా వామాప్పోలే ఎంబెరుమాఁ కటాక్షిత్తా రొరువరామిత్తనై ఆళ్వార్" ఇత్యాది

ఆళ్వారులు ముక్తులని కొందరు, ముక్త ప్రాయులని కొందరు, వైకుంఠవాసులైన నిత్యముక్త పురుషులలో ఒకరిని పరమాత్మయే "మీరుపోయి భూలోకమున నవతరించి ఈ కార్యమును సాధింపు"డని ఆదేశింపగా వచ్చినవారే ఆళ్వారులని కొందరు, పరమాత్మయే ఆళ్వారుల రూపమున వచ్చెనని మఱికొందరు ఇట్లు పూర్వాచార్యులు భావించుచున్నారు. ఈ భావనకు కారణము ఆయా ఆళ్వారుల ప్రభావము. కాని, అక్కడివారిని పరమాత్మయే ఇక్కడికి పంపిన యెడల "మనము వచ్చిన పని పూర్తియైన వెంటనే తిరిగి పోవుదు"మని వారు తమ మనస్సులో నిశ్చింతగా నుండవలెను గదా! కాని అట్లుగాక వారు తమ గాథలలో "నన్నింకను జన్మమృత్యు పరంపరా రూపమైన ఈ దుఃఖ సముద్రములో ఎంతకాలము పడవేసి యుంచెదవు" అని పలు విధములుగా ఆక్రోశించుటచేత వీరు సంసారిమండలములోని జీవులేనన్నది వాస్తవము అయితే కోటానుకోట్ల జీవులలో వీరికే ఇంతటి జ్ఞాన విశేషమునకు కారణమేమంటే ''ప్రేక్షే కంచిత్ కదాచన" అని చెప్పబడిన భగవంతుని ఆకస్మిక కరుణాకటాక్షపాతమే. సర్వస్వతంత్రుడైన ఆయన ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కరిపై అనుగ్రహబుద్ధితో కటాక్షించును ఆట్లు కటాక్షింపబడినవ్యక్తి దివ్యజ్ఞాన సంపన్నుడై ముక్తి సామ్రాజ్యము నొందును. యుద్ధాది కారణములచేత రాజవంశ మంతరించి దేశము అరాచకము అయినప్పుడు పట్టపుటేనుగునకు కళ్లుగట్టి పూలదండను తొండమున కందించగా అది ఎవని మెడలో ఆదండను వేయునో వాడు రాజుగా నిర్ణయింపబడునని ఒక వ్యవస్థ పూర్వకాలమున నుండినది. ఆ ప్రకారమే ఇచట భగవంతుడను నిరంకుశ మదగజేంద్రముచేత కటాక్షింపబడిన వ్యక్తి ఒకానొక జీవాత్మ ఈ ఆళ్వారులని- పై అవతారికా వాక్యములకు తాత్పర్యము.

ప్రకృతమునకువత్తును. అట్లె తన విశేషకటాక్షముచే సంస్కరించిన ఈ తొండరడిప్పొడి ఆళ్వారులనుగూడ కర్మశేషము ననుభవింప జేయదలంచిన భగవంతుడు ఒక్కసారిగా ఇంద్రియ వశ్యులనుచేసెను ఒకనాడు ప్రబల వర్షపాతముచేత తడసి వణికి పోవుచున్న ఆ వేశ్యాపరిచారికను దయతో వీరు ఆశ్రమములోనికి పిలిచి ఆశ్రయమిచ్చిరి అపుడామె సౌందర్యమును దగ్గరగా చూచి సమ్మోహితులైరి. బ్రహ్మచర్య వ్రతభంగమునొందిరి. భగవత్సంకల్పము తన ప్రతిజ్ఞకు తోడై కార్యము నెరవేయుటచేత ఆమె తన యింటికి మరలెను. వీరును వ్యామోహ ప్రేరితులై ఆమెను వెంబడించిరి, తన ప్రతిజ్ఞ నెరవేరుటచేతను వీరు నిర్ధనులగుటచేతను ఆమె తిరస్కరింపగా తిరిగి ఆశ్రమమునకే వచ్చిచేరిరి. ఆనాటి రాత్రి బ్రహ్మచారి వేషమున శ్రీరంగనాథుడు ఆలయములోని యొక బంగారు పాత్రనుతెచ్చి విప్రనారాయణుడు కానుకగా పంపినాడని తెలిపి ఆ వేశ్యకు అందజేసెను. మరునటి ఉదయమే ఆలయములోని స్వర్ణపాత్రము దొంగిలింపబడినట్లును, పూజారుల గృహములలోను నగరములోని వివిధ ప్రాంతములలోను అన్వేషింపగా అది ఆ వేశ్యగృహమున లభించినట్లునూ రక్షకభటులు రాజునకు నివేదించిరి. రాజాజ్ఞచే ఆమెను బంధింపగా 'విప్రనారాయణుడు ఒక మనిషి ద్వారా పంపె'నన్నట్లు తెలిపెను. ఇట్లు తాను చేయని భగవద్ద్రవ్యాపహారమను నేరమునకు రాజు ఆయనకు కారాగార శిక్షను విధించెను. తనకు అసంభావితమైన రీతిలో కలిగిన కామ వ్యామోహమునకు తత్ఫలితముగా ఆరోపిత పాపానుభవరూపమైన కారాగార శిక్షకును వీరి మనస్సు దుర్భరముగు సంక్షోభమునొందెను.

ఆనాటిరాత్రి రాజునకు శ్రీరంగనాథుడు స్వప్నములో సాక్షాత్కరమునిచ్చి విప్రనారాయణుడు నిర్దోషియనియు, నేనే ఆయనయొక్క కర్మశేషమును క్షయింపజేయుటకై ఈ మాయను కల్పించితిననియు, ఆ పరమభాగవతుని చెరనుండి విడిపించి సాదరముగా క్షమాపణను వేడు కొమ్మనియు ఆదేశించెను. చెరసాలనుండి విడువబడిన వీరు వేశ్యాసంగ దోషమునకు మిగుల పశ్చాత్తాపమునొంది ఆ పాపపంక ప్రక్షాళనమునకు ప్రాయశ్చిత్తమును చేసుకొనదలంచి జ్ఞానవృద్ధులను ఆశ్రయించి వారి శ్రీపాద ధూళీ మిశ్రిత పవిత్ర తీర్థసేవనముచేత ఆత్మ పరిశుద్ధిని పొందిరి. ఆనాటినుండియు తమకు భక్తాంఘ్రిరేణువు (తొండర్-అడి-పొడి) అను పేరు దాస్యనిరూపక వ్యవహారముకాగా అట్లే లోక ప్రసిద్ధిని పొందిరి. తమ అగాధ భగవద్భాగవత భక్తినిష్ఠకు ప్రతీక యనదగిన ఈ తిరుమాలై ప్రబంధమును సుప్రభాతరూపమైన తిరుప్పళ్లియెళుచ్చియను ప్రబంధమును రచించి శ్రీరంగనాథ మాలా కైంకర్యవృత్తితో శేష జీవనమును గడపి శ్రీరంగక్షేత్రముననే ముక్తినొందిరి.

# గ్రన్థ ప్రతిపాద్యము – ప్రయోజనము

ఈ ఆళ్వారుల చరిత్ర విశేషమును తెలుసుకున్నాము. ద్రవిడమున దీవికి వ్యాఖ్యానమును ప్రసాదించిన పెరియ అచ్చాం పిళ్లైస్వామివారు గ్రంధావతారికలో విశదముగా తెలిపిన విశేషములను చర్చించుకుందాము అనాదిగా ప్రకృతిబద్ధులైయుండు జీవులను బద్ధసంసారులు అందుము. వారు కర్మభూమియైన భూమండలములో పూర్వ సంస్కారముచే పుణ్య పాపకర్మలనాచరించుచూ పుణ్యఫలానుభవార్థమై స్వర్గమునకు పాపఫలానుభవార్థమై నరకమునకుపోయి, అచట అవి తీరిపోగానే తిరిగి భూమండల మునకే చేరుదురు వారు ఇచట మరల జన్మమెత్తుటకు కారణము పూర్వకర్మ శేషము. దానితో వారు తిరిగి గర్భవాసమునకై వచ్చుమార్గమున పడు పలువిధములైన పాట్లను వేదాంత శాస్త్రమున పంచాగ్ని విద్యయను ప్రకరణమున ఛాందోగ్యోపనిషత్తులో వివరింపబడియున్నవి. శ్రీ భాష్యమునగూడ తృతీయాధ్యాయారంభమున తదంతర ప్రతి పత్త్యధికరణమున ఇది తెలుపబడినది. జీవుడు నరకమున యాతనాశరీరముతో పాపఫలము ననుభవించి పిదప దానిని వదలి పుణ్యానుభవమునకై స్వర్గమునకు వచ్చి అచట దివ్య శరీరముతో కొంతకాలము అనుభవము తీరగానే దానిని వదలి సూక్ష్మ శరీరముతో నిరాలంబమగు ఆకాశమున వచ్చి పడును సూర్యుడు తన కిరణములతో హిమవంతుని మంచునాకర్షించి దానితో ఈ జీవుని కలిపి మేఘములోనికి చేర్చును మేఘము వర్షించునంతవరకును అచటనుండి, వర్షధారలతో భూమిపై పడును, సస్య వర్ధకమైన ఆ జలముతో పాటు సస్యములో ప్రవేశించును. ఆ సస్యము ఆహార రూపమున పక్వమై పరిణమింపగా అందుండి అన్నముగా పురుష శరీరమున ప్రవేశించి అందు శుక్లమున కలసి సంయోగముచే స్త్రీ గర్భమున చేరును. అచట తిరిగి జన్మ మునకై పిండశరీరప్రాప్తి. "ఇతితు పంచమ్యా మాహుతౌ ఆపః పురుష వచసో భవన్తి" అను ఛాందోగ్య వాక్యమున చెప్పబడినట్లుగా ద్యులోకమనబడు ఆకాశము, మేఘము, భూమి పురుషుడు స్త్రీ గర్భము అనబడు ఈ ఐదు స్థానములకు క్రమ ముగా వచ్చిపడి చివరకు మాతృగర్భవాసమునొందును. అందు క్రమముగా పెరుగుచూ సుకుమారమగు శరీరమగుటచేత తల్లి తినుచుండు ఆహారములోని వేడి, కారము, ఉప్పు మొదలగు వాటిచే దుర్భరమగు వేదనను అనుభవించుచూ ఇటునటు తిరుగుట కైనను వీలులేని విధముగా నవమాసములు అందే బంధింపబడి యుండును. పిదప గర్భము నుండి అతి కష్టముగా బయల్పడి శైశవములో మలమూత్రములలోనే పడి యుండి దురదపెట్టినను గోకుకొనలేక చీమలు దోమలు కుట్టుచున్ననూ తోలుకొనలేక ఆకలిదప్పులను గూర్చి చెప్పుకొనలేక కాలము గడుపును. ఆపైన బాల్యమున క్రమ

ముగా జ్ఞానవికాసము కలిగి భగవదాభిముఖ్యము ఏర్పడవలసియున్ననూ "బాల్యే క్రీడనకాసక్తః" అన్నట్లు ఆటపాటలతో గడిపి, యౌవనమున ఇంద్రియ సుఖములకై అసహ్య పాపకృత్యములుచేసి, చివరకు వార్ధక్యమున కాలు సేతులు జ్ఞానేంద్రియములు పనిచేయని అశక్త స్థితిని పొందును. ఈలోపుగా అనుకొనని విధముగా మరణదశ సంప్రాప్తమై శరీరము నుండి అతి కష్టముగా విడివడి యమకింకర పీడితుడై ఈ జీవితమును చాలించి నరకమునకు పోవును, ఇది జీవుని సంసార చక్ర పరిభ్రమణ రూపమైన అనర్థ పరంపర.

"సుహృదం సర్వభూతానాం" అని భగవద్గీతలో చెప్పబడినట్లు సర్వభూత హిత ప్రదుడు పరమ దయాళువునగు సర్వేశ్వరుడు జీవుల ఈ దుర్దశనుకని వీరి ఉజ్జీవనమునకై వేదశాస్త్రమను ప్రదీపమును ప్రసాదించినాడు గుడ్డివానికి నేత్రదానమువలెను చీకటి గదిలోనున్నవానికి దీపమువలెను ఈ శాస్త్రము జీవులకు తత్త్వమును విశదముగా తెలుపునని ఈశ్వరునిభావన. ఈవేదశాస్త్రము "క్షరం ప్రధానం- అమృతాక్షరం హరః- క్షరాత్మానౌ ఈశతే దేవ ఏకః (శ్వేతాశ్వతరము) ఇత్యాది వాక్యములలో పరిణామాత్మకమగు జడప్రకృతి నశ్వరమనియు, నిత్యుడగు జీవుడు దానిలో కలిసియుండి కర్మఫలమును అనుభవించుచుండుననియు ఈ ప్రకృతి - జీవులకు నిర్వాహకుడైన ఈశ్వరుడొకడు కలడనియు బోధితమైనది. మరొకచోట "యస్యపృథివీ శరీరం" "యస్యాత్మా శరీరం" "ఏష సర్వభూతాన్తరాత్మా.... ఏకో నారాయణః" ఇత్యాది వాక్యములచేత చేతనాచేతన పదార్థములన్నియు ఈశ్వరుని శరీరములనియు ఆయన వాటికన్తరాత్మయనియు సర్వశరీరకుడైన ఆ ఈశ్వరుడు శ్రీమన్నారాయణుడేననియు ఆ వేదశాస్త్రమే స్పష్టముగా నిరూపించినది. దుఃఖహేతువైన ఈ ప్రాకృత శరీర సంబంధము దానికి హేతువైన పుణ్యపాప రూపకర్మ సంబంధము భగవదుపాసనచే తొలగిపోగా 'పుణ్యపాపే విధూయ' "విజ్ఞానసారథిర్యస్తు... సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోఃపరమం పదమ్" ఇత్యాది వాక్యములచేత శ్రీవైకుంఠమునందు పరమాత్మతోకలసి శాశ్వతానందావాప్తిరూపమోక్షము జీవునికి సంప్రాప్తించునని యు వేదాన్తశాస్త్రము ప్రతిపాదించినది. స్పష్టమైన ఈ శాస్త్రార్థము నెరిగి జీవరాశి తన వద్దకు చేరునని ఈశ్వరుడు భావింపగా- వారు మాత్రము పాప ప్రాచుర్యముచేత వేదబాహ్యులగుటయు కొందరు వైదికమార్గమున ప్రవేశించియు దానికి అపార్థమును గ్రహించి తామేగాక ఇతరులకును బోధించి దుఃఖపడుటయు జరుగుచున్నది. 'తత్రైవ కేపి చపలాః శలభీభవన్తి' అన్నట్లు దీపపుకాంతిలో ఆహార

మును వెతుక్కోవలసిన శలభములు (మిడతలు) ఆ దీపముపైనే పడి చచ్చిన విధముగా శాస్త్ర దీపమును లోకులు అజ్ఞానంచేత దుర్వినియోగం చేసుకున్నారు.

ఇట్లు లోకక్షేమానికై సర్వేశ్వరుడిచ్చిన శాస్త్రదీపము ఉపయోగింపకపోగా ఇక ఆయనయే స్వయముగా వీరి క్షేమార్థమై రామకృష్ణాద్యవతారములెత్తి వచ్చినాడు. తాను పంపిన ఆదేశపత్రము చెల్లని దేశముపైన రాజే స్వయముగా దండెత్తివచ్చినట్లు లోకరక్షార్థమై ఈ అవతారములు దాల్చుట భగవంతుని రెండవ ప్రయత్నము. ఇపుడీమూర్ఖలోకము ఆయనయొక్క ప్రభావము నెరుగలేకపోగా ద్వేషించి అహంకారముచేత చెప్పరాని విధముగా అనుక్షణము దూషించినది. హిరణ్యకశిపు రావణాదుల వలె యుద్ధమునకుగూడ తలపడి నశించుచున్నది. ఈశ్వరుని ఈ ప్రయత్నముగూడ ఫలింపలేదు. చేసిన ప్రయత్నములు సఫలముకాకున్నను పోయిన తన వస్తువులపై ఆశను వీడని యజమానివలె భగవంతుడును 'వీరిలో ఈ ద్వేషబుద్ధి తొలగి ఏనాడైనను కొందరైనను నాపై అనుకూలభావము ఏర్పడి ఆశ్రయించకపోదురా'యని అవసరమునకై ప్రతీక్ష చేయుచుండును.

నిరంతరము పాపప్రవృత్తిగల మానవుని జీవితములో ఒకప్పుడు అనుకోకుండనే పుణ్యము గూడ వచ్చిపడును. దానిని శాస్త్రకర్తలు 'యాదృచ్ఛిక సుకృతము' అందురు. గోవును చంపబోయినవాడు అది వానికందక గుడిచుట్టును తిరుగుచుండగా వాడును దానికై తిరుగును. ఈ ఆలయ ప్రదక్షిణము అతనికి యాదృచ్ఛికమైన సుకృతము. దైవ విశ్వాసము లేనివాడు వ్యాపారమునుబట్టియో బాంధవ్యమును బట్టియో పలుసారులు కంచి, తిరుపతి, అయోధ్య వంటి పుణ్యక్షేత్రములకు పోయి అచట కొంతకాలముండును. అది అతనికి యాదృచ్ఛిక సుకృతము. ఇట్టి ఒకటి రెండు సుకృతములను పరిగణనకు తీసుకొని భగవంతుడు అతనిపైన తన విశేష కటాక్షమును ప్రసరింపజేయును. దానిచే నీతనిలో పూర్వముండిన భగవంతుని ద్వేషించు దుర్బుద్ధియు వైముఖ్యమున్ను తొలగిపోయి అద్వేష ఆభిముఖ్యము లేర్పడును. గడచిన తన హేయ జీవనముపైన జుగుప్సతో శ్రేయోమార్గము నవలంబించుటకై సత్సంగమును తద్వారా సదాచార్యాశ్రయణమును చేయును. వారి ఉపదేశముచేత భగవంతుడు సర్వస్వామియనియు తాను ఆయనకు శేషభూతుడననియు యధార్థ జ్ఞానమును పొంది మోక్ష పురుషార్థ లబ్ధికై ఉపాయమేదా యని అన్వేషించును. శాస్త్రబోధితములైన కర్మ-జ్ఞాన-భక్తి యోగములు తనవంటి అశక్తునికి అసాధ్యములు. పైగా జీవితాంతము ననుష్ఠింపగా ఎపుడోగాని ఫలితము నీయవు. పైగా వాటిని

అనుష్ఠించునపుడు ఏవైన లోపములు జరిగినచో మహా ప్రమాదము శరణాగతినిచేసి భగవంతునినే సిద్ధోపాయముగా నెంచుట మంచిదేగాని దానికి మహా విశ్వాసము ప్రధానముగా నుండవలెను. బ్రహ్మాస్త్రమువంటి ఆ శరణాగతి విశ్వాసము శిధిలమైనచో ఫలింపదు.

## భగవన్నామ సంకీర్తన వైభవము

భగవన్నామ సంకీర్తనము అన్నిటికంటెను ముముక్షువులకు సులభోపాయము. దానిని అనుష్ఠించుటకు దేశ కాల నియమము లేవియు లేవు కొందరికి మాత్రమే ఇందులో నధికారము, అను నియమము గూడ లేదు. అందరికినీ ఇందులో అధికారం కలదు. ఇది సర్వ పాప ప్రణాశనము. భక్తి ప్రపత్తులకు ఇది అంగమేగాని స్వతంత్రముగా మోక్షప్రదమైన ఉపాయము కాదేమోనని సందేహింపవలదు. విష్ణు సహస్ర నామాధ్యాయమున మొదట ధర్మరాజు "కింజపన్ ముచ్యతే జంతుః-జన్మ సంసార బంధనాత్" అని భీష్మని గూర్చి ప్రశ్నించుటను బట్టియు, "...యాతి బ్రహ్మ సనాతనమ్" అని చివరకు ఫలశ్రుతిని చెప్పుటను బట్టియు నామానుసంధానము మోక్ష ప్రాప్తికి సాక్షాదుపాయమని తెలియుచున్నదిగదా! ఈ ఆళ్వారులు గూడ ఇదియే ఉత్తమోత్తమమైన ఉపాయమనియెంచి తాము అనుష్ఠించి ఈ ప్రబంధమున లోకులకు ఉపదేశించుచున్నారు. వీరికి ఈ విషయమున శ్రీ విష్ణుధర్మము అను మహా గ్రంథము ప్రమాణము. అందలి విషయ మేమనగా-

పాండవులకు నాలుగైదు తరముల తరువాత ఆ వంశమున శతానీకుడు అను రాజు జన్మించెను. అతడు భగవదనుగ్రహ పాత్రమైన వంశమున జన్మించినవాడు గనుక పరమ సాత్వికుడై తాను రాజ్య పదవికి వచ్చిననాటి నుండియు బలవంతులు దుర్బలురైన జనులను బాధింపకుండునట్లు పరిపాలించుచుండెను. లౌకికముగా నేను వీరిని రక్షించుటయేగాక, పారమార్థికముగా గూడ వీరికి శ్రేయస్సును కలిగించవలెనని యతడు భావించి శ్రీ శౌనకమహర్షి వద్దకుపోయి ఇట్లు ప్రార్థించెను. "అయ్యా! దేహ యాత్రాపరులై యుండి సంసారమున అట్టడుగున పడియున్న ఈ లోకులు సులభముగా ఉజ్జీవించు ఉపాయమేదో అనుగ్రహింపుడు." ఇది విని ఆ మహర్షి ఇట్లు బదులు చెప్పెను. "మహారాజా! ఇది కలికాలారంభము. పాప ప్రాచుర్యమునుబట్టి కర్మ-జ్ఞాన- భక్త్యాది సాధనము లేవియు అనుష్ఠించుటకు వీరు అధికారులు కారు. భగవన్నామ సంకీర్తన మొక్కటియే సర్వాధికారికమైన సులభోపాయము. దీనినే ప్రచార మొనర్పుము." ఇది శతానీకునికి శ్రీ శౌనక మహర్షి చెప్పిన యుపదేశము.

ఇక ప్రకృతమున ఈ ఆళ్వారులను శ్రీరంగనాథుడే "లోకమున సర్వాధికారిక మైన సులభమగు ఉజ్జీవనోపాయమేదో తెలుపుము" అని ప్రశ్నింపగా వీరు ఈ స్తోత్ర రూపమున "స్వామీ! నీ నామ సంకీర్తనమే పరమోపాయముగదా"యని సమాధాన మిచ్చుచున్నారు. అక్కడ శతానీకునిది అజ్ఞాత ప్రశ్నము ఇక్కడ శ్రీరంగనాథునిది జ్ఞాత ప్రశ్నమే. తెలిసియే శ్రీరంగనాథుడు అడుగుచున్నాడు. తెలిసి యడుగుట యెందులకు? అన్నచో- "కింమృష్టం? సుతవచనమ్-పునరపి మృష్టం తదేవ సుత వచనం" అన్నట్లు తనకు ప్రియపుత్ర ప్రాయులైన ఈ ఆళ్వారుల నోటినుండి ఈ మంచి మాటను వినవలెనని ఆ స్వామి యపేక్ష. లోకమున గూడా తండ్రికి అతి ప్రియమైనది ఏమి? అని ప్రశ్నింపగా, తన కుమారుని ముద్దుమాటలకంటె అతి ప్రియ మైనది వేరేమున్నది అని బదులు చెప్పుదుముగదా! ఇట్లు శ్రీరంగనాథుడే ఈ ఆళ్వారుల ద్వారా లోకమునకు నామసంకీర్తన వైభవమును ఈ ప్రబంధమున ప్రకటింపజేసినాడు.

పరతత్త్వమును ప్రకటించిన శ్రుతులకంటెను ఉపబృంహణములను వ్రాసిన మహర్షులకంటెను తక్కిన యాళ్వారులకంటెను ఈ విప్రనారాయణ మునీన్ద్రులకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఎట్లనగా— 'యతోవా ఇమాని భూతాని జాయంతే' ఇత్యాది వాక్యములచేత జగజ్జన్మస్థితిలయకారణమైనది బ్రహ్మమనితెలిపి 'కారణంతు ధ్యేయః' అని ఆకారణవస్తువే ఉపాస్యమని చెప్పినవి కొన్ని శ్రుతులు. మరి ఉపాస్య కారణ బ్రహ్మమెవరు? అను ప్రశ్నరాగా— 'స బ్రహ్మా స శివస్సేన్ద్రః సోఽక్షరః పరమస్స్వరాట్" ఇత్యాది వాక్యములు అనేక సామాన్య శబ్దములతో తెలిపిననూ సందేహము తీరనందున చివరకు "ఏకోహవై నారాయణ ఆసీత్" అను స్పష్టశ్రుతిని బట్టి నారాయణుడే పరబ్రహ్మమని నిర్ణయము తీసుకొనవలసి వచ్చినది ఇట్లు శాస్త్రీయ పద్ధతిలో వివిధోపనిషత్తులను సమన్వయము చేసుకొన్నప్పుడుగాని నిశ్చయము తేలదు. ఇక ఉపబృంహణముగా వేదార్థమును విశదీకరించిన మహర్షులుగూడ 'అజాయమానో బహుధా విజాయతే' అను శ్రుతిలో చెప్పిన భగవదవతార రహస్యములను తమ ఇతిహాస పురాణ గ్రంథములలో ప్రకటించిరి. అందులోను శ్రీ వాల్మీకి మహర్షి శ్రీరామావతార వైభవమునే కీర్తింపగా శ్రీ పరాశర మహర్షి శ్రీకృష్ణావతార వైభవమునందే ఆసక్తిని కనబరచినాడు శ్రీ శౌనకమహర్షి అర్చావతార ప్రభావమునే 'తా మర్చయేత్ తాం ప్రణమేత్- తాం భజేత్తాం విచిన్తయేత్" ఇత్యాది వాక్యములతో ప్రశంసించినాడు. ఇట్లీ మహర్షుల వివిధ మార్గములచేత సామాన్యునికి ఎవడు ఉపాస్యుడో ముఖ్య నిర్ణయము కలుగదు. ఇక ఆళ్వారులలో మొదటివారగు ముగ్గురును సర్వోన్నతమైన పరత్వమునకు ఆస్పదమైన శ్రీ వైకుంఠనాథునియందును సౌలభ్యగుణ

ప్రకాశకమైన శ్రీ వేంకటాచలమునందును అదరాతిశయమును చూపిరి శ్రీ శఠకోప మునీన్ద్రులు శ్రీ విష్ణుచిత్తులును తమ ప్రబన్ధములలో విశేషించి కృష్ణావతార ప్రావణ్య మునే కనబరచిరి. తిరుమంగై ఆళ్వారులు నానా దివ్యదేశములలో దక్తిని తమ గ్రన్థముల ద్వారా అవిష్కరించుకొనిరి. వీరిలో ఏ ఒక్కరును ఫలానా అవతారమునో దివ్యక్షేత్రమునో ఆశ్రయింపుడని ఖచ్చితముగా చెప్పలేదు.

ఈ ప్రబన్ధకర్తయగు ఆళ్వారులు మాత్రము ఇతర దివ్యక్షేత్రములను వేటిని గూడ తాము కీర్తించక శ్రీరంగ క్షేత్రమును ఒక్కదానినే పరమప్రాప్యముగానెంచి అందుండు శేషశాయియగు శ్రీరంగనాథునే ఆరాధించి ప్రస్తుతించి ఇతరులకు అట్లే ఉపదేశించిన మహనీయులు. ఇట్లు ఒకే అర్చామూర్తిని నమ్ముకొనుట దానినే ఆరాధించుట ఇతరులకును అదే ఉపదేశించుటయు వీరిలోనే కనబడు విశేషము వీరివలె వీరి ఈ తిరుమాలై ప్రబన్ధమునకును ఒక ప్రత్యేకత కలదు. ఇందలి పదార్థములను గాని వాక్యార్థమునుగాని తెలిసికొనుటకు కష్టపడనవసరము లేదు సులభముగా స్పష్ట ముగా అర్థబోధము కలుగును. తక్కిన ఆళ్వారుల ప్రబంధములట్లుగావు. వాటిలో పదార్థ వాక్యార్థ భావార్థములను తెలిసికొనుటకు వేదాన్తాది శాస్త్రాన్తర జ్ఞానము అవ సరము. 'నీరాయ్ నిలనాయ్ తీయాయ్ కాలాయ్ నెడువానాయ్'.... అని యొకచోట శ్రీ శఠకోపులు భగవంతుని స్తుతించిరి. 'నీవే జలమై భూమియై అగ్నియై వాయువై మహాకాశమై సూర్యచంద్రులై శివుడవై బ్రహ్మవై" వెలసితివని దాని యర్థము. జడములైన పంచభూతములకు పరమాత్మకును అభేదమెట్లు కుదురునను సందేహము కలుగగా, అందులకు సమాధానముగా 'శరీర వాచక శబ్దములు తద్విశిష్టాత్మపర్యంత బోధకములు' అను శాస్త్రీయ న్యాయమును చూపి 'పరమాత్మ పంచభూత శరీరకుడు' అని యర్థము చెప్పవలెను. వారే మరొకచోట 'మునియే నాన్ముకనే ముక్కణ్ణప్పా' అని పరమాత్మను స్తుతింపగా త్రిమూర్తిసామ్యమును చెప్పిరి కాబోలునని భ్రమ కలుగును. అది వాస్తవము కాదు. "సర్వభూతాన్తరాత్మా" ఇత్యాది శ్రుతి ప్రకారము "ఓ నారాయణా! నీవే బ్రహ్మకు రుద్రునకును అంతరాత్మవు" అని అర్థమును నిరూ పించవలెను. ఇట్లు ఎన్నో చోట్ల అర్థ నిర్ణయమునకై శ్రమపడవలసి యుండును. ఈ బాధలేవియు ఈ తిరుమాలై ప్రబంధమును పఠించినపుడు కలుగవు. ఓంకారము వలె శబ్దము అత్యల్పమై అర్థము మాత్రము గ్రహింపరానంతగా నిగూఢమైయుండక మహాభారతమువలె అతి విస్తృతమై తాత్పర్యార్థము దుర్గ్రహమైయుండక ఈ ప్రబన్ధము అతి సంగ్రహముగాని, అతివిస్తృతముగాని కాకుండ అన్యూనానతిరిక్తముగా నుండి సర్వచేతనులకును కర్తవ్యబోధకమై నిత్యానుసంధేయమై ప్రకాశించుచున్నది.

శ్రీమతే రామానుజాయ నమః

## సంస్కృతమున తనియన్ శ్లోకము

తమేవ మత్వా పరవాసుదేవం ।
రంగేశయం రాజవదర్హణీయమ్ ।
ప్రాబోధకీం యోఽకృత సూక్తిమాలాం ।
భక్తాంఘ్రిరేణుం భగవన్తమీడే ॥

## ప్రబంధ తనియన్

మత్తొన్ఱుం వేండా మననే మతిళరంగర్ ।
కత్తినంమేయ్త్త కళలిణైక్కీళ్ ।
ఉత్త తిరుమాలై పాడుం శీర్ తొండ ।
రడిప్పొడి యెంబెరుమానై ఎప్పొళుదుంపేశు ॥

ప్రతిపదార్థము : మననే: ఓ మనసా- మతిళ్-దృఢ ప్రాకార శోభితమైన, అరంగర్- శ్రీరంగక్షేత్రమునకు అధీశుడైన స్వామియొక్క, కత్తినంమేయ్త్త-ఆవుదూడలను మేపుటకై బృందావన సంచారము చేసిన, కళల్ఇణై కీళ్- శ్రీ పాదముల జంటను గూర్చి, ఉత్త తిరుమాలై- సుందరమైన తిరుమాలై అను స్తోత్రమును, పాడుంశీర్- గానము చేసిన కవితాశ్రీకలిగిన, తొండరడిపొడి- భక్తాంఘ్రిరేణు అను నామ ధేయముగల, ఎంబెరుమానై- మన విప్రనారాయణస్వామి వారిని ఎప్పొళుదుం- నిత్యమును, పేశు- కీర్తించుము. మత్తొన్ఱుంవేండా- మరేమియు నవసరము లేదు

వివరణము : గ్రన్థమును అధ్యయనము చేయుటకు ముందు గ్రన్థకర్తలను గూర్చిన స్తోత్రరూపమగు తనియన్లను పఠించుట సంప్రదాయము. ఇందు మొదటి సంస్కృత శ్లోకము తిరుమాలై ఆండాన్ మాలాధరార్యులు అను ఆచార్యులు రచించినది. వీరు శ్రీ మద్రామానుజులకు ద్రవిడ ప్రబంధార్థ విశేషములను ఉప దేశించిన ఆచార్యులు శ్రీరంగ క్షేత్రమున శేషశాయియైయున్న శ్రీరంగనాథుడే పర వాసుదేవుడని, రాజోపచారములతో ఆ స్వామికి సేవచేయ దలంచి, తిరుప్పళ్లి యెళుచ్చి అను సుప్రభాత స్తోత్రమును మరియు తిరుమాలై అను సుగంధి పుష్ప మాలికవంటి ఈ శ్రీమాలికా స్తోత్రమును ఎవరు రచించిరో, అట్టి పూజనీయులైన

భక్తాంఘ్రిరేణు మునీంద్రులను నిత్యమును కీర్తించెదను అని సంస్కృత శ్లోకమునకు భావార్థము

ఇక రెండవది ద్రవిడ భాషలో గల తనియన్ దీనిని రచించినవారు తిరువరంగప్పెరుమాళ్ అరైయర్ అను ఆచార్యులు. వీరును శ్రీ రామానుజాల వారికి ఆచార్యులే. ఓ మనసా: నీవు ఎల్లప్పుడును శ్రీరంగనాథ సేవా గరిష్ఠులై తద్భక్త శ్రీపాద రేణువుగా తనను నిరూపించుకొన్న శ్రీ విప్రనారాయణ మునీంద్రులను కీర్తించుచుండుము అంతేచాలును. మరేమియువద్దు. అదే నీకు ఉత్తారకము సుకుమార సుగంధి పుష్పములతో కూర్చబడిన పుష్పమాలికవలె సుకుమార మధుర శబ్దార్థ సందర్భ సంఘటితమైన తిరుమాలై అను చిన్న స్తోత్రమును రచించి శ్రీ రంగనాథుని పాదాబ్జములపై సమర్పించినవారు ఈ మహనీయులు. అని దీని భావము ఇందులో శ్రీరంగనాథునికి "కత్తినంమెయ్త్త" అను పదము వాడబడినది ఈ పదమునే ఈ ఆళ్వారులను 9వ పాశురములో వాడియుండుటచేత దీని యర్థము వీరికి మిక్కిలి ఇష్టమైనట్లు గ్రహింపవచ్చును. ఆవుదూడల గుంపులను మేపుటకై వనసంచారమును చేసిన భక్తసులభుడైన ఆ కృష్ణుడే ఈ రంగనాథుడని భావము. శేషశాయి యగు ఆ స్వామియొక్క శ్రీపాదముల సౌకుమార్యమును సేవించినపుడు ఈ ఆళ్వారులును తక్కిన ఆళ్వారులును ఇట్లే 'నడందకాల్‌గళ్ నొందవో', 'ఎవ్వాయి నడందనై ఎమ్మిరామావో' అని పలువిధములుగా తమ ప్రేమావేశమును ప్రకటించుకొనుచూ "స్వామీ! ఆనాడు రామకృష్ణాద్యవతారములలో వనసంచారముచేత నీ మృదుపాద ద్వయి ఎంత నొచ్చినదో గదా! ఆ శ్రమ తీరునట్లు ఇచట శయనించియున్నావా' అని ప్రస్తుతించి యున్నారు. ఇది ఆళ్వారులందరి ప్రేమార్ద్రమగు మానసికానుభవము.

శ్రీ తొండరడిప్పొడి ఆళ్వారు ప్రసాదించిన

# శ్రీ మాలికా స్తోత్రము

( తిరుమాలై - ప్రబన్ధము - విపులార్థ వివరణము )

**(1)** **మొదటి** పాశురము. అవతారిక :- పవిత్రమగు భగవన్నామము దానిని ఉచ్చరించినవారికి యమవశ్యతను (యమునికి వశమై నరకయాతనలనుభవించుటను) తొలగించుననియు, దానిననుసంధించువారు భగవంతునికి అత్యంత ప్రియులగుటచేత వారిని ఎవరున్నూ ఎదిరించజాలనంతటి ప్రభావము కలిగియుందురనియు, ఈ మొదటి పాశురములో నిరూపింపబడుచున్నది.

పా॥ కావలిల్ పులనై వైత్తు కలితన్నై క్కడక్కప్పాయిందు
నావలిట్టుళదరుగిన్డ్రోం నమన్ తమర్ తలైగళ్ మీదే ।
మూవుగుండుమిళుందముదల్వా ! నిన్నామం కత్త
ఆవలిప్పుడైమై కండాయ్ అరంగమానగరుళానే !

ప్రతిపదార్థము : మూవులగు- ముల్లోకములను, ఉండు ఉమిళింద- ప్రళయమున కడుపులోనుంచుకొని మరల సృష్టించిన, ముదల్వా- ఆదికారణభూతుడవగు, అరంగమానగరుళానే- ఓ శ్రీరంగనాథా! నిన్నామం- నీ దివ్యనామమును, కత్త- నేర్చి ఉచ్చరించిన, ఆవలిప్పుడమై- ప్రభావాతిశయముచేత, పులనై - ఇన్ద్రియములను కావలిల్ వైత్తు- నిగ్రహించి, కలితన్నై- పాప సమూహమును, కడక్కప్పాయిందు- పూర్తిగా తొలగించుకొని, నమన్ తమర్ - యమునియొక్క అతని భటులయొక్కయు తలైగళ్ మీదే- శిరస్సులపైన, నావల్ ఇట్టు- పరాజయమును కల్గునట్లు గర్జించుచూ, ఉళదరుగిన్డ్రోం- సంచరించుచున్నాము, కండాయ్- చూచితివా.

(వివరణము) 'కావలిల్ పులనై వైత్తు' అనుదానికి రెండు విధములుగా అర్థమును చెప్పవచ్చును. ఇన్ద్రియములను కావలిలోపెట్టి- అనగా నిగ్రహించి- అనియొక అర్థము. లేక- కావలా లేకుండునట్లు ఇన్ద్రియములను స్వేచ్ఛగా విడిచిపెట్టి- అని

రెండవ యర్థము. నేను ఇన్ద్రియ నిగ్రహాది సాధనములను ఆచరింపకున్ననూ నీ నామోచ్చారణము చేసినంత మాత్రమున యముడు తద్భటులను పెట్టు బాధలను తప్పించుకొన గలిగితినని నామ సంకీర్తన వైభవమును తెలుపుటలో తాత్పర్యము. అట్లు యమవశ్యతను తప్పించుకొనుటకు నేను యజ్ఞ దాన తపః క్రియాదులనేమియు చేయలేదు సరికదా, ఇంద్రియములనుగూడ 'సృపశుః' అన్నట్లు విచ్చలవిడిగా క్షుద్ర భోగములపై విడిచిపెట్టితిని. శాస్త్రములో చెప్పినవి చేయకపోగా చేయరానివిగూడా చేసితిని, అయినను నీ నామ సంకీర్తన ప్రభావము అమోఘముగా నన్ను యమవశ్యకతకు దూరము చేసినది సుమా!

వెనుక ఉపోద్ఘాతములో ప్రమాణముగా తెలుపబడిన శ్రీ విష్ణు ధర్మ గ్రంథము నందు శతానీకుడు శ్రీ శౌనక మహర్షిని ప్రశ్నించినపుడు "రాగాదిభిర నిర్జితైః...." ఇత్యాది వాక్యము సంస్కృతమున కలదు. రాగద్వేషాది దుర్గుణములచే ఇంద్రియ లోలురై చరించుచున్ననూ ఈ ప్రజలు ఉజ్జీవించు సన్మార్గమేదైనా కలదా ? తెలుపుము" అని యతని ప్రశ్నకు తాత్పర్యము. పైన మహర్షియును ''పాపభూయిష్ఠులైనవారు గూడ ఈ కలికాలమున పవిత్రులై ఉజ్జీవించుటకు భగవన్నామ కీర్తనమే తరణో పాయము'' అని సమాధానించెను. ఆ విష్ణుధర్మ ప్రమాణానుసారము ఇచటగూడా ''కావలిజాపులనై వైత్తు'' అను వాక్యమునకు 'నా ఇంద్రియములను కట్టుబాటులో పెట్ట కున్ననూ' అని రెండవ యర్థమును సమన్వయించవచ్చును. విషదష్టుడైనవానికి వైద్యమును చేయు భిషగ్వరుడు ''నీవు ఏదైనమా తినవచ్చును, పథ్యమేమియులేదు భయపడకుము నా దివ్యౌషధము తప్పక విషమును హరించగలదు" అని చెప్పును తన ఔషధము అమోఘముగా పనిచేయునని నొక్కిచెప్పుటయే అతని యుద్దేశ్యము భగవన్నామ ప్రభావము గూడ సంసార విషదష్టులను సైతము పావనులను చేయ గలదని సారాంశము.

ఇక ఇంద్రియములను కావలిలో పెట్టి, అనగా నిగ్రహించి, అను మొదటి యర్థము గూడ సమంజసమే. ఇంతకుముందు బాహ్య విషయములపై స్వేచ్ఛగా తిరిగిన ఇంద్రియములను నీ నామ సంకీర్తన ప్రభావముచేత వశము చేసుకొనగలిగితిని, పాపరాశిని పారద్రోలితిని అని సంకీర్తనఫలితమును ఉగ్గడించుటలో తాత్పర్యము. అరాజకమైన దేశమునందు విచ్చలవిడిగా తిరిగిన రౌడీలను రాజు వచ్చిన పిదప అందరినీ బంధించివేయగలిగినట్లు నీ నామ సంకీర్తనమును నేను నేర్చి ఉద్వృత్తము లైన ఇంద్రియములను గూడ బంధింపగలిగితినని యభిప్రాయము.

లేక పనికిరాని లౌకిక క్షుద్రవిషయములపై నుండి ఇన్ద్రియములను మరల్చి రంగనాధుని దివ్యమంగళ విగ్రహముపై సిరముగా నిలిచియుండునట్లు బంధించితినని భావము. "పుంసాం దృష్టి చిత్తాపహారిణం" అన్నట్లు భగవద్విగ్రహ సౌందర్యము చూపరుల సర్వేన్ద్రియములను ఆకట్టుకొనగలిగినది గదా !

"కలితన్నై కడక్కప్పాయిందు"— పాపరాశిని సమూలముగా తొలగించుకొనగలిగితిని. ఇదియే వెనుకచెప్పిన ఇన్ద్రియ లౌల్యమునకు హేతువైనది. ఐహికముగా బాహ్యక్షుద్రసుఖ ప్రవృత్తికి హేతువేగాక అదృష్టమున నరకహేతువు, భగవద్విషయ వైముఖ్యమునకు హేతువు, దేహాత్మ భ్రమకు హేతువు, ఇట్లెన్నో అనర్థములకు కారణము ఈ పాపరాశియే. ఇంతవరకు ఇది "బుద్ధిః కర్మానుసారిణీ" అన్నట్లు నన్ను నియమించినది. నేను దానికి వశుడనై యుంటిని ఇప్పుడు నామ ప్రభావముచేత నేనే దానిని తుడిచిపెట్టగలిగితిని. సంస్కార మాత్రముగూడ లేకుండునట్లు పాపరాశిని తుడిచివేసితిని "అపహతపాప్మా" అని శ్రుతిచెప్పినట్లు ఎన్నడును పాపగన్ధమెరుగని నిత్యపురుషుడితడు అనదగినట్లు పవిత్రుడనైతిని. ఈ అర్థమున 'కలి' అనగా పాపము, మరియు కలియుగము అని యర్థమును చెప్పవచ్చును. కలిదోషమును పూర్తిగా తొలిగించుకొని, అనగా ఇతడు కృతయుగ పురుషుడేమో యన్నట్లు మారిపోయితిని హనుమంతుడొక్కసారిగా విశాల సముద్రమును దాటినట్లు వీరును నామానుసంధాన వైభవముచే పాపసముద్రమును దాటగలిగిరి.

"నిన్నామంకత్త" అని నామానుసంధాన ప్రభావముచేతనే వచ్చిన ఈ గొప్ప ఫలితమును వీరు తామే సాధించితిమన్నట్లు గొప్పను చెప్పుకొనుట తగునాయని కొందరు సందేహించవచ్చును. నిజమే. భగవన్నామమునకు ఒక విచిత్రమైన స్వభావమున్నది. దానముచేయు స్వభావముగల కొందరు మహాపురుషులు తమకు కీర్తి రావలెనను కోరికలేనందున రాత్రి సమయములలో ఎవరికిని కనబడకుండ సత్రములకు పోయి అచటనున్న బీదలకు అన్నదానమునుచేసి వత్తురట. (వీరిని తమిళభాషలో 'ఇరా మడమూట్టువార్' అందురు) అట్లే ఈ భగవన్నామముగూడ ఇతరులకు తెలియకుండా తనను ఉచ్చరించువారికి ఎన్నో మహోపకారములు చేయును. అదే దాని స్వభావము, ప్రభావము. కనుకనే ఉచ్చరించు వ్యక్తియు ఆ ఫలితములు సిద్ధించుట తన గొప్పతనమే ననుకొనును. సర్వపాప ప్రణాశన- యమభట తర్జనాది ఫలితములు తమకే కలుగుటచేత వీరును అట్లే (పాయిందు) నిశ్శేషముగా తుడిచివేసుకొనగలిగితిననుటలో తప్పులేదు.

మరొక ఆశంక :— అనాది పాపఫలమైన స్థూలసూక్ష్మరూప దేహ సంబంధము పూర్తిగా తొలగిపోయినపుడేగదా ఈ ఆళ్వారులు ఇట్లు చెప్పవచ్చును. దేహముతో నుండగనే సర్వపాప ప్రణాశమెట్లు సంభవము ? సమాధానము— ఔను. శ్రీ రంగ నాథుని అమోఘ దివ్యకటాక్షము వీరిపై పూర్ణముగా ప్రసరించుటయే దానికి కారణము. ఆ మహావిశ్వాసముతోనే ''ఇకనాకు పునర్జన్మాదులు లేవు. యమభటాదులును నన్ను బాధింపజాలరు. నాకు కోరిన మోక్షఫలితము తప్పక లభించును" అని దృఢముగా చెప్పుట సంభవమైనది. ఆ స్వామి అంత అధికముగా వీరి ననుగ్రహించెను.

''నావలిట్టు....నమన్‌తమర్....'' ఇత్యాది. పాపఫలమును అనుభవింపచేయు యముని తలపైనను అతని భటుల తలపైనను, పాదప్రహారముచేసి ధైర్యముగా తిరగగలిగితిమి. తమకు ఇపుడు నామసంకీర్తనమను బలము చేకూరిన వెంటనే పూర్వము పలుజన్మలలో ప్రతిసారియు తమను హింసించిన యముని అతని భటులను గూడ పేరుపెట్టి పిలిచి ''ఇక మీరు నన్నేమి చేయుదురు. మీ తలదన్నువాడనైతిని సుమా"యని వీరు అధిక్షేపించుచున్నారు. ''నావల్ ఇట్టు" అనగా- శత్రువుయొక్క ఓటమిని సూచించు విధముగా 'ఔట్ — ఔట్' అని సగర్వముగా గొంతెత్తి గేలి సేయుట. తెలంగాణా ప్రాంతమున ఆటలలో ఓడిపోయినవారిని గూర్చి తొంటచేయిని చూపుచూ 'లేవ్‌డి—లేవ్‌డి' అని గేలిసేయుటకలదు. 'నావల్—నావల్' అని తమిళ దేశమున అందురు.

పూర్వము యమభటుల పేరు చెప్పినంతనే 'అమ్మో'యని వణికిపోయిన వీరు ఇప్పుడు నామసంకీర్తన బలముచేత ఆ యముని వాకిటిముందుకే పోయి ''రమ్మ నీవు వ్రాసిపెట్టిన నా పాపముల చిట్టాను చింపివేయుము. ఇపుడు నీవు నన్నేమి చేయగలవు" అని కవ్వించుచున్నారు. వాలియొక్క పేరు విన్నను భయపడి ఋష్యమూకపర్వత గుహలో దాగియుండిన సుగ్రీవుడు శ్రీరాముని బలమును, అండగాగొని కిష్కింధా నగర ద్వారమువద్దకే పోయి వాలిని యుద్ధమునకు రమ్మని సింహగర్జన చేసినట్లున్నది వీరి మహోత్సాహ మిపుడు. సుగ్రీవునికి అపుడు రామ బలము అండయైనది. వీరికి నామబలము అండయైనది. ఇంతే తారతమ్యము. (ఉశిదరుగిన్గోం) ఇకనన్ను ఎవరునూ ఏమియుచేయలేరన్నట్లు నిర్భయముగా సంచ రించుచున్నాము. తాము ఒక్కరేగదా నామానుసంధానముచే ఇంతటి ఫలమునొందు చున్నది. ''మేము సంచరించుచున్నాము" అని బహువచనముగా చెప్పుచున్నారేమి ? అన్నచో— తమతో ఈ సంకీర్తన గోష్ఠిలో కలిసి అన్వయించినవారిని ఈ పనిని

ద్వేషింపనివారినిగూడ కలుపుకొని బహువచనముగా చెప్పుచున్నారు. భగవదనుగ్రహ పాత్రులైన తామొక్కరే నామసంకీర్తన ప్రభావమును ఎరిగినవారైనను తత్ఫలితమును మాత్రము బహువచనము చేత అనుకూలురైన అందరికినీ వీరు పంచి ఇచ్చుచున్నారు. విశాల సముద్రమును దాటి లంకలో అశోకవనమును విరచి రాక్షససేనను మర్దించి తన పరాక్రమమును చాటినవాడు ఒక హనుమంతుడే, అయినను సీతమ్మ జాడను తెలిసి కొనివచ్చిన మహాసంతోషమునకు ఫలితముగా మధువనమున తృప్తిగా మధువును ఆస్వాదించినవారు వానర వీరులందరును అయిరిగదా!

ఒకడు మహారాజుగారితో చుట్టరికము నొందెను. ఆ బాంధవ్య ప్రభావమును బట్టి లోకములో అతడేగాక అతని తక్కిన బంధువులు మిత్రులుగూడ గొప్ప హోదాను పొందగలిగియుండగా, సాక్షాద్భగవదనుగ్రహపాత్రులైన ఈ ఆళ్వారులతో సంబంధము కలవారికి తత్ప్రభావమునుబట్టి ఈ సత్ఫలితములు లభించకపోవునా!

లోకమున పాపమును చేసినవారు నరక ఫలానుభవము వచ్చునేమోయని భయపడి "యమం తర్పయామి - చిత్రగుప్తం తర్పయామి" అని యమాదులను ఆరాధింతురు. మరి ఈ ఆళ్వారులు నామసంకీర్తన ప్రభావమునందగాగొని ఆ యమాదుల తలలపైననే ధైర్యముగా కాలు జాపుచున్నారు. వీరి అభిప్రాయ ప్రకారము ఇది తమకు విజయముగా భావించినను ఆ యముడు మాత్రము తనకిది యవమానమని భావింపడు. పైగా "ప్రణామం యేపి కుర్వంతి - తేషామపి నమోనమః" అన్నట్లుగా ఎవరు భగవంతుని సన్నిధిలో ప్రణామమాచరింతురో- అట్టివారికిగూడ నేను తలవంచి మాటి మాటికిని నమస్కారముచేయుదునని ఆ యముడనుచున్నాడు. మరియు విష్ణుపురాణములోని "స్వపురుష మభివీక్ష్య పాశహస్తం- వదతి యమః కిల తస్య కర్ణమూలే, పరిహర మధుసూదన ప్రపన్నాన్- ప్రభురహ మన్యనృణాం, న వైష్ణవానామ్" అను శ్లోకమును బట్టియు, శ్రీ భక్తిసార మునీంద్రులు (తిరుమళిశై ఆళ్వారులు) తమ నాన్ముగన్ తిరువందాదియను ప్రబంధమున "తిరంబేల్మిన్ కండీర్ తిరువడితన్నామం......... ఇరైంజియుం శాతువరామ్ పోతుమిన్గళ్ ఎన్రాన్" ఇత్యాది ద్రవిడ గాథలో చెప్పిన దానిని బట్టియు, యముడు తన భటుని పిలుచుకొని చెవిలో రహస్యముగా ఇట్లు చెప్పెనట- "దేహపోషణపరులైన పాపుల పైననే నా అధికారము. భగవద్భక్తుల పైనగాదు. వారే నా పై అధికారులు. వారు కనబడినచో సాధుభావముతో నమస్కరించి ప్రక్కకు తొలగిపొండు. వారిని బంధింపబోకుడు"- దీనినిబట్టి యముడు తాను భయపడుటయేగాక తన భటులను గూడ కట్టుబాటులో నుంచునని స్పష్టమైనది.

ఈ ఆళ్వారులు చెప్పినదానినివిన్న శ్రీరంగనాధుడు వారిని ఇట్లు ప్రశ్నించెను. ''అందరును యమునికి భయపడుచుండగా ఆ యముని తలదన్నెదనని మీరిట్లు నిర్భయముగా చెప్పుచుంటిరేమి? ఏమండీ! మీకింత ధైర్యము దేనినిబట్టి కలిగినది?" దీనికి సమాధానమే "మూవులగుండు మిళిందముదల్వా!'' ఇత్యాది పై భాగము. స్వామీ! నాకు యముడన్నచో భయమెందులకు? నేను క్షోణీకోణశతాంశపాలన కళాదుర్వార గర్వానలక్షుభ్యత్ క్షుద్ర నరేంద్రులను ఆశ్రయింపలేదు సర్వ లోకములను ప్రళయ కాలమున తన ఉదరములోనికి తీసుకొని తిరిగి వెలుపలికితీసి సృష్టిస్థితులను కల్పించు జగత్కారణభూతుడవగు నిన్నాశ్రయించితిని. ''మృత్యుర్యస్యోపసేచనం'' అని కఠోపనిషత్తులో చెప్పినట్లు మృత్యువును (యముని) గూడ ప్రళయకాలమున మ్రింగిన వాడవుగదా నీవు.

''నిన్నామంకత్త ఆవలిప్పుడమై"- కాదు కాదు నీ నామ సంకీర్తన ప్రభావమే నాకీ బలమునిచ్చినది. తిరువాయ్ మొళి ప్రబంధమున ''ఓరాయిరమాయ్ ఉలగేళ్ అళిక్కుంపేర్...'' అని చెప్పబడినట్లు సప్తలోకములను రక్షించగల ప్రభావము నీ సహస్ర నామములకు కలదని నేనెరుంగుదును. నీకంటెను నీ దివ్యనామము భక్త రక్షణమున నిత్య సన్నిహితమై ఉపయోగపడును. ముద్దబంగారమునకు ఆభరణముగా నమరిన బంగారమునకు ఎంత తేడా కలదో నీకును నీ పేరునకును అంత వ్యత్యాసము కలదు. ముద్దబంగారము ఎక్కడో దాచుకొనవలసినదే తప్ప నిత్యము ధరించుటకు ఉపయోగపడదు. ఆభరణమైన స్వర్ణము నిత్య సన్నిహితమై యుండును. నీవు సాక్షాత్కారమునిచ్చి నిత్యము మా వెంట నుండవు నీదివ్యనామము అట్లుగాక మా నాలుక పైననే యుండి ఉచ్చారణమాత్రముచే రక్షకమగును.

"నామంకత్త" ఇచట మంత్రమును అని చెప్పక నామమును అనుచున్నారేమి? యని సందేహము రావచ్చును. మంత్రోచ్చారణకు దేశ- కాల- అధికారి నియమములు కలవు నామోచ్చారణకు అవియేవియు నవసరములేదు. ఏక్షణమైనను ఎక్కడనైనను ఎవడైనను ఉచ్చరింపవచ్చును. "అమ్మా" యని పిలుచుటకు నియమమేముండును?

ఒకప్పుడు నంజీయర్ అను స్వామివారు తమ ఆచార్యులైన శ్రీ పరాశర భట్టరువారిని "స్నానాది పవిత్రతా నియమాలు ఏవియు లేకున్నను భగవన్నామోచ్చారణము చేయవచ్చునా? లేక శుచిత్వము సంపాదించుకొనియే ఉచ్చరింపవలెనా?" అని ప్రశ్నించిరి. దానికి భట్టరువారిట్లు బదులు చెప్పిరి. "గంగాస్నానమును చేయుటకు పోవువాడు ముందొక చిన్న నీటిచెలమలో స్నానముచేసి పోవలెనా? సర్వపాపములను

శమింపజేయు గంగ పూర్వమున్న దేహ మాలిన్యమును తొలగించి శుద్ధిని కలుగజేయ జాలదా!" దీనినిబట్టి గంగవలె సర్వపావనమైన దివ్య నామోచ్చారణకు ముందు గూడ శుచిత్వయోగ్యతను సంపాదింప పనిలేదని వారి సమాధానములోని సారాంశము.

నోరార భగవన్నామోచ్చారణ చేయుటకు అందరును అర్హులే. నాకు అర్హత లేదని ఎవరునూ చింతింపరాదు తల్లిని చంపుటకు కత్తిని పైకెత్తిన క్రూరుడుగూడ తన చేయి గోడను గుద్దుకొనగా నొప్పితో "అమ్మా" యని ఆక్రందించును గదా.

"కత్తు" అనగా అభ్యసించుట యని యర్థము. గురువు మొదట ఉచ్చరింపగా విని అదే క్రమమున వేదమును ఉచ్చరించి అభ్యసించినట్లుగా వీరును నామోచ్చారణ మును అభ్యసించిరి. శ్రీరంగనాథుడే వీరిపై పూర్ణముగా తన దివ్య కటాక్షమును మొదట ప్రసరింపజేసి తన దివ్యనామమును ఉపదేశింపగా వీరు అభ్యసించిరి. అదియు అక్షర గ్రహణమే అర్థముతో పనిలేదు.

''కండాయ్''- చూచితివా రంగనాథా ! ఈ ఆశ్చర్యము. నాలో ఎంతమార్పు వచ్చినది? నేను పూర్వమువలెనే యున్నానా? నీ అనుగ్రహముచే దివ్యనామానుసంధానము చేసిన నాకును సంసారులకును తారతమ్యము మా ఆకారములోనే కనబడుటలేదా, దివ్య రసాయనౌషధమును సేవించిన వానికిని మన్నుతిన్న వానికిని గల భేదమును ఆకారమునుబట్టియే గుర్తించవచ్చునుగదా! (కృష్ణావతారమున) మన్నుతిన్న నీ ముఖమునకును నామామృతాస్వాదనముచే బ్రహ్మతేజోవంతమైన నా ముఖమునకును తేడా కనబడుటలేదా ! (ఇది రసోక్తి)

''అరంగమానగరుళానే!'' వైకుంఠము నుండి శ్రీరంగ మహానగరమునకు వచ్చి తీరికగా ఆదిశేషునిపై నీవు పవళించియున్నది "నాపేరు చెప్పుకొని వచ్చి నన్నాశ్రయించు భక్తుడెవడైన లభించకపోవునా?" అను పేరాసతోనే గదా! సత్య సంకల్పుడవైన నీ ఆశ నా వలన ఫలించినది. ఈ శ్రీరంగము 'మానగర్' గొప్ప నగరము. ఇందు ప్రవేశించిన వారికి సంసార తాపము లన్నియు అణగారిపోవును.

మొదటినుండియు పాపములలోనే పుట్టి పెరిగిన ఒక ధూర్తుడు ధార్మికసంఘము నుండి బహిష్కరింపబడినాడు. నలుగురిలో ముఖమెత్తుకొని తిరగలేని దుఃస్థితిలో నున్నాడు అట్టివానికి రాజకులములోని వారితో బాంధవ్యము ప్రగాఢ పరిచయమును ఏర్పడినవి. ఇక వానిని అడ్డుపెట్టువారెవరు? ఒకనాడు బహిష్కృతుడైనవాడు నేడు తీవిగా



49551

ఎవరినీ లెక్కసేయక రాజసదస్సులోనికి రాగలుగుచున్నాడు. ఆనాడు 'ఛీ' అన్నవారు ఇపుడు తలలువంచి నమస్కరించుచున్నారు. దీనినే రాజకుల మాహాత్మ్యము అందురు. అట్లే ఇంద్రియములచే ఆకర్షింపబడి విచ్చలవిడిగా పాపపు వృత్తిని కలిగియుండిన నేను భగవన్నామ సంకీర్తనము అను రాజకుల మాహాత్మ్యముచేత పూర్వము నన్ను శిక్షించిన యమ-తద్భటాదులనుగూడ తలదన్నగలిగితిని, అని మొదటి పాశురమున ఈ ఆళ్వారులు సగర్వముగా చెప్పుకొని భగవన్నామ ప్రభావమిట్టిదని లోకమునకు చాటిరి. దీనికి సంస్కృతానువాదముగా శ్లోకము.

శ్లో॥ పంచేంద్రియాణి వినిగృహ్య, విశోధ్యపాపం।
ఆధాయ చాప్యపజయం యమతద్భటేషు।
రంగేశ! లోకగణజక్షణ సృష్టి దక్ష।
త్వన్నామ కీర్తనవశాత్ ముదితోస్మిపశ్య॥

**(2)** అవ : వెనుక భగవన్నామ పవిత్రతను తెలిపి తదనుసంధానముచేత కలిగిన అతిశయమును ఉగ్గడించిరి. ఇపుడానామ సంకీర్తనము ఎంత భోగ్యముగా నుండునో ఇందు వివరించుచున్నారు. అయితే, మొదటనే దాని (భోగ్యతను) మాధుర్యమును చెప్పి, పిదప పవిత్రతను చెప్పవచ్చును గదా? వీరు అట్లు చెప్పలేదేమి? అను శంక కలుగవచ్చును. సమాధానము వినుడు- మనస్సులో పెనుభూతమువలె భయమావరించియుండగా మధురమైన వస్తువు ననుభవింపవలెనను అపేక్ష కలుగునా? భయము తొలగునంతవరకును వ్యాకులమైన మనస్సులో ఎవరికైనను వేరు కోరికలు పుట్టునా? శరీరమున జ్వరము విడువక అనువర్తించుచుండగా భోగ్యమైన పాలు రుచించునా? మొదట అవివేకముచేత చెప్పరానన్ని పాపములనుచేసి, పిదప అందులకు నేను ఎన్ని నరకబాధ లనుభవింపవలెనోయని దిగులుపడువానికి భోగ్యవస్తువులపై మనస్సు పోవునా? కనుక మొదట ఆ భయమును పోగొట్టిన తరువాతనే నామామృత మధుర్యమును వివరించుట ఉచితము,

"యన్నామ సంకీర్తనతో మహాభయాత్,
విమోక్షమాప్నోతి న సంశయం నరః"

ఇత్యాది వాక్యములలో మహర్షులు నామ సంకీర్తనము ప్రబల భయనివారణ హేతువని నిస్సంశయముగా నమ్ముమనుచున్నారు. ఇక ఆళ్వారులును అది అమృతము

వలె అతిభోగ్యమని "పెళప్పిల్ పెరుం పెయరే పేశి" ఇత్యాది సూక్తులచే తెలుపు చున్నారు. ఈభగవన్నామము లౌకిక ఫలితములను కోరువారికి వాటిని ప్రసాదించును కర్మయోగాద్యుపాయాంతర నిష్ఠులకు పవిత్రతా హేతువై తదనుష్ఠానార్హతను కలి గించును భగవంతుని శ్రీపాదములే శరణమని నమ్మిన ప్రపన్నులకు జీవనశేషమగు దేహయాత్రలో భోగ్యమగు ఆహారము వలె నిత్యము ఆస్వాద్యమై యుండును.

సముద్రపు రేవులో మునిగి ముత్యములను సంపాదించువారు ఆముత్యముల నిచ్చి నేరేడుపండ్లను కొనుక్కొందురు. వాటి వెలను ఎరిగిన శ్రేష్ఠిగారి వద్ద అవే ఎక్కువ వెలకు అమ్మబడును. ఇక ఐశ్వర్యవంతులు వాటిని హారములుగా గ్రుచ్చి అలంకరించుకొని యనుభవింతురు. ఆ ముత్యముల వలెనే ఈ భగవన్నామములు కొందరికి లౌకిక ఫలప్రదములై యుపయోగపడగా మరికొందరికి సాధనాంతర యోగ్యతా పాదకములై యుండి ప్రపన్నులకు మాత్రము నిత్యానుసంధేయములై అమృతగుళికలవలె భోగ్యములై యుండును.

వెనుకటి పాశురమును విన్న శ్రీ రంగనాథుడు వీరితో నిట్లనెను. "ఓ మునీన్ద్రా! నా నామములను కీర్తించిన భక్తులకు నేనొక దివ్యలోకమును ఫలముగా నిచ్చుట అల వాటు. ఆ భక్తులు 'అది మాకు వద్దు' అనజాలరు. నేనును దానిని ఇయ్యక తప్పదు కనుక మీరు నేనిచ్చు ఆ మహాఫలమును స్వీకరింపుడు"- ఈ మాటకు సమాధానముగా వీరు చెప్పినదే ఈరెండవ పాశురము. "స్వామీ! నీ మధుర దివ్య నామ సంకీర్తనము చేయునపుడు నాకు కలిగిన మహానందమును కాదని మరేదో లోకమునకుపోయి అనుభ వించు ఇతర సుఖములను వేటినిగూడ నేనొల్లను" అని ఖండితముగా చెప్పుచున్నారు.

పా॥ పచ్చై మామలై పోల్ మేని పవళవాయ్ కమలచ్చెంగణ్
అచ్చుదా! వమరరేరే! ఆయర్ తంకొళుందే యెన్నుం ।
ఇచ్చువై తవిర యాన్ పోయ్ ఇన్దిరలోకమాళుం
అచ్చువై పెరినుం వేండేన్ అరంగమానగరుళానే ॥

ప్రతి - అరంగమానగరుళానే! శ్రీ రంగనాథా! పచ్చైమామలై పోల్- మర కత మహారత్న పర్వతమువంటి, మేని- దివ్యశరీరము కలవాడా! కమలచ్చెంగణ్- కమలములవలె ఎర్రని నేత్రములు కలవాడా! అచ్చుతా- భక్తులను జారవిడువనివాడా! అమరరేరే- అనంత గరుడ విష్వక్సేనాది నిత్యసూరులకు నాయకుడా! ఆయర్ తం

కొళుందే- గోపాలనాయకుడా' ఎన్దుం ఇచ్చువై తవిర- అను ఈ నామమాధుర్యమును విడచి, యాఞ-నేను, పోయ్- ఎచటికో పోయి, ఇందిరలోకం ఆళుం-ఇంద్రాదిలోకములను పాలించుట యనెడు, అచ్చువై - ఆ యానందము, పెరినుం వేండేఞ- లభించిననూ ఇష్టపడను.

వివరణము: "పచ్చైమామలై"- ఇత్యాది "ఎన్దుం" అనునంతవరకును ఆరు భగవన్నామములు. ఒక్కొక్క నామమును అర్థానుసంధానపూర్వకముగా ఉచ్చరించుచున్నపుడు నోట నమృత మూరుచుండును. అమృతానుభవ సమానమగు ఈ సంకీర్తనానందమును విడచిపెట్టి మరెక్కడికో నన్ను పొమ్మనెదవా రంగనాథా! ఇది తప్ప నాకు వేరేదియు వద్దు- అనుచున్నారు.

"పచ్చైమామలైపోల్ మేని"- ఆకుపచ్చని కాంతి కలిగి సుందరమగు నొక మరకత మణిమయ పర్వతమువలె ప్రకాశించునది స్వామియొక్క దివ్యమంగళ విగ్రహము. దర్శించువారి నేత్రములకు మనస్సునకును చల్లదనము కల్గించునది. చూచిన క్షణముననే సంసారతాపముల నన్నింటిని అణగార్చి ఆనందింప జేయునది. నేయి పేరుకొని గడ్డగట్టినట్లుగా స్వామియొక్క హృదయములోని చల్లని దయా గుణము ఘనీభవించి శ్యామల శీతల కోమల దివ్యమంగళ విగ్రహముగా పరిణమించెను కాబోలు అన్నట్లున్నది. ఆ మరకత మణి పర్వతము గూడ స్థిరత్వమునకు ఔన్నత్యమునకు ఉపమానము కావచ్చును గాని, భగవద్విగ్రహములోని నయనానందకరమగు చల్లదనము దానికెక్కడిది? 'మేని' అను పదమునుబట్టి "ఆనందమయః" అని ఉపనిషత్ప్రతిపాదితమైన భగవంతుని దివ్యాత్మ స్వరూపమో మరియు ఆనంద జ్ఞాన బలైశ్వర్య వీర్యాది తద్గతగుణ సముదాయమో వీరి నాకర్షింపలేదు. వాటిని తనలో నిముడ్చుకొని ప్రత్యక్షగోచరమగు ఉజ్జ్వల దివ్య విగ్రహమే వీరికి ఆకర్షకమైనదని తాత్పర్యము. పెరియాళ్వార్ అని ప్రశస్తినొందిన శ్రీ విష్ణుచిత్త మునీంద్రుఁడును ఈ రంగనాథుని దివ్య విగ్రహమునే తమ నేత్రములకు ఆకర్షకమైనట్లు అద్భుతముగా నిట్లు వర్ణించిరి.

"కన్నాడు కొళ ముగిల్పోల్ కువళైగళ్పోల్ కుఱై కడల్పోల్ నిన్నాడు కణ మయిల్పోల్ నిఱముడైయ నెడుమాల్——" ఇత్యాది. ఎత్తైన కొండపై వచ్చి వాలిన చల్లని మేఘమువలెను సుకుమారములగు కలువరేకులవలెను గంభీరముగ ధ్వనించు నీలమహార్ణవము వలెను నిగనిగలాడు మెరుగు చాయ గలిగి నాట్యమాడు నెమిళ్ళ

గుంపువలెను భగవద్విగ్రహము భక్తుల మనో నయనములను పరవశింపజేయుచున్నదట. ఒక్కొక్క గుణము గల ఆ ఉపమాన వస్తువులు శీతల-మృదుల-శ్యామల-ఉజ్జ్వల-దివ్య విగ్రహమునకు సంపూర్ణోపమానములు కాజాలవని భావము. ఈ ఛాయలోనే సాగిన శ్రీరంగరాజ స్తవ శ్లోకము గూడ ఇచట అనుసంధేయము

శ్లో॥ సింవేదిమం చ జన మిందిరయా తటిత్త్వా
భూషామణిద్యుతిభి రిన్ద్రధను ర్దధానః।
శ్రీరంగధామని దయారస నిర్భరత్వాత్।
అద్రౌ శయాళురివ శీతలకాల మేఘః॥

"పవళవాయ్ కమలచ్చంగణ్" అధరము-నేత్రములు- మొదలగు అవయవముల సౌందర్యము విగ్రహములోని సముదాయ శోభయగు లావణ్యమునకు అభివర్ధకముగా నున్నది. ఎర్రని పగడమువలె అధరశోభ భక్తుల నేత్రములను ఇతర వస్తువులపైకి పోనీయకుండ అకట్టుకొనుచున్నది పచ్చల కొండపై మొలచిన పగడపు తీగలో ఒక ఎర్రని పగడము పుట్టినట్లున్నది చల్లని చూపులతో ఎర్రని పద్మములవలె విప్పారిన నేత్రములు స్వామియొక్క హృదయములో నున్న వాత్సల్యరసమును ఆవిష్కరించుచున్నవి. చిరునవ్వుతో కూడిన ఎర్రని అధరము వికసితములైన నేత్రములను కలసి భక్తులను కుశల ప్రశ్న మడుగుటకు పలకరించబోవుచున్నట్లున్నవి

శ్లో॥ సంభాషమాణ మివ సర్వవశం వదేన
మందస్మితేన మధురేణ చ వీక్షితేన... ఇత్యాది
శ్రీరంగరాజస్తవ శ్లోకమిచట అనుసంధేయము

రంగనాథుని దివ్య విగ్రహ సౌందర్యమును ఇంత అభినివేశముతో అనుభవించుచున్న ఈ ఆళ్వారుల పాశురమును అధ్యయనము చేసిన నంజీయర్ అను ఆచార్యులవారు ఆశ్చర్యముతో నిట్లు సెలవిచ్చినారట "దేవుడే లేడనియు- ఉన్నను ఆయనకు శరీరముగాని గుణములుగాని ఒక దివ్య దేశముగాని లేవనియు వాదించు శూన్యవాదులు లోకమున ఎటు జూచినను కనబడు ఈ రోజులలో భగవంతుని దివ్య శరీర శోభానుభవమును ఇంత అత్యాదరముతో కీర్తించు ఈ ఆళ్వారులవంటి మహనీయులు అవతరించుట గొప్ప విశేషము గదా!"

"అచ్యుదా"- అచ్యుతుడు అను పదమునకు ఎన్నటికిని మారని స్వరూప స్వభావములు కలవాడని యర్థము. "సదైక రూప రూపాయ" అని గదా సహస్రనామా ధ్యాయ వచనము, ఉపమానములైన ఆ మరకతగిరియో పగడమో పద్మమో ఇవన్నియు రోజుకు రోజు కాంతి తరిగిపోగా కాలక్రమమున స్వరూపనాశము నొందును. భగవంతుని దివ్య దేహమో ఆత్మస్వరూపమో గుణములో అట్టివికావని భావము లేక- నీవు అచ్యుతుడవై అనగా, స్వరూప స్వభావములకు ఎట్టి హానియు లేనివాడవై ప్రకాశింతువుగాక, అని వీరు మంగళాశాసనము చేయుచున్నారని గ్రహింపదగును స్వామిపై అసదృశ ప్రేమభరితులైన ఆళ్వారులందరి స్వభావముగూడ స్వామి సాక్షాత్కారమైనతోడనే "పల్లాండు- ఉన్- శేవడి శెవ్వితిరుక్కాప్పు" అని మంగళములు పాడుటయేగదా! లేక- ఆశ్రితులైన వారిని ఏనాడును విడువక రక్షించువాడనియు భావము కావచ్చును "నత్యజేయం కథంచన" అను శ్రీరాముని ప్రతిజ్ఞ స్మరణీయము

"అమరరేరే"- ఈ దివ్య సౌందర్యమును నిత్యము తృప్తిగా ననుభవించు నిత్యసూరులకు స్వామియైనవాడు, ఎందరు ఎంతకాలము అనుభవించుచున్ననూ తరగని అపరిచ్ఛిన్న తేజోవిరాజితుడు. "సదా పశ్యంతి సూరయః" "అమరర్ గళ్ అధిపతి" ఇత్యాది ప్రమాణోక్తమగు నర్థము ఇదే.

"ఆయర్ తంకొళుందే"- శ్రీ దేవ్యాది దివ్య మహిషీగణము అనంత గరుడాది నిత్యసూరివర్గము మొదలగు వారికి మాత్రమేకాదు, గొల్లలు-గోవులు మొదలగు సామాన్య ప్రాణులకుగూడ తన దివ్య సౌందర్యానుభవమును ప్రసాదించు సర్వ సులభుడు అప్రతిమమైన సౌందర్యము పరత్వము సౌలభ్యము ఇవన్నియు నిత్య నూతనములై ఏకరాశిగా దివ్య విగ్రహ రూపమునొందినవని సారాంశము

"ఎన్నుం ఇచ్చువై తవిర"- ఓహో, మీకు ఇట్టి నా స్వభావమును సంపూర్ణముగా సాక్షాత్కరింపగా ఈ భోగ్యతాబుద్ధి ఏర్పడినదా- అనియందువేమో? స్వామీ! అదేమియులేదు. కేవలము అర్థానుసంధాన పూర్వకముగా ఆస్వాదించుటచే నాకు కలిగిన ఆనందమే యిది. ఈ సంకీర్తనామృతాస్వాదమును విడచి మరెక్కడికో నన్ను పొమ్మందువా! "కరస్థముదకం త్యక్త్వా ఘనస్థ మభివాంఛతి" అన్నట్లు చేతికందిన దానిని విడచి మరొకదానికై నేనాశపడను. ఈ నామ సంకీర్తనము నీకు అభ్యాసములో లేనందున దీనిలోగల రుచి నీకు తెలియక పోవచ్చును.

''యాఁపోమ్''- నిత్యసన్నిహితమై చేతికందియున్న ఈ శ్రీరంగ క్షేత్రము లోనే యుండక "ఉద్బాహురివవామనః" అన్నట్లు చేతికందని అతిదూరములోనున్న మరొక చోటికి నేను పోజాలను.

"ఇన్దిరలోకమాళుం"- ఇచట ఇన్ద్రి శబ్దమును పరమాత్మ వాచకముగానే గ్రహింపవచ్చును. "బ్రహ్మ- రుద్ర- ఇన్ద్రాది దేవతావాచక శబ్దములన్నియు వ్యుత్పత్తినిబట్టి నేరుగాగాని, ఆ దేవతల కంతర్యామియగుటచే అపర్యవసాన వృత్తినిబట్టిగాని- భగవద్వాచకములే" అను వేదాంత శాస్త్రనిర్ణయము ఇచటగ్రాహ్యము ఆ విధముగా ఇప్పుడు ఇన్ద్రి లోకమనగా "తద్విష్ణోః పరమం పదం" అని కీర్తింప బడిన శ్రీవైకుంఠధామమని యర్థము. ఈ శ్రీరంగమున నామ సంకీర్తనానుభవముతో భాగవత సేవతో ధన్యుడనై యుండుటయే తప్ప ఆ పరమపద వాసమునుగూడ నేనొల్లను అనిభావము "ఆళుం" అనగా, పాలించుటకై అనియర్ధము. "అణ్మిఁ గళ్వానగం ఆళియాంతమరెన్ఱు ..." అని శ్రీ శఠకోపమునీన్ద్రులు తెలిపినట్లుగా ఈ లోకము నుండి పోవు ముక్తపురుషులను ఆ పరమపద వాసులందరును 'అయ్యా! వేంచేయుడు, ఈ పరమపదముతోపాటు మమ్మేలుకొనుడు' అని సాదరముగా ఎదురు కొని ఆహ్వానింతురట అట్లు పరమపదమును పాలించుటకై రమ్మని పిలిచినను నేను పోజాలను.

"అచ్చువై - ఇచ్చువై "- ఆ మోక్షానందము అప్రత్యక్షము శాస్త్రమాత్ర బోధి తము. ఈ నా సంకీర్తనానందమో ప్రత్యక్ష సిద్ధము మరియు చేతికందినది.

"పెరినుం వేండేఁ" ఆ మోక్ష మహానందము లభించనంతవరకు మీరు వద్దం దురు. తీరా లభించిన పిదప 'ఓహో! ఇదే బాగున్నది' అని మీరే యందురు, అని స్వామి వీరితో పరిహాసము చేయగా, "అది నాకు లభించినను వద్దు వద్దు" అని తిర స్కరించుచున్నారు. నన్ను పరీక్షించుటకై నీవు ఆ మోక్షమును చూపించినను నేను త్రోసివేయుట తథ్యము. "...భిత్వా భాస్కరమండలం పునరపి ప్రత్యాగతః స్యాం భువమ్."

ఇచట "వేండేఁ" (నాకువద్దు) అనుచున్నారు. అంతేగాని- ''ఉఱాదు" (అయుక్తము-అనుచితము) అని ప్రయోగింపకపోవుటలో విశేషమున్నది. తమ కంటెను అధిక జ్ఞాన సంపన్నులైన నిత్యులు ముక్తులును అనుభవించు పరమపద మును అనుచితమని ఆక్షేపించుట తగదు గదా! మరియు ఆ మోక్షమును ఉత్తమ

పురుషార్థమని తెలుపు వేదాంత శాస్త్రమును గూడ ఆక్షేపించినట్లగును. ఆ దృష్టితో ''యాన్ వేండేన్'' ''నాకు వద్దు'' అనియే చెప్పిరి. ఇది నా యిష్టమని భావము. రోగి తన నోటి అరుచినిబట్టి ''పాలుచేదు'' అనియో ''పుల్లగా నున్నవి'' అనియో త్రాగనిచో ఆరోగ్యమునకై త్రాగమని నిర్బంధించువారుందురు. కాని ''వేండేన్'' (నాకు అసలే వద్దు) అను వ్యక్తిని ఎవరు మార్చగలరు. ''భావోనాన్యత్ర గచ్ఛతి'' అని చెప్పి పరమపదమును నాకు వద్దన్న హనుమంతుని శ్రీరామచంద్రస్వామి ఏమి చేయగలిగినాడు?

ఇచట ''ఇందిరలోకం'' అను పదమునకు పరమపదము అని యర్థమునుగాక ''దేవతలుండు స్వర్గలోకమును'' అనిగూడ అర్థమును చెప్పవచ్చును. శ్రీ కుల శేఖరులు తమ పెరుమాళ్ తిరుమొళి ప్రబంధములో ''మిన్నన్నైయ నుణ్ణిడైయార్ ఉరు ప్పశియుం మేనకైయుం'' అనియు ''ఉంబరుల కొండు ఒరుకుడై క్కీళ్ ఉరుప్పశి తన్'' అనియు శ్వేతచ్ఛత్రము క్రిందనుండి స్వర్గము నేలుచూ ఊర్వశ్యాదులతో ఆ ఇంద్రుడనుభవించు స్వర్గసుఖములు గూడ నాకు వద్దని తెలిపినట్లు ఇచటగూడ గ్రహింపవచ్చును.

''అరంగమానగరుళానే''- పరమపదమునే వద్దనుచుంటిరే ఇక్కడ అంత కంటే విశేషమేమున్నది? అని శ్రీరంగనాథు డడిగిన ప్రశ్నకు సమాధానమే ఈ సం బోధనము. పరమపదమున సుఖముగా ఉండవలసిన నీవు దానిని విడచివచ్చి మావంటి వారికి నీ దివ్య సౌందర్యమును సౌశీల్య వాత్సల్యాది మహా గుణములను ప్రకటించు కొరకేగదా ఈ శ్రీరంగ క్షేత్రమున నిత్యవాసము చేయుచుంటివి. ఇంతకంటే నాకు మాత్రము వేరేమి కావలెను? అల్పులైన మానవులకు గూడ దర్శనమిచ్చి అలరించు నీ వాత్సల్య సౌశీల్యాది గుణములను నేరుగా చూచి తాము ననుభవించుటకై ఆ నిత్యసూరులును ఇచ్చటికి వచ్చుచుండగా నేనచ్చటికి పోనేల? అని వీరి అభి ప్రాయము. ఇచటనే యుండి నామసంకీర్తనమును చేయుచు అనుభవించు ఈ ఆనంద మునకు ఆ పరమపదవాసము గూడ సాటిరాదని చెప్పుటచేత ఈ ఆళ్వారులకు నామ సంకీర్తనమన్న ఎంత యిష్టమో తెలియుచున్నది. భగవదారాధన సమయమునందు స్వామికి నైవేద్యము (అరగింపు) సమర్పించునపుడు తిరుప్పావులోని ''కూడారై వెల్లుంశీర్'' అను పాశురమును, తిరుమాలైలోని ఈ ''పచ్చైమామలై పోల్'' అను పాశురమును, తిరువాయ్మొళిలోని ''అడియేన్‌మేవి అమర్‌గిన్ఱ వముదే'' అను పాశు రమును, పెద్దలు అనుసంధించుట సంప్రదాయము.

శ్లో॥ హరిన్మణి మహీధరోపమతనో! ప్రవాళాధర!
స్ఫురత్కమలలోచనాచ్యుత! సురేశ! గోపేశ్వర!
ఇతీదృగమృతాసవం నహి విహాయ రంగప్రభో!
తదింద్రభువనావనం తదపి భోగజాతం వృణే॥

**(3)** అవ॥ మీకు పరమపదము అవసరములేని పక్షమున మీరు ఈ శ్రీరంగ ప్రాంతములోనే సంసారమండలమునందుండి నామ సంకీర్తనమును చేసుకొను చుండుడు, అని శ్రీరంగనాథస్వామి తెలుపగా- వీరు పునర్విమర్శలో పడి ఇట్లను చున్నారు. "స్వామీ! జన్మ మృత్యు పరంపరా రూపమై పాప భూయిష్ఠమైన ఈ సంసార కూపములో నామానుసంధానమునకు అవకాశమే లేదు. అయినప్పుడిక నాకు ఈ సంసార మండలము గూడ వద్దు". ఇది విన్న ఆ స్వామి "నామ సంకీర్తనకు అవకాశము లేనంతగా మీరు చెప్పు దోషములు సంసారములో నేమున్నవి" అని ప్రశ్నింపగా ఆ దోషములను ఈ మూడవ గాథలో వివరించుచున్నారు. దీనినిబట్టి అనాదికాలముగా సుపరిచితమైన సంసార మండలముపై గూడా జుగుప్సను కలిగించు విధముగా వీరికి నామ సంకీర్తనము మిక్కిలి రుచించినదని తెలియుటచేత అది ఎంత మధురమైనదో సహృదయులు గుర్తింపవచ్చును.

పా॥ వేదనూల్ పిరాయంనూరు మనిశర్ తాం పుగువరేలుం
పాదియుమురంగిప్పోగుం నిన్దదిల్ పదినై యాండు
పేదై పాలకనదాకుం పిణి పశి మూప్పు త్తున్బం
ఆదలాల్ పిరవి వేండేన్ అరంగమానగరుళానే ॥

ప్రతిపదార్థము : అరంగమానగరుళానే!- ఓ శ్రీ రంగనాథా!, మనిశర్ తాం- మానవులైనవారు, వేదనూల్- వేదశాస్త్ర ప్రకారము, నూరుపిరాయుం- నూరుసంవత్సరములు ఆయుస్సును, పుగువరేలుం- పొందినప్పటికినీ, పాదియం- అందులో సగము (50 సంవత్సరములు), ఉరంగిపోగుం- నిద్రతో గడచి పోవును, నిన్దదిల్ పదినై యాండు- మిగిలిన ఏబది సంవత్సరములు, పేదై- శిశుత్వము, పాలగన్- బాల్యము అదాకుం- ఆపైన వచ్చు యవ్వనము, పిణి- రోగము, పశి- ఆకలి, మూప్పు- ముసలితనము, తున్బం- దుఃఖము, (వీటితోనే గడచును) ఆదలాల్- కాబట్టి, పిరవి వేండేన్- మానవ జన్మమును కోరను.

వివరణము: వేదమను శాస్త్రమునందు "శతాయుర్వైపురుషః" అని ప్రతిపాదింపబడినట్లు మానవుల ఆయుర్దాయము నూరు సంవత్సరములై యున్నది. ఆ కాలము మానవుల ఆయుష్యమునకు పరమావధి. ఇట్లని వేదగ్రన్థములలో వినుటయే గాని తరుచుగా అంతకాలము జీవించుట ప్రత్యక్షమున కానరాదు. ఆ నూరేండ్లు అను మాట కొలబద్దతో కొలవబడినట్లు చెప్పబడినను ఏ కొద్దిమందికి మాత్రమో అన్వయించును. మరియు ఆయా ప్రాంతములలోనున్న కాలమానములోగల తేడాలనుబట్టి కాలతలలో భేదమున్నట్లే దేవమానములోను మనుష్యమానములోను దిన-మాస-సంవత్సరాదులలో తేడాలున్ననూ ఇచట 'మనిశర్' అనుటచేత మనుష్యమానమునే గ్రహింపదగును. "న జాయతే మ్రియతేవా కదాచిత్ - నాయం భూత్వా భవితావా న భూయః" అని కఠోపనిషత్తులో తెలుపబడినట్లు ఆత్మ నిత్యమైనందున కల్పాదిలో దేహ సంబంధ రూపసృష్టిని పొందుటయు ప్రళయమున ప్రకృతిలో కలసి మరుగు పడిపోవుటయు చెప్పబడియున్నది ఇచట నట్లుగాక "పునరపి జననం పునరపి మరణం" అన్నట్లు మాటిమాటికిని చావు పుట్టుకలు కలిగియుండుట అని అభిప్రాయము "మనుష్యలు" అను పదముచే సూచితమగుచున్నది. ఇందువలన సంతత మరణ స్వభావత్వము వివక్షితమగును. గర్భములో పడినది మొదలు మానవులను మరణము వెంటాడుచునే యుండునని భావము "పుగువరేలుం" (పొందినప్పటికిని) అను పదముచే ఈ తాత్పర్యము ఆవిష్కరింపబడుచున్నది. అసలు అట్లు నూరేండ్ల ఆయుస్సును పూర్తిగా పొందువారే యుండరు గర్భములోనే చచ్చుట, అందుండి బయల్వెడలుచూ చచ్చుట, పుట్టిన నాల్గు రోజులకే చచ్చుట, దృఢముగా తిరగవలసిన యౌవన దశలో చచ్చుట, ముసలితనములో చచ్చుట. అని యిట్లు మనుషులకు మరణము అనిశ్చితమేగదా: ఈ విషయమే ఈ క్రింది శ్లోకములో తెలుపబడియున్నది.

శ్లో॥ గర్భేచ లీయతే భూయః జాయమానోస్తమేతి చ।
జాతమాత్రే చ మ్రియతే-బాలభావేథ యౌవనే
మధ్యమం వా వయః ప్రాప్య- వార్ధక్యేవా ధ్రువా మృతిః॥
ఇత్యాది.

లోకమున మానవులు మాత్రము తమ ఆయుష్య మిట్లు వ్యర్థముగా గడిచి పోవుచున్నదేయని విచారింపరు. పైగా సూర్యోదయమైనపుడు 'సంపాదించుకొనుటకు అవకాశము వచ్చిన'దని సంతోషింతురు. సూర్యాస్తమయమైనపుడు సుఖించుటకు వీలుచిక్కినదని ఆనందింతురు. వాల్మీకి మహర్షి శ్రీరామాయణమున ఈ విషయము నిట్లు వివరించెను.

శ్లో॥ నందన్త్యుదిత ఆదిత్యే-నన్దన్త్యస్తమితే రవౌ।
మనుష్యా నావబుధ్యన్తే-ఆత్మనో జీవితక్షయమ్ ॥

ఇత్యాది. "జాయస్వ మ్రియస్వ" అను శ్రుతి మాటిమాటికి పుట్టుట చచ్చుట తప్ప మానవ జీవితములో ఏమియు సారములేదని తెలుపుచున్నది. శ్రీ శఠకోప మునీంద్రులును "మిన్నిన్నిలై ఇల-మన్నుయిర్ ఆక్కైగళ్" అని చెప్పి "మీరు జీవించు శరీరములు మెరపులకంటెను క్షణ భంగురమైనవి సుమా" యని ఈసడించుచున్నారు. శ్రీ భక్తిసార మునీంద్రులును "వాళ్గళాగి నాళ్గళ్ శెల్ల..." ఇత్యాది పాశురమున ఒక్కొక్కరోజు గడచినకొద్దియు ఆయుష్యములోని కొంత భాగము ఖడ్గముచే ఖండింపబడినట్లు తరిగిపోవుచుండునని జీవితాస్థిరతను వివరించుచున్నారు. ఇట్టిదిగదా ఈ మానవ జీవితము : ఇందుకో నామ సంకీర్తన కవకాశమేది?

"పుగువరేలుం" ఒకవేళ ఎవడో ఒకడు అదృష్ట విశేషముచేత శ్రమకోర్చి నూరేండ్లును జీవించినాడే యనుకొన్ననూ, "పాదియుం ఉరంగిప్పోగుం"- అందులో సరిగా సగానికి సగము వ్యర్థముగా నిద్రలోనే గడిచిపోవును. ఒక రోజులో సగము రాత్రి యైనపుడు- అది పూర్తిగా నిద్రతోనే గడచిపోయినపుడు, ఆయుష్యములో 50 సంవత్సరముల కాలము సంకీర్తనావకాశము లేక వ్యర్థమైనట్లేగదా! "జహౌ నిద్రాంచ తంద్రాంచ" అని శ్రీ రామాయణమున రామ సేవకై లక్ష్మణుడు నిద్రాలస్యములను పూర్తిగా విడిచినట్లు వాల్మీకి ప్రశంసించెను. ఆ లక్ష్మణునివంటి మహానుభావులెందరు కలరు ? 'సతతం కీర్తయంతశ్చ' అను గీతా వాక్యమును బట్టి నిరంతర నామ సంకీర్తన కొరకేగదా మానవ జీవిత మేర్పడినదని స్పష్టమగుచున్నది.

"నిన్దదిల్ పదినైయాండు" ఇత్యాది. ఇక సగము నిద్రలో పోగా మిగిలిన యాభై సంవత్సరములుగూడ శిశుత్వము- బాల్యము- యౌవనము- రోగము- రొప్పి- వార్ధక్యము మొదలగు వాటితో గడుచును. ఇట్లు జాగ్రదవస్థలో గడచిన మిగిలిన సగముగూడ పనికిరాని క్షుద్ర జీవితమేనని అధిక్షేపించుచున్నారు. ఆయుష్యములో ఈ ప్రతియొక్క అవస్థయు అజ్ఞాన పరిపూరితమే. ఎట్లనగా- 'పేదై'- అనగా స్తనంధయత్వము. మాటలురాని అవస్థగనుక సంకీర్తనము అసంభవము. తల్లిచేయు పోషణకు అధీనముగానే మలమూత్రాదులలో గడచు జీవితమే ఆ శిశుత్వము. ఇక "పాలకన్" అనగా బాల్యము. "ఆషోడశాత్ భవేద్బాలః" అని మనుస్మృతిలో చెప్పినట్లు సుమారు నాల్గవ ఏట నుండి 16 ఏండ్ల వరకుగల జీవితము. ఇదియంతయు "బాలః క్రీడనకాసక్తః" అన్నట్లు ఆటపాటలలోనే గడచిపోవు అజ్ఞానదశయేగనుక

నామ సంకీర్తనము చేయలేదేయని మనము ఈసడించుటకే వీలులేదు ఇక 'అదాతుం' ఆపైనవచ్చు యౌవనావస్థ. ఇందులో అత్యుద్రిక్తములైన ఇంద్రియములకు అధీనుడై క్షుద్రవిషయ భోగములపైకి మాత్రమే పరుగిడుచుండునుగాని వివేకముతో ప్రవర్తించు నవకాశము బొత్తిగా నుండదు. వివేకమును లోపింపజేసి పాపములలో పడద్రోయు యౌవనమునకంటె తల్లి యొడిలో జీవించు శిశుత్వమనబడు ఆ అత్యంతాజ్ఞానదశయే ఈ మేలు, అనిపించును. ఈ యౌవనమున కలిగిన కొద్ది జ్ఞానముగూడా పాపకార్యమునకే ఉపయోగపడుచుండును గదా! ఇట్లు యౌవనము గడుపుచుండగనే మరొక ప్రక్కనుండి వ్యాధులు ప్రవేశించును. చికిత్సచే ఆ వ్యాధులను తగ్గించుకొని తిరిగి ఆరోగ్యమును పొందగా "పశి" ఆకలి పెరుగును. ఇచట ఆకలియనగా- మరల ఇంద్రియములన్నియు శక్తిని పొంది తమకు భోగవస్తువులను తెచ్చిపెట్టమని ఈ మానవుని పురికొల్పుటయే దరిద్రగృహస్థుని యింటనుండు బాలుర తలా ఒక్కొక్క ప్రక్కనజేరి "నానా! అన్నము పెట్టు"మని వేధించుచున్నట్లు ఈ పంచేంద్రియములు గూడ తమకు కావలసిన రూప రస గంధాదులను తెచ్చిపెట్టుమని మానవుని అటునిటు లాగుకొని పోవుచూ బాధించుచుండునని ఆళ్వారులు "ఐవర్ తిశైతిశై వలిత్తు ఏత్తు గిన్ఱనర్" ఇత్యాది సూక్తులలో ఆదృశ్యము కన్నులకు గట్టునట్లు విశదీకరించియున్నారు. ఔను! ఇది వాస్తవమే! క్షుద్రమగు అపమృత్యుదానమును స్వీకరించియు క్రూరముగా పరులను హింసించియు ద్రవ్యార్జనము చేయుట యేందులకు? ఈ ఇంద్రియములను తృప్తిపరచుటకేగదా మానవుడీ పాడు పనులకు ఒడిగట్టుచున్నాడు.

"మూప్పు-తున్బం" చివరకు ముసలితనము-మరణదుఃఖము అనుభవించుటకో పాపములు చేయుటకో తగిన శక్తిలేకున్ననూ మనస్సులో ఆశ చావదు "..తదపి న ముంచ త్యాశాపిండమ్" మరల శక్తిరాక పోవునా! సుఖమనుభవించకపోవుదునా! అను ఆశ వీడదు. పూర్తిగా శరీరేంద్రియములలో శక్తియుడిగిపోయిన పిదప గూడ వయస్సులో తాను చేసిన ఘనకార్యములను మాటిమాటికి తలంచుకొని ఇతరులకు చెప్పుచూ తృప్తిచెందుదురట. వార్ధకావస్థలో వచ్చు ఇట్టి వ్యవహారములను పెరియ తిరుమొళి ప్రబంధములో శ్రీపరకాల మునీంద్రులు అతి మనోహరముగా నిట్లు వర్ణించిరి.

పండు కామరానవాఱుం పావయర్ వాయముద
ముండవాఱుం వాళ్న్దవాఱుం ఒక్క వురైత్తు ఇరుమి
తండుకాలా వూన్ఱియూన్ఱి తళ్ళి నడవామున్
వండుపాడుం తండుళాయాన్ వతరి వణంగుదుమే॥

పూర్వము తాను పలువురు స్త్రీలతో మహారసికుడై విహరించిన విధమును ఆ స్త్రీల అధరామృత మాస్వాదించిన విధమును ఎవరికినీ తలవంచక దర్జాగా జీవించిన విధమును తలంచుకొని ఉవ్విళ్ళూరుచూ వృద్ధుడు ఏకధాటిగా ఇతరులకు చెప్పుచుండును ఇంతలో గొంతు తడబడి విపరీతముగా దగ్గువచ్చును దగ్గుచుగూడ ఆ సంగతులు చెప్పుట మానడు. కాళ్ళపై నిలబడలేక చేతికర్రనే కాలువలె ఊతముగా చేసుకొని శరీరమును ఈడ్చుకొనుచు నడచుచుండును మానవులారా! మీకును ఇట్టి వార్ధక్యదురవస్థ రాకముందే తులసీమాలాధారియగు బదరీనారాయణస్వామిని సేవింతెదము, రండు. అని దాని అర్థము. ఇట్లు ముసలితనమున గూడ తాను పూర్వము చేసిన పాడుపనులనే చెప్పుచుండును గాని నామసంకీర్తనము చేయడు. ఇక అనుకొనకుండనే తలపైన పిడుగుపడినట్లు మరణమేర్పడును. జీవితము సమాప్తమగును. ఇట్లు ఆయుష్యమున ఏ భాగము గూడ ఉపయోగపడదనిరి తమ దేశమును వశము చేసుకొనుటకు వచ్చిన శత్రువులకు ఏవో తప్పుడు లెక్కలు చెప్పియు లొంతలు-దిబ్బలు- ఇసుక చౌడు ఇవన్నియు కాగితముపై వ్రాసి చూపియు ఇదంతయు వ్యవసాయ యోగ్యముకాని వ్యర్థమగు దేశమని తెలుపువారివలె, ఈ ఆళ్వారులును నామోచ్చారణకు ఇందులో అవకాశమే లేదన్నట్లు ఉన్న ఆయుష్యమంతయు పైపైననే వ్యర్థముగా గడిచిపోవునని ఈ పాశురమునందు శ్రీరంగనాధునికి లెక్కలు చూపి విన్నవించిరి.

"మీరు ఆ పరమపదమును 'అచ్చువై పెరినుం వేండే' నని తిరస్కరించితిరి. 'ఆదలాల్ పిరవి వేండేన్' అని ఈ మానవ జీవితమును వద్దంటిరి. నిలబడితే వొట్టు-కూర్చుంటే వొట్టు అన్నట్లు ఏదియు వద్దన్న పక్షమున మీరు సాధించినదేమి? నాకు ఉన్నవే రెండు విభూతులు, ప్రపంచములు ఒకటి. శ్రీ వైకుంఠము- రెండవది ఈ ప్రకృతి మండలము గదా!" అని రంగనాధుడు ఆక్షేపమును తెలుపగా, "అరంగమానగరుళానే" అనిసంబోధించి తమ యభీష్టమును నిగూఢముగా సూచించిరి

స్వామీ! విభూతిద్వయమున కంటెను విలక్షణమైనది ఈ శ్రీరంగ క్షేత్రము తృతీయ విభూతి యనదగు ఈ దివ్య క్షేత్రమున ఉండి నిన్ను అనుభవించుచుండుటకు నాకు ఒక్క అడుగు భూమి దొరకదా! ఆ రెండు ప్రపంచములకంటె శ్రీరంగమునకు గల ప్రత్యేకత ఏమి యన్నచో, చెప్పెదను వినుము లోకులు తమ శిశువులకు అన్న ప్రాశనాదులను చేయుటకని ఇచటికే వచ్చి వారిని నీ అనుగ్రహమునకై నీ పాదముల మీదనే పడవేయుచుందురు. ఇట్లు చేసినచో పిల్లలకు తమకును శ్రేయస్సు కలుగునని భావింతురు. ఆపైన ఆ పిల్లలు గూడ బాల్యమున ఆటపాటలు నేర్చినచో ఇచటికేవచ్చి

వీధులలో ఆడుకొనుచుందురు. వారి ఆటలుగూడ నీ ఉత్సవములను అనుకరించు ఆటలే. తీర్థగోష్ఠి- ప్రసాదగోష్ఠి- ఊరేగింపు- అరగింపు ఇవన్నియు పెద్దలవలె వారును ఉల్లాసముగా అనుకరించుచూ ఆడుకొందురు. శ్రీ రామాయణమున వాల్మీకి అయోధ్యానగర వైభవమునిట్లు కీర్తించెను.

బాలా అపి క్రీడమానాః-గృహద్వారేషు సంఘశః।
రామాభిష్టవ సంయుక్తాః-చక్రురేవ మిథః కథాః ॥

బాలురు గూడ గుంపులుగా చేరి తమ ఇండ్ల ముందర రామ కథలనే చెప్పుకొనుచూ ఆడుకొనచుందురట. అటుపైన వయస్సు పెరిగి యౌవనమందు కోరిన భోగము లనుభవించుటకై గృహములలో ఏకాంతముగా నున్ననూ, స్వామియొక్క దివ్య సౌందర్యము అలంకార వైభవము ఉత్సవ గోష్ఠి పవిత్ర సంస్కృత ద్రవిడ వేదాధ్యయనము ఇవన్నియు మనస్సులో స్మృతికివచ్చి క్షుద్రభోగములపై వ్యామోహము అణచి స్వామిసేవకై పరుగిడునట్లు చేయును. చివరకు ముసలితనములోగూడ కదలలేక వాకిటి అరుగుపై కూర్చొని యుండగా ఊరేగింపు అను వ్యాజముతో స్వామియే వచ్చి దర్శన మిచ్చుచుండును. ఇట్లు సర్వావస్థలలోను ఈ క్షేత్రమున భగవత్సంబంధానువృత్తి నిరంతరము జరుగుట విశేషము. మరియు "దేశోఽయం సర్వకామధుక్" అన్నట్లు చతుర్విధ పురుషార్థ లాభము ఇచట సంభవమగును కనుక నాకును నీ నామ సంకీర్తనముతోపాటు ఈ శ్రీరంగక్షేత్రవాసమే కావలెనని "శ్రీరంగనాథా" అని సంబోధించిన వీరి అభిప్రాయము.

శ్లో॥ యద్వ్యప్యాయుశ్శతాబ్దావధి నిగమతతి వ్యాహృతం మానుషాణాం
తత్రార్ధం నిద్రయైవ వ్యపగత, మపరే శిష్టపంచాశదబ్దాః ।
డింభత్వం బాల్యలౌల్యం తరుణిమ విహృతిః వృద్ధతా క్షుత్రుజా చే-
త్యేతైరేవ వ్యపేతాః, తదిహ సహి జనిం రంగబన్ధో! వృణోమి॥

**(4)** అవ : తమకు భగవంతుని నిరవగ్రహానుగ్రహముచేత లభించిన నామ సంకీర్తనామృతాస్వాదమను మహాఫలమును గూర్చి వెనుకటి మూడు పాశురములలో ప్రస్తావించిరి. ఇక్కడినుండి 11 పాశురములవరకును పరోపదేశమును చేయుచున్నారు. ఆ యమృతాస్వాదమును చేయుచున్న వీరు తమ అనుభవమును వదులుకొని మధ్యలో ఇతరులకుపదేశింపనేల? అని కొందరడుగవచ్చును. కాని "నాకు ఉన్నచో చాలును.

ఇతరులతో నాకేమి పని?" అను స్వభావము కాదు వీరిది. యోగ్యతయుండి సర్వ జనులకు అనుభావ్యమై అతిసులభమైన ఈ విషయమునకు లోకులు దూరమై పోవు చున్నారే అజ్ఞులగు వారికి ఇందులో అవకాశము కల్పించెదము అను దయతో ఉపదేశించుచున్నారు సంకీర్తనమనునది ఇతరులతో కలిసియే అనుభవింప వలసినదిగాని, ఏకాన్తముగా ఒక్కడే చేయవలసినదికాదు గనుక ఇందలి భోగ్యతను ఇతరులకునుతెలిపి వారితో కలసి అనుభవింపవచ్చునని వీరి ఆశ. "ఏకః స్వాదు న భుంజీత" అను ప్రకారము తాము అనుభవించినదానిని తక్కినవారికిగూడ పంచిపెట్టక ఉండలేని స్వభావము వీరిది. కనుక నుపదేశించుచున్నారు.

వీరు లోకులను రమ్మని పిలువగా, వారు "అయ్యో! పాపిష్ఠులమగు మాకు పవిత్రమగు సంకీర్తన కార్యమందు అన్వయించు యోగ్యత కలదా!" అని సందేహము వెలిబుచ్చిరి. అందుకు సమాధానముగా- ప్రాయశ్చిత్తములెన్నిచేసిననూ నశిం పని ప్రబల పాపములుగల క్షత్రబంధువనువాడే నామసంకీర్తన ప్రభావముచే మోక్ష సిద్ధినందినాడు సుమా! ఇక మీరేల వెనుదీయుదురు" అని వీరు దృష్టాంతమును చెప్పి నను ఆ లోకులు అంతగా ఉత్సాహము చూపకపోవుటతో, వీరు చెప్పినది వినిగూడా ఆ పాపముల ఫలముగా కష్టములలోనే మునిగిపోవుచున్నారే" అని ఆశ్చర్యమును ఈ పాశురమున ప్రకటించుచున్నారు.

పా॥ మొయ్త్తవల్వినైయుళ్ నిన్ఱు మూన్ఱెళుత్తుడైయ పేరాల్
కత్తిరబన్ధుమన్ఱే పరాంగతి కండుకొండాన్ ।
ఇత్తనై యడియరానార్క్కు-రంగుం నమ్మ రంగనాయ
పిత్తనై పెత్తుమన్దో! పిరవియుళ్ పిణంగుమాఱే ॥

ప్రతి మొయ్త్త- దృఢముగా ఆవరించియుండు, వల్వినైయుళ్ నిన్ఱు- ప్రబల పాప సమూహమునుండి, మూన్ఱెళుత్తుడైయ పేరాల్- మూడక్షరములుగల (గోవింద) నామముచేత, కత్తిరబందుం- క్షత్రబన్ధువు అనువాడుకూడ, పరాంగతి- మోక్షమును కండుకొండాన్అన్ఱే- పొందినాడుగదా! ఇత్తనైఅడియరానార్క్కు- ఇంత మాత్రముచేతనే భక్తులైనవారికి, ఇరంగుం- దయను చూపించు, నం అరంగనాయ- మన రంగనాధుడను, పిత్తనై- సౌశీల్యముగల స్వామిని, పెత్తుం-లభించిగూడ, పిరవియుళ్- (లోకులు) జన్మహేతువగు సంసారచక్రమునందు, పిణంగుమాఱే- దుఃఖపడుచున్నారే, అన్దో- అయ్యో!

వివరణము : పలురకములై అనాదిగా చేయబడిన పాపములన్నియు తేనె తెట్టెకు ఈగలు ముసరినట్లు ఈ ఆత్మను ఆవరించియున్నవి "నేను ముందు నేను ముందు" అన్నట్లు అవియన్నియు అహమహమికతో ఫలదానోన్ముఖములై యున్నవి. "నెయ్‌కుడత్తైప్పత్తి యేఱుం ఎఱుంబుగళ్‌పోల్" అని శ్రీ విష్ణుచిత్తమునీన్ద్రులు తెలిపినట్లు నేతికుండకు పట్టిన చీమలవలె పాపములు వ్యాధిరూపమున దేహమును ఆవరించి యుండును. ఇన్నిపాపములను ఒక్క జీవుడే చేయగలడాయని సంశయింపరాదు. ఈశ్వరునికి ఎంతటి శక్తి కలదో, ఒక విధముగా జీవునికిని అంతటి శక్తి కలదు,

"మేరుమన్దర మాత్రోఽపి రాశిః, పాపస్య కర్మణః ।
కేశవం వైద్యమాసాద్య-దుర్వ్యాధిరివ నశ్యతి"॥

అని చెప్పబడినట్లు మేరు-మందర పర్వతములవలె పెరిగిపోయిన పాపరాశి గూడ మహా వైద్య ప్రభావముచే గడ్డు వ్యాధిగూడ నశించునట్లుగా అమోఘ భగవత్సంకల్ప శక్తిచే పూర్తిగా నశించిపోవునట మరియు ఉపనిషత్తు "తద్యథా ఇషీకా తూలం అగ్నౌప్రోతం ప్రదూయేత ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే" అని చెప్పినట్లు చిన్న నిప్పురవ్వ పడినచో రాశివంటి బూరుగు దూదియంతయు నశించిన విధముగా భగవత్ప్రభావముచే సర్వ పాపరాశియు ధ్వంసమగునట. ఇట్లు సర్వ పాపరాశిధ్వంసమునందు భగవచ్ఛక్తి యెంతటిదో ఆ పాపములను అనంతముగా క్షణకాలమున సృష్టించుటలో జీవునికిని అంత శక్తి కలదు. "యద్బ్రహ్మకల్ప నియుతానుభవే ప్యనాశ్యం .. " ఇత్యాది శ్లోకమున శ్రీ కూరత్తాళ్వాన్ స్వామివారు తెలిపినట్లు ఒకొక్క పాపమే కొన్ని వేల బ్రహ్మకల్పముల కాలము అనుభవించిననూ తీరనిది కాగా, అట్టివానిని వీడు అర్ధక్షణములో చేయగలుగుచున్నాడు గదా !

"మొయ్‌త్త వల్వినై యుళ్ నిన్ఱు"- నది సముద్రములో పడిన చిన్న జంతువు అలల తాకిడికి క్షోభించినట్లు అణు పరిమాణమగు జీవుడును పాపసముద్రములో దరిగానక దుఃఖ పరంపరచే క్షోభించుచుండును పాప ఫలముగా దుఃఖ మనుభవించుచున్ననూ ఇతడు వాటిని చేయుట మానడా? అన్నచో మానడు. "నాకు ఈ దుఃఖము లనుభవించుట అలవాటైపోయినది. ఎంతకైనను ఓర్చుకొందును, 'పొమ్మనును... ।' నిప్పులలో కాలూనినట్లు పాపములలోనే స్థిరపడిపోవును.

"మూన్ఱెళుత్తు ఉడైయ పేరాల్" మూడక్షరములు గల భగవన్నామ ముచ్చరించుటచేత అంతటి మహాపాపియగు క్షత్రబన్ధువనువాడు గూడ ఉజ్జీవింప గలిగెను.

''కెడుంఇడ రాయిన వెల్లాం కేశవా వెన్న... '' అని తిరువాయ్‌మొళి ప్రబంధమున శ్రీ శఠకోప మునీంద్రులు కేశవ నామోచ్చారణము చేసినే సర్వ పాప ప్రణాశము జరుగునని, యమభటులును దూరముగా పారిపోవుదురని ప్రసాదించిరి.

మూడక్షరములుగల నామము అనుటచేత ఇందలి ఒక్కొక్క అక్షరమే ఉచ్చరించినను ఫలప్రదమగునని సూచితము. వేయి అక్షరములో పదివేల యక్షరములో కలిగి ఎంత సేపు చెప్పినను ముగియని అతి దీర్ఘ మంత్ర పారములవలెగాక మూడే అక్షరములుకలిగిన శుభనామము. ఇది మంత్రమన్నచో ఋషి- ఛ్ఛందస్సు- దేవత- శక్తి- బీజములు- వర్ణము- వినియోగము- ధ్యానము- మొదలగువాటి పరిజ్ఞానముతో పాటు కొన్ని వైదిక పద్ధతులను అవలంబింపవలసి యుండును. ఉపనయనాధికారము గల పురుషులే ఉచ్చరింపవలెనను నియమముగూడ నుండును. కేవలము ఈ భగవన్నామ కీర్తనకు అవేమియు లేవు. స్త్రీలు, పిల్లలు, గొల్లలు ప్రతి వారికిని యిందు అధికారమున్నది బాధ కలిగిన ప్రతివాడును ''అమ్మా'' యని అనుట సహజమైనట్లే ఆపదలోనున్న ఎవడైనను దీనిని ఉచ్చరింపవచ్చును.

క్షత్రబన్ధువు ఉచ్చరించిన ఆ మూడక్షరముల పేరేదో వీరు ఇందులో చెప్పలేదు. ఈ కథ విన్నవారికి ఆ భగవన్నామమేదో మేముగూడ ఉచ్చరించెదమని ఇందులో రుచి ఏర్పడి 'మాకును ఆ నామమును ఉపదేశింపుడు' అని కోరినపుడే చెప్పవచ్చునని మరుగుపరచిరి.

క్షత్రబన్ధు చరిత్రము సంగ్రహముగానిది- ''బ్రహ్మబంధు'' అను పదములో గల బన్ధుశబ్దము నీచార్థకము. బ్రహ్మబంధువనగా నీచ బ్రాహ్మణుడని యర్థము. అట్లే క్షత్రబంధు శబ్దముగూడ నీచ క్షత్రియుడు అనునర్థము నిచ్చును అంతేగాని అదియతని పేరు కాదు. సూర్యవంశీయుడగు విశ్వరథుడను రాజుయొక్క కుమారుడతడు. బాల్యము నుండియు మహా పాపిష్ఠుడు. ఋషులను హింసించుచు క్రూరుడై నరమాంసభక్షకుడై అడవులలో తిరుగుచుండెను ఒకరోజున అడవిలో పోవుచున్న మునీశ్వరుడొకడు దోవ తప్పి దిమ్మ దిరగుచూ దప్పికతో సరస్సువద్దకు పోయి కాలుజారి అందులో పడెను. దూరమునుండి చూచిన ఈ క్రూరుడు వెంటనే అచటికి వచ్చి ఆ మహర్షిని వెలికి తీసి ఉపచారములుచేసి కాపాడెను. ఆయనను చూచిన క్షణమున ఇతని మనస్సులో క్రూరభావముపోయి ఎంతో ప్రశాంతత ఏర్పడెను. ఆ మహర్షియు ఇతని ఘోరాకారమునుచూచి యోగశక్తిచే నితని జన్మవృత్తాంతమును తెలిసికొని దయాళువై ఇతని సజ్జీవింప జేయదలంచి, ప్రబల పాపవాసనచేత నితడు

సన్మార్గ వర్తియగుట అసాధ్యమని భావించి గూడ మృదు మధురోపదేశములతో నీతనికి కొంచెము ఆస్తిక భావము కలుగునట్లు చేసి ''గోవింద'' నామమును ఉపదేశించెను. ఆ నామము యొక్క ప్రభావమును అతనికి తెలిపి "నీవు ఏ పాప మును చేయుచున్నను మరచిపోకుండ ఎల్లప్పుడునూ గోవింద-గోవింద అని ఉచ్చ రించుచుండుమని చెప్పి మహర్షి వెళ్ళిపోయెను అతడును పాపవృత్తిలో నుండికూడ మహర్షి ఆదేశించిన ప్రకారము గోవిందనామ సంకీర్తనము చేయుచూ జీవితాంతమున ఆ దేహమును వదలి రెండవ జన్మమున నామోచ్చారణ ప్రభావమున బ్రహ్మవేత్తల వంశమున పుట్టి భగవంతుని ఆరాధించి తరించెను. ఆ ఉపదేశించిన మహర్షి నారదు దేవనియు కొందరు చెప్పుదురు.

ద్రవిడ వ్యాఖ్యానములో ఉదాహరింపబడిన ఈ క్రింది శ్లోకము పై కథకు సూచకము

''సంత్యక్తే సర్వలోకేన-తస్మిన్ దుర్వృత్త చేతసి।
చింతాం చకార సమునిః-క్షత్రబన్ధౌ దయాపరః''॥

మహర్షులు ఈ క్షత్ర బంధువు పేరు విన్నంతనే చెవులు మూసుకొనువారట నాలూరాన్ అనువాని పేరు వినగనే శ్రీవైష్ణవగోష్ఠిలోని ప్రతివారును ఇట్లే అసహ్య భావముతో చెవులు మూసుకొనుచుండిరట.

''పరాంగతి కండుకొండాన్''- అంతటి మహాపాపియగు క్షత్రబంధువుగూడ గోవిందనామ సంకీర్తనముచేత కేవల పాప క్షయమునో స్వర్గాది పరలోక సుఖమునో ఐశ్వర్య కైవల్యములనోగాక భగవత్సాన్నిధ్యరూప సాక్షాన్మోక్షమునే పొందగలిగెను సుమా! పాపిష్ఠులలో చిట్టచివరివాడనదగిన యతడు నిత్యసూరు లనుభవించు మహా ఫలమును పొందగలిగినాడు. ''కండు కొండాన్'' అనగా ఇపుడు తెలిసికొని స్వీక రించినాడు అని యర్థము. పోగొట్టుకున్న దానిని తిరిగి లభించినట్లు అని భావము. నామసంకీర్తనచే కొత్తగా వచ్చిన ఫలము కాదిది. ఇంతకాలముగా అజ్ఞానముచేత కోల్పోయిన తన వస్తువునే తిరిగి తాను పొందగలిగినాడని ''ఏష సంప్రసాదః అస్మా చ్ఛరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే'' అను శ్రుతిచేతను ''సంపద్యావిర్భావః స్వేనశబ్దాత్'' అను బ్రహ్మ సూత్రము చేతను ''... జ్ఞానానందాదయో గుణాః- ప్రకాశ్యంతే, న జన్యంతే-నిత్యా ఏవాత్మనో హి తే'' ఇత్యాది పురాణ సూక్తి చేతను ప్రతిపాదితమైన అర్థ విశేషమే సూచితమైనది. జీవుడు

ప్రాకృతమై అనాదిగా తన సహజ జ్ఞానానందాది శక్తిని ఆవరించిన స్థూల- సూక్ష్మ శరీరము నుండి వెడలిపోయి పరమాత్మను చేరి తిరిగి తన సహజస్వరూపమగు అపహత పాప్మత్వాది గుణాష్టకమును జ్ఞానానందప్రకాశావిర్భావమును పొందుటయే ముక్తియని వేదాంత సిద్ధాంతము,

"ఇత్తనైయడియర్ ఆనార్కు"- ఇట్లు నామ సంకీర్తన మాత్రముచేతనే భక్తులైన వారిపైగూడ దయను చూపువాడు మన రంగనాథుడు పరభక్తి పరజ్ఞాన పరమభక్తులనబడు యోగ్యతలేవియు లేకున్ననూ క్షత్రబంధువువలె కొద్ది అనుకూల తను చూపినను చాలునని భావము "ఈశ్వరుడు స్వామి- నీవాతనికి దాసుడవు"అని పరమార్థము నుపదేశించినచో "నేనే స్వతంత్రుడను- ఒకనికి దాసుడనుకాను" అని యహంకారముతో పూర్వమువలె భగవంతుని ద్వేషింపక సమ్మతించిన చాలును. ఈ మాత్రముచేతనే ఇతడు పూర్తిగా భగవద్భక్తుడైపోయినట్లు భావించవచ్చునా: అన్నచో స్వామి పరమోదారుడు విశాల హృదయుడు గనుక ఆయనయట్లే భావించును. ఈ క్రింది ప్రమాణ శ్లోకములను చూడుడు.

> "దురాచారోపి సర్వాశీ- కృతఘ్నో నాస్తికః పురా
> సమాశ్రయేదాదిదేవం- శ్రద్ధయాశరణంయది॥
> నిర్దోషం విద్ధితంజన్తుం- ప్రభావాత్పరమాత్మనః ।"

ఇత్యాది. మొదట అతిదెంత నాస్తికుడైనను కృతఘ్నుడు, దుష్టవర్తనుడు, సర్వభక్షకుడునైనను, భగవంతునిపై శ్రద్ధతో శరణు పొందినయెడల అతని పూర్వ వృత్తమును గమనింపక నిర్దోషి యితడుఅని పరమాత్మ భావించి అనుగ్రహించునట. పూర్వముండిన వైముఖ్యముపోయి అద్వేషాభిముఖ్యములు ఇతనిలో కలిగిన ఈ మాత్రము మార్పునకే ఆయన ఎంతో ఉప్పొంగిపోవును. "యథా తథా వాపి సకృత్ కృతోంజలిః" అన్నట్లు వీడు ఏ భావముతో చేతులు జోడించినను, తనపై పర్వతము వంటి భారము ఆరోపింపబడినట్లు స్వామి భావించి వీని రక్షణము నా వశ్యతమని యెంచునట. "భూయిష్ఠాంతే నమఉక్తింవిధేమ" అను ఈశావాస్యములోని చివరి మంత్రమున "తే భూయిష్ఠాం"అని అన్వయమునుచెప్పి నమః అను ఉక్తి మాత్రమే ఆ స్వామికి ఎంతో గొప్ప సంతోషమునిచ్చునని తాత్పర్యమును పెద్దలు వచింతురు. "ఇరంగుం"- నాతో తనకుగల స్వాభావిక సంబంధము నెరిగి వ్యతిరేక భావ మును విడచి ఈ జీవుడు ఎప్పుడభిముఖుడగు నాయని అట్టి సదవకాశమునకై ఎదురు

చూచు మృదు స్వభావము భగవంతునిది. ఆ ఎదురు చూచుటచే ఈశ్వరునికి లభించిన ఫలితమేమనగా- జీవునిలో ఇపుడు కలిగిన అప్రతిషేధ బుద్ధియే. ఈశ్వరుడు చేయు రక్షణమును ఇతడు తిరస్కరింపక పోవుటయే. మోక్షమును పొందు జీవునిలో ఈ అప్రతిషేధ మాత్రము ఉన్ననూ చాలును. ఈ సంగతిని శ్రీ లోకాచార్యులవారు ముముక్షుప్పడి గ్రంథమున "పెత్తుక్కు వేండువదు విలక్కామైయుం ఇరప్పుం" అను సూత్రమువద్ద వివరించియున్నారు. మా తత్త్వోపహార గ్రన్థమున 232 పేజీలో ఈ సూత్రార్థమును చర్చించియున్నాము. ఇంత మాత్రమే తప్ప అవాప్త సమస్తకాముడైన స్వామి ఇతని నుండి మరేవిధములైన కానుకలనో పూజలనో అపేక్షింపడు. అపుడే తాను కన్న దూడపై ఆవు వాత్సల్యముతో దోషమును చూడక దయను చూపినట్లు పరమాత్మయు మోక్ష ఫలమువిచ్చి గూడ ఇతనికి ఏమియు చేయలేకపోయితినే" అని మనస్సులో దుఃఖించునట "ఇరంగుం" అను పదమునకు ఈ విధముగా దుఃఖించుటయని గూడ అర్థము కావచ్చును

"నం అరంగనాయ"- మనవంటి అకించనులను అనుగ్రహించుటకే గదా స్వామి శ్రీరంగక్షేత్రమున వచ్చి చేరినది. శ్రీవైకుంఠము నిత్యముక్తులకే అనుభవస్థానము క్షీరసాగరము ముక్తప్రాయులనదగిన సనకసనందనాదులకును బ్రహ్మ రుద్రేంద్రాది దేవతలకును దర్శన స్థానము. రామకృష్ణాద్యవతారములు ఆ కాలమునందు జన్మించిన అదృష్టవంతులకే ఉపయోగించినవి ఇక స్వామి శ్రీరంగమున వేంచేసియున్నది ఆ దేశ కాలములకు దూరమైన అందరికినీ దర్శనమిచ్చుటకే కదా! క్షత్ర బంధువునకు సోదరులము అనదగిన మనకును సులభముగా దర్శనమిచ్చుటకై శ్రీరంగములో నున్నాడని "నం అరంగనాయ" అనుటకు తాత్పర్యము.

"పిత్తనై" ఈ ద్రవిడ పదమునకు పిచ్చివాడని యర్థము. భక్తులపై స్వామికి గల వ్యామోహమునే యిచట పిచ్చియని వ్యవహరించుచున్నారు. ఏమియు తెలియని అజ్ఞానిని పిచ్చివాడందుము. అట్లే తన స్థాయిని గమనింపక అతి వ్యామోహము చూపువానిని పిచ్చివాడందుము ఆశ్రితులలోగల దోషములను ఏ మాత్రమును ఎరుగడు గనుక, వారి స్థాయికి తన స్థాయికిని ఎంతో తేడా ఉన్ననూ వెర్రిగా అభిమానించువాడు గనుక భగవంతుడు పిచ్చివాడేనని చెప్పుట రసోక్తి లోకమున దుఃఖితుడైనవాడు తన రక్షణకై స్వామివద్దకు పోయి ఆశ్రయింపవలసి యుండును. ఇచట నట్లు గాక ఏ కొరతయులేని పరమాత్మయే వచ్చి 'నన్నెవరు ఆశ్రయింతురా' యని ఎదురు చూచుచూ నివసించు ప్రదేశము ఈ శ్రీరంగమని భావము.

''అన్దో! పిరవియుళ్ పిణంగు మారే'' ఇట్టి స్వామికి సన్నిహితులైయుండి గూడ లోకులు భగవన్తునికి విముఖులై దుఃఖించుచున్నారే! ఏ మాశ్చర్యము? ఇంత కంటె గొప్ప ఆనందహేతువగు విషయము లభించినచో దీనిని (ఈభగవన్నామ మును) విడిచినను 'పోనిమ్మ'ని సమాధానపడవచ్చును. ''రసోవై సః''అని చెప్పబడు ఈ ఆనందమయ పరమాత్మసాన్నిధ్యమునకంటె అధికమైనది మరేమున్నది? జన్మ మరణాది రూప సంసారచక్రములోపడి నలిగి గిలగిల కొట్టుకొనుచుగూడ ఈ జీవుడు సులభుడై దుఃఖధ్వంసకుడైన స్వామితో అహంకారముచే వివాదపడి దూరమైపోవుచు న్నాడేయని లోకమును చూచి వీరు అసహించుకొనుచున్నారు. ఒక శవము యొక్క మాంసమునకై పోట్లాడుకొను రెండు క్షుద్ర జంతువులవలె ఈ మానవులుగూడ వివేకహీనులై అతినీచములైన భౌతిక పదార్థములకొరకు పరస్పరముగా కీచులాడు కొనుచున్నారే ''అన్దో'' అహో! పరిశుద్ధముగు జీవాత్మ స్వరూపము జ్ఞానానన్దమయ మై ఉజ్జ్వలమైనది గనుక పరమాత్మకు కౌస్తుభరత్నమువలె స్పృహణీయమై యుండునని శాస్త్రకర్తలు చెప్పుదురు. అట్లు భగవంతుని హృదయమున వెలుగొందవలసిన ఈ జీవరత్నము ప్రకృతిపంకములోపడి హీనదశను పొందుచున్నదేయని ''అయ్యో అయ్యో'' అన్నట్లు ఈ ఆళ్వారులు ఆవేదన చెందుచున్నారు మరియు సర్వవిధ బంధువై సులభుడు సాధుశీలుడునైన స్వామిని విడిచి దుర్లభములు దుఃఖ ప్రదములు నైన క్షుద్ర విషయములకై శ్రమపడుచుండు జీవవర్గమును చూచి పరమధార్మికులైన వీరు భరింపరాని ఆవేదనతో "అన్దో" అని ఆక్రోశించుచున్నారు.

శ్లో॥ పాపాంభోధే రపారాత్ పరగతి మగమన్మాంసభుక్ క్షత్రబన్ధుః
భక్త్యాహీనోపి వర్ణత్రయఘటిత పదోచ్చారణేనైవ పూతః.
ఏవం వాఙ్మాత్రభక్తేష్వపి నిజకరుణాం రంగనాథే ప్రయచ్ఛ—
త్యద్ధా! సంసారవార్ధౌ జనిమృతిభయదే బంభ్రమీ త్యేషలోకః॥

**(5)** అవ. లోకులు సులభము భోగ్యమునైన భగవద్విషయమును విడచి దుర్లభము క్షుద్రమునగు ప్రాకృత విషయమునకై ప్రాకులాడుచూ దుఃఖించుచున్నారే! యని వెనుకటి పాశురమున వీరు వాపోయిరి. ఇప్పుడు పరమనాస్తికుడొకడు వీరిని ఇట్లు ప్రశ్నించెను. ''పదహారేండ్లవయస్సుగల నారీమణులు మోక్షరూపమహానంద మునిచ్చు వారుండగా ఈ సంసార మండలమును క్షుద్రమని దూషింతురేల?'' ఈ ప్రశ్నించినవాడు చార్వాక మతస్థుడు ఆ మతమున- దేహమేతప్ప అందులో మరొక నిత్యమగు ఆత్మయను వస్తువేదియు లేదనియు, పుణ్యపాపములు, వాటి వలన

కలుగు స్వర్గనరకములనబడు అప్రత్యక్ష పరలోకములు, ఇవేవియు లేనేలేవనియు ప్రత్యక్ష్యముగా ఈలోకమున కలుగు సుఖ దుఃఖానుభవములే స్వర్గనరకములనియు బోధింపబడియున్నది. పైకి ఇంపుగా కనబడు ఈ మతమును విశ్వసించిన అజ్ఞానులైన లోకులు దుఃఖముల పాలగుచున్నారు. వీరనుభవించు ప్రాకృత విషయములన్నియు అల్పములు అస్థిరములు పైగా దుర్లభములు దుఃఖప్రదములు. శాశ్వతానంద ప్రదమగు భగవత్సేవను విడచి ఈ క్షుద్ర విషయములకై ఆశపడెదరేల? అని ఈ పాశురమున ప్రబోధించుచున్నారు.

పా॥ పెండిరాల్ శుకంగళుయిప్పాన్ పెరియదోరిడుంబై పూండు
ఉండిరా క్కిడక్కుంపోతుం ఉడలుక్కే కరైందునైందు ।
తండుళాయ్ మాలై మార్బన్ తమర్గళాయ్ పాడి యాడి
తొండుపూండ ముదముణ్ణా త్తొళుంబర్ శోరుగక్కుమాతే ॥

ప్రతి : పెండిరాల్- భార్యవలన, శుకంగళ్ ఉయ్ప్పాన్- సుఖములను పొందెదనుగాకయని భావించి, పెరియదు- పెద్దదియగు, ఓర్ ఇడుంబై పూండు- ఒక దుఃఖమును తనపై వేసుకొని, ఇరా- రాత్రి సమయమున, ఉండు- తిని, కిడక్కుం-పోతుం- శయనించినపుడుగూడ, ఉడలుక్కే- శరీర పోషణముకొరకే, కరైన్దు-ఆరాటపడి, నైందు- మనస్సు వ్యాకులత నొందియుండగా, తణ్ తుళాయ్ మాలై-చల్లని తులసీ మాలికను, మార్బన్- వక్షస్థలమున ధరించు స్వామికి, తమర్గళాయ్-దాసులై, పాడి- ఆయన కీర్తిని పాడి, ఆడి- సంతోషముతో నాట్యముచేసి, తొండు పూండు- భగవత్సేవను అలవరచుకొని, అముదముణ్ణా- అమృతమనదగిన మోక్షా నందమును అనుభవింపక, తొళుంబర్- నీచులగు ఈలోకులు, శోరు ఉగక్కుం ఆతే-తిండి కొరకే ఆరాటపడుదురేమి?-

వివరణము : "పెండిరాల్ శుకంగళ్ ఉయ్ప్పాన్"- ఒక సుందరాంగిని వివాహమాడి ఆమెవలన ఎంతో సుఖపడెదనని యితని భావన అగ్నిజ్వాలను త్రాగి దప్పిని తీర్చుకొనుట విప్పిన పాము పడగయొక్క నీడన విశ్రాంతిని గోరుట విష భక్షణము చేసి జీవింపబూనుటయు నెటువంటివో, అట్టిదే దుఃఖమూలమగు భార్యా పరిగ్రహమును సుఖహేతువని భ్రమించుట. "కొండపెండీర్" అను దశకమున శ్రీ శఠకోప మునీంద్రులు చెప్పినట్లు తన సుఖమునకై తెచ్చుకున్న ఆ భార్యయు తాను విధేయురాలైయున్నట్లు నటించుచునే 'అదితెమ్ము-ఇదితెమ్ము' అని దుర్లభ వస్తువు

లను కోరి తెమ్మనుచూ బాధించును. ఇతనికి ద్రవ్యమున్నంతవరకుసు ఇతడు సుఖ పెట్టునంతవరకును మాత్రమే ఆమె కితనిపై ఆదరము

''పెండిరాల్'' అను పదము స్త్రీజాతి వాచకము అనుకున్నపుడు 'భార్య' అనియే గాక 'వేశ్యాస్త్రీ' అనిగూడ అర్థమును గ్రహింపవచ్చును. వారివలన సుఖము నొంద గోరుట భ్రమ మాత్రమే వారు ఇతనిచ్చు ద్రవ్యమును బట్టి ''ఇంతకాలము నీకు సుఖమునిత్తు''నని కాలపరిమితిని విధింతురు. ఆ వేశ్యలకు ద్రవ్యము ప్రధానము గనుక వీడపేక్షించినంత సుఖము నొందలేడు. పైగా తన ఆ వేశ్యాగమనమును లోకులు గుర్తించినచో అవమానము. ఆ యవమానమును లెక్కచేయకున్ననూ మరణానంతరము నరకము తప్పదు దీనినిబట్టి వీడు కోరుకొను కామసుఖ మెంత నీచమైనదో అనర్థహేతువో గ్రహింపవచ్చును. ఈ క్షుద్ర సుఖమునకే వీరు ''ఆనంద మయం'' అని ఉపనిషద్బోధితమైన బ్రహ్మానందమును పొందినట్లు పొంగిపోవు చుందురు.

''శుకంగళ్''- సుఖములను పొందగోరుననే బహువచనమునుబట్టి సర్వ సుఖ ములను ఈ భార్యవల్ల కలుగునని ఇతని భావన. వీని ఇంట ఆ భార్య అడుగుపెట్టిన వేళావిశేషమునుబట్టి సంపదలు పెరుగునని, యౌవనమున కామసుఖము సిద్ధించునని పంచి పుత్రపౌత్రాదులు కలిగి వంశవృద్ధి యగునని ఎన్నెన్నో కోరికలు ఆమెవలన తీరునని వీని ఆశ. ఇది అడియాసయేగాని ఆమెవలన నిజముగా అట్టి సుఖముల నొందలేడు. ఎంతకాలము గడచిననూ ''ఇట్లు సుఖపడితి''నని గుర్తించుకొనదగిన దేమియు నితనికి మిగలదు. ఇకనితడు ధనహీనుడైనచో అడుగడుగున భార్య అనాద రించుటచేత వీనికి ఇంకను ఆమెను వశమునందుంచుకొనవలెనను పట్టుదల ఎక్కు వగుచుండును. అపుడు ద్రవ్యార్జనకై అపమృత్యు దానాదులు స్వీకరించుట పరులను హింసపెట్టుట వంటి మహా దుఃఖములను కోరి తెచ్చుకున్నవాడగును అని ''పెరియ దోర్ ఇడుంబై పూండు'' అను దాని భావము. ''పూండు'' అను పదము మెడకు తగిలించుకొన్న బరువువలె ఈ దుఃఖమంతయు తొలగించుకొనరానిదై స్వయముగా మెడకు చుట్టుకున్నది- అను అర్థమును సూచించును.

కావ్యప్రకాశమను అలంకార శాస్త్ర గ్రంథమున మమ్మటభట్టు ఉదాహరించిన ఒక శ్లోకము (అజ్ఞాత కర్తృకము) ఇచట గమనింపదగినది.

శ్లో॥ రేరే! చంచలలోచనాంచితరుచే! చేతః ప్రముచ్య స్థిర-
ప్రేమాణం మహిమాన మేణనయనామాలోక్య కిం నృత్యసి?
"త్వం మన్యే విహరిష్యసే" బత హతాం ముంచాన్తరాశామిమామ్
ఏషా కంఠతటే కృతా ఖలు శిలా సంసారవారాన్నిధౌ ॥

ఒక విరక్త పురుషుడు తన మనస్సుతో ఇట్లు చెప్పుకొంటున్నాడు. ఓ పిచ్చి మనసా! నీపై స్థిరమైన ప్రేమతో హృదయములో నిత్యసన్నిహితుడైన పరమాత్మను విడచి, ఎందుకు చంచలాక్షియైన ప్రియురాలిని చూచి వ్యామోహంతో అంతగా గంతులు వేయుదువు. నీవు ఆమెతో విహరించగలనని సుఖపడెదనని భావించు చున్నట్లున్నావు. ఈ దురాశను వదిలిపెట్టుము. సంసార సముద్రములో దిగిన నీ మెడకు చుట్టుకొన్న గుదిబండయే ఆమె- అని నీవు తెలిసికొనలేకున్నావు సుమా! ఈ బండను వదిలించుకొనంతవరకు నీవు సంసార సముద్రము నుండి వొడ్డుకు రాలేవు. అని శ్లోకమునకు భావము.

శ్లోక రచయిత ఎవడోగాని మంచి వ్యాకరణవేత్త- రసికుడు. "ప్రహాసేచ మన్యోపపదే మన్యతేరుత్తమ ఏకవచ్చ" అనే పాణిని సూత్ర ప్రకారం పరిహాస రస స్ఫోరకమైన ప్రయోగ చమత్కృతిని కవి ఇచట "త్వం మన్యే- విహరిష్యసే" అనే వాక్యమున చూపినాడు. పరిహాససూచకమైన వాక్యమున "మన్యతే" అను ధాతువును ప్రయోగించినపుడు 'త్వం' శబ్దము కర్తగాగల ఆ క్రియకు 'మన్యే' అని యుత్తమ పురుష వచ్చుననియు, 'నేను ఇట్లు చేసెదను' అను కొన్న రెండవ క్రియకు మధ్యమ పురుష వచ్చుననియు, మధ్యమోత్తమ పురుషలకు ఆ సూత్రమున వ్యత్యయము చెప్పబడినది. ఇది సామాన్య భాషా నియమమునకు చెప్పబడిన విశేషమైన మార్పు. త్వం మన్యసే- అహం విహరిష్యే ఇతి" (నీవు అనుకొనుచుంటివా- నేను విహరించెదను అని) ఈ రీతిలో ప్రయోగించవలసిన వాక్యమును "త్వం మన్యే- అహం విహరిష్యసే' ఇతి- (నీవు అనుకొనుచున్నావా!- నేను విహరించెదవు-అని) ఇట్లు మధ్యమోత్తమపురుషలను తారుమారుగా ప్రయోగించుట పరిహాస సూచనకై చేయవచ్చునని సూత్రమునకు భావము. "నీవామెతో విహరింపదలంచితివా! ఎంత వెర్రివాడవు" అని హేళన చేయుట ఇచట ముఖ్యము "ఏహి శ్యాల! త్వం మన్యే- అహం ఓదనం భోక్ష్యసే- ఇతి" (రమ్ము బావా! నీవు అనుకొంటివి- నేను అన్నము తిందువు- అని) భోజనము చేయవచ్చిన ఓ బావా! నీకు అన్నము మిగలలేదు అని గేలిసేయుట ఈ వాక్యమునకు తాత్పర్యము.

ఈ వ్యాకరణ విషయము ప్రాసంగికము. నీ మెదకు గుదిబండయై నిన్ను సంసార సముద్రములో పూర్తిగా ముంచివేయునామెను ప్రియురాలని భ్రమించితివా అని పరిహసించుటయే పై శ్లోకమున సారాంశము.

భార్యను పరిగ్రహించి అనంతములైన సుఖములను పొందగలనని యెంచినవాడు అనంతదుఃఖములనే పొందుచున్నాడుగదా ''అంజలికింకరః'' అన్నట్లు అంజలి చేసినంత మాత్రమున భక్తపరాధీనుడగు స్వామిని ఆశ్రయించి యుండినచో అనన్త సుఖమునే పొందవలసిన ఈ జీవుడు అట్లుచేయక దుఃఖసాధనమగు స్త్రీలను ఆశ్రయించినాడు. ''సు సుఖం కర్తుం ...'' అని భగవద్గీతలో చెప్పినట్లును ''తూయవముతై ప్పరుగిప్పరుగి ఎణామాయప్పిరవి మయర్వ అరుత్తనే' (నిర్మలమై భోగ్యమగు భగవద్గుణామృతమును పుష్కలముగా ఆస్వాదించి సంసార బంధహేతువగు నా అజ్ఞానము పోగొట్టుకొంటిని) అని శ్రీ శఠకోపమునీంద్రులు ప్రసాదించినట్లును ఆశ్రయణ సమయము మొదలుకొని ఫలప్రాప్తి పర్యంతము భగవత్సంబంధము అమృతమువలె అతిభోగ్యము సులభసాధ్యముగూడ.

“ఉండు ఇరా క్కిడక్కుంబోదు”- తిండికిగూడ అవకాశములేని విధముగా పగలంతయు సంపాదనకై తిరిగి వేసారి మరల రాత్రికే ఇంటికి వచ్చి భోజనము చేయును. ఆ పైన పగలు కలిగిన దేహశ్రమచేత పూర్తిగా అలసిపోయి నిద్రాదేవి ఆవహింపగా విశ్రాంతికై పడకపై పడిపోవునుగాని శిథిల శరీరేంద్రియములతో ఏమి సుఖము నొందును? రేపు తీరికగా సుఖింతును లెమ్మని భావించును

“ఉడలుక్కే కరైందు నైందు”- రేపు ఈ శరీరేంద్రియములను అలసిపోనీయక పరిపుష్టముగా నుంచుకొందునని అపుడు స్థిర సుఖమును అనుభవింతునని భావించి నిద్రతోనే ఆనాటి కథను ముగించును ఈ శరీరమే స్థిరమని నమ్మునుగాని రేపేమగునోయని ఎరుంగడు

దేహాతిరిక్తమగు నిత్యమైన ఆత్మ వేరు కలదనియు, మరణానంతరము నా గతి యేమగునో- ఎన్ని నరకము లనుభవింపవలెనో అనియు వీనికి తెలియునా? ఆ యాత్మ వివేకము లేనందుననే కేవల దేహ పోషణకే పాటుపడుచుండును.

''తండుళాయ్ మాలై మార్భణ''- చల్లని తులసీ మాలికను వక్ష స్థలమున ధరించిన స్వామికి దాసులై ఆనందాతిరేకముతో భగవద్గుణములను సంకీర్తించుచూ

ఆడుచూ నిత్య కైంకర్యమును చేయవలసిన ఈ జీవులు క్షుద్ర విషయ సుఖములకు లోనైరిగదా: "అహమన్నం అహమన్నం" అనియు "హావూ హావూ" అనియు శ్రీ వైకుంఠమున భగవదనుభవముతో ఆనందపూర్వకముగా సామగానము చేయు నిత్యముక్తులవలె నుండవలసినవారు ఇంతటి దుర్దశను అనుభవించుచున్నారే

"తొండు పూండు"- దాస్యవృత్తిని అలంకారముగా సంతోషముతో స్వీకరించి "ద్రుమ చీరైరలంకృతః" అన్నట్లు నారగుడ్డలు దాస్యమునకు అలంకారమైన విధముగా జీవునికి భగవత్సేవయే సహజమగు అలంకారము గదా! కనుకనే "అహం సర్వం కరిష్యామి" అని లక్ష్మణస్వామియు, "వళివిలా వడిమైశెయ్య వేండుం నామ్" అని శ్రీ శఠకోప మునీంద్రులును, నిరంతరముగా తమకు ఈ భగవద్దాస్యమే కావలెనని అపేక్షించిరి. శ్రీరంగమున ఉత్సవ మూర్తియగు స్వామికి (నంబెరుమాళ్) శేర సుందర పాండ్యుడు అను రాజు ఒక రత్న ఖచిత కంఠాభరణమును సమర్పించెను స్వామికి అది నిత్యాలంకారమైనట్లు జీవునికిని దాస్య వృత్తి నిత్యాలంకారము.

వెనుక "ఇడుంబై పూండు" అనుచోట 'పూండు' అను పదమునకు దుఃఖ భారమును మోసుకొని అనియు, ఇక్కడ "తొండుపూండు" అన్నప్పుడు అదే "పూండు" అను దానికి సంతోషముతో అలంకరించుకొని అనియు అర్థభేదమును చెప్పవచ్చునాయని సందేహింప నవసరము లేదు. సందర్భ భేదమునుబట్టి అర్థమును మార్చి చెప్పవచ్చును. క్షుద్రులకు చేయు సేవను "సేవా శ్వవృత్తిః" అని నింద్యముగా చెప్పుదురు "సాకిమర్థం న సేవ్యతే" అనియు "పారతంత్ర్యం పరేపుంసి" అనియు చెప్పబడినట్లు భగవత్సేవను స్వీకరింపదగిన ఉత్తమ ధర్మముగా ప్రతిపాదింతురు. సేవ యనునది ఉభయత్ర ఒకటియేయైనను విషయ భేదమును బట్టి ఎంతో తేడా కలదు గదా!

తనకు ఇష్టమైన పూజ్యమైన వ్యక్తికి సేవచేయుట సంతోష ప్రదమై సుఖ హేతువు. నాగానంద నాటకమున శ్రీ హర్షమహాకవి-రాజ్యమేలుటకంటె తల్లి దండ్రుల చెంతనుండి వారికి సేవలు చేయుటయే తనకు ఇష్టము జన్మసార్థక్య ప్రదము నని జీమూతవాహనుడు భావించినట్లుగా వర్ణించెను. కనుక భగవద్భాగవతాచార్య సన్నిధిలో చేయు దాస్య వృత్తి అత్యంతాభీష్టమై ఉజ్జీవన హేతువగును గాని నింద్యము కాదని గ్రహింపదగును. శ్రీ యామునాచార్యులవారు స్తోత్రరత్నమున "తవ దాస్య సుఖైకసంగినాం" అనియు శ్రీవత్స చిహ్న మిశ్రులు వరదరాజస్తవమున "తవదాస్య

మహారసజ్ఞః" అనియు భగవత్కైంకర్యము, అమృతము వలె మహా భోగ్యముగా నిరూపించియున్నారు ఈ విషయమునే ఈపాశురములో "తొండు పూండు అముదం" అని ఆళ్వారులు వివరించిరి.

"తొళుంబర్ శోరుగక్కుమారే"– అట్టి భగవద్దాస్యమునకు అర్హులైన ఈ మానవులు నీచవృత్తి నొంది కేవలము పొట్టకూటికై అలమటించుచున్నారే. నిత్యము నిత్యముక్త పురుషులవలె ఈ లోకులును భగవత్సంబంధము కలవారే అయినను ఆయన వీరికి అతిసులభుడేయైనను అమృతభోగ్యమగు ఆ స్వామిసేవను వదులుకొని వీరు సంసారలంపటులై పొట్టపోసుకొనుటకే జీవితమంతయు గడుపుచుండుట అనాదిపాప వాసనా ప్రభావముచేతనే గదా! తన ఆత్మనిత్యమనియు భగవత్సేవ ఉజ్జీవన మనియు తెలిసి కొనవలసిన జీవుడు, అనిత్యమైన దేహమునకు పోషకమైన క్షుద్రాహారమునకై అహోరాత్రములు పాటుపడుట ఆత్మజ్ఞానములేక పోవుట వల్లనేగదా!

**(6)** అవ : అయ్యా! మీరన్నట్లు లౌకిక భోగ్యపదార్థములన్నియు అల్పములు క్షణికములు కావచ్చును. అయినను మేము వాటిని త్యజించబోము. కారణమేమనగా! వాటిలో ఏ ఒక్కదానిలో సంపూర్ణముగా తృప్తినిచ్చు అన్నిగుణములు లేకపోయినను ఆవిషయము లనేకములైనందున ఒకదానిలోలేని భోగ్యత మరొకదానిలోనున్నందున వాటినన్నిటిని చేర్చుకొని అనుభవించుచుందుము. కనుక అవే మాకు చాలును. అప్రత్యక్షమైన భగవంతుని మేమెరుగము. అని లోకులనగా, వారికి ఈ పాశురమున సమాధానమును తెలుపుచున్నారు. ఓ మూఢులారా! మీరు అనుభవించు వస్తువులవలె అనుభవ సాధనములైన మీ శరీరేంద్రియములును క్షణభంగురములేనని గుర్తించలేక పోవుచుంటిరే! భోక్తలుగా మీరు అనుభవించుటకు ఆధారములైన అవియే నశ్వరములైనపుడు మీరు ఎట్లు అనుభవింతురు? అని యాక్షేపించుట ఈ పాశురములోని సమాధాన సారాంశము.

పా॥ మరంశువర్ మదిళెడుత్తు మఱుమైక్కే వెఱుమై పూండు
పురంశువరోట్టైమాడం పురళుంబోదరియమాట్టీర్ ।
అరంశువరాగినిన్ఱ అరంగనార్కాళ్ శెయ్యాదే
పురంశువర్కోలం శెయ్దు పుళ్కవ్వ కిడక్కిన్ఱీరే ॥

ప్రతి : మరం- కాష్ఠరబుద్ధియనెడు, శువర్- అడ్డుగోడను, మదిళ్ఎడుత్తు- ప్రాకారమువలె తనచుట్టూ తానే పెంచుకొని, మఱుమైక్కే- భవిష్యత్తులో రావలసిన

నగతికి, వెరుమైపూండు- అవకాశమిచ్చు మంచితనమేమియులేనివారై, పురంశువర్- ఆత్మకు బాహ్యావరణమైన, ఓట్టైమాడం- అస్థిరమగు ఈశరీరము, పురళుంపోతు-నేలపై పడిపోవు సమయమును, అరియమాట్టీర్- తెలిసికొనలేకుంటిరి అరంశువర్- ధర్మమే స్వరూపముగా, అగినిన్ఱ- కలిగియున్న, అరంగనార్కు- శ్రీరంగనాథునికి, ఆళ్ శెయ్యాదే- సేవలను చేయక, పురంశువర్- బాహ్యమగు శరీరమును, కోలంశెయ్దు- అందముగా అలంకరించుకొనుచూ, పుళ్కవ్వ- పక్షులు పొడుచుకొని తినునట్లుగా, కిడక్కిన్నీరే- నశించుచుంటిరిగదా!!

<u>వివరణము</u> 'మరం' అను పదమునకు క్రౌర్యము- క్రోధము- సాహసము- మొదలగు పలు అర్థము లున్నవి. పైన చెప్పిన మూడర్థములలో దేనినైనా గ్రహించ వచ్చును ఈ మూడును ఆత్మకు చెందిన ధర్మములే. కాని ఆత్మ వినాశకరములు. ఆత్మోజ్జీవనకు హేతువులుగా భగవద్గీతలో 13 అధ్యాయమున ''అమానిత్వమ దంభిత్వం అహింసా క్షాంతిరార్జవమ్...'' అని మొదలిడి ఇరువది గుణములు కీర్తింపబడి యున్నవి. ఆ యాత్మ గుణములకు ప్రతికోటియే (మరం) అనబడు క్రౌర్యముగాని క్రోధముగాని సాహసముగాని. దీనిని అజ్ఞానముచే ఈ జీవుడు తనకు రావలసిన శ్రేయస్సునకు అడ్డుగోడగా ప్రాకారమువలె పెంచుకున్నాడు. అది యెట్లనగా- ఇతడతి క్రూరుడై క్రోధావేశముతో దుష్కార్యములలో నిరంకుశముగా ప్రవర్తించునపుడు చూచిన పెద్దలు "అయ్యో! తానే కోరి కష్టములను తెచ్చుకొనుచున్నాడే" యని భావించి ఇతనికి హితోపదేశము చేయబూనుదురు. వీడు దానిని తిరస్కరించును. అట్లు ఇతరులు కలిగించదలచిన మేలునకు ఇతనిలోని క్రౌర్యాది దుర్గుణ సముదాయమే అడ్డుగోడ యగుచున్నది గదా! రావణునికి మారీచుడు, మాల్యవంతుడు, కుంభకర్ణుడు, విభీషణుడును హితమును బోధించిరి. వాడు వినలేదు. అపుడు వానితో కలసిన మారీచుడు కుంభకర్ణుడును నశించిపోయిరి అతనితో కలియని మాల్యవంతుడు విభీషణుడును ఛీ యని దూరముగా తరిమివేయబడిరి.

ఈ దుర్గుణములు ఇతనికి ప్రాకారములవలె అడ్డుగోడలుగా పెంచబడినవి అనుటచేత ఇవి సహజములు కావనియు ఏనాటికైనను ఇతడు భగవదనుగ్రహ పాత్రుడైనపుడు ఈ కోటలు కూలిపోవుట తప్పదనియు సూచింపబడుచున్నది.

వీర సుందర బ్రహ్మరాయడు అను నొకరాజు శ్రీవత్స చిహ్నమిశ్రులకు (కూరత్తాళ్వాన్ స్వామివారికి) శిష్యుడు. అతడు శ్రీరంగమున ఒక ప్రాకారమును

కట్టించుచూ దానికి అడ్డముగా నున్నదని చెప్పి ఒక శ్రీ వైష్ణవ భాగవతుల ఇంటిని కూలగొట్టించెను తన ఆచార్య పుత్రులైన శ్రీ పరాశరభట్టరువారు వద్దని చెప్పినను వినలేదు. పైగా తన ఆజ్ఞకు మీరు అడ్డము చెప్పుదురాయను కోపముతో భట్టరు వారిని దూషించి వారు శ్రీరంగమును విడచిపోవుటకు కారణమయ్యెను. ఇట్లు అతడు భాగవతాపచారము చేసి కట్టిన ప్రాకారము అతనికి నరకపాతి హేతువుగానే పరిణమించెను. అట్లే ఈ జీవునిలోని క్రౌర్యాది దుర్గుణములు గూడ వీర సుందరరాయని ప్రాకారమువలె ఆత్మ వినాశహేతువులేనని తాత్పర్యము

"మరుమైక్కే వెరుమై వూండు"- మరుమై-అనగా అదృష్టము. అది రాబోవు సద్గతికి హేతువు. వెరుమై అనగా దారిద్ర్యము, శూన్యత. సద్గతికి హేతువగు సదృష్టము కొద్ది మాత్రముగూడలేని వాడై అని శబ్దార్థము ఇందుకు కారణము వెనుక చెప్పిన క్రౌర్యాది దుర్గుణములే. వాటినిబట్టి అదృష్టహేతువైన మంచిని కొంచము గూడ చేయనందున సద్గతికి అవకాశమేలేదు శరీరపోషణకై ఎన్నో పాట్లుపడినట్లు ఆత్మోజ్జీవనకుగూడ ఏమైనను మంచిని నేను చేయవలెనను భావము వీనిలోనున్నచో, ఇప్పటికైనను వీనికి సద్బుద్ధి కలిగెనుగదాయని ఈశ్వరు దనుగ్రహించును. "ధాతు సామ్యేస్థితే స్మర్తా" అని వరాహచరమశ్లోకమున చెప్పబడినట్లుగా ఎవడు పరమాత్మను మదిలో తలంచుకొని ఒక్క సత్కార్యమునైన చేయునో, దానినే వ్యాజముగాగొని పరమాత్మయు "అహం స్మరామి" అని తానుగూడ వీనిని మరువకుండా అంతకాలమున పరగతిని ప్రసాదింపగలడు. అట్లు ఈశ్వరుడు చల్లగా అనుగ్రహించి దుర్గతి నుండి తప్పించుటకు అవకాశము లేకుండా వీడు అదృష్టహీనుడైనాడని భావము దేహపోషణకు చెందిన దారిద్ర్యము అనిత్యము గనుక ఆ దేహముతోనే పోవును. నిత్యమగు ఆత్మకు చెందిన ఈ అదృష్ట దారిద్ర్యము ఆత్మవలె నిత్యమే. అనాదిగా పూర్వజన్మలలో ఈ అదృష్టమును మేముసంపాదించుకొనకున్నను ఇప్పుడైననూ అదేదో తెలిసికొని చేసెదమందురేమో! ఆ యవకాశమునుగూడ జారవిడుచుకొంటిరి ఎట్లనగా "పురంశువర్ ఓట్టైమాడం పురళుంబోదు"- ఈ బాహ్య శరీరము క్షణికమైనది. ఏ క్షణమున అంతరించిపోవునో. ఇది పడిపోవుటకు సిద్ధముగానున్న శిధిల గృహము వంటిది. ఎప్పుడు నేలగూలునో మీకే తెలియదు. ఇది దృఢముగానున్నపుడు భోగ లాలసులైన మీకు ఈ బుద్ధి పుట్టలేదు ఇపుడు మీరు వివేకముతో తెలిసికొని ఆచరించెదమని ప్రయత్నించు లోపలనే ఈశరీరము నేలపై పడిపోకుండునా! మీ ప్రయత్నము నెరవేరునా! మృత్యువు మీ చేరువలోనుండగా నింకేమి చేయుదురు?

"అరంశువరాగినన్ఱ అరంగనార్క్కు....." ధర్మము సాధ్యమని సిద్ధమని రెండు విధములు. క్రియారూపములై అనుష్ఠింపవగిన యజ్ఞ-దాన-హోమాదులు సాధ్యధర్మములనబడును. పరమాత్మ సిద్ధధర్మమనబడును లోకసంరక్షణమునందు పూర్వమే సిద్ధమై యున్న వ్యక్తి యగుటచేత "రామోవిగ్రహవాన్ధర్మః" కృష్ణం ధర్మం సనాతనం" ఇత్యాది ప్రమాణములనుబట్టి ఈయనను సిద్ధధర్మమని శాస్త్రకర్తలు వ్యవహరింతురు. ఈ రంగనాథుడు ఆ సిద్ధధర్మమే. సాధ్యధర్మములైన యజ్ఞాదులు మోక్షఫలసిద్ధికి ఉపాయములే అయినను అవి నేరుగా ఫలమునీయజాలవు వాటిచే ప్రసన్నుడైన పరమాత్మయే ఫలప్రదాత కావలెను ఇక సిద్ధధర్మమైన ఆయననే మనము ఆశ్రయించినపుడు మరొకరి ముఖమును చూడనవసరములేదు గదా! ఫలమునిచ్చు ఉపాయము-సాక్షాత్ఫలముకూడ ఆయనయే ఆయన సాన్నిధ్యమున కైంకర్యమేగదా ప్రాప్యమైన ఆ ఫలము. "ఉపాయోపేయత్వే తదిహ తవ తత్త్వం, నతు గుణౌ" అను భట్టరువారి శ్రీ రంగరాజస్తవసూక్తి ఈ సంగతిని నిరూపించుచున్నది.

ఈ పాశురమున "శువర్" అను పదమును శరీరమునకు (అరంశువర్) పరమాత్మకును ప్రయోగించుటలో-ఒక చమత్కార విశేషమున్నది. శరీరము-పురంశువర్ అనగా-ఆత్మ స్వరూపావరణమై అజ్ఞాన పాపకర్మాదులకు హేతువై అడ్డుగోడవలె ఆత్మను సద్గతికి పోనీయకుండా వినాశహేతువైనది. అరంశువర్-పరమాత్మ. ధర్మస్వరూపుడై కోట గోడవలె రక్షించువాడాయన. "ప్రాకారః సర్వవృష్ణీనాం" అన్నట్లు ఒక్క యాదవులకేకాక సర్వ ప్రాణులకును ఆయన రక్షకమగు ప్రాకారమేగదా! ఓ మానవులారా! "పురంశువర్" అనబడు క్షణికమగు ఆ దేహమును నమ్ముకొని ఏల దుఃఖముల పాలయ్యెదరు? "అరంశువర్" అన్నట్లు ధర్మప్రాకారభూతుడైన స్వామి నాశ్రయించి ఉజ్జీవింపుడు అని తాత్పర్యము

"ఆగినన్ఱ అరంగనార్"-ఏ భక్తులైనను వచ్చి "స్వామీ! రక్షింపుము" అని ఆశ్రయింపరా! అను ఆశతో శ్రీరంగమునకు వచ్చి భక్తులకొరకే నిరంతరము ప్రతీక్షించువాడాయన.

తమ వెంట వచ్చిన సుమంత్రునితో శ్రీరామచంద్రుడు "ఇక తిరిగి అయోధ్యకు వెళ్లిపొమ్ము" అని ఆదేశించి తాను సీతాలక్ష్మణులతో కలసి గంగనుదాటి వెడలిపోయెను. కాని స్వామితోనే ఉండిపోవుదునని ఆశించిన సుమంత్రుడు వారు వెళ్ళిపోయిన పిదపగూడ రెండు మూడు రోజులు అచటయుండి "శ్రీరాముడు మరలవచ్చి వెంట రమ్మని తనను పిలువకపోవునా" అని ఎంతో ఆశతో వారు పోయిన దిక్కుకే

ఎదురుచూచుచుండెనట "శబరీ యదిహ రామః పునశ్శబ్దాపయేదితి"— అని వాల్మీకి చెప్పెను అట్లే శ్రీ వైకుంఠము నుండి వచ్చి మన కొరకే శ్రీరంగమునందు నిత్య వాసమొనర్చి స్వామి ప్రతీక్షించుచున్నాడని ఈ ఆళ్వారుల యభిప్రాయము.

"అరంగనార్కు ఆళ్ శెయ్యా?దే"— ఇట్లు మన దగ్గరకే వచ్చిన స్వామిని సేవించు భాగ్యము కలిగెనని సంతోషింపరేల? ఇందులకై మనము యజ్ఞ దాన తపో వృత్తులను అనుష్ఠింపకున్నను స్వామియే మనకు పరమకృపతో సేవాఫలము నందించు చున్నాడుగదా! నిత్యముక్తులవలె నిరంతర భగవత్సేవను పొందవలసిన మనము ఇంతకాలముగా ఈ మహాఫలితమును కోల్పోవుట మన ప్రబల పాపప్రభావము చేతనే గదా!! జీవుడు స్వతంత్రుడెప్పుడునుకాడు. సర్వదా ఇతడు పరతంత్రుడే. ప్రకృతి మండలములో నుండి స్వతంత్రుడనని భ్రమించుచున్నాడుగాని కర్మ పరతంత్రుడై జన్మ మరణములను పొందుట ఇతనికి తప్పినదా! స్వాతంత్ర్యభ్రమతో చేసిన పాప కర్మ వాసన చేతనే ప్రకృతి పరాధీనుడై నానా విధ దుఃఖములకు లోనైనాడు. అట్లు వీడు ప్రకృతివశుడై అలమటించుచున్నాడు గాని "సహజశేషియగు భగవంతునికి నేను దాసుడనుగదా" యను వాస్తవమెరిగి భగవత్పారతంత్ర్యమును స్వీకరింపలేదు. ఇది పాపఫలమేగదా! అయ్యో! స్వామియే మనదగ్గరకు వచ్చినను సహజము మహా ఫలమునగు కైంకర్యమును ఆచరింపరేల?

"పురంజువర్ కోలంశెయ్దు" ఆత్మోజ్జీవనమగు ఈ స్వామి కైంకర్యమును విడచి క్షుద్ర దేహపోషణకే పాటుపడెదరేల? మీకీ ప్రకృతి సంబంధము కర్మచే వచ్చినదిగాని సహజముకాదు. అజ్ఞానమునకు దుఃఖపరంపరకు హేతువగు దీనిని నమ్ముకొని "అసన్నేవ స భవతి" అన్నట్లు అసత్ప్రాయులగుదురా? ఆత్మకు సహజా లంకారమగు శేషవృత్తిని స్వీకరించి యుజ్జీవింతురా? ఒక మూర్ఖుడు కొత్తగా నొక ఇంటిలో సుఖముగా నుందునని చేరినాడట. ఎలుకలు పందికొక్కులును ఆ ఇంటిని లోపల త్రవ్వుచున్నవి. తోరణములతోను పందిళ్ళతోను ఆ ఇంటికి బాహ్యాలంకార ములు చేయుచున్న మూర్ఖునివలెనే మీరును మలినము క్షణికమునైన ఈ శరీరమునే పోషించుకొనుటకు యాతనలు పడుచుంటిరే, శునక శృగాలాది జంతువులు గృధ్రాది పక్షులు తినవలసిన మాంసభూయిష్ఠమైన ఈ శరీరమునకు పాయసాన్నాది భోగ్యా హారమును సమకూర్చి సువర్ణరత్నాభరణాదులతో అలంకరింతురా ? ఎంత అజ్ఞానము! ఇచట మహాభారతములోని గృధ్రగోమాయు సంవాదకథను అనుసంధించుకొనవలెను.

"పుళ్కవ్వ కిడక్కిన్టీరే"- జీవించి యున్నపుడే వ్యాఘ్రాదిక్షుద్ర జంతువులు

49551

గాని మరణించిన పిదప గృధ్రాది పక్షి సముదాయముగాని పీక్కొని తినుటకే ఈ శరీరము ఉపయోగపడ గలదు. మీరు శ్రద్ధగా పోషించి అలంకరించుకొనిన శరీరము ఆ విధముగా నశింపక తప్పదు ఇది వాస్తవము ఇచట మరొక రహస్యము గుర్తింపదగును. గ్రద్దలు రాబందులు గూడ కృతఘ్నుడైన మానవుని శరీరమాంసమును తినవట. వాలివధానంతరము సుగ్రీవుడు కిష్కింధకు రాజై తారతో సుఖలోలుడై శ్రీరాముని వార్తనే మరచియుండగా తనతో ఉపకారము నొంది గూడ మాటతప్పిన కృతఘ్నుడైన ఆ సుగ్రీవుని గట్టిగా మందలింపుమని లక్ష్మణుని పంపుచూ స్వామి ఇట్లనెను "...తాస్మృతానపి క్రవ్యాదాః కృతఘ్నాన్ నోపభుంజతే" ఇత్యాది. ఇతరుల వలన తాను ఉపకారమును పొంది తిరిగి తాను అతనికి ప్రత్యుపకారమును చేయకపోగా అతనిని ద్వేషించు కృతఘ్నుల మాంసమును పక్ష్యాదులుగూడ తినవని నీవట్లు కృతఘ్నుడవు కాకుమని స్వామి సుగ్రీవుని హెచ్చరించుట జరిగినది. ఓ మానవులారా! భగవంతుడిచ్చిన శరీరేంద్రియాదులను గొని వాటితో ఆయనకు సేవను చేయకపోగా ఆయననే మరచి స్వార్థబుద్ధితో దేహ పోషణలో పడిన మీరును కృతఘ్నులే. మీరు ఇట్లు నీచముగా జీవించుచూ కృతఘ్నులై ఆ పక్షులు గూడ విడిచిపోవునట్టి క్షుద్ర శరీర పోషణకై అలవడి వినాశము నొందెదరేల? శ్రీరంగనాథుని ఆశ్రయింపుడు.

ఈ ఆళ్వారులు ఆ లోకులు జీవించియుండగనే "పుళ్కవ్వ కిడక్కిన్నీరే" అని చెప్పుట సంభవమా! "పక్షులు పొడుచుకొని తినునట్లు నేలపై పడియుంటిరే" యని ఎదురుగానే నిలచియున్న వారిని గూర్చి యనుట పొసగునా? అని కొందరు సందేహింపవచ్చును. భవిష్యత్తులో ఇట్టి దుర్దశ సంభవమని వారు ఊహించి చెప్పుచున్నటు గమనింపవలెను రావణుడు సింహాసనముపై నుండగానే హనుమంతుడు అతనిని గూర్చి "నేయమస్తి పురీలంకా" ఇత్యాదిగా "ఈ లంకగాని నీవుగాని ఇక లేవు" అని ఖండితముగా చెప్పినట్లునూ దుర్యోధనాదులు యుద్ధభూమిలో నేలపై పడియుండగా శ్రీ వేదవ్యాసుడు నేను చెప్పినట్లు చేయక వినాశమును కోరితెచ్చికుంటిరిగదాయని ఈసడించినట్లునూ, ఈ విప్రనారాయణ మునీంద్రులు గూడ లోకులకు భావి దుర్దశను తెలియజెప్పి భగవంతుని ఆశ్రయింపుమనుచున్నారు.

**(7)** అవ : "నీచులారా! పొట్టపోసుకొనుటకే జీవించుచుంటిరా!" అనియు "గృధ్రగోమాయు ప్రభృతులు మీ దేహమును పీకుచూ తిను"నవియు మమ్ము నిందించెదరేల? రజస్తమో గుణ ప్రభావముచేత సంసారమండలమున జీవులకు ఇట్టి అజ్ఞానము సహజము. అనాది సిద్ధమైన అజ్ఞానావరణచేత తత్త్వజ్ఞానము మాకు దుర్లభము. పైగా- మీరు "తండులాన్ మాల్యై మార్బన్" అని తులసీమాలా విభూషిత వక్షస్థ్సలు

దగు స్వామిని ఆశ్రయింపుమంటిరి. అటిదూరమున శ్రీ వైకుంఠములో ఎక్కడనో ఉండు ఆ స్వామి మాకు అందుబాటులో లేడు మరియు ఆశ్రయించవలసిన మాకు ప్రతిబన్ధకములుగా ఎన్నో కర్మబంధములున్నవి. వాటిని పోగొట్టుకొనుట మాకు అసాధ్యము., కావున మాకు సన్నిహితుడై సులభుడై మా కర్మలన్నియు తొలగించి తన సన్నిధికి చేర్చుకొనగల దైవమును మాకు ఉపదేశింపుడు"- అని లోకులు తమ దుస్థితిని విన్నవింపగా విని ఆళ్వారులు ఈ ఏడవ పాశురమున "శ్రీరామచంద్రుని ఆశ్రయింపుడు, ఆయన మనరక్షణకై అవతరించి దుష్టశిక్షణమును చేసిన మహాత్ముడు" అని ఉపదేశించుచున్నారు.

పా॥ పులై యరమాగినిన్ఱపుత్తోడు శమణమెల్లాం
కలై యఱక్కఱ్ఱ మాందర్ కాణ్బరో కేళ్ పరోదాఱ
తలై యఱుప్పుండుం శావేఱ శత్తియం కాణ్మినయ్యా
శిలై యినాలింంగై శెత్త తేవనే తేవనావాఱ ॥

ప్రతి : కలై - సాంగముగా వేదమును, అఱక్కఱ్ఱ - బాగుగా అభ్యసించిన, మాందర్ - విజ్ఞానవంతులైన మానవులు, పులై అఱమాగి - నీచధర్మ ప్రబోధకములై యుండి, నిన్ఱ - లోకవ్యాప్తములై యున్న, పుత్తోడు - బౌద్ధమతముతో పాటు, శమణం - జైనమతము, ఎల్లాం - మొదలగు అవైదిక మతములన్నింటిని, కాణ్బరో - మనస్సున పట్టించుకుందురా! కేళ్‌పరోతాఱ - (లేక) వినుదురా, తలై అఱుప్పుండుం - నా తలను నరికినను సరే, శావేఱ - నేను మరణింపను, అయ్యా శత్తియం కాణ్మిఱ - అయ్యా! అతివాస్తవమగు ఈ ఆశ్చర్య విషయమును గమనింపుడు, శిలైనాల్ - ధనుస్సుచేత, ఇలంగై శెత్త - లంకా నగరమును ధ్వంసము చేసిన, తేవనే - దేవుడే (శ్రీరాముడే) తేవఱఆవాఱ - పరదైవమై యున్నాడు.

వివరణము : మానవులారా! మిమ్ములను కొన్ని అవైదికములైన దుర్మతములు అజ్ఞానములో పడద్రోసినవి. అందుచే మీరు పరమాత్మ జ్ఞానమును కోల్పోయితిరి. సంపూర్ణముగా వేదమును దాని అర్థమును తెలసికొన్న విజ్ఞానవంతులెవరునూ ఆ మతములను వినరు. మనస్సున పట్టించుకొనరు. నేను అతి వాస్తవమును ప్రతిజ్ఞ చేసి చెప్పెదను, వినుడు. రాక్షస వినాశకుడై ధర్మరక్షకుడైన శ్రీరాముడుతప్ప మరొక దైవము లేదు ఈ నా మాట అబద్ధమైనచో నా తలను నరుకుడు. నరికినను

నేను చావను. ఇది నా ప్రతిజ్ఞా వాక్యములోని సత్య ప్రభావము. పరీక్షింపుడు. ఇది ఈ ఆళ్వారులకు యధార్ధ విషయమునగల దృఢ విశ్వాసము. సత్యమగు అగ్రహము.

"పులై యరం... పుత్తొడు శమణం"- పుత్తర్-బౌద్ధులు,శమణర్-జైనులు, వీరు అవైదికములైన మతములను లోకమున ప్రచారము చేసినవారు. అందు బౌద్ధులు నాలుగు రకములుగ నున్నారు. వైభాషికులు-సౌత్రాంతికులు- యోగాచారులు- మాధ్యమికులు అని వారి పేర్లు. పృధివ్యప్ తేజో వాయువులు నాల్గే పదార్థములు. ఇవి జడములు. జ్ఞానమే ఆత్మ ఇవన్నియు క్షణికములే. ప్రత్యక్షానుమాన ప్రమాణములచే వీటిని గ్రహింపదగును. ఇది వైభాషిక మతము. బాహ్య పదార్థములు గూడ అనుమాన ప్రమాణగ్రాహ్యములేనని రెండవవారి మతము. బాహ్య వస్తువులుగూడ లేవు. జ్ఞానమొక్కటియే కలదని మూడవవారి మతము. ఏదియులేదు, సర్వము శూన్యమేనని నాల్గవవారి మతము. ఇక జైనులు- సర్వము శూన్యమే నన్నచో లోక వ్యవహారమెట్లు కుదురును? ఆ శూన్య వాదము తప్పు. కార్య కారణ రూపమున రెండు విధములైన సర్వ పదార్థములును కారణ రూపములో నిత్యములు. కార్యరూపములు అనిత్యములు. కార్యరూపమున భిన్నములు. కారణరూపమున అభిన్నములు. కార్యములు అసత్యములు. కారణములు సత్యములు. ఇట్లు ప్రతి పదార్థము ఉభయ రూపమైనందున అనైకాంతికము. ఏకాంతము అనగా నిశ్చయము. ఇది ఇట్టిదేనని నిశ్చయము లేదు గనుక అనైకాంతికము అందురు పరలోకమును పరమాత్మను వైదిక ధర్మములను అంగీకరింపని ఈ మతములన్నియు నీచములు. (ఎల్లాం) వేదమును ప్రమాణమనియెంచి గూడ దానికి విపరీతార్థములను చెప్పు మతములు కొన్ని. అవి సాంఖ్య-తార్కిక-పాశుపతాదులు.

"కలై యరకత్త.... కాణ్బరోకేళ్వరో" వేదములు స్మృతులు ఇతిహాసములు పురాణములు వీటిని బాగుగా చదివి అవగాహన చేసుకున్న పెద్దలు- శ్రీ కూరత్తాళ్వాణ వంటి మహానుభావులు. ఈ ప్రమాణములను పూర్తిగా సమన్వయము చేసుకొని తత్త్వ నిర్ధారణముచేసిన సమర్థులు మహావిజ్ఞానులు పై క్షుద్ర మతములను ఆదరింపరు-వినరు గూడ సర్వకారణభూతుడైన శ్రీమన్నారాయణునే లేడని వాదించు ఆ మతములను గూర్చి చర్చించుటగూడ మహాపాపమేనని వారి అభిప్రాయము. ఇచట నొక చిన్న సంఘటనను ద్రవిడ వ్యాఖ్యానకర్తలు ఇట్లు ఉదాహరించిరి.

ఒకరోజున శ్రీ కూరత్తాళ్వానులు భగవద్రామానుజుల వారి వద్దకు వచ్చు చుండగా త్రోవలో కొందరు ఇష్టసిద్ధియను సాంఖ్యమత గ్రంథమును చదువుచుండు టను చూచిఅచట కొంతసేపుఆగి ఆ సాంఖ్య మతవిషయములు విని ఆలస్యముగా ఆచార్యుల వారి వద్దకు వచ్చిరి. శ్రీరామానుజులు ఆలస్యమునకు కారణమడుగగా వీరు జరిగిన సంగతిని చెప్పిరి. అపుడు ఆచార్యులు ఆ దుర్మత శ్రవణ జన్య పాప పరిహారార్థమై ప్రాయశ్చిత్తముగా కూరత్తాళ్వానులను సచేలముగా స్నానము చేసిరమ్మని ఆదేశించి, అట్లు వచ్చిన పిదప తమ శ్రీపాద స్పర్శమును వారిశిరముపై కలిగించి పాద తీర్థమునుగూడ ప్రసాదించి సంస్కరించిరి. ఇక ముందు ఇట్టి పనులు చేయకుడని ఆజ్ఞాపించిరి. వ్యామోహకములైన ఆ దుర్మతముల శ్రవణము వైదికమత విశ్వాసమును శిథిలముగావించి ఆత్మవినాశహేతువు అగునని ఆచార్యులవారి అభిప్రాయము. బాహ్యకుదృష్టి మతముల వాసనయు సోకరాదనియు భగవన్మతముపై దృఢ విశ్వాసముతోపాటు సదాచార్యానువర్తనమే ఆత్మకు ధారకము అనియు శ్రీవైష్ణవాచార్యుల దృఢ దీక్ష.

"తలై యరుప్పుండుం కావేణ"— లోకులారా! మీరు వేదమును ప్రమాణముగా విశ్వసించగల విజ్ఞాన పరిపాకము కలవారు కాకపోవచ్చును. నేను ప్రత్యక్ష ప్రమాణము చేతనే "సత్యముగా భగవంతుడున్నాడు, ఆయనయే మనకు ఆశ్రయణీయుడు" అని ప్రతిజ్ఞచేసి చూపెదను. నాతలను నరికినను నేను చావను ఇది నా సత్య ప్రతిజ్ఞ. నేను ఈ శిరఃఖండనముచేత మరణించితినేని నా ప్రతిజ్ఞ అసత్యమగును. పరీక్షింపుడు ఇది ఆళ్వారుల సాహసోపేతమైన దృఢ ప్రతిజ్ఞ.

పూర్వకాలమున గొడ్డలిని నిప్పులో కాల్చి సత్యప్రతిజ్ఞను చేసినవాడు చేతితో పట్టుకొనును. అతడు ప్రతిజ్ఞ చేసిన విషయము సత్యమనుటకు అతని చేతులు కాల్చకుండుటయే నిదర్శనము ఈ పద్ధతి ఉపనిషత్తులలోను చెప్పబడి యున్నది. అట్లే శ్రీరాముడే పరదైవమను విషయమున వీరు ప్రతిజ్ఞచేసి పరీక్షించుకొనుడని లోకులపై సవాలు విసురుచున్నారు. వర బలముచే అవధ్యుడైన ఇంద్రజిత్తును వధించుటకై లక్ష్మణుడు—

"ధర్మాత్మా సత్యసంధశ్చ-రామో దాశరథిర్యది ।
పౌరుషే చాప్రతిద్వంద్వః-శరైనం జహి రావణిమ్" ॥

అని ప్రతిజ్ఞ చేసి వధించెను గదా! అట్టిదే ఈ ఆళ్వారుల ప్రతిజ్ఞ.

తల నరికి వేసిన పిదప మరణించకుండుట యెట్లు? అని లోకులు ప్రశ్నింప వచ్చును. "సత్తియం కాణ్మిన్ అయ్యా"- అని సమాధానమునిచ్చుచున్నారు. నా ప్రతిజ్ఞ సత్యమో కాదో పరీక్షించండయ్యా. ఇదే సత్యమగు ప్రత్యక్ష ప్రమాణము ఇంకనూ సందేహమెందులకు ?

వారు చేసిన ఘోరప్రతిజ్ఞను విన్న లోకులు- "స్వామీ! తమ ప్రతిజ్ఞను విశ్వ సించెదము. దయచేసి పరదైవము ఎవరో తెలుపుడు" అని ప్రార్థింపగా పరతత్త్వ మును ఉపదేశించుచూ "శిలై యినాల్ ఇలంగై శెత్త దేవనే దేవనావాన్" అని పాశు రమును ముగించుచున్నారు బ్రహ్మాది దేవతలు రావణునికి ఎన్నో వరములను ఇచ్చి యున్నారు ఆ వరప్రభావముచే గర్వించిన రావణుని వలన చివరకు ఎన్నో బాధలకు లోనైనారు. అపుడు శ్రీమన్నారాయణుని ఆశ్రయింపగా ఆయన శ్రీరామచంద్రుడై అవతరించి కోదండధారియై ఆ రావణుని అతని రాజధాని లంకను విధ్వంస మొన రించెను కోదండధారియగు ఆ స్వామియే పరతత్వము. మనకు ఆశ్రయణీయుడు. ఆయనను మించిన పరదైవము లేదు

**(8)** అవ : శ్రీరాముని ఆశ్రయింపుడను ఉపదేశము లోకుల చెవిన పడ లేదు. అందులకు వారికి గల కారణమేమనగా- ఆ శ్రీరాముడు మహాగుణశాలి, ధార్మి కుడు ఆ మహోన్నత పురుషుడు మనవంటి అల్పులకు అందడు అని వారి యభి ప్రాయము కనుక వారి మనస్సు మారలేదు బాహ్యదుర్మతములపై వారికి గల వ్యామోహమే భగవద్విషయవైముఖ్యమునకు కారణమని ఈ ఆళ్వారు మనస్సులో క్రోధమేర్పడినది. దుర్మతములను విని భగవద్ద్వేషవ్యాపులైన వీరిని, వీరికి ఇట్టి దుర్బోధములను చేయు అనాస్తిక మత ప్రవర్తకులను, తల నరికి వధించినను దోషము లేదని ఆవేశముతో శ్రీ రంగనాథునికి విన్నవించుచున్నారు.

పా॥ వెరుప్పొడు శమణర్ ముండర్ విదియిల్ శాక్కియర్‌గళ్ నిన్పాల్
పొరుప్పరియనగళ్ పేశిల్ పోవదే నోయదాగి ।
కురిప్పినక్కడైయుమాగిల్ కూడుమేల్ తలైయైయాంగే
అరుప్పదే కరుమం కండాయ్ అరంగమానగరుళానే !!!

ప్రతి : అరంగమానగరుళానే: శ్రీరంగనాథా! వెరుప్పొడు- అసూయా భావ ముతో, శమణర్- జైనులు, ముండర్- శైవులు, విదియిల్ శాక్కియర్‌గళ్-

అదృష్టహీనులైన బౌద్ధులు, నిన్పాల్- నిన్ను గూర్చి పొరుప్పు అరియనగళ్- సహింపరాని నిందావాక్యములను, పేశిల్- చెప్పినయెడల, అదువే- అభగవన్నిందయే నోయ్‌ఆగి-వ్యాధివలె బాధకరమై. పోవదు- (అది విన్న సాత్వికుడు) మరణింపగలడు ఇనక్కు- నాకు, కురిప్పు అడైయుమాగిల్- దృష్టిలో పడిన యెడల, కూడుమేల్- శక్యమైన యెడల, అంగే- అక్కడనే, తలయై అప్పదే- వానితలను నరుకుటయే కరుమం కండాయ్- కర్తవ్యము సుమా:-

వివరణము: "వెరుప్పొడు శమణర్ ముండర్"— జైనులకు శైవులకును భగవద్వైభవముపై ఎందుకో అంత ద్వేషము: లోకమున అర్థ కామాదులపైగల అపేక్షచేత ఇతరులను ద్వేషించుటను అసూయపడుటను చూచుచున్నాము కాని ఏ కారణము లేకనే పరమాత్మ వైభవమును విన్నంత మాత్రమున ఈ జైన-శైవులు- ఎందుకు ద్వేషింతురో తెలియదు. వేద ప్రమాణముచే సర్వోత్తముడుగా శ్రీ మహా విష్ణువు ప్రతిపాదింపబడి యుండుటను, ఆయనను ఆరాధించు జ్యోతిష్టోమాది వైదిక కర్మల ప్రభావమును విన్ననూ చూచిననూ వారు సహింపలేరు. ఆ స్వామికి బ్రహ్మో త్సవములు ప్రారంభము కానున్నవి- అని తెలిసినంతనే కొందరికి ఉరిపోసుకున్నంత దుఃఖము కలుగును. మరికొందరు తమ ఇంటి తలుపులు మూసుకొందురు. ఉత్సవ సమయమున వినపడు కాహళాది వాద్యములు వినలేక కొందరు చెవులు మూసుకొందురు.

"ముండఋ నీఋ" అని తిరుచ్చంద విరుత్తాది గ్రన్థములలో ప్రతిపాదింపబడి నట్లు శివుడు ముండిత శిరస్కుడై యుండుట వలన భస్మధారియగుట వలనను ఆయన నారాధించు శివభాగవతులును అట్టి వేషమునే దాల్చి యుందురు. కనుకనే శైవులను ముండర్ అని ద్రవిడ భాషలో వ్యవహరింతురు. లేక "శమణర్ ముండర్" అను రెండు పదములును జైనులకే వర్తించవచ్చును. వారును శిరోముండనము కలిగి యుందురు.

"విదియిల్ శాక్కియర్‌గళ్"- భగవంతుని వైభవ మెరిగి ఆశ్రయింపలేని అభాగ్యులైనవారు బౌద్ధులు.

"నిన్పాల్ పొరుప్పరియనగళ్ పేశిల్"- వారందరును భగవంతుని గూర్చి సహింపరాని దుష్ప్రసంగములను చేయుచుందురు. అసలు ఈశ్వరుడే లేడనియు, జీవ వర్గములో చేరిన బ్రహ్మరుద్రాదులలో ఏ ఒకరినో పరదేవతయనియు వారుచేయు దుర్వాదములను వైదికులు భరింపలేరుగదా: "పేశిల్" అనుటచేత ఎక్కడనో మారు

మూలలలో నుండి చెప్పుటగాక, దగ్గరనేయుండి కర్ణకఠోరముగా దూషించుచున్నప్పుడు భగవద్భక్తులు సహింపజాలరని భావము

ఒకప్పుడు బలిచక్రవర్తి తన తాతయగు ప్రహ్లాదుని వద్దకు పోయి ''రాజ్యము క్రమముగా క్షీణించుచున్నది ఇందులకు కారణమేమి?'' అని యడిగెనట. ప్రహ్లాదు డిట్లు బదులు చెప్పెను, ''నీవు నిష్పక్షపాతముగా వర్తింపక సజాతీయులగు రాక్షసుల కొరకై దేవతలను పీడించుచున్నావు. వారు క్షీరాబ్ధికి పోయి శ్రీమన్నారాయణుని ప్రార్థింపగా ఆయన వారికి విజయమును చేకూర్చుటకై అదితి గర్భమున ఉపేంద్రు డుగా జన్మించబోవుచున్నాడు. ఇక నీ ఐశ్వర్యము అంతరించిపోవుట తథ్యము.'' ఈ మాటను విని బలిచక్రవర్తి భగవంతుని దూషింప నారంభించెను. వెంటనే ప్రహ్లా దుడు ఆ భగవన్నిందను భరింపలేక చెవులుమూసుకొని- ''ఓరి భ్రష్టుడా! నా ఎదుటనే భగవన్నిందను చేయుదువా? ఇది నేను భరింపజాలను. ఇంతకంటె నా తలను నరికి నను నాకు మహోపకారము చేసినట్లు భావింతును. నీవు చేసిన ఈ దుష్ప్రసంగమునకు ఫలితముగా రాజ్యభ్రష్టుడవయ్యెదవుగాక'' అని శపించెను.

శ్రీ పరాశరభట్టరువారు ఒకనాడు ఈ విషయమునే చెప్పుచుండగా వారి శిష్యు లగు నంజీయరువారు విని ఇట్లు ప్రశ్నించిరట- ''అయ్యా! ప్రహ్లాదుడు పరమ విరక్తుడు గదా! అతని దృష్టిలో రాజ్యము గూడ క్షుద్రమైనదే గనుక ''రాజ్య భ్రష్టుడవు కమ్ము'' అని శపించుటలో విశేషమేమి?'' దీనికి ఆచార్యులవారిచ్చిన సమాధానము- ''ఔను. కుక్కను దండించుట యనగా దానికి కావలసిన ఆహారమగు అశుద్ధమును దూరము చేయుటయే గదా! అట్లే బలిచక్రవర్తికి ఇష్టమగు రాజ్యము నశించుగాక యని శపించుటలో తప్పులేదు.'' ఈ సమాధానముతోపాటు మరొక దృష్టాంతమును గూడ గ్రహింపవచ్చును. రాజకుమారుని దండించుట యననేమి? అతనికి అభీష్టమగు చందన కుసుమ తాంబూలాది భోగములను అందించకపోవుటయేగదా! అట్టిదే ఈ ప్రహ్లాదుడిచ్చిన శాపము.

''పోవదే నోయదాగి''— పిళ్లై తిరునఱైయూరరయర్ అను ఆచార్యుల వారి వంటి పరమ సాత్త్వికుడెవడైనను ఆ దుర్మతస్థులు చేయు నిందను విన్నచో భరింప లేక ప్రాణత్యాగము చేయుట తథ్యము. దుర్భరమగు వ్యాధివలె మానసిక క్షోభను కలిగించి ఈ నింద సాత్త్వికులకు వినాశహేతువగునని భావము. లేక- దానిని విని భరింపలేని మనోదౌర్బల్యము కలవాడైనచో ఆ నిందించువారికి కంటబడకుండా అతి దూరముగా తొలగిపోవలెనని యర్థము.

శ్లో॥ గురోర్యత్ర పరీవాదః - నిందా వాపి ప్రవర్తతే ।
కర్ణౌ తత్ర పిధాతవ్యౌ - గంతవ్యం వా చతోన్యతః ॥

అను నీతి శ్లోకము ఈ విషయమునే నిరూపించుచున్నది. తన ఆచార్యుని గురించి అపవాదలు చెప్పటగాని నిందా వాక్యములు పలుకుటగాని ఎప్పుట జరుగునో- అచట వెంటనే చెవులు మూసుకొనుటయో అచటి నుండి వేరొక చోటికి వెడలి పోవుటయో శిష్యుని కర్తవ్యము- అని శ్లోకార్థము.

''కురిప్పు ఇనక్కు అడైయుమాగిల్'' ఆ భగవద్దూషకులు నాదృష్టి గోచర మైన యెడల, "కూడుమేల్" వారిని జయించగల శక్తి నాకు దృఢముగానున్న యెడల, "తలైయై అంగే అరుప్పదే కరుమం"- అప్పుడే అక్కడనే వారిశిరస్సును ఛేదించుట నా కర్తవ్యము. లేక ఆ భగవన్నిందాపరులు నా శిరస్సును ఛేదించుటయే కర్తవ్యమనిగూడ అర్ధమును చెప్పవచ్చును అట్లయినచో ఇక నాకు ఆ నిందా వాక్యములు వినే అవకాశము తప్పిపోవును అని భావము. వారి తలనే నరికినచో ఇక పైనవారికి భగవన్నిందా పాపమును చేయు నవకాశము ఆగిపోవునని రెండవ భావము. అగ్నిషోమీయమున పశుహింస వలన యజ్ఞకర్తకు స్వర్గఫలము లభించునట్లు హింసింపబడిన పశువునకు గూడ ఆ ఫలమే లభించునని ''న వా ఉ ఏతన్మ్రియసే.. దేవానిదేషి ..'' ఇత్యాది వైదిక మంత్రము చెప్పుచున్నదిగదా! అట్లే నిందించిన వ్యక్తికి శిరచ్ఛేదముచే ఇక పైన ఆ నిందాపచారము పెరగదు. వినునట్టి భక్తునికిగూడ వినవలసిన దుర్యోగము తప్పిపోవును. గనుక ఇద్దరికిని మంచిదేనని యభిప్రాయము.

"కండాయ్ అరంగమానగరుళానే!" రంగనాథా! దండకారణ్యమున వసించు మహర్షులను బాధించుచున్న రావణాదిరాక్షసవర్గమును నశింపజేసిన నీకును ఇది అభిమతమేగదా! రామకృష్ణాద్యవతార కాలమున దర్శింపలేకపోయిన మావంటివారిపై అనుగ్రహ బుద్ధితోనే అర్చారూపమున శ్రీరంగమున నీవు వేంచేసియుంటివిగదా! ఇట్లు పరమదయాళుడవగు నిన్నుగూడ ద్వేషముతో నిందించువారిని వధింపక తప్పదు.

శాంత స్వభావులు క్రౌర్యము నెరుగనివారునగు ఈ ఆళ్వారులు "తల నరికెదను" అనుట సమంజసమా? "న హింస్యాత్ సర్వా భూతాని" అని శాస్త్రము హింసను నిషేధించుచున్నది గదా అని కొందరికి రెండు సందేహములు కలుగవచ్చును. ఇందు అనౌచిత్యము ఏమియులేదు. భగవద్దూషకులకును భగవద్భక్తులకును విరోధము

అనాది సిద్ధమే. వారు వీరిని హింసించుట, వీరు వారి వినాశము కోరుటయు ఇతిహాస పురాణాది ప్రసిద్ధము. భక్తులు "తమకు భగవద్ జ్ఞానము లేకున్నను సత్త్వాంగత్వము లేకున్ననూ సరేగాని, భగవద్విరోధులతో మాత్రము తమకు ఎట్టి సంబంధమును ఉండరాద"ని అది తమకు దుఃఖహేతువని భావింతురట. శ్రీ పరకాల మునీంద్రులు "...అవనై యుళ్ళత్తు-ఎణ్ణాదమానిడత్తై ఎణ్ణాదపోదెల్లాం ఇనియవారే" (పెరియతిరు-11-6-7) అని తమ ప్రబంధమున తెలిపిన విషయమిదే. కనుక పరమాత్మ విరోధులను దండించుట శాస్త్రసమ్మతమే. మరియు "న హింస్యాత్ సర్వాభూతాని" అను వాక్యమునకు "పశునా యజేత" అని అగ్నీషోమీయ యాగమున పశు హింసను విధించు వాక్యమునకు విరోధమేమియు లేదు. ఉత్సర్గాపవాద న్యాయమునుబట్టి విశేష విధి సామాన్య శాస్త్రమునకు బాధకము గనుక విశేష వ్యతిరిక్త స్థలములలోనే సామాన్య విధి వర్తింయునని శాస్త్రకారులందురు. ఆ రీతిలో యజ్ఞ పశు హింసా విశేష విధికి 'న హింస్యాత్' అను సామాన్య శాస్త్రము వర్తించనట్లే భగవద్విరోధిజన హింసా విధికిగూడ అది వర్తింపదు ఇదొక సమాధానము.

శ్రీభాష్యమున భగవద్రామానుజులు 3వ అధ్యాయమున ప్రథమ పాదాంతమున "అశుద్ధమితి చేన్నశబ్దాత్" అను సూత్రమును వ్యాఖ్యానించుచూ ఇట్లు భాషించిరి. "శబ్దాత్ అగ్నీషోమీయాదేః సంజ్ఞపనస్య స్వర్గలోకప్రాప్తి హేతుతయా హింసాత్వా భావశబ్దాత్. పశోర్హి సంజ్ఞపన నిమిత్తాం స్వర్గలోక ప్రాప్తిం వదంతం శబ్దమామనన్తి "హిరణ్య శరీర ఊర్ధ్వః స్వర్గం లోకమేతి" ఇత్యాదికమ్. అతిశయితాభ్యుదయ సాధన భూతో వ్యాపారోఽల్ప దుఃఖదోపి న హింసా. ప్రత్యుత రక్షణమేవ. తథాచ మంత్రవర్ణః 'న వా ఉ ఏతన్మ్రియసే న రిష్యసి దేవా నిదేషి పథిభి స్సుగేభిః. యత్ర యంతి సుకృతో నాపి దుష్కృతః తత్ర త్వా దేవః సవితా దధాతు" ఇతి. చికిత్సకం చ తాదాత్వికాల్పదుఃఖకారిణమపి రక్షకమేవ వదంతి. పూజయంతిచ తద్జ్ఞాః" ఇత్యాది.

ఈ భాష్యసూక్తి ప్రకారము యజ్ఞమున చేయబడు పశువధము హింసకాదని తెలియును. దీని అర్థమేమనగా:- "అగ్నిషోమీయాది యాగములయందు చేయబడు ఆ పశువధము యజ్ఞపశువునకు గూడ స్వర్గలోక ప్రాప్తికి హేతువని వైదిక మంత్రము చేతనే చెప్పబడియున్నది కావున అది హింస కాజాలదు. దానికిగూడ యజమానితో పాటు స్వర్గము లభించునని తెలుపు ఆ మంత్రము "హిరణ్య శరీర ఊర్ధ్వః"..... ఇత్యాదికము. హిరణ్యము (బంగారము) వలె దేదీప్యమాన శరీరము గలిగి ఊర్ధ్వ

లోకాభిముఖమై స్వర్గమునకు (ఈపశువు) పోవుగాక అని దానిఅర్థము. అత్యధికమైన అభ్యుదయమును సాధించిపెట్టు వ్యాపారము కించిద్దుఃఖప్రదమే యైనను హింస యన బడదు. పైగా ఆ పని దానికి క్షేమప్రదమైనందున రక్షణమనియే చెప్పబడును. స్పష్ట ముగా మరొక మంత్రము ఈ విషయమును నిరూపించుచున్నది. ఆ మంత్రము "న వా ఉ ఏతన్మ్రియసే " ఇత్యాదికము. ఆ పశువును ఖండించునపుడు దానిని గూర్చి సంబోధించుచూ ఈ మంత్రమును యజమానుడు చదువవలెను. దీని అర్థ మేమనగా- "ఓ యజ్ఞపశువ్ఛాగమా! నేనుచేయు ఈ శస్త్రచ్ఛేదముచేత నీకు వినాశ మేమియు కలుగదు. సుఖముగా ఊర్ధ్వమార్గమున పయనించి దేవతల సన్నిధికి చేర గలవు ఆలోకమునకు పుణ్యవంతులు తప్ప పాపిష్ఠులు వెళ్ళజాలరు. అచట నిన్ను సూర్యభగవానుడు రక్షించుగాక", ఇట్లు ఆ పశువునకు అధిక ఫలమునిచ్చు ఆ పశు చ్ఛేదనము హింసయే కాదు కావున "న హింస్యాత్" అను వాక్యముతో విరోధము లేదు వైద్యుడుచేయు శస్త్ర చికిత్సాదులు హింసగాకాక రక్షణముగానే లోకమున భావింపబడుచున్నవిగదా ఆ వైద్యుని లోకులు పూజించుచున్నారుగూడ. అట్లే సర్వ-లోకక్షేమార్థమై భగవద్దూషకులను వధించుట హింసకాజాలదని తాత్పర్యము ఇది రెండవ పరిహారము భగవద్గీతలో ద్వితీయాధ్యాయమున 31 శ్లోకమును వివరించు ఘట్టమున గూడ భగవద్రామానుజులు ఈ పరిహారమును తెలిపియున్నారు. తాత్పర్య చంద్రికలో శ్రీ వేదాన్త దేశికులవారు "...యజ్ఞోఽస్య భూత్యై సర్వస్య తస్మాద్యజ్ఞే వధోఽవధః" అను మనుస్మృతి శ్లోకమును ప్రమాణీకరించి ఈ విషయమును సమ ర్థించిరి లోకక్షేమార్థమైచేయు యజ్ఞములో పశువధము దోషముకాజాలదని ఆ శ్లోక మున కర్థము లోకక్షోభమును కలిగించి ధర్మవినాశకులైనవారిని దండించుటయు దోషముకాదు.

శ్రీ పరాశరభట్టరువారు శ్రీరంగరాజస్తవమున బౌద్ధమతమును ఖండించుచూ "వరదః సుగతపాశః చోరలావం విలావ్యః" అని తమ ఆగ్రహమును వ్యక్తీకరిం చిరి పాశశబ్దమునకు దుష్టుడని యర్థము. వైదికధర్మ ధ్వంసకుడైన ఆ బౌద్ధమతస్థుని దొంగను నరికినట్లు నరికివేయవలెనని ఆ శ్లోకమున కర్థము.

భగవద్దూషకులపై ఈ ఆళ్వారులకు గల క్రోధావేశము ఎంతటిదో ఇచట సూచితమగుచున్నది.

**(9)** అవతారిక: వెనుక ఏడవ గాథలో శ్రీరామచంద్రుడే పరదైవమని, ఆయ నను ఆశ్రయింపుడని, ప్రబోధించిరి. కాని సంసారులకు ఆ యుపదేశము చెవికెక్కునా?

వారు ఈ మాటపై ఆసక్తిని చూపకపోగా నిత్యములైన తమ లౌకిక విలాస వ్యవహారములపైననే తత్పరులై యుండిరి. వారిలో మార్పు ఏమాత్రమునూ కలుగలేదు. ఈ అనాచరమునకు వీరి మనస్సు క్షోభించినది నాస్తిక మతముల ప్రభావము లోకులపై ప్రబలముగా పడుటచేతనేగదా వారు హితోపదేశమును వినకున్నారు, అని వీరిలో క్రోధావేశము పెరిగినది. అట్టి పాపిష్ఠుల తలను నరికివేసినను పాపము లేదని తీవ్ర పదజాలముతో వారిని ఎనిమిదవ గాథలో మందలించిరి.

అంతట కొందరమాయకులు ఇట్లనిరి. "అయ్యా! మేము నాస్తికులమై మీరు చెప్పిన హితమును వినకపోవుట కాదు. ఆస్తికులమే. కాని మీరు శ్రీరామచంద్రుని ఆశ్రయించమని అంటిరి. ఆయన పరమ ధార్మికుడు. అధర్మమును అణుమాత్రమైననూ సహింపడు. కావున మావంటి పాపిష్ఠులకు ఆయనయొక్క గుమ్మము వద్దకు పోవుటకే అర్హత లేదు ఒకవేళ ఆ స్వామి దర్శనమైననూ, ప్రక్కనుండు వసిష్ఠాది మహర్షులు" వీరు యోగ్యులా అయోగ్యులా "యని పరీక్షింపజూతురు. కావున మేము శ్రీరామచంద్రుని ఆశ్రయించుట, ఆయన మమ్మనుగ్రహించుటయు అసంభవమే. కనుక మా అయోగ్యతను లెక్కింపక ఉదారబుద్ధితో అనుగ్రహింపగలవాడును ఆశ్రయింపనివారిని గూడ నిర్హేతుక దయతో తానై రక్షింప నుద్యమించు సాధు స్వభావుడును అగు దైవమును మాకు తెలియజేయుడు. ఆ మహానుభావుని ఆశ్రయించెదము." ఆ మాటను విని అట్టి మహోదారుడైన పరమ పురుషుడు శ్రీ కృష్ణుడేననియూ ఆయనను సేవింపుడనియు ఈ తొమ్మిదవ గాథలో ఉపదేశించుచున్నారు.

పా॥ మత్తుమోర్ తెయ్వముండే? మదియిలా మానిడంగాళ్ !
ఉత్తపోదన్ని నీంగళ్ ఒరువనెన్ఱుణర మాట్టీర్ ।
అత్తమేలొన్ఱరియీర్, అవనల్లాల్ తెయ్వమిల్లై ।
కత్తినంమెయ్త్తవెన్దై కళలిణై ప్పణిమినీరే ॥

ప్రతి : మదియిలా మానిడంగాళ్ — బుద్ధిహీనులైన ఓ మానవులారా! మత్తుం ఓర్ తెయ్వం ఉండే — (కృష్ణునికంటె) వేరొక దైవము కలదా? ఉత్తపోదు అన్ని — అందరును ఆశ్రయించినపుడు గాని, ఒరువన్ ఎన్ఱు - (ఇతడు) సాటిలేని దైవము అని నీంగళ్ ఉణరమాట్టీర్ — మీరు గుర్తింపజాలరు, అత్తమేల్ ఒన్ఱు — ప్రమాణ నిశ్చితార్థమును ఏమియును, అరియీర్ - మీరెరుగరు, అవన్ అల్లాల్ తెయ్వం ఇల్లై — ఆ కృష్ణుడు

తప్ప వేరొక దైవములేదు. కత్తు ఇసంమెయ్త్త ఎంద్రై— ఆవు దూడలను మేపు మా కృష్ణస్వామియొక్క, కళ్ళల్ ఇణై— శ్రీపాదములు జంటను, నీరే పణిమిన్— మీరే ఆశ్రయింపుడు.

వివరణము : ''మత్తుం ఓర్ తెయ్వం ఉండే?''— నేను చెప్పబోవు కృష్ణ పరమాత్మ తప్ప మనమాశ్రయింపదగిన సాటిలేని దైవము వేరొకటి కలదా? ''ఈశ్వ రోహం అహంభోగీ'' అని భగవద్గీతలో చెప్పినట్లు మేమే ఈశ్వరులమని అహంకి రించు దేవతలు ఎందరో కలరు. అంతటి అహంకారముతో నిండినవారు మన మాశ్రయింపదగిన స్థాయిలో నుండరు. మన ముఖమే చూడరు. కృష్ణస్వామి అట్టి వాడుకాదు. సర్వసులభుడు పైగా మనకు ''త్వమేవ మాతాచ పితా త్వమేవ'' అన్నట్లు సన్నిహితుడైన ఆప్తబంధువు. దయాళువగు కన్నతండ్రిని కాదని ఏ సంబంధములేని దురహంకారుడగు పొరుగింటివానినెవడైన ఆశ్రయించునా? ''అహం వో బాంధవో జాతః'' అన్నట్లు మనలను ఆత్మీయులనుగా అభిమానించు ఆ కృష్ణుడే భగవద్గీతలో ''యేప్యన్యదేవతాభక్తాః'' అనుచున్నాడు. ఆ దేవతలను అన్యుల క్రిందనే తోసి వేసినాడు. మానవులలో గూడ కొందరు జాత్యాదులనుబట్టి నిహీనులైనను ఐశ్వర్య మునుబట్టి, ఆశ్రయింపబడుదురు. పిదప విమర్శింపగా వారిలోని దుర్గుణములు బైట పడి విడువబడుదురు ఇక కృష్ణుడన్ననో, అట్టి దోషములేమియులేని పరదైవము.

ఇక ''మరొక దైవము కలదా!'' అను వాక్యమునకు ఉన్నచో చెప్పుడు' అని ప్రశ్నించుటలో తాత్పర్యము కాదు. అన్యదేవతలు అట్టివారుకారు సుమా! యని ఆక్షే పమును తెలుపుటయే దాని భావము. శ్రీ శఠకోపులు ''ఏఴులగుం ఈ పావంశెయ్దు అరుళాల్ అళిప్పారార్?'' అని తిరువాయ్మొழిలో ప్రసాదించిరి. ''మన పాపములను పోగొట్టి దయతో రక్షించు దైవము ఏడు లోకములలోను గోపాలకృష్ణుడు తప్ప మరొకడు కలడా!'' అని వారి సూక్తికి అర్థము అయనవల్లనే బ్రహ్మహత్యాది పాప విమోచనమును పొంది రక్షింపబడిన రుద్ర బ్రహ్మేంద్రాది దేవతలుగూడ ''ఔను ఆయనయే పరదైవము'' అని యొప్పుకొందురుగాని, ప్రసిద్ధమైన సర్వాంగీకృతమైన ఈ వాస్తవమును కాదనగలవారు ఎవరును ఉండరు గదా! అట్లే ఇచటగూడ ''ఇత రులు అట్టివారు కాజాలరు'' అని త్రోసివేయుటలోనే ఈ వాక్యమునకు పర్యవసానము.

''మతిలేని మానవులారా'' అని సంబోధించుటకు తాత్పర్యమేమనగా: వేద ములలో కర్మకాండములో చెప్పబడినట్లు ముప్పదిమూడు కోట్ల దేవతలు కలరని.

వారందరును ఆరాధింపదగిన వారేనని, ఇంతమాత్రమే మీరెరుంగుదురు. పరతత్త్వ రహస్యమును ప్రకటించు ఉపనిషత్తులలోగాని తదుపబృంహణములైన స్మృతీతిహాసాదు లలోగాని చెప్పియున్న పరమార్థమును ఎరుంగలేని అభాగ్యులు మీరు. "చతుర్హోతారో యత్ర సంపదం గచ్ఛంతి దేవైః" అను వేదవాక్యమునకు అర్థమును మీరెరుంగరు. పరమాత్మ అన్తర్యామిగా చేరియుండి ఆయా దేవతలకు యజ్ఞములతో సంబంధము కల్పించినాడని దాని యర్థము. "అహం హి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభురేవచ" అను గీతా వాక్యము "యే యజన్తి పితౄన్ దేవాన్.... విష్ణుమేవ యజన్తి తే" అను పురాణవాక్యముగూడ దేవతలందరు అంగభూతులేనని వారిద్వారా అన్తర్యామియై హవిస్సును స్వీకరించు పరమాత్మయే ముఖ్యుడని తెలియజేయుచున్నది. ఈ విజ్ఞాన మును పొందుటకు యోగ్యమైన మానవజన్మమునెత్తిగూడ మీరు దానిని లభించుకొనక పోవుట మీ దౌర్భాగ్యమే గదా! భగవంతుని అస్తిత్వమును గుర్తించి, భక్తితో ఆయనకు దాస్యముచేసి ఉజ్జీవింపుటకు ఉపయోగించునదే విజ్ఞానము. ఆయనను ఆయన నామములను మరచినవారు మానవులేకారు. వారు అసత్ప్రాయులే. "అసన్నేవ స భవతి. అసత్ బ్రహ్మేతి వేదచేత్" అను ఉపనిషద్వాక్యమున కర్థమిదే. బ్రహ్మ జ్ఞానభిన్నములైన విద్యలేవియు విద్యలేకావు. "విద్యాన్యా శిల్పనైపుణమ్" అన్నట్లు అవియన్నియు పరమార్థమునకు ఉపయోగించని వినోదకర నైపుణ్యములు మాత్రమే. ఒకడు చెప్పులను అందముగా నగిషీలువేసి చూడముచ్చటగా కుట్టును. అది పురుషార్థ మునిచ్చు మహావిద్యయగునా!!

అయ్యా! అట్టి బ్రహ్మ విజ్ఞానమును పొందగల శక్తిమాకు లేదు. మీరు దయతో ఉపదేశించినచో గ్రహించెదము. అని లోకులు చెప్పుమాటలకు సమాధాన ముగా వీరు ఇట్లనుచున్నారు. (ఉత్తపోదుఅన్ఱి- ఇత్యాది) నేను చెప్పినను మీరు గ్రహింపరు. గ్రహించినను నమ్మరు. మీరు ఆశ్రయించు ఆ ఇతర దేవతలను మీరును కట్టగట్టుకొని మహాప్రళయములో ఆయనలోనే లయము నొందుదురు. ఆయ నయే పరదేవతయని అప్పుడే మీ మనస్సుకు తట్టును. లేక- ఆ దేవతలను రావణా దులు ముప్పతిప్పలు పెట్టుచుండగా స్వామీ! రక్షింపుమని వారు ఆయననే ఆశ్రయిం తురు. అప్పుడుగాని మీకు ఆయన పరదేవతయని అర్థము కాదని భావము. పునరా వృత్తిరహితమైన మోక్షమును ప్రసాదించు ఆయనను క్షుద్రఫలములనిచ్చు' ఆ దేవత లలో చేర్చి 'వారిలో ఇతనొకడు'- అని భావించుటయే మీ అజ్ఞానము. నిష్కర్షించి తెలిసికొనగల వివేకము మీకెక్కడిది?

''సత్యం సత్యం పునస్సత్యం.... న దైవం కేశవాత్పరం" అని మహాభారతమున వేదవ్యాసుడు భుజమునెత్తి ఘంటాపథముగా చాటినట్లు మరల చెప్పెదను వినుడు- ఆయనతప్ప ముమ్మాటికిని మరొకదైవము లేదు- లేదు- లేదు.

(కత్తినం మెయ్త్తవెండై - ఇత్యాది) ఆయన పేరేమందురా? గోపాలుడు" గోవిందుడు. గోవుల గుంపులను దూడల మందలను గోపబాలురతో కలసి కాచుచూ తిరుగువాడు. మనందరి దైవము ఆ కృష్ణుడేనని యభిప్రాయము. "కృష్ణుడు" అని నేరుగా పేరును చెప్పక "గోవుల గుంపులను మేపువాడు" అని చెప్పుటలోగల విశేషము నిచట గుర్తింపదగును. ఇతర దేవతలందరిలో అహంకారము మెండు. తమంతటివారిని గూడ చూచినచో ఓర్వలేనితనము వారిలో జాస్తి. అట్టివారు మానవులపై ప్రేమను చూపుదురా?

కృష్ణుడట్టివాడు కాడు. దేవాధిదేవుడై కూడ తన పరత్వమును భావించక సౌలభ్య సౌశీల్యాది గుణములతో వారు వీరను తారతమ్యమును చూపక ఆశ్రితులందరితోను కలసిమెలసి తిరుగునంతటి మహోదారహృదయుడు. ఈయనకు ఆ దేవతలుసాటియా?

(కళ్ళలిజై... ఇత్యాది) ఆయనయొక్క శ్రీపాద పద్మముల జంటను ఆశ్రయింపుడు. "అహమస్య అవరోభ్రాతా- గుణైర్దాస్య ముపాగతః" అని హనుమంతునితో లక్ష్మణస్వామి తెలిపెను. నేను శ్రీరామునికి చిన్నతమ్ముడను. కాని ఆయనలోని మహాగుణములనుబట్టి నేను దాసుడనుగానే సేవను చేయుచుందును- అనెను. అట్లే మనమును సౌలభ్య- సౌశీల్యాది మహాగుణశాలియగు శ్రీకృష్ణుని ఆశ్రయింతము రండు.

ఇతర దేవతలు ఈ సద్గుణములు కలవారు కాకపోగా దురహంకారవంతులు అసూయాగ్రస్తులుగూడ అనుటకు ఒక ఉదాహరణము చెప్పెదను. వినుడు. షట్చక్రవర్తులలో నొకడు మహాధార్మికుడునైన యయాతి తన జీవితాంతమున స్వర్గమునకు వెళ్లెను. ఆయనయొక్క ప్రభావమును బట్టి ఇంద్రుడు ఆయనను తన అర్ధాసనములో కూర్చుండబెట్టుకొనక తప్పలేదు. యోగక్షేమములను విచారించిన పిదప ప్రసంగవశమున ఇంద్రుడు "కర్మ భూమియగు మీ భూలోకమున గొప్ప పుణ్యకర్త ఎవడు" అని ప్రశ్నించెను. యయాతి కొద్దిసేపు విచారించి 'అసత్యమును చెప్పరాదు' అను తలంపుతో ''నేను పాలించు రోజులలో ప్రజలు నన్ను గొప్ప పుణ్యశాలిగా చెప్పుకొనుచుండిరి."అని బదులు చెప్పెను. 'ఒకమానవుడు నాతో ఏకాసనస్థుడై కూర్చొనుటయా'

అని అసూయావిష్టుడై యున్న ఇంద్రుడు వెంటనే 'నీవు ఆత్మస్తుతిని చేసుకొనుచున్నా' వను వంకను చూపి అది నీదోషమని తెలిపి తలక్రిందులుగా పడునట్లు భూలోకమునకు త్రోసివేసినాడట ఇట్లు ఇతరుల పొరుగును గూడ సహింపలేని దేవతలు మనకు ఆశ్రయణీయులు కారు.

శ్రీపరాశరభట్టరువారు ఈ కథను వివరించు చుండగా విన్న నంజీయరువారు ఇట్లు ప్రశ్నించిరట. ''అయ్యా! మహాభారతమును వేదార్థోపబృంహణమందురుగదా! అందులో గల ఈ కథ వలన ఏవేదార్థము సూచింపబడినది. సెలవిండు' — అపుడు ఆచార్యులవారు ''సాహంకారులైన వారిని ఆశ్రయింపకుడు. మీహితమును కోరి మీవెంటనుండు పరదైవమునే ఆశ్రయింపుడు'" అను ధర్మసూక్ష్మము ఈ కథ వలన తెలియుచున్నది. అని ప్రత్యుత్తర మిచ్చిరి.

**(10)** అవతారిక : వెనుక రామావతారమును ఆశ్రయింపుమనిరి అది మాకు సాధ్యము కాదన్నప్పుడు సర్వసులభుడైన శ్రీకృష్ణుని ఆశ్రయింపు మనిరి. అయ్యా! ఆ రెండవతారములును మాకు అందనివే. ఎన్నోవేల సంవత్సరముల తరువాత జన్మించిన మాకు ఇపుడు ఆ గడచిపోయిన అవతారమూర్తుల నాశ్రయించుట ఎట్లు సంభవము? అన్న మానవుల ఆక్రందనమును గమనించి వీరు ఈ పదవ గాథలో ఇట్లు సమాధానము నిచ్చుచున్నారు. భక్తులారా! ఆ యవతారముల కాలమున మేము జన్మించకపోయితిమే అను మన కొరతను తీర్చుటకే పరమపదము నుండి వచ్చి భగవంతుడు శ్రీరంగము నందు స్థావర ప్రతిష్ఠగా శేషునిపై శయనించి నిత్యవాసము చేయుచున్నాడు. ఇచటకు వచ్చి మీరును ఆశ్రయింపుడు మోక్షార్థులైన మీరు ఈ శ్రీరంగనాథుని కాదని దేవతాంతరము నాశ్రయింపబోవుట- గర్భదరిద్రుడు జ్యేష్ఠా దేవి వద్దకు పోయి ఐశ్వర్యమునిమ్మని కోరుట వంటిదే సుమా! అని హెచ్చరించు చున్నారు.

పా॥ నాట్టినాన్ తెయ్వమెంగుం నల్లతోర్ అరుళ్ తన్నారే।
కాట్టినాన్ తిరువరంగం ఉయ్యవర్కు ఉయ్యుం వణ్ణం।
కేట్టీరే నంబిమీర్ గాళ్ కెరుడ వాహనసుం నిర్క।
చ్చేట్టైతన్మడియగత్తు చ్చెల్వం పార్తిరుక్కిన్నరే॥

ప్రతి : తెయ్వం- ఆయా సామాన్య దేవతలను, ఎంగుం - లోకమందు అంతటను, నాట్టినాన్ - సృష్టించినాడు. ఉయ్యవర్కు - ఉజ్జీవించవలెనని (ముక్తి

నొందవలెనని) కోరువారికి, ఉయ్యుంవణ్ణం - ఉజ్జీవించుటకు తగిన విధముగా నల్లదు ఉత్తమమగు, ఓర్ అరుళ్ తన్నాలే- సాటిలేని దయాగుణముతో, తిరువరంగం కాట్టినాన్ - శ్రీరంగ క్షేత్రమును చూపినాడు. నంబిమీర్గాళ్ - ఐశ్వర్యాదులతో పూర్ణులైన ఓ లోకులారా! శ్రేట్టీరే - వినండయ్యా, కెరుడవాహనుంనిర్క - గరుడ వాహనారూఢుడగు శ్రియఃపతియుండగా, శేట్టైన్ మడియగత్తు- జ్యేష్ఠాదేవి (పెద్దమ్మవారు) వద్దకు చేరి, శెల్వం పార్త్తిరుక్కిన్నీరే- ధనమును సంపాదింప గోరెదరేల?

వివరణము: సత్త్వరజస్తమోగుణముల ప్రాచుర్యమును బట్టి మానవులలో మూడు రకములవారుందురు. ఆ గుణములను బట్టియే వారి వారికి కలుగు కోర్కెలలో గూడ మార్పులుండును. అందు రజోగుణముచేతను తమోగుణము చేతను లౌకిక క్షుద్ర ఫలములను మాత్రము అపేక్షించు వారికై ఆ ఫలములను ప్రసాదింప సామాన్య దేవతలను పరమాత్మ సృష్టించినాడు మొదట రజస్తమో గుణ ప్రభావముచే లోకులు వారి నాశ్రయించినను, ఆ దేవతలను గూడ సృష్టించి వారికంతటి శక్తినిచ్చినవాడు పరమాత్మగదా యని వివేకము కలిగినపుడు ఈ మానవులే సత్త్వగుణావిష్టులై తన నాశ్రయించకపోదురాయని భగవంతుని అభిప్రాయము. వాస్తవమునకు ఆ దేవతలకు శక్తినిచ్చి అంతర్యామిగా పరమాత్మ ఆధార భూతుడై యుండనిచో ఆధారదండము (గుంజ)లేనందున పందిరికెక్కలేని తీగవంటిదే ఆ దేవతల అస్తిత్వముగూడ అగును. "అంగాన్యన్యా దేవతాః" (ఇతర దేవతలందరు భగవంతునికి అవయవస్థానీయులే) "విష్ణురాత్మా భగవతః భవస్యామితతేజసః" (త్రిపురాసురవధమునందు విష్ణువంతర్యామిగా నుండి శక్తి నిచ్చుట చేతనే పరమశివుడు వారిని జయించగలిగెను.) ఇత్యాది ప్రమాణములన్నియు ఈ వాస్తవమును చాటుచున్నవి. ఆధారమైన పందిరి గుంజను మరచి తీగను దాని పూలను పండ్లను చూచి మురిసిపోవు మానవుల వలెనే లోకులు కొందరు గూడ ఆ దేవతలనే ఆశ్రయించి మూలకారణమైన పరమాత్మను మరచి పోవుచున్నారు.

ఇట్లుండగా తత్త్వము నెరిగి సత్త్వగుణ సంపన్నులై మోక్షము నపేక్షించు వారికొరకు దయాపరవశుడై తానే శ్రీవైకుంఠము నుండి మహావిష్ణువు శ్రీరంగక్షేత్రమునకు వేంచేసి అందరికిని దర్శనీయుడైనాడు ఇచట స్వామియొక్క దయాగుణమును "నల్లదు ఓరరుళ్" (ఉత్తమమైన మహాగుణము) అని ఈ ఆళ్వారులు కీర్తించుటలో ఎంతో విశేషమున్నది. అదేమనగా— మొదట సూర్యచంద్ర - అగ్న్యాది దేవతలను సృష్టించుట లోకక్షేమమునకై చేసిన దయాకార్యమే. తన దర్శనమును కోరు ఏ

ఒకరిద్దరు ధ్రువాదులవంటి భక్తుల కొరకోగాక, కోరకున్నను తానే ఉండబట్టలేక అవ తారాదుల నెత్తివచ్చి సర్వ జనుల క్షేమమును కలిగించుచూ నిత్య సన్నిహితుడగుట దయా విశేష కార్యమే గదా! కనుకనే పొదుగులో పాలు నిండిపోయి సలుపుచుండగా ఉండలేక తనంతట తానే నేలపై పాలను కార్చు గోవువంటి స్వభావము భగవంతునిది అని పెద్దలందురు అతటి దయ మరే దేవతలలోను కానరాదని దీని భావము.

(కేట్టీరే నంబిమీర్గాళ్!) ''వినండి మానవులారా!'' అని వీపుపైతట్టి ప్రబో ధించుచున్నారు. జూదము మొదలైన దుర్వ్యసనములలో మైమరచి మునిగియున్నవారిని హెచ్చరించినట్లు లౌకికములైన క్షుద్రైశ్వర్యసుఖములలోనే మునిగియుండు లోకులకు తెలసివచ్చునట్లు ఈ క్రింది హెచ్చరికను చేయుచున్నారు

గరుడవాహనారూఢుడై వచ్చి పరమాత్మ తానే మన రక్షణకై ఎదురుచూచుచూ నిల్చియున్నాడు. ఆయనను కాదని అజ్ఞానముతో మీరు అల్పులగు దేవతలను ఆశ్ర యించుట పరిహాస్యము. ఇనుపగజ్జెల తల్లియగు జ్యేష్ఠాదేవి (పెద్దమ్మవారు) వద్దకు పోయి ఎవడైనా "నాకు ఐశ్వర్యమునిమ్మ" అని ప్రార్థించువాడుండునా? ఆ పెద్దమ్మ ఐశ్వర్యము నివ్వలేనట్లే వీరును పరమపురుషార్థమగు మోక్షము నివ్వజాలరు. కనుక తత్త్వమెరిగి శ్రీమహావిష్ణువు నాశ్రయించిన వారెవ్వరును ఇతర దేవతలు తమ ఎదుట వచ్చి నిలిచిననూ వారివంకగూడ చూడరట. ఒకప్పుడు పార్వతీ పరమేశ్వరులు ఆకాశమార్గమున పోవుచూ వైరాగ్య సంపన్నుడైన భృగుమహర్షి పుత్రుడగు విష్ణు భక్తునిచూచి అతని ఆశ్రమమునకు వచ్చిరట. ఆయన వారిని ఆదరించక పోగా కన్నెత్తియైన చూడలేదు. వారే ఆయనను పలకరించి ''మేము పార్వతీ పరమేశ్వరు లము, వరము నిత్తుము, కోరుకొమ్మ" అన్నారట. ఆయన "నాకు మోక్షమునిమ్మ" న్నాడట. అది మాకు సాధ్యముకాదు- మరొకటి కోరుకొమ్మన్నా"రట. అపుడాభక్తుడు ''ఐతే నేను బొంతను కుట్టుకొనుటకు ఈ సూదిలో దారము ఎక్కునట్లు వరమునిండు" అని ఈసడించినాడట. భగవద్భక్తిని సారముగా కలిగిన ఆ మహాభక్తుడే భక్తిసార మునీంద్రుడు- తిరుమళిశై ఆళ్వార్- అని పెద్దలందురు.

ముముక్షువులకు ఇతర దేవతలతో పనిలేదని భావము.

**(11)** అవతారిక: అందరికిని సన్నిహితుడై అందుబాటులో నుండుట అను సౌలభ్య గుణమునకు పరాకాష్ఠయైన అర్చావతారరూపమగు శ్రీరంగనాథునిగూర్చి తెలిపినను ప్రజలలో ఆభిముఖ్యము కనబడలేదు. నేనాశ్రయింపుడని చెప్పిన శ్రీరామచంద్రుడే

ఆ యవతారమును చాలించినను భవిష్యత్కాలమునగూడ లోకులాశ్రయించుటకై దయతో శ్రీరంగనాథరూపమున వచ్చి ఇచట శేషుని పై శయనించియున్నాడు. ఆయన యొక్క దివ్య నామానుసంధానమును చేయుచూ మీ జన్మమును సార్థకము చేసి కొనవలసియుండగా అట్లు చేయక వ్యర్థముగా కాలమును గడుపుచుంటిరే లోకులారా ఎంత దురదృష్టవంతులు మీరు! అని ఈ గాథలో అవహేళన చేయుచున్నారు.

పా॥ ఒరువిల్లాలోంగుమున్నీర్ అడైత్తులగంగళయ్యా
శెరువిలే యరక్కర్కోనై శెత్త నంశేవగనార్ ।
మరువియ పెరియకోయిల్మదిళ్తిరువరంగమెన్నా
కరువిలే తిరువిలాదీర్! కాలత్తైక్కళిక్కిన్నీరే ॥

ప్రతి : ఒరువిల్లాల్- సాటిలేనిదగు ధనుస్సుతో, ఓంగు- తరంగములతో క్షుభితమగుచున్న, మున్నీర్- సముద్రమున, అడైత్తు- సేతుబంధనమొనర్చి ఉల గంగళ్ ఉయ్యా- లోకముల క్షేమముకొరకై, శెరువిలే- యుద్ధమునందు, అరక్కర్ కోనై- రాక్షసాధిపతియైన రావణుని, శెత్త- వధించిన, నంశేవగనార్- మన శ్రీరామచంద్రస్వామి, మరువియ- ప్రేమతో వచ్చి నివసించిన, పెరియకోయిల్- మహాదేవాలయము, మదిళ్తిరువరంగం- సప్తప్రాకారములతో కూడిన శ్రీరంగక్షేత్రము ఎన్నా- అని నోరార కీర్తింపక, కరువిలే తిరువిలాదీర్- మాతృగర్భమునందే దుర దృష్టవంతులైన లోకులారా! కాలత్తై- జీవిత సమయమునంతయు కళిక్కిన్నీరే! వ్యర్థముగా గడుపుచుంటిరే.

వివరణము : "ఒరువిల్లాల్" ఇత్యాది. సాటిలేని ధనుస్సుతో సముద్రమును క్షోభించునట్లుచేసి సేతువును కట్టినవాడు. 'ఒరు' అను పదమునకు ఒకటి- అనగా సాటిలేనిది అని యర్థము. లేక, కళ్ళన అన్నట్లుగా, చేతికందినది ఏదో ఒకటియని అనిశ్చితార్థకము. శ్రీరామునికి శత్రువధమునకై ఫలానా ధనుస్సేకావలెననే నియమ మేదియులేదు ఆయన ఏది చేత పట్టిననూ అదే మహాయుధమగునని భావము. "అస్త్రామాస తృణం ప్రియాద్రుహి- తృణామాస స్మరారేర్ధనుః" సీతమ్మకు ద్రోహ మొనర్చిన కాకాసురునిపై గడ్డిపరకయే మహాస్త్రముగా ప్రయోగింపబడినది శివుని మహాస్త్రమగు ధనుస్సుగూడ గడ్డిపరకవలె ఆయన చేతిలో నిస్సారమైనది.

స్వామి సముద్రునిపై ధనుస్సును ఎక్కుపెట్టుటకు కారణమేమి అనగా- సము ద్రుని ప్రార్థించి లంకకు పోవుటకు మార్గమునిమ్మని స్వామి మూడు రాత్రులు శరణా

గతిచేసి ప్రాయోపవేశమై పరుండెను కాని సముద్రుడు ఈయనయొక్క సౌమ్యతకు మెచ్చి దర్శనమీయవలసియుండగా, అట్లు చేయలేదు. వెంటనే "చాపమానయ సౌమిత్రే" అని స్వామి లక్ష్మణునితో ధనుస్సును పట్టుకు రమ్మనెను. విషమును గ్రక్కు త్రాచు పామువంటి తీక్ష్ణబాణములను సముద్రునిపై వదిలెదననెను.

(ఓంగుమున్నీర్) దానితో సముద్రుడు భయముచే కుతకుతలాడి పోయెను. అతనిలో కలిగిన ఈ సంభ్రమ సంక్షోభము సహజముకాదు. కోదండమును చేతబట్టి ఎదుట నిలచిన శ్రీరాముని వీరమూర్తిని చూచినపుడు కలిగిన తత్తరపాటే అది. ఉపాధ్యాయుని చేతిలో బెత్తమును చూచి బెదరిపోయిన విద్యార్థులవలెనే సముద్రుడును వచ్చి శ్రీరాముని పాదములపై బడెను. మున్నీర్ అను పదము తమిళమునను తెనుగుననూ సముద్రవాచకముగా నున్నది. "మును + నీర్" మొదట బ్రహ్మచేత సృష్టింపబడిన జలము అని వ్యుత్పత్తిని చెప్పుదురు. "అప ఏవ ససర్జాదౌ" అని మనుస్మృతియు "యా సృష్టిః స్రష్టురాద్యా" అని కాళిదాసును ఈ విషయమును తెలిపిరి "మూన్జు + నీర్" మూడు విధములగు నీరు కలది. "మున్నీరు" అనిగూడ మరొక వ్యుత్పత్తి కలదు. నదీజలము- ఊటజలము- వర్షజలము- అను మూడు రకములైన నీరు కలియుటచేత సముద్రము మున్నీరైనదని అభిప్రాయము.

(అడైత్తు) శ్రీరాముడు విల్లును చేతబట్టి ఆ సముద్రునిపై సేతువును కట్టెను. వింటితో సేతువును కట్టుట యెట్లు? రాళ్లతోగదా కట్ట వేయవలసినది: అని సందేహము రావచ్చును. నిజమే: ఈ విల్లు పనిచేయనిచో ఎన్ని పర్వతములను తెచ్చి వేసినను అవి అడుగుపట్టిపోవునుగాని సేతువు నిలబడునా? ఈ ధనుస్సునకు బెదరిన సముద్రుడు తన వీపును చూపి దానిపై సేతువును బంధింపుమని కోరెను. కనుక సేతుబంధమునకు మూలకారణము కోదండమే

(ఉలగంగళ్ ఉయ్య) స్వర్గాది సర్వలోకోజ్జీవనమునకే ఈ సేతు బంధనము రావణవధము. బ్రహ్మదత్తములైన వివిధ వరముల బలముచేత వాడు సర్వలోకములను క్షోభింపజేసెను. "న యష్టవ్యం న దాతవ్యం" అని చెప్పినట్లు యజ్ఞదానాది కర్మములను నిషేధించెను.

"పురీమవస్కంద లునీహి నందనం- ముషాణ రత్నాని హరామరాంగనాః
విగృహ్య చక్రే నముచిద్విషా బలీ- యఇత్థమస్వాస్థ్య మహర్దివం దివః"

అని మాఘ కవి చెప్పినట్లు మాటిమాటికిని స్వర్గరాజధానియగు అమరావతిని ముట్టడించెను. నందన వనమును ధ్వంసము చేసెను. చింతామణ్యాది రత్న రాసులను దోచుకొని పోయెను. అప్సర స్త్రీలను చెర పట్టెను. ఒక ఇంద్రుడే అననేల? సర్వ లోకాధిపతులతోను విరోధించి వారి లోకములకు రాత్రింబవళ్లు కునుకుపాటు గూడ లేకుండునట్లు సంక్షోభమును కలిగించెను. అట్టి రావణుని మన స్వామి వధించిన పిదపనే గదా! సర్వలోకములకు క్షేమమేర్పడినది. లేక- సర్వమానవులు ఈ సేతువును దర్శించి తమ పాపములను పోగొట్టుకొనుటకై సేతువును నిర్మించెననియు భావమును చెప్పవచ్చును. "సేతుం దృష్ట్వా సముద్రస్య" ఇత్యాది ప్రమాణములు సేతుదర్శనము పాపహరమని చెప్పుచున్నవి.

(శెరువిలే ఆరక్కర్కోనై చ్చెత్త) రావణునివలె మన స్వామి పిరికివాడో మోసగాడో కాడు. వాడు మాయలేడిని చూపి రామలక్ష్మణులను ఆశ్రమమునకు దూరముచేసి ద్వారములు తెరచియున్న ఇంటిలో కుక్క దూరినట్లు ఏకాకిగనున్న సీతను అపహరించుట వాని మోసము పిరికితనము గూడగదా! స్వామి యట్లుగాక నేరుగా యుద్ధమున నెదిరించి వానిని వధించెను (శెత్త) అనగా హిసించిన అని యర్థము. స్వామి రావణుని ఒకేమారుగా వధింపలేదు. వానిని చిత్రహింసలకు గురిచేసెను. వాని కంటి ఎదుటనే చతుర్విధ సైన్య పరికరములను తుత్తునియలు చేసెను. పుత్ర పౌత్రాది బంధు వర్గమును వధించెను. తన తలలు నేలపైబడి పొర్లుచుండగా తన కన్నులతో తానే చూచి ఆవేదన చెందునట్లు ఒక్కొక్క తలను నరికెను. ఇన్నివిధములుగా హింసింపనేల? ఒకేసారి వాని ప్రాణములు తీసిన చాలదా! అని కొందరు భావింపవచ్చును. స్వామి ఆశయమదికాదు. ఒకరోజు కాకున్న మరొకరోజైనను వాడు నా పరాక్రమమునుచూచి బెంబేలెత్తి తన వధ తథ్యమని యెంచి ప్రాణములపై తీపితో శరణాగతుడు కాకపోవునా! అని ప్రతీక్షించుటయే స్వామి యభిప్రాయము కనుకనే రథము విరిగి అశ్వములు సారథియు చచ్చి చేతిలోని ధనస్సు విరిగి కింకర్తవ్యతా మూఢుడైయున్న రావణుని చూచి స్వామి జాలి చూపి ఇట్లన్నారట.

"గచ్ఛానుజానామి, రణార్దితస్త్వం। ప్రవిశ్య రాత్రించరరాజ! లంకాం
ఆశ్వాస్య నిర్యాహి, రథీచ ధన్వీ- బలం తదా ద్రక్ష్యసి మే రథస్థః"॥

ఇది వాల్మీకి రామాయణ శ్లోకము. "రావణా! ఇవాళటికి యుద్ధంచాలు. చాలా అలసిపోయినావు. లంకకు పోయి విశ్రాంతి తీసుకొని రేపు రథము, ధనుస్సు

వగ్గైరా పరికరములు పట్టుకొని వచ్చి నా పరాక్రమమును మరల చూడవచ్చును. పొమ్ము"— ఇది శ్రీరామచంద్రస్వామివారి సత్యపరాక్రమము. చేతికి చిక్కిన శత్రువును వధింపక వదిలి పెట్టుటలో ఆయన అభిప్రాయమేమి ? వాని మనస్సు మారి శరణు అన్నచో రక్షించవలెననియేగదా; కాని ఆ మొండివాడు ససేమిరా తలవంచక పోవుటచే, చివరకు వాని వధ తప్పలేదు.

(నంశేవకనార్) "శేవకన్" అను పదమునకు స్వామి- వీరుడు- సేవకుడు అని మూడర్థములున్నవి. మూడున్నూ ఇచట కుదురును. కాని వ్యాఖ్యానకర్తలు మూడవ అర్థమునే గ్రహించిరి. సేవకుడు యజమానికి పరతంత్రుడు. ఇచట స్వామి భక్తపరాధీనుడై భక్తులు చేతులు జోడించినంత మాత్రమున నిత్యసేవకునివలె అనుక్షణము కంటికి రెప్పవలె కనిపెట్టుకొనియుండి కాపాడువాడు అని భావము.

ఒకనాడు నంజీయరువారు ఈ పాశురమును అనుసంధించుకొనుచూ "భగవంతుడు మనకు అత్యంత విధేయుడై మన రక్షణమున అతి జాగరూకుడై యుండును" అని అర్థమును భావించుచూ వీధిలో వెళ్ళుచుండిరి. అపుడు ఒకచోట భర్త తన భార్యను హింసించి వెళ్ళగొట్టుచుండగా ఆమె యతనితో ఇట్లనెను. "నేను అబలనని నన్ను హింసించుచున్నావు కాని 'దుర్బలస్య బలం రాజా' అన్నట్లు మావంటివారిని కాపాడుటకే మన మహారాజు చేతిలో ఆయుధమును పట్టియున్నాడు. ఆయనవద్దకే పోయి 'రక్షింపు'మని వేడుకొందును." ఈ మాటను విన్న నంజీయరువారికి మిక్కిలి ఆశ్చర్యము కలిగెను. "సామాన్యుడైన రాజుపైననే అజ్ఞానియగు ఆమెకు ఇంత విశ్వాసముండగా, పరమ దయాళువగు భగవంతునిపై శాస్త్రజ్ఞానముగల మనకు, 'నంశేవకనార్' అని కీర్తించు మనకు ఎంతటి విశ్వాసముండవలెను ? భగవంతునిపై ఈ విశ్వాసములేనిచో మన విజ్ఞానమంతయు నిష్ప్రయోజనమే గదా ?" అని వారు వాపోయిరి.

మరొకప్పుడు చోళదేశపు నాయకుడైన వీర శిఖామణి పల్లవరాయన్ అను రాజు తమ ఆచార్యుడైన శ్రీ పరాశరభట్టరువారివద్దకు పోయి హితమునుపదేశింపుమని కోరెను వారును రామలక్ష్మణగుప్తా సా" అను శ్రీ రామాయణ శ్లోకమును వివరించుచూ, వానర సేనయంతయు రామలక్ష్మణుల రక్షణకై తెల్లవారువరకును కాపలా కాయదలచి కొంతసేపటికి ప్రకృతి ప్రభావముచే నిద్రపోగా, రామలక్ష్మణులే ధనుర్ధరులై ఆ రాత్రి యంతయు ఆ సేనను కాపాడిరను విషయమును తెలిపి, అట్టి శ్రీరామునినే రక్షకుడుగా దృఢముగా విశ్వసింపుమని ఉపదేశించిరి. ఈ విషయమును

సమగ్రముగా మా సత్సంప్రదాయ సుధా గ్రన్థములో 7వ వార్తగా 16-17 పేజీలలో పాఠకులు గమనింపవచ్చును ఆ సమయమున ప్రక్కనే ఉండిన శ్రీ నంజీయరు మొదలగువారును ఆచార్యులవారి ఉపదేశ సారమును విని, "ఇలై తుణై మత్తెం నెంజే"- ఇత్యాది తిరుమళిశై ఆళ్వారుల పాశురమును వారి ఉపదేశమునకు సంవాద ప్రమాణముగా అనుసంధించుకొన్నారట నాన్ముగన్ తిరువందాదిలోని 8వ పాశురమిది.

పా॥ ఇలై తుణై మత్తెంనెంజే! ఈశనై వెన్ఱ- శిలై కొండ శెంగణ్ మాల్ శేరా- కులై కొండ, ఈరైందలైయాన్ ఇలంగైయై యీడ శిత్త- కూరంబనల్లాల్ కురై॥

ప్రాసంగికమైన ఈ పాశురమునకున్నూ సంగ్రహముగా అర్థమును తెలుసుకుందాము.

(ఈశనై వెన్ఱశిలై కొండ) శివుని జయించిన ధనుస్సును ధరించినవాడగు (శెంగణ్ మాల్ శేరా) పద్మ పత్రారుణాక్షుడైన శ్రీరామచంద్రస్వామిని ఆశ్రయింపక (కులై కొండ ఈరైందలైయాన్) మరణమునొందిన పది తలలవాడగు రావణుని యొక్క (ఇలంగైయై ఈడ శిత్త కూరంబన్ అల్లాన్) లంకానగరమును ధ్వంసము చేసిన తీక్ష్ణములగు బాణములుగల శ్రీరాముడు తప్ప (ఎన్నెంజే) ఓనా మనసా! (కురై తుణై మత్తు ఇల్లై) మన దైన్యమును తీర్చగల సహాయభూతుడు మరొకడులేడు. శ్రీరాముడు తప్ప మనకు ఆపదలలో సహాయపడువాడు మరొకడు లేడని భావము. ఇక్కడ శివుని జయించిన ధనుస్సును ధరించినట్లుగా శ్రీరాముడు వర్ణింపబడెను. ధనుస్సుతో శివుని జయించుట ఎప్పుడు జరిగినది? అను శంక కలుగును. శ్రీరామాయణమున బాలకాండము చివర పరశురాముడు చెప్పిన కథ ఇచట ప్రమాణముగా గ్రహింపదగును. హరి-హరులిద్దరిలో ఎవరు గొప్పయని నిర్ణయించుటకై విశ్వకర్మ నిర్మించిన రెండు ధనుస్సులను ఇద్దరికి ఇచ్చి దేవతలు వారికి కలహమును కల్పించిరి. అపుడు విష్ణువు తన ధనుస్సుతో హుంకరించి శివునిపై విజృంభింపగా ఆయన పరాజితుడై పాదాక్రాంతుడయ్యెను (అధికం మేనిరే విష్ణుం) అపుడు దేవతలు విష్ణువే అధికుడని నిర్ణయించిరి.

ఇట్లు శ్రీ నంజీయరు మొదలగువారు శ్రీ పరాశరభట్టరు వారి ఉపదేశమునకు సంవాదముగా అనుసంధించిన ఈ ప్రాసంగికమగు పాశురముగూడ ప్రకృతమైన ఈ తిరుమాలై పాశురమునకును సంవాదమే గదా.

(మరువియ పెరియకోయిల్) ఆర్తజన బాంధవుడైన ఆ శ్రీరాముడు ప్రేమాభి మానములతో ఇప్పటికినీ అస్మదాదుల సంరక్షణకై నిత్యవాసము నేర్పరచుకొనియున్న శ్రీరంగక్షేత్రమిది (మదిళ్) సుదృఢముగా తిరుమంగై ఆళ్వారులచే కట్టబడిన మహోన్నత ప్రాకారములచే శోభితమైన క్షేత్రము. (ఎన్నాకరువిలే తిరువిలాదీర్) ఈ క్షేత్రముయొక్క నామములను ఉచ్చరించుటయే శ్రేయోదాయకము. శరీరము అలసిపోకుండా నోటిమాటగా ఉచ్చరించినను చాలును. అట్లుగూడ ఉచ్చరింపని దురదృష్టవంతులు ఈ లోకులు. "జాయమానం హి పురుషం- యం పశ్యేన్మధుసూదనః" అను సూక్తి ప్రకారం జన్మసమయంలో ఏ మానవునిపై భగవంతుని కటాక్షము పడునో, అతడు సాత్త్వికుడై భగవత్తత్త్వము నెరిగి ముముక్షువౌతాడట. దీనినిబట్టి జన్మసమయం లోనో లేక గర్భములోనే ఉండగానేనో ప్రహ్లాద- శఠకోపమునీంద్రులవలె కొందరు ఆ భగవత్కటాక్షపాతానికి నోచుకుంటారు. అట్టి అదృష్టంలేనివారు ఆగర్భ దుర దృష్టవంతులు వారిని గూర్చియే "కరువిలే తిరువిలాదీర్!" అని సంబోధనము చేయ బడినది.

(కాలత్తై కళిక్కిన్ఱీరే) ఓ అభాగ్యులారా? సుకరమైన భగవన్నామోచ్చారణ మునైన చేయక వ్యర్థముగా కాలము గడిపెదరేల? "విచిత్రా దేహసంపత్తిః- ఈశ్వ రాయ నివేదితుం" అని చెప్పబడినట్లుగా కరచరణాది దేహము మనకు లభించినది ఈశ్వరారాధనమునకేగదా! దానిని భగవత్తునికి వినియోగించి ఉజ్జీవించవలసి యుండగా జీవిత కాలమును వ్యర్థముగా గడిపెదరేల? మనకై స్వామి పరమపద మును గూడ విడచి శ్రీరంగమునకు వచ్చి సన్నిహితుడై యుండగా ఈ మంచి అవకా శమును జారవిడుచు కొందురేల? సంసారి చేతనుల దౌర్భాగ్యమును చూచి ఈ ఆళ్వారులు పొందిన నిర్వేద మెంతటిదో దీనిని బట్టి సువ్యక్తమగుచున్నది,

**(12)** అవతారిక: అయ్యో! "నోరార భగవన్నామమునైన ఉచ్చరింప రాదా" అనుచుంటిరి, మా పాప విశేషమును బట్టి ఈ వాగింద్రియము పూర్వవాసనచే క్షుద్ర విషయములపైననే దూషణ-భాషణాది దుష్ప్రసంగములకే పాల్పడుచున్నది గాని నామోచ్చారణమునకు ఉద్యమించుటలేదు. అని వైముఖ్యమును చూపుచున్న లోకులకు ఆళ్వారులు ఈ గాథలో మరొక విధముగా ఉపదేశమును చేయుచున్నారు. ఓ మూఢ జనులారా! మీరు ఉచ్చరింపలేకున్ననూ, ఇతరులుచ్చరించినపుడు విన్ననూ శ్రవణ మాత్రముచేతనే ఉజ్జీవనమును కలిగించు నట్టిది భగన్నామము. అని ముద్గలోపాఖ్యా

నముచేత తెలియుచున్నదిగదా! అట్లు చెవులారా నామమును వినుటకైననూ నోచు కొనని అభాగ్యులా మీరు? అని ఈసడించు చున్నారు.

పా॥ నమనుం ముర్కలనుంపేశ నరగిల్ నిన్నార్గళ్ కేళ్క
నరకమే శువర్కమాగుం నామంగళుడైయ నంబి।
అవనతూరరంగ మెన్నాదు అయర్తు వీళ్తుండశియుమాంచర్
కవలైయుళ్ పడుగిన్నారెన్ఱు అదనుక్కే కవర్గిన్నేనే॥

ప్రతి: నమనుం-యముడును, ముర్కలనుం- ముద్గలుడును, పేశ-మాట్లాడు చుండగా. నరకిల్ నిన్నార్గళ్-నరకములో నుండినవారు కేళ్క-ఆసంవాదమును వినగా నరకమే దుఃఖావహమైన ఆ నరకలోకమే, శువర్కమాగుం- సుఖప్రదమగు స్వర్గ ముగా మారునట్లు చేసిన, నామంగళుడైయ-పవిత్ర నామధేయములు కలిగినవాడు, నంబి- సద్గుణపరిపూర్ణుడు భగవంతుడు. అశియ మాందర్- శోచనీయులైన మానవులు, అవనతు ఊర్-అపరమాత్మ స్థిరవాసమును చేసిన దివ్యదేశము, అరంగం ఎన్నాతు- శ్రీరంగ క్షేత్రము గదాయని కీర్తింపక, అయర్తు- భగవన్నామ వైభవమును మరచి వీళ్ందు- సంసార కూపములో పడి, కవలైయుళ్ పడుగిన్నార్ ఎన్ఱు- కష్టములలో పడి పోయిరే! అని, అదనుక్కే అందులకే, కవర్కిన్టేనే- నేను మిక్కిలి వ్యాకుల పడు చున్నాను.

వివరణము : విష్ణుధర్మము-అనే గ్రంథమున 90వ అధ్యాయమున గల ముద్గ లోపాఖ్యానమనే ఇతిహాసాన్ని నిరూపించుచూ ఈ పాశురం సాగినది. ఆ కథ యేమనగా- పాపాచరణ ప్రవణుడైన ముద్గలుడు ఒకప్పుడు దానము చేయుచూ "కృష్ణార్పణమస్తు" అని ఉచ్చరించెను. అవసాన కాలమున అతనిని యమ భటులు వచ్చి నరకమునకు లాగుకొనిపోయి హింసించుచూ యముని వద్దకు తీసుకొనిపోయిరి. కాని యముడితనిని సాదరముగా ఎదుర్కొని పూజించెను. అపుడాశ్చర్యముతో ముద్గలుడు "యమదేవా! నీభటులు నన్ను దండించుచుండగా నీవు గౌరవించు చుంటివేమి"? అని ప్రశ్నించెను, అంతట యముడు- "నాభటులుగాని, నీవుగాని, ఎరుంగని ఒక సత్కర్మను నీవు చేసితివి. ఒకనాడు దానముచేయు సందర్భమున కృష్ణనామమును ఉచ్చరించితివి. ఆ ప్రభావముచే నీవు నాకును సత్కారయోగ్యుడవు అని బదులుచెప్పెను. ఈ యమముద్గల సంవాదము ఆనోట ఈనోట వ్యాపించి నరక మున గల అందరి చెవులలో పడెను. ఈ సంవాదము ద్వారా కృష్ణనామ ప్రభావమును

విన్నపుడు నరకములోని వారందరికి ఆ బాధలు పోయి స్వర్గములో కలుగు నంతటి మహానందానుభవము కలిగెనట. ఇట్లు విన్నంత మాత్రమున ఏ పవిత్రనామము నరక మునే స్వర్గముగా మార్చగలిగినదో, అట్టి నామమును మీరు ఉచ్చరింప లేకున్ననూ చెవులారా వినియైన తరింపుడని ఈ పాశురమున ఉపదేశింప బడుచున్నది.

పేశ- అనగా సంభాషించుచుండగా అని యర్థము. ఇచట యముడు ముద్గలు నికో నరకవాసులకో భగవన్నామ ప్రభావమునుపదేశింపబూని కృష్ణనామము నుచ్చ రింపలేదు. ఎప్పుడో జరిగిన సంగతిని గుర్తుచేయుచూ "నీవు కృష్ణనామమును కీర్తించితివి గదా!" యనెను. భగవన్నామమును కీర్తించినవానిని తన భటులు నరక మునకు లాగుకొని వచ్చుటచేత తన పదవికి ఏమి భంగము వాటిల్లునోయని భయ పడెను. "భయాదస్య.... మృత్యుర్ధావతి పంచమః" అని యముడే కఠోపనిషత్తులో నచికేతునికి ఉపదేశించుచూ "సర్వదేవతలనూ నేనునూ ఆ పరమాత్మ యాజ్ఞోల్లం ఘనము చేసినచో ఏ అపాయమువచ్చునో యని భయపడుచుందుము" అని కీర్తించి యున్నాడు. కావున భయముతో ప్రసంగవశమున యముడు ముద్గలునికి బదులుచెప్పిన మాటలలో కృష్ణనామోచ్చారణము జరిగినది. అంతే.

(నరగిల్ ... కేళ్క) ఇక విన్నవారు కూడ తాము చేసిన పాపాలకు పశ్చా త్తాపమునొంది ఆ పాపశాంతికై "భగవన్నామమును విందుముగాక" యని సిద్ధపడిన వారుకాదు. "సమిత్పాణిః" అని శ్రుతి చెప్పినట్లు సమిధలు చేతబూని బద్ధాంజలి పుటయుక్తులై శిష్య లక్షణములతో ఆచార్యునివద్దకు పోయి ఉపదేశరూపముగా విన్న వారునుకారు. యాదృచ్ఛికముగా ఆ సంవాదము ఈ నరకవాసుల చెవిన పడినది అంతే.

అయితే- యాదృచ్ఛికముగానైన ఇంతకుముందెప్పుడునూ వీరి చెవిన భగవ న్నామము వినబడలేదా! అందురేమో! లేదు. పూర్వమంతయు వీరి మనస్సులు సాంసా రిక విషయ సుఖానుభవపరవశములై యున్నందున చెవిద్వారా అవగాహన కలుగునట్లు మనస్సుకు పట్టలేదు ఇప్పుడు నరకములోపడి పాపఫలముగా దుర్భర దుఃఖములను అనుభవించుచుండుటచేత "ఓహో! ఎవరో నరక బాధలు తొలగించుటను గూర్చి మంచిమాటలు చెప్పుచున్నారే" అని ఉత్కంఠతో భగవన్నామము వినే అవకాశము వారికిపుడే కలిగినది. ఇట్లు విన్నంత మాత్రమున బాధామయమైనట్టి నరకమంతయు వారికి మహానందప్రదమైన స్వర్గముగా మారినదట.

(నామంగళుదై యనంబి) ఇది నామ ప్రభావమే ఆ నామములచేత భగవంతుడు "నంబి" అనబడుచున్నాడు. నంబి అనగా- పరిపూర్ణుడు సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం- విముక్తదుఃఖాః సుఖినో భవంతి" అని చెప్పబడినట్లు శబ్దమాత్రమే దుఃఖవిముక్తిని కలిగించగలదు. (అపనతూర్ అరంగం ఎన్నాదు) అట్టి పవిత్రనామ సహస్రముగల స్వామియొక్క నిత్యావాసమైన ఈ శ్రీరంగక్షేత్రమునైన నోటితో కీర్తింపలేదా! ఎంత పాపిష్ఠులు ఈ లోకులు. దేవుని నామము నుచ్చరించువారు మా వద్ద నుండరాదని ఈసడించు నాస్తికులు కొందరు అట్టివారిని దేశమునుండియే తరిమికొట్టువారు కొందరు, నామము నుచ్చరించినంతమాత్రమున కొట్టి చంపజూచు వారు కొందరు, ఇట్లు ప్రపంచమంతయు పాపభూయిష్ఠమైనదేయని ఈ ఆళ్వారుల ఆవేదన.

అసహ్యములైన నానావిధ పాపములతో జీవితకాలమంతయు గడిపిన ఒకడు జీవితము చాలించు సమయమున, ''అయ్యో! వీడు నరకమునకు పోవునే" యను జాలితో అతని సన్నిహిత బంధువులు ''ఇప్పుడైనను వీనితో భగవన్నామమును ఉచ్చరింపచేయుదము" అని భావించిరట ''నారాయణ" అనుము- అని నిర్బంధించిరట. వారు ఎన్నిసారులుగా ప్రయత్నించినను, వాడు ''అవసరము అవకాశము వచ్చినపుడు అట్లే ఉచ్చరించెదను" అని ప్రతిసారియు తప్పించుకున్నాడట. కాని ''నారాయణ" అనలేదట. చివరకు వాడు మృతి నొందెను. దీనినిబట్టి వాడొకసారియైనను చిన్న భగవన్నామమును ఉచ్చరించుటకుగూడ అవకాశము కల్పింపని అతని పాప ప్రాబల్యమెంతటిదో తెలసికొనవచ్చును.

(అయర్తు వీళ్ న్దు అళియమాన్దర్) ఈ పురాకృత పాపభూయిష్ఠత వల్లనే భగవంతుని మరచి క్షుద్రవిషయానుభవ వ్యసనములలోపడి దుఃఖాతురులై లోకులు దయనీయమగు దుస్థితిని పొందియున్నారు జ్ఞానశూన్యములైన ఇతర ప్రాణుల గూర్చి విచారింప పనిలేదు. యోగ్యత కలిగిన మానవజన్మమెత్తికూడ వీరు దుర్గతిని పొందియుండుటయే మిక్కిలి శోచనీయము.

శ్లో॥ నారాయణేతి నామాస్తి - వాగస్తి వశవర్తినీ।
తథాపి నరకే ఘోరే - పతంతీతి కి మద్భుతమ్ ॥

అనే ఆర్షవచనమునకును ఇదే తాత్పర్యము. పవిత్రమై చాలా చిన్నదియగు నారాయణ మంత్రము ఉన్నది. దానిని ఉచ్చరించగల నాలుక తన వశములోనే ఉన్నది. అయి

నమూ ఈ మానవుడు దానిని ఉచ్చరించి తరింపక నరకముననే పడిపోవుచున్నాడే ఏమాశ్చర్యము?

ఇట్లే తత్త్వవేత్తలైన తక్కిన ఆళ్వారులును ''తాముళరే- నావాయిలుందే" ఇత్యాది పాశురములలో తమ ఆవేదనను ప్రకటించుకొనిరి.

**(13)** అవతారిక : గడచిన 4వ గాధ నుండి ఇంతవరకును పరోప దేశరూపముగా పాశురములు సాగినవి. వీరు భావించినట్లే లోకులెవ్వరునూ దానిని వినగల స్థితిలో లేరు. పైగా మాకు ఇవేమియు పట్టవన్నట్లు విముఖులై వెళ్ళిపోయిరి. ఇపుడు ఈ ఆళ్వారులొక్కరే స్వగతముగా ఇట్లనుకొనుచున్నారు. "ప్రపంచమునం దున్న విజ్ఞానులందరును శ్రీవైకుంఠనాధుని స్తుతించు చుండగా అజ్ఞానులైన ఈ లోకులు గూడ ఒక్కసారిగా అందరును కలసి శ్రీరంగనాధాయని నోరార కీర్తించి రేని, అందరును ముక్తినొందుటచేత నరకలోక మంతయు వ్యర్థమై గడ్డి మొలచి పాడు పడి పోవునుగదా !"- ఈ భావమే క్రింది పాశురములో నిరూపితమగుచున్నది.

పా॥ ఎఱియునీర్ వెఱికొళ్వేలై మానిలత్తుయిర్గళెల్లాం ।
వెఱికొళ్ పూంతుళబమాలై విణ్ణవర్కోనై యేత్త ।
అఱి విలా మనిశరెల్లాం అరంగ మెన్నళై ప్పరాగిల్ ।
పొఱియిల్ వాళ్ నరకమెల్లాం పుల్లెళుందొళియుమన్రే ॥

ప్రతి : ఎఱియునీర్- ఎగయుచున్న తరంగములతో కూడిన, వెఱికొళ్- దుర్గంధ పూరితమైన, వేలై-సముద్ర తీరముచే పరివేష్టితమైన, మానిలత్తు-భూమండల మందు నివసించు, ఉయిర్గళ్ ఎల్లాం- జీవులందరును, వెఱికొళ్పూం- సుగంధమును వెదజల్లునట్లు పుష్పించిన, తుళబమాలై-తులసీ మాలికను ధరించిన వాడగు, విణ్ణవర్ కోనై - నిత్యసూరులకు నాథుడైన నారాయణుని ఏత్త-ప్రస్తుతించు చుండగా, అఱి విలా మనిశరెల్లాం- అజ్ఞానులైన ఈ మానవులందరు గూడ, అరంగమెన్ను- శ్రీరంగ అను నామమును, అళైప్పరాగిల్- నోటితో ఉచ్చరించిన యెడల, పొఱియిల్ వాళ్- ఇంద్రియవశులైనవారు నివసించు, నరకమెల్లాం- నరకలోకమంతయు, పుల్ఎళుందు గడ్డి మొలచి, ఒళియుం అన్రే- పాడుపడిపోవును గదా !

వివరణము : భగవంతునికి మానవులకునుగల తారతమ్యమును తెలుపుటకు ఇందులో రెండు ప్రత్యేక విశేషణములు చెప్పబడ్డవి. ఆయన "విణ్ణవర్కోన్" పరమపదవాసు

లకు నాథుడు  ఆ పరమ పదము అసంకుచితమై అనంత వైశాల్యము కలిగినది. నిర్దుష్టమై జ్ఞానానన్దమయమై సౌగంధ్య సౌకుమార్యాది శోభితమైనది. ఇక మానవులు "వేలై మానిలత్తు" అనగా- సాగర వేలాపరివేష్టితమై త్రింశత్కోటి యోజన విస్తీర్ణమగు భూమిలో స్థిరనివాసులు. ఆ భూమండలము పరిమితమేగాక కఠినము దుర్గంధ భూయిష్ఠము. సముద్ర పరివేష్టితమైన భూమండలము అన్నచో చాలునుగదా! (ఎరియునీర్) ఎగిరిపడుచున్న తరంగములు గలదియను విశేషణము ఎందులకు? అది వ్యర్థముగదా! యని సందేహింపరాదు "పెళ్ళత్తిడై ప్పట్ట నరియినంబోల్" అని తిరుమంగై ఆళ్వారులు తెలిపినట్లు కూలంకషమై ప్రవహించు నదీజలములో చిక్కికొట్టుకుని పోవుచున్న నక్కల గుంపులవలెనే ఈ జీవులును తరంగ సంక్షుభిత సముద్రావృత భూమధ్య భాగములో చిక్కియున్నారని తెలుపుటయే ఆ విశేషణమునకు భావము. ఇట్లే 'వెరికొళ్' దుర్గంధ భూయిష్ఠమైన- అను విశేషణముగూడ సార్థకమే. స్వామి సన్నిధిలోఉండి ఆయనయొక్క వక్షస్థల తులసీ సౌగంధ్యమును అనుభవించవలసిన వీరు దుర్గంధ దూషితమగు ప్రాంతములో అల్లాడుచున్నారుగదా! యని దాని భావము.

(విణ్ణవర్కోనై ఏత్త) ఏత్త అనగా, స్తుతించుచుండగానని యర్థము. స్తుతించుట విజ్ఞానముతో చేయు పనిగదా!

"విచిత్రా దేహసంపత్తిః- ఈశ్వరాయ నివేదితుం ।
పూర్వమేవ కృతా బ్రహ్మన్! హస్తపాదాదిసంయుతా" ॥

అని చెప్పబడినట్లు హస్తపాదాది కర్మేంద్రియములతోను చక్షురాది జ్ఞానేంద్రియములతోను కూడిన ఈవిచిత్ర దేహము భగవత్సేవకే సృష్టింపబడినదని భావించు విజ్ఞానులు తమ వాగింద్రియమును భగవస్తుని స్తుతికై ఉపయోగింతురు. శ్రీరామతత్త్వము నెరిగిన మహిళామణి సుమిత్రయు "సృష్టస్త్వం వనవాసాయ" నిన్ను రాముని సేవకొరకే నేను కన్నాను" అని చెప్పి లక్ష్మణుని ప్రేరేపించినది గదా!

(అరివిలా మనిశర్) ఇత్యాది- విజ్ఞానవంతులు ఆ రీతిగా భగవత్సేవకై ఉపయోగపడినట్లే, అంతటి జ్ఞానశక్తి లేకున్ననూ ఈ అల్పజ్ఞులైన మానవులుగూడ ఒక్కసారి శ్రీరంగాయని పవిత్రవామోచ్చారణ మాత్రమైన చేసినచో ఎంత బాగుండును. అందరును తరించి పోవుదురుగదా! ఇక నరకమునకు పోవువారే లేనందున ఆ నరకమంతయు గడ్డి మొలచిపోయి పాడుబడిపోగలదు. ఇది ఈ ఆళ్వారుల ఉదాత్త

భావన. మనసార కాకున్నను భక్తి లేకున్నను యాదృచ్ఛికముగానే చేసిన నామోచ్చారణ ప్రభావము అమోఘమని దీని యభిప్రాయము

ఇక "పోరియల్ వాళ్ నరకం ..." ఇత్యాది చతుర్థ పాదమునకు మరొక్క విధముగా గూడ అర్థము చెప్పవచ్చును. ఇంద్రియలోలురగు పాపులకు శిక్షాస్థలము నరకలోకము. అనగా యమలోకము. వివేకవంతులైన తత్త్వవేత్తలకు పంచభూత పరిణామమైన ప్రపంచమంతయు దుఃఖప్రదమే గనుక ఆ దృష్టితో ఈ ప్రపంచము గూడ నరకప్రాయమే గదా. ఇచటివారు తరుచుగా ఇంద్రియవశ్యులైనవారే. అందరును ఒక్కసారిగా శ్రీరంగనామమును ఉచ్చరించినచో దాని ప్రభావముచే అందరును ముక్తినొందగా ఇక ప్రకృతి మండలమంతయు గడ్డి మొలచిన బీడువలె పాడుపడి యుండునని భావము.

**(14)** అవతారిక: వీరు పరోపదేశరూపముగను స్వగతముగను ఇంతవరకు కొన్ని పాశురములను ప్రసాదించిరి వారెవరునూ వీరి మార్గమునకు రాలేదు. ఛీ! ఇట్టి వారితో సంబంధమును పెట్టుకొని వ్యర్థముగా కాలము గడపక నేరుగా కమనీయమగు శ్రీరంగ క్షేత్రవైభవమును నేనే నోరార కీర్తించి ఆనందింతునుగాకయని ఉపక్రమించిరి. మహోపకారకుడైన ఈ శ్రీరంగనాథుని విషయమై కృతజ్ఞతనుగూడ చూపలేని కృతఘ్న మానవులను గూర్చి వారికంటే శునకములే మేలని ఈసడించిరి. స్వానుభవ రూపముగా శ్రీరంగ వర్ణనముతో సాగిన ఈ పాశురము కృతఘ్నమానవులనిందతో ముగిసినది.

పా॥ వండినముఱలుం శోలై మయలిన మాలుంశోలై
కొండల్ మీదణవుం శోలై కుయిలినం కూవుం శోలై
అండర్ కోన్ అమరుంశోలై అణితిరువరంగమెన్నా
మిండర్ పాయిన్దుణ్ణుం శోత్తై విలక్కి నాయ్క్కిడుమినీరే ॥

ప్రతి : వండుఇనం- తుమ్మెదల గుంపులు, ముఱలుం- ధ్వనించుచుండు, శోలై - తోటలు కలిగినది, మయిల్ ఇనం- నెమిళ్ల గుంపులు, ఆలుం శోలై - ఆడుచుండు తోటలు కలది, కొండల్- మేఘములు, మీదు అణవుం శోలై - శిఖరముల మీద వచ్చివ్రాలు తోటలు కలది, కుయిల్ ఇనం-కోకిలలగుంపులు, కూవుం శోలై - పాడుచుండు తోటలు కలది, అండర్ కోన్- బ్రహ్మాండ వర్తి దేవతలకును స్వామియగు

భగవంతుడు, అమరుంళోలై - వేంచేసి యుండు తోటలు కలది. అణి తిరువరంగం- భూమండలమునకు ఆభరణమైనది ఈ శ్రీరంగక్షేత్రము, ఎన్నా మిండర్ - ఇట్లు కీర్తింపని మూర్ఖజనులు, పాయ్ందు ఉణ్ణుం- సంతోషముతో విను చుండిన, శోత్తై - అన్నమును, విలక్కి - లాగుకొని, నీరేనాయ్‌క్కిడుమినో - ఓ లోకులారా! మీరు కుక్కకు పెట్టుడు.

<u>వివరణము :</u> ఉభయ కావేరి ప్రవాహ మధ్యమున నున్న శ్రీరంగ నగరము నందలి ఉద్యానవనముల రామణీయకమును ఇందు వర్ణించుచున్నారు (వండినం మురలుం)పూవులనుండి ప్రవహించు మకరంద ధారలను ఆస్వాదించుటకు తుమ్మెదలు గుంపులుగా జేరినవి. గొంతు వరకును ఆ మధువును త్రావి పట్టలేని ఆనందముతో అవి ఆ క్షేత్రమునకు మంగళమును పాడుచున్నట్లున్నవి. శ్రీవైకుంఠమున ముక్త పురుషులుగూడ సానందముగా భగవంతుని అద్భుత సౌందర్యాది గుణములను సేవించుచూ "హావూ- హావూ- హావూ- కి-" అని ఆశ్చర్యముతో సామగానము చేయుచుందురట. ఇచట తిర్యగ్జంతువులైన తుమ్మెదలు. నెమిళ్ళు, కోకిలలు మొదలగునవి గూడ అట్లే ఆనందాతి రేకమును కలిగి యున్నవని భావము

"మయిల్ ఇనం ఆలుం"- ఎత్తుగా ఆకాశమునకు పెరిగి వచ్చగా కనబడు పుష్పఫల వృక్షములను చూచి నెమిళ్ళు మేఘభ్రమచే నాట్యమాడుచున్నవి. వెనుకటి తుమ్మెదల గానము శ్రవణానందమై యుండగా ఈ నెమిళ్ళ గుంపులు చేయు నృత్యము నేత్రానందకరమైనది (కొండల్‌మీతు...) ఎత్తైన వృక్షశిఖరములపైన మేఘములు వచ్చి వాలినవి. భూసారముచేత తోటలోని వృక్షములు ఆకాశము నంటునట్లు పెరిగినవి. కనుకనే పర్వతాగ్రముపైవలె వృక్షశిఖరములపై గూడ మేఘములు వాలినవి (కుయిలినం కూవుం) చూతాంకురాస్వాద కషాయ కంఠములైన కోకిలలును గుంపులుగాచేరి పంచమ స్వరముతో పాడుచున్నవి.

"అండర్ కోన్ అమరుం...." అనంతకోటి బ్రహ్మాండములకు నాయకుడైన పరమాత్మ గూడ ఈ ప్రకృతి సౌందర్యమునకు ముగ్ధుడై పరమ పదమును వ్యూహ స్థలమగు క్షీరాబ్ధిని విభవావతార స్థలమగు అయోధ్యా మధురాదులను విడచి వచ్చి ఇచటనే ఆదిశేషునితో పాటు గరుడ విష్వక్సేనాది పరివారముతోపాటు శ్రీభూనీళాది దివ్యమహిషీ సహితుడై నిత్యావాసము చేసినాడు. పవిత్రమగు ముక్తిక్షేత్రమగుట చేత అస్మదాదులకు సేవనీయమైనట్లు ఆయనకును ఈ దివ్య దేశము ఆదర పాత్రమై ప్రాప్యమైనది.

(అణితిరువరంగం) అణి- అనగా ఆభరణము. ఇట్టి ఉద్యానములతోను ప్రభావవిశేషముతోను ఒప్పుచుండు ఈ క్షేత్రము భూమండలమున కంతటికినీ భూషణ ప్రాయమేగదా ॥

(ఎన్నామిండర్) ఈ క్షేత్రవైభవమును నోరార కీర్తించుచూ జీవించలేని మూర్ఖులు. ఉదరపోషణమునకై పాపములు చేయుచునే జీవితమంతయు గడుపు అజ్ఞానులు. తత్ఫలితముగా "పునరపి జననం, పునరపి మరణం" అన్నట్లు సంసార చక్రములోపడి పరిభ్రమించుచూ భగవంతుని పూర్తిగా మరచిన ఈ మానవులు. (పాఱ్ందుఉణ్ణుంశోత్తై) పొట్టపోసుకొనుటయే జీవితపరమార్థమని యెంచు ఈ లోకులు తమకు శరీరేంద్రియాదులనిచ్చు మహోపకారకుడైన స్వామి ఇచటికే వచ్చి యున్నను ఆయనను మరచిన కృతఘ్నులు. స్వామిపై విశ్వాసముతో కృతజ్ఞతను చూపవలసియుండగా దానికి మారుగా విముఖులై ఆయన పేరునుగూడ తలంపని ఈ కృతఘ్నుల అపచారము క్షమింపరానిది. వీరు ఆర్తితో సంపాదించుకొని తినుతిండిని వీరి వద్ద నుండి లాగుకొని కుక్కకు పెట్టిననూ దోషముకాదు. అది తనను పోషించు యజమానిపై పూర్ణవిశ్వాసముతో సేవచేయునట్టి కృతజ్ఞతాబుద్ధిగల జంతువు.

నోటిముందరి అన్నమును లాగివేయుట పాపముకదా యందురేమో కాదు. ధర్మశాస్త్ర సమ్మతమే. ఆ శాస్త్ర ప్రమాణమేదియనగా-

"యోఽసాధుభ్యోఽర్థమాదాయ - సాధుభ్యః సంప్రయచ్ఛతి ।
స కృత్వా ప్లవమాత్మానం - సన్తారయతి తావుభౌ" ॥

ఎవడు దుర్మార్గుల వద్ద నుండు ధనమునుగాని పదార్థమునుగాని లాగుకొని దాన్ని మంచివారికి ఉపయోగపడుటకై ఇచ్చునో, అతడు ఆ ఉభయులను తరింపజేసినవాడగును- అని పై శ్లోకమునకర్థము. ఈ పనినిచేసిన వ్యక్తిని అటువారి నిటు ఇటువారినటు దాటించి ఉపకరించు నావతో పోల్చవచ్చును. ఇచ్చట పాపిష్ఠుని ధనము పాపకార్యమునకుగాక పుణ్యమునకే ఉపయోగపడినందున ఆ మొదటివానికి గూడ కొంత పుణ్యఫలము కలుగును. దారిద్ర్యముతో బాధపడు రెండవ సాధు పురుషునికి ఆ బాధ తొలగిపోయి ధర్మమునకు ఉపయోగమగును. ఇట్లు మధ్యస్థుడు ఆ ఇద్దరికిని శ్రేయస్సును కలిగించినవాడగుచున్నాడు. కనుక కృతఘ్నుల నోటిముందటి అన్నమును తొలగించుట దోషము కాజాలదు. భగవన్నామమును ఉచ్చరింపని లోకులు

ఊనకమునకంటె నిహీనులని ఈ ఆళ్వారుల అభిప్రాయము. ఇంత తీవ్రముగా లోకులను ఈసడించు వీరి ఆగ్రహము పరమశ్లాఘనీయము.

**(15)** అవతారిక : ఈ ప్రబంధమున మొదటి మూడు పాశురములచేత తమకు కలిగిన భగవన్నామానుసన్ధానజనితమహానంద ఫలమును నిరూపించిరి. పిదప లోకులకును దీని వైభవముపదేశించి వారిని గూడ నామసంకీర్తన పరులనుగా చేసెదనని భావించి 11 పాశురములలో మధురముగను తీవ్రముగను ప్రబోధమును చేసిరి. "ఉదయ మిహ శిలాయాం అంకురః కింకరోతి?" అని పెద్దలు వ్రాసాదించినట్లు రాతిబండలవలె కఠిన తరములైన వారి హృదయములలో ఈ ఉపదేశబీజము అంకురించునా? ప్రబల పాపదూషిత మనస్కులైనవారిపై తమ ఉపదేశము ఫలించకుండుటను గమనించి ఇంతటితో ఆ పనిని మానుకొనిరి. ఇకపైన 10 పాశురములతో తమ హృదయముతో శ్రీరంగనాథుడు నిర్హేతుకమగు కృపావిశేషముచే కలిగించిన భక్తి పరిపాక రూప మహోపకారమును కృతజ్ఞతతో ఆవిష్కరించు చున్నారు. అనాదిగా తాము గూడ ఆ లోకులవలెనే నిత్యసంసారులై భగవద్విముఖులై క్షుద్ర విషయ వ్యామోహముతో తిరుగుచుండగా ఇంతకాలమునకు ఈ జన్మమున తమలో భగవంతునిపై ద్వేషము వైముఖ్యము పోయి బాహ్య విషయ వైరాగ్యమేర్పడి భగవద్గుణాను సంధానమున క్రమముగా రుచికలిగి అది పరభక్తి పరజ్ఞాన పరమభక్తి పర్యంతముగా నభివృద్ధి చెందుటకు నిర్హేతుక భగవత్కృపావిశేషము తప్ప మరేమియు కారణము కాదను విషయమును నిరూపించు చున్నారు. "ఎన్నైత్ తిరుమనం తెరుత్తాయ్- ఉనక్కెన్ సెయ్గేన్" అని శ్రీశఠకోప మునీంద్రులు "క్రూరమగు నా మనస్సును మార్చి సంస్కరించిన నీకు నేనేమి ప్రత్యుపకారమును చేయగలను స్వామీ!" యని విన్నవించినట్లు వీరును తమ కృతజ్ఞతాభావమును స్వామికి నివేదించుకొనుచున్నారు. ఇపుడీ 15వ పాశురమున తనపై వైముఖ్యము పోయి అద్వేషాదులు ఏర్పడినంతమాత్రముననే పరమాత్మ అనుగ్రహించి జ్ఞానదీపమును వెలిగించి తన స్వరూపగుణ విభూత్యాది ప్రభావమును ప్రకాశింప చేయుననియు, ఈశ్వరాస్తిత్వమును గ్రహించినంత మాత్రముననే అజ్ఞానాన్యథా జ్ఞాన విపరీత జ్ఞానములను తొలగించుననియు, నాలో స్వామి కలిగించిన మార్పే ఇందులకు దృష్టాంతమనియు తెలుపుచున్నాము.

పా॥ మెయ్యర్కే మెయ్యనాగుం విదియిలా వెన్నైప్పోల
పొయ్యర్కే పొయ్యనాగుం పుళ్కొడియుడైయ కోమాన్!
ఉయ్యప్పోం ఉణర్వినార్గళ్కు ఒరువనెన్నుణర్న్ద పిన్నై
అయ్యప్పాడరుత్తు త్తోన్రుం అళగనూరరంగమన్రే॥

ప్రతి : పుళ్కొడి- గరుత్మంతుని తనకు ధ్వజముగా, ఉడయకోమాన్- కలిగిన శ్రీమన్నారాయణుడు, ఎన్నైప్పోల- నావలెనే, మెయ్యర్కే- ద్వేషభావము తొలగిపోయినవారికిగూడ, మెయ్యనాకుం- నిష్కపటముగా తన పూర్ణానుభవమును కలిగించును. పొయ్యర్కే- (నావలె) భగవద్విముఖులై యుండినవారికి, పొయ్యనాగుం- అసత్య స్వరూపుడై యుండును. ఉయ్యప్పోం- ఉజ్జీవించవలెననెడు, ఉణర్వినార్గళ్కు- జ్ఞానము కలిగినవారికి, ఒరువనెన్ను- ఒక ఈశ్వరుడు కలడు అనెడు, ఉణర్న్దపిన్నై- జ్ఞానము కలిగిన పిదప, అయ్యప్పాడు- సందేహమును, అరుత్తు త్తోన్రుం- తొలగించి సాక్షాత్కారమునిచ్చు, అళగనూర్- సుందర విగ్రహుడైన స్వామియుండు దివ్య దేశము, అరంగంఅన్రే- శ్రీరంగక్షేత్రమేగదా.

వివరణము : ''మెయ్యర్కే మెయ్యనాగుం"- మెయ్ అనగా సత్యము పొయ్ అనగా అసత్యము. కపటబుద్ధి లేకుండుటయే సత్యము. నేనే స్వతంత్రుడను అనే ఉన్మత్తకమైన దురహంకారముతో అనాదిగా మానవుడు భగవంతుని ద్వేషించి విముఖుడై తిరుగుచున్నాడు. "దాసభూతాస్స్వ తస్సర్వే-హ్యాత్మానః పరమాత్మనః'' అను ప్రమాణముచే స్వామియగు పరమాత్మకు తాను సహజముగా దాసుడనను సంగతిని మరచినాడు. ఇది ఇతనికి ఆరోపితమైన దుస్థితి. ఇది తొలగిపోయి భగవంతునిపై అద్వేషము ఏర్పడినపుడు సత్యమైన నిష్కపటమైన పరిస్థితి ఏర్పడును అట్టివారే ''మెయ్యర్'' అనబడుదురు.

''విదియిలా ఎన్నైప్పోల''.... పూర్వము నేను అనాదిగా భాగ్యహీనుడనై యుండి ఈనాటికి భగవంతుని ద్వేషించిన ఆ కపటబుద్ధిపోయి సహజ దాస్యమునకు అంగీకరించి మెయ్యన్ అనబడుచున్నాను. ఇట్లు నావలె (మెయ్యర్కే) ద్వేషము వీడి అనుకూలురైన అందరికినీ స్వామి గూడ నిష్కపటముగా సంపూర్ణానుగ్రహము ప్రసాదించును. సంకోచింపడు. నిత్యముక్తులపై ఎంతటి ప్రేమనుచూపి ఆనందింపజేయునో వీరిపైగూడ అంతటి ప్రేమను చూపును. ఇది భగవంతుని ''మెయ్"- వాస్తవ స్వరూపము

'మెయ్' అను పదము ఇద్దరికి అన్వయించుచుండగా, జీవుని విషయమున ''అద్వేషము కలిగియుండుట'' అని యర్థమును ఈశ్వరుని విషయమున ''సంకోచింపక పూర్ణానుగ్రహము నిచ్చును'' అను అర్థమును మార్చిచెప్పుట ఎందులకు? అని శంకింపవచ్చును. ఈ స్తోత్రమంతయు భగవద్గుణములను కీర్తించు సందర్భమైనందునను, సమస్త కల్యాణగుణశాలి అవాప్త సమస్తకాముడునగు స్వామి ''వీడు నాకేమి సమర్పించెను- ఎంత సేవ చేసెను'' అని పరిగణింపక వీనిలో పూర్వపు వైముఖ్యం పోయినంత మాత్రముననే అనుగ్రహించు మహోదారుడైనందునను, ఇట్లు అర్థమును చెప్పుటలో తప్పులేదు. జీవునిలో ఉండవలసిన యోగ్యత (మెయ్) అద్వేషము మాత్రమే. అజ్ఞానముచేతను అహంకారముచేతను ఆరోపించుకున్న ద్వేషము ఉన్నంత వరకును వాడు భగవదనుగ్రహపాత్రుడు కాజాలడు గదా! ''సుదుష్టో వాప్యదుష్టోవా'' అనియు ''మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం'' అనియు చెప్పుకొను పరమాత్మ గూడ అద్వేషమునే గమనించునుగాని ఇతర సాధనానుష్ఠానమేమియు చూడడు.

''పొయ్యేర్కు పొయ్యానాగుం''- ఇంతకు పూర్వము నేను భగవద్విముఖుడనై తిరిగినట్లు ఉండువారికి ఆయనగూడ విముఖుడై పోవును. తాను అనుగ్రహించుటకు హేతువనదగిన మంచి జీవునిలో లేకపోగా, మంచియని పేరుపెట్టదగిన (సమర్థింపదగిన) పాపకార్యముగూడ కనబడనందున వీనిని రక్షించు నవకాశము లేకపోయినదే యని నిరాశతో పరమాత్మ వెనుదీయునని భావము

"విదియిలా ఎన్నైప్పోవల''— భాగ్యహీనుడనగు నావలె- అని తమను తామే దూషించుకొనుట- గడచిన కాలమంతయు భగవత్సంబంధము లేక వ్యర్థముగా పోయెనేయను నిర్వేదముతో చేయబడినది. ఆళ్వారులలో మొదటివారగు సరోయోగి యనబడు పొయ్‌గై ఆళ్వారులుగూడ తమ ముదల్ తిరువన్దాది ప్రబంధమున "పఱ్ఱదే పల పకలుం పోయినవెన్ఱు అంజి యఱ్ఱదేఞా" గడచిన అనంతకాలము భగవదనుభవములేక వ్యర్థముగా గడచిపోయెనేయని దుఃఖించిరి. శ్రీరామచంద్రుని దర్శింపనివాడును ఆయనయొక్క చల్లని చూపునకు నోచుకొననివాడును "ఛీ" యని ఇతరులచే నిందింపబడుటయేగాక తమకు తామే నిందించుకొనెడివారని వాల్మీకిమహర్షి "యశ్చ రామం న పశ్యేత్తు.... స్వాత్మాప్యేనం విగర్హతే" అని చెప్పియున్నాడు. అట్లే వీరును తమ దౌర్భాగ్యమునకు తామే వాపోవుచున్నారు.

"పుళ్‌కొడియుడైయకోమాఞా"— ఎవరు నన్ను రక్షకుడుగా స్వీకరింతురాయని వెతకుచూ నిరీక్షించు ఆ స్వామి ఏకాకియా! అని భావింపరాదు. అనంతగరుడ విష్వ

క్సేనాది నిత్యముక్తులు అసంఖ్యాకులు సేవింపగా శ్రీవైకుంఠమున కొలువుతీరి యుండువాడే ఆయన. సర్వరక్షకుడను నేనని చాటుటకై గరుత్మంతుని ధ్వజముగా దాల్చియున్నవాడు. ఐనచో ఇక సామాన్య మానవులకై ప్రతీక్షింపనేల? అన్నచో- లోకమున గొప్ప ఐశ్వర్యవంతులు గూడ తమ వద్ద ఎన్ని రత్నములున్నను ఒక రత్నము జారిపోయినచో దానికై ఎంతో ఆర్తితో వెదుకుచుండుటను మనము చూచు చున్నాముగదా! వారు తప్పిపోయిన తమ వస్తువును విడిచిపెట్టలేక దాని అన్వేషణకై ఆరాటపడుచున్నట్లుగనే స్వామియు ప్రతీక్షించుచుండును

"ఉయ్యప్పోం ఉణర్వినార్గళుక్కు" ఇత్యాది. ఇక- పూర్వపు అజ్ఞానావస్థ పోయి మనముజ్జీవించు మార్గమేదాయను వివేకజ్ఞానము కలిగినవారికి, మనకందరికిని స్వామి యగు మహాపురుషుడొకడు కలడనియు, ఆయనను ఉపాసించి ఎట్లు శ్రేయస్సును పొందుదుమాయనియు సందేహించువారికి, సర్వ సంశయములను తానే తీర్చి మార్గ దర్శియై సాక్షాత్కారమును కలిగించు మహోదారుడు ఆ పరమాత్మయే.

"అళ్ళగనూర్ అరంగమన్నే"— అర్జునునివంటి మహాజ్ఞానులకు తత్త్వోపదేశ ముచే "గత సందేహః" అనునట్లు సర్వసంశయములను ఛేదించినను, అంతటి జ్ఞాన పరిపాకము లేనివారికి తన అతిలోక సౌందర్యమును ప్రదర్శించి "ఈయనయే పురు షోత్తముడు" అను నిర్ణయమును కలిగించును. "కండవాత్తాల్ తనదే యులగెన నిన్రాఁ" అని ఆయనను సాక్షాత్కరించిన ఆళ్వారులు కీర్తించినట్లు దర్శించినంతమాత్రముచేత ఈ సర్వ ప్రపంచమునకు ఈయనయే అధికారియని నిశ్చయించుకొనదగిన పరత్వ సూచక దివ్య సౌందర్యరాశి ఆ స్వామి. ఆయన దర్శనమునకై మనమెచ్చటికో పోనవసరము లేదు. మన భూలోకముననే శ్రీరంగక్షేత్రమున నిత్యవాసము చేయు చున్నాడు. ఇది ఆయనకు స్థిరావాసము. శ్రీవైకుంఠము కేవలము అప్పుడప్పుడు కొలువు తీరియుండు సభామంటపము మాత్రమే. నిత్యసంసారినై ప్రకృతిలో పడి యుండిన నన్ను తన సౌందర్యముచే నాకర్షించి ఉద్ధరించినవాడు ఈ శ్రీరంగనాధుడే నని ఈ పాశురమున తమ కృతజ్ఞతను వీరు ప్రకటించుకొనిరి.

**(16)** అవతారిక : నావలె అభాగ్యులైనవారిని గూడ పూర్ణానుగ్రహమునుచూపి ఉద్ధరించునని వెనుకటి పాశురమున తెలుపబడినది. తమ పూర్వపరిస్థితి యెట్టిదో, అట్టి తమను ఆయన యెట్లు వశీకరించుకొని తనపై ఆదరమును పెంచెనో ఇపుడు వివ రించుచున్నారు.

పా॥ శూదనాయ్ కళ్వనాగి తూర్త్తరోడి శైందకాలం
మాదరార్ కయల్గశెన్నుం వలైయుళ్పట్టు అళుందువేనై ।
పోదరేయెన్ఱు శొల్లి పుందియిల్ పుగుందు తన్పాల్
ఆదరం పెరుగవైత్త అళగనూర్ అరంగమన్ఱే ॥

ప్రతి : శూదనాయ్- జూదగాడనై, కళ్వనాగి- దొంగనై, తూర్త్తరోడు- ధూర్తులతో, ఇశైందకాలం- కలసి తిరుగుచుండిన కాలమున, మాదరార్- యువతుల యొక్క కయల్గళ్ ఎన్నుం- మత్స్యములవంటి నేత్రములనెడు, వలైయుళ్పట్టు- వలలో చిక్కుకొని, అళుందువేనై- దుఃఖించుచున్న నన్ను, పోదరే ఎన్ఱుశొల్లి- రావోయీ అనిచెప్పి పుందియిల్పుగుందు- నాహృదయమున ప్రవేశించి, తన్పాల్- తనపైన, ఆదరం పెరుగవైత్త- ప్రేమను పెరుగునట్లు చేసిన, అళగనూర్- సుందరుడైన స్వామి యొక్క నివాసస్థానము, అరంగమన్ఱే- శ్రీరంగక్షేత్రమేగదా.

వివరణము : ''శూదనాయ్ కళ్వనాగి''— ఇత్యాది. జూదరినైతిని- దొంగనైతిని- ధూర్తులతో కలసి తిరిగితిని- యువతుల కటాక్షములనెడు వలలోపడి దుఃఖించుచుంటిని. ఇది నా పూర్వ వృత్తాంతము. డబ్బును, వెండి, బంగారములను స్థిరాస్తులనుగూడ పందెముకాచి ఆడునది జూదము అందరూ చూచుచుండగనే ప్రత్యక్షముగా పరుల ఆ ద్రవ్యమును మోసముతో కాజేయుటచేత జూదరి యనగా ''పశ్యతోహరుడు'' అనవచ్చును. ఇతరుల వస్తువును తన వశము చేసుకొనుట చౌర్యము. ఈ చౌర్యములో దోషాధిక్యము అల్పత్వము అను తారతమ్యము దొంగిలించబడిన వస్తువులను బట్టియు దాని అధికారినిబట్టియు నుండును. కట్టెల మోపును దొంగిలించినవానికి రత్నాపహారికిని ద్రవ్య తారతమ్యమును దోష తారతమ్యము కలదుగదా। మరియు చండాలుని ద్రవ్యమును అపహరించినవానికిని వసిష్ఠ ద్రవ్యమునో, రాజద్రవ్యమునో అపహరించిన వానికిని ఈ తారతమ్యము స్పష్టమే. జీవుడీశ్వరునికి కౌస్తుభరత్నమువలె అమూల్యాభరణమైనవాడని శాస్త్రము చెప్పుచున్నది. కనుక ఈ జీవరత్నమునకు స్వామి ఈశ్వరుడు. అట్లు ఈశ్వర పరతంత్రమైన జీవాత్మ వస్తువును (తనను) నేనే స్వతంత్రుడనని భావించుట జీవుడు చేసిన ఆత్మాపహారమగు మహాదోషము. ''కింతేన నకృతం పాపం- చోరేణాత్మాపహారిణా'' అన్నట్లు ఇతనికంటె పెద్ద గజదొంగ మరొకడు ఉండడు. అనాదిగా ''నేనే స్వతంత్రుడను'' అని యహంకరించి తిరిగిన నేను అట్టి ఆత్మాపహారియగు గజదొంగనని ''కళ్వనాగి'' అను పదమునకు భావము.

ఇక జూదమనగా ఒక విధముగా పశ్యతోహరత్వమేనని చెప్పుకొంటిమి. మంచి నడవడి కలిగి, నేను ఈశ్వరునికి దాసుడనని సర్వస్వామి యీశ్వరుడు కలడని విశ్వసించి జీవించు ఒక సాత్త్వికుడైన వ్యక్తిని అదంతయు నబద్ధమని కూటయుక్తులతో దుర్బోధచేసి వంచించి తనవలె నాస్తికునిగా మార్చివేయుట గూడ జూదము వంటి క్షుద్రవ్యాపారమే యగును. నేనట్లు నాస్తికుడనై దైవవిశ్వాసము గలవారి నెందరినో మోసగించితినని "చూదనాయ్" అను పదమునకు తాత్పర్యము.

"తూర్త్తరోడి శైందకాలం" సర్వవిధ బంధువైన ఈశ్వరుని విడిచిన నాకు ఈ దుష్టప్రవృత్తిలో ఎందరో ధూర్తులు సహాయమైరి. నిరంతరము వారితో కలసి తిరిగితిని ఇట్లు దుస్సహవాసముతో గడచిన కాలమునకు అంతేలేదు. విష్ణుభక్తులతోడి సహవాసము జీవునికి సహజమై యుండగా తద్భిన్నముగా అనర్థహేతువగు ఈ దుస్సహవాసమే నాకు అనాదిగా ఏర్పడినది భాగవతులతో కలుగు సహవాసము భగవత్సంబంధమును కలిగించునట్లు ధూర్తులతో సహవాసము క్షుద్రములగు మధుపాన-స్త్రీ వ్యసనాది భోగములలోనికి దించునుగదా!

"మాతరార్ కయల్గణ్ణెన్నుం వలైయుళ్ పట్టు"— నేను గూడ ఆ ధూర్త సహవాసముచేత దిగజారి యువతుల చూపులనువలలో పడిపోయితిని. అందుండి తప్పించుకొనలేక దుఃఖించు చుంటిని.

కామాంధుడైనవాడు అది యువతి యన్నంతమాత్రమున పోయి పైనబడును గాని దాని కులము చరిత్ర వంటి వాటిని గమనింపడుగదా! చేపల వంటి ఆ నేత్రములలో గల సోయగమునే గుర్తించును. వారిహృదయము అడకత్తెరవలె క్రూరమైనది యైనను చూపులతో మాత్రము నీవు లేనిచో జీవింప జాలనన్నట్లు ప్రేమను ఒలకబోయుదురు. ఆ చూపులనెడు వలను విసరి తాము దూరముగా నుండియే వారు వీని నాకర్షింతురు. అట్లాకర్షింప బడిన వీడు ఎంతో ఉత్సాహముతో సువర్ణ రత్నాద్యాభరణములను పుష్ప సుగంధి వస్తువులను తెచ్చి సమర్పించుకొని స్వల్పభోగము నొంది చివరకు సర్వస్వమును కోల్పోయి కట్టుకున్న చిన్న పంచెతో బైటపడును. అవివేకి యైనందున మొదటనే వారి కుటిల హృదయమును గ్రహింపలేక వలలో పడిన పక్షివలె తల్లడిల్లును. తాననుభవించిన సుఖము పెద్దగా నేమియు లేనందున చివరకు వృథా ప్రయాస మాత్రమే ఇతనికి మిగులును.

''అఱ్ఱున్దువేన్రై పోదరే యెన్దుకొల్లి" ఇత్యాది. ఇట్లు దుఃఖ సముద్రములో తలమునకలైయున్న నన్ను చూచిన శ్రీరంగనాథుడు- ''ఓయీ విప్రనారాయణా! ఏల దుఃఖింతువు! నీకేమి కావలెను? అడుగుము" అని ప్రశ్నించెను. "స్వామీ! నన్నింతగా నాకర్షించి నా సర్వస్వము దోచిన ఆ నేత్రసౌందర్యవతిని దయగల ధార్మికుడెవడైన తెచ్చి నాతో చేర్చిన బాగుండును గదాయని ఆశతో ప్రతీక్షించు చున్నాను." అని నేను లజ్జను వీడి నా కోరికను తెలుపగా, ఆ స్వామియు ''ఓహో! నేత్ర సౌందర్యమును చూడదలంచితివా! ఇదిగో చూడుము-" అని చెప్పి తెరను తొలగించి కమల పత్రాక్షమగు తన ముఖ మండలమును దర్శింపజేసినాడు. "ఉయి ర్కెల్లాం తాయాయ్ అళిక్కిన్ఱ తణ్ తామరైక్కణ్" అని కీర్తింపబడినట్లు లోక మున కంతటికి చల్లని తల్లివలె ధారకములైన తామరల వంటి తన దివ్యనేత్రములను చూడమని ఆదేశించినాడు. ఏమి యా నేత్రసౌందర్యము? నేనింతకు ముందు చూచినవి తేనె పూసిన విషపు చూపులు! ఈ స్వామి నేత్రములు గంభీరాంభస్సముద్భూత- సుమృష్ట నాళ- రవికర వికసిత పుండరీక దళాలవలె అరుణములు ఆయతములునై నాకు ప్రాణధారకములై వాత్సల్యామృతమును వర్షించు చున్నవి. అని తదేకదీక్షతో దర్శించు చుండిన వీరి మనస్సు ఒక్క క్షణములో బాహ్య విషయాంతరముల నుండి మరలింప బడినది ''రామః కమల పత్రాక్షః- సర్వసత్త్వ మనోహరః" అని హనుమంతుడు శ్రీరాముని దివ్య మంగళ విగ్రహమును వర్ణింప నారంభించి మొదట నేత్ర సౌందర్యమునే ప్రస్తుతించుచూ 'కమల పత్రముల వంటి ఆయన నేత్రములు చూచిన ప్రతి ప్రాణి యొక్క మనస్సును తక్షణమే ఆకట్టుకొనగలవు' అని తెలిపెను. అట్లే ఈ ఆళ్వారుల మనస్సు గూడ శ్రీరంగనాథుని నేత్రసౌందర్యమునకు వశమై పోయినది. ఇక విషయాంతరముల పైకి పోలేదు అంతే-

"పున్దియల్ పుకుందు"— వెంటనే నామనస్సును చెదిరిపోకుండ స్వామి ఆక్ర మించి బంధించినాడు. అంతేకాదు "తణ్ణాల్ ఆదరం పెరుగవైత్త ''- ఇంతవర కును ఇతర విషయములపై కలిగిన ప్రేమను మార్చి తనపై మరలునట్లు చేసినాడు. చవిటినేలపై ప్రవహించుచుండిన నీటిని చేలపైకి మరలించినట్లు నా ప్రేమను తన పైకి త్రిప్పుకొని సార్థకమగునట్లు చేసినాడు ''ఇంతింతై వటుడింతయై" అన్నట్లు తన వలె నా ప్రేమకును విశ్వరూపమునిచ్చినాడు. నాలో ఇట్టి హఠాత్పరిణామము కలుగుటకు అవసరమైన కర్మయోగ జ్ఞానయోగాది సామగ్రి ఏమియులేదు ఇదంతయు ఆ స్వామియొక్క కరుణాప్రసారమే. ఆ చల్లని నేత్రములు నా తాపమును తీర్చిన చలివేంద్రములు.

"అళగణా"— నాలో ఈ విధముగా భక్తిని పెంచినది ఆస్వామియొక్క దివ్య మంగళ విగ్రహ సౌందర్యమే కర్మజ్ఞాన వైరాగ్యాదులు కావు. "పేరమర్ కాదల్ కడల్‌పురైయ విళైవిత్త కారమర్ మేని నంకణ్ణణ్" అని శ్రీ శఠకోపమునీంద్రులు తమ హృదయమను విశాలమగు వ్యవసాయ క్షేత్రమున ఆశయను విత్తనమును నాటి భక్తియను వరి పంటను సమృద్ధిగా పెరుగునట్లు చేసినది ఆ స్వామియొక్క వర్షుక నీలమేఘమువలె నిగనిగలాడు దివ్య శరీర సౌందర్యమేనని రూపకాలంకార ప్రక్రియలో మనోహరముగా ప్రసాదించి యున్నారుగదా! వెనుకటి పాశురమున "అయ్యా ప్పాడపత్త అళగణా" అనియు, ఇందులో "ఆదరం పెరుగవైత్త అళగణా" అనియు చెప్పుటచేత వీరికి ఆస్వామియొక్క దివ్య సౌందర్యమొక్కటియే పరతత్త్వము ఎవ డాయను సంశయమును ఛేదించినది, భక్తిని పుష్కలముగా పెంచినదిగూడ నని సూచితమైనది. ఒకే దివ్యౌషధము రోగశాంతిని శరీరబలవృద్ధినిగూడ కలిగించినట్లు ఒక్కటియే ఉభయ ఫల సాధకమైనది.

"ఊరరంగమన్దే"— మనస్సులో వైముఖ్యముపోయి రుచి కలిగినంత మాత్ర మున వెంటనే ఆలసించక తన దర్శనమిచ్చి నావంటివారిని పట్టుకొనుటకై మాటు వేసి ప్రతీక్ష చేయుచున్న దివ్య స్థలము ఈ శ్రీరంగక్షేత్రమే గదా!

**(17)** అవతారిక : నా హృదయములోచేరి ఆస్వామి భక్తి సమృద్ధిని కలిగించి తన దివ్యమంగళ విగ్రహమును నా ఎదుట నిలిపి నేత్రాది సర్వేంద్రియములకు తృప్తిగా ఆస్వాదించునట్లు అమృత భోజనమును పెట్టుచున్నాడని ఇందు వివరించు చున్నారు.

పా॥ విరుంబినిన్ఱు ఏత్తమాట్టేణ్, విదియిలేన్ మదియొన్ఱిల్లై
ఇరుంబుపోల్ వలియనెంజం, ఇఱై ఇఱై యురుగుం వణ్ణం।
శురుంబమర్ శోలై శూళ్న్ద వరంగ మా కోయిల్ కొండ
కరుంబినై క్కండుగొండు ఎన్ కణ్ణిణై కళిక్కుమాఱే॥

ప్రతి : విరుంబి నిన్ఱు- సాదరముగా స్థిరముగా నిలచి, ఏత్తమాట్టేణ్- విన్ను స్తుతింపజాలను, విది ఇలేణ్- అంజలి బంధాది వ్యాపారమును గూడ చేయలేను. మతి యొన్ఱిల్లై- తత్త్వజ్ఞానము అసలే లేదు, ఇరుంబుపోల్- ఉక్కుపిండమువలె, వలియనెంజం- కఠినమైన నా మనస్సు, ఇఱై ఇఱై- ప్రతిక్షణమును, ఉరుగుంవణ్ణం-

కరిగి పోవు విధముగా. శురుంబు అమర్- తుమ్మెదలతో ముసురుకొని యుండు, శోలై శూళ్ న్ద- ఉద్యానములతో పరివృతమైన, అరంగం- శ్రీరంగ క్షేత్రమును, మా కోయిల్కొండ- రాజభవనముగా చేసికొన్న కరుంబినై - చెరుకు గడవలె భోగ్యమగు ఆ స్వామిని, కండు గొండు- సాక్షాత్కరించి, ఎన కణ్ణిణై - నా కన్నుల జంట, కళిక్కుం అతే- సంతృప్తినొందుట యెట్టిదో.

వివరణము : విరుంబినిష్టు ఇత్యాది. స్తుతించు విషయము చాలా గొప్పది యైనపుడు సావధానముగా సగౌరవముగా స్తోత్రము చేయవలసియుండును. సర్వోత్త ముడవగు నిన్ను నేను అట్లు స్తుతించలేక పోయితిని ఇతర క్షుద్రవ్యక్తులను కొనియాడు టకు ఎంతో ఉత్సాహముతో ప్రవర్తించు నా వాగింద్రియమునకు నిన్ను స్తుతించు చున్నపుడు మాత్రము శక్తి చాలలేదు. నోరు పనిచేయకున్ననూ శరీర వ్యాపార రూప మగు కైంకర్య మేదైనా చేయలేదా అందువేమో- "విదియిలేన" నిన్ను గూర్చి వినయముగా కనీసము అంజలినైన జోడింపలేక పోయితిని. "సా జిహ్వా యా హరిం స్తౌతి" అన్నట్లు నిన్ను కీర్తించు నవకాశముగాని "యౌ తత్పూజా కరౌ కరౌ" అన్నట్లు చేతులార నిన్ను పూజించు నవకాశముగాని నాకు లేక పోయినది. పోనీ మనస్సులో నైన నిన్ను ధ్యానించుకొను వీలుకలుగలేదా అందువేమో, "మదియిలేన-" లేదు. సమగ్రముగ నీ స్వరూప స్వభావములను గుర్తించలేకపోయినను ఈశ్వరుడవగు నీవు ఒకడవున్నావని గూడ నేను గుర్తించలేక పోయితిని. ఇతర విషయములగూర్చి "విద్యాన్యా శిల్పనైపుణం" అన్నట్లు పనికిరాని విజ్ఞానము నెంతో సంపాదించితిని గాని, ఉజ్జీవన హేతువగు నిన్ను గురించిన పరిజ్ఞానమును మాత్రము కొంచెమైనను సంపాదింపక "అసన్నేవ స భవతి" అన్నట్లు అసత్ప్రాయుడనైతిని. పోనిందు. మోక్ష కారణ సామగ్రిలో మనస్సే ప్రధానము గనుక ఆమనస్సునే నేను మార్చివేసెద నందువేమో, "ఇరుంబు పోల్ వలియనెంజం" నా మనస్సు ఇనుమువలె అతి కఠిన మైనది. పైగా "అతితప్తమయోపి మార్దవంభజతే-" అని కాళిదాసన్నట్లు అగ్నిలో కాల్చి ఇనుము నైననూ సాగదీయ వచ్చునేమో గాని నా మనస్సు మాత్రము ఎవరికినీ మార్చరానంతటి కఠినమైనది.

"ఇత్తై ఇత్తై ఉరుగుంవణ్ణం"— కఠినమైన నేలపై మేఘము వర్షింపగా కాఠి న్యము పోయి మార్దవమేర్పడినట్లు విషయాంతర సంపర్కమున కఠినమైన మనస్సు భగవత్ప్రీతిభావముచే ప్రతి క్షణము శిథిలమై పోవుచున్నది. ఇట్లు మనస్సు ద్రవీభూత మగుటకు కారణము ఉద్యానముల సౌందర్యము శ్రీరంగనగర సౌందర్యము అందు

వేంచేసియున్న స్వామియొక్క దివ్య మంగళ విగ్రహ సౌందర్యము- అని ఉత్తరార్థ మున చెప్పబడుచున్నది

''కురుంబమర్ శోలైకుళ్ న్దు"— ఆ పూదోటలలోని పుష్ప మకరందమునకు పరిమళమునకును ఆకర్షితములైన తుమ్మెదలు అక్కడనే పుట్టి పెరిగినవి కాబోలు నన్నట్లు ముసురకొని యున్నవి ఆ వనములలో వసన్తశోభ నిత్యోజ్జ్వలమై యున్నది. వనశోభను మించి శ్రీరంగనగర శోభ ఆకర్షకమైనది. ''అరంగమా నగర్ కోయల్కొండ" ఆ సుందర నగరమును పరమపదమువలె తన నిత్య నివాస స్థానముగా చేసుకున్న స్వామి. ఎవరాయన? ఆయన పేరేమి? ఇచట ఆ పేరును చెప్పకుండ ''కరుంబినై" అను పదముతో విగ్రహ గత దివ్య సౌందర్యమును సూచించుచున్నారు. చెరుకుగడవలె భోగ్యమైనవాడు. సౌశీల్యాదిగుణము లాయనలో ఎన్నియున్ననూ ఈ భోగ్యతయే ప్రాధాన్యము నొందినది. (కన్నల్) అనగా చెరుకు రసముతో తయారైన కలకండముక్క. అటువంటివాడు అని చెప్పక (కరుంబు) చెరుకుతోనే పోల్చిచెప్పుటలో విశేషమేమనగా- అది పాకముతో తయారైన మాధు ర్యము కలది. అట్లుగాక సహజ భోగ్యతకలవాడు స్వామి, అనుటకై నేరుగా చెరుకు గడతోనే పోల్చబడెను. "రసోవైసః" అను శ్రుతియు సాక్షాదానందస్వరూపుడాయన అని నిరూపించుచున్నది గదా.

"కండుగొండు ఎన్ కణ్ణిణై కళిక్కుమాతే"— మహానిధిని చూచి ఉప్పొంగి పోయినట్లు ఆ స్వామిని చూచి నా నేత్రములు ఆ సౌందర్యరసమును జుర్రుకొను చున్నవి. ఇది నేత్ర పుటములతో జుర్రుకొనవలసిన చెరుకు రసము "లోచనాభ్యాం పిబన్నివ" అన్నట్లు "సదాపశ్యంతి సూరయః" అని శ్రుతి చెప్పినట్లు రెప్పపాటు లేకుండా సదా ఆ స్వామిని దర్శించు నిత్యముక్తులకుగూడ ఈ మాదిరి తృప్తి కలుగ దేమో! "దివ్యం దదామి తే చక్షుః" అన్నట్లు వారివి దివ్యచక్షువులు. నావి భౌతిక నేత్రములే. ఇచట నేత్రములు వాస్తవమునకు కరణములే అనగా- సాధనములు మాత్రమే. వాటితో స్వామిని దర్శించి తృప్తినొందవలసిన ఫలభోక్త ఈ ఆళ్వారులే. ఇంద్రియాధిష్ఠాత స్వతంత్రకర్తయును జీవుడే అయినను ఉత్సాహముతో నేత్రములే స్వాతంత్ర్యము వహించి తామే స్వామి నాస్వాదించి తృప్తి నొందినట్లున్నవి. రాముడు వనమునకు పోయిన పిమ్మట శోకాంధుడైన దశరథుడు "రామం మేఽను గతాదృష్టిః" అనుచూ రామునితోనే తన చూపుగూడ వెంటబడిపోయెనని ఆక్రోశించె నట. ఇంద్రియప్రేరకుడైన ఆత్మ కర్తతో అవసరములేకుండా కరణము (సాధనము)

లైన ఇంద్రియములకే భగవత్సౌందర్య ప్రభావముచే తృప్తినొందగల కర్తృత్వము ఆయన వెంటపడిపోగల కర్తృత్వము ఏర్పడినట్లున్నది

**(18)** అవతారిక : భగవత్సౌందర్యమును దర్శించినప్పుడు కలిగిన సంతోషాతిరేకముచే ఆనందాశ్రువులు ఉప్పొంగుచూ తమ చూపులకు అడ్డుగోడలవలె ప్రతిబంధకములైనట్లు ఇందు వాపోవుచున్నారు.

పా॥ ఇనితిరై త్తివలై మోద వెరియుంతణ్ పరవై మీదే
తనికిడందరశుశెయ్యుం తామరైక్కణ్ణనెమ్మాన్ ।
కనియరుందనైయ శెవ్వాయ్ కణ్ణనై క్కండ కణ్గళ్
పనియరుంబు దిరుమాలో ఎన్ శెయ్‌గేన్ ఉలగత్తీరే!

ప్రతి : ఇనితిరై - సొంపుగా తరంగములు, తివలై మోద - సన్నని తుంపురులను విసురుచుండగా, ఎరియుం - ఎగయుచున్న, తణ్ పరవై మీదే - చల్లని కావేరీ ప్రవాహ మధ్యమున, తనికిడందు - ఏకాంతముగా శయనించి, అరశుశెయ్యుం - లోక రక్షణము చేయుచున్న, తామరైక్కణ్ణన్ - పద్మపత్రాక్షుడును, ఎమ్మాన్ - మాకు స్వామియును, కనియరుందు అనైయ - దొండపండువంటి, శెవ్వాయ్ - ఎర్రనిపెదవి కలవాడునుఅగు, కణ్ణనై - కృష్ణరూపమున అవతరించిన శ్రీరంగనాధుని, కండ కణ్గళ్ - సేవించిన నా నేత్రములు, పనిఅరుంబు - చల్లని ఆనంద బాష్పములను, ఉదిరుం - కార్చుచున్నవి. ఆలో - అయ్యో! ఉలగత్తీరే - లోకులారా! ఎన్ శెయ్‌కేన్ - ఏమి చేయుదును.

వివరణము : ఈ శ్రీరంగక్షేత్రము పరమాత్మకు ఒక చిన్న ఏకాంతమగు విశ్రాంతి ధామమైనది. ఈ దివ్యస్థలము స్వామికి (ఎయిర్ కూలర్ వలె) పూర్ణసుఖప్రదమైనది. "ఇని తిరై త్తివలై మోద" - ఉభయ కావేరీ మధ్యమున శయనించిన ఆయనకు కావేరీ తరంగములు రెండు ప్రక్కల నుండి చల్లని తుంపురులను విసరుచున్నవి. అలల పరంపరలచే చిమ్మబడిన ఆ తుంపురులు చల్లగా స్వామి శరీరమును తాకుచూ సుఖముగా నిదురించుటకై జోకొట్టుచున్నట్లున్నవి. మెల్లగా మృదువుగనే ఆ తుంపురులు వచ్చి తాకుచున్ననూ కుసుమ సుకుమారమైన ఆ శరీరమునకు ఎంతగట్టి దెబ్బతగిలియుండునో యని భావించుచూ "మోద" అని ప్రయోగించిరి రాళ్ళతోనో గుదియలతోనో మోదినట్లు ఆ చిన్న తుంపురుల తాకిడికి గూడ తట్టుకొనలేనంత

సుకుమారమైనది దివ్య మంగళ విగ్రహమని భావము. వెనుక ''అరక్కర్ కోనై చ్చెత్త నం శేవకనార్'' అనుచోట రాక్షస నాయకుడైన రావణుని వధించిన వీరశ్రీ కలవాడు అని కీర్తించిరి. అది పరోక్షము ఇపుడు ప్రత్యక్షముగా సేవించి సౌకుమార్య మును కీర్తించు చున్నారు.

''ఎరియుంతణ్ పరవై మీదే''- ''క్షీరసాగర తరంగ శీకరాసార తారకిత చారుమూర్తియే'' అన్నట్లు క్షీరసాగర మధ్యమున శయనించినపుడు పొందిన యనుభ వమే ఇచట కావేరీ మధ్యమున గూడ స్వామికి కలిగినది. పరవై-అనుపదమునకు సముద్రము అనియే అర్థమైననూ ఇచట జలసమృద్ధిగల కావేరి మధ్యమున యని సాదృశ్యమును బట్టి (గౌణవృత్తి చేత) అర్థమును గ్రహింపదగును.

"తని కిడందు అరశు శెయ్యుం" తన మనోభావమునెరిగి సేవచేయు నిత్య ముక్త వర్గముతో నిండిన ఆ పరమపదమును వీడి ఆయన ఈ ఏకాంత స్థలమునకు వచ్చినది లోకుల యోగక్షేమములనుఅరయుటకే గదా ! అయినను ఈ జనులు క్షుద్ర విషయాసక్తులై స్వామి సేవను విడచి తప్పించుకొని తిరుగుచున్నారే ! ''అరశు శెయ్గై'' అనగా- వశీకరించుకొనుట. 'అహం' అను భావము పోయి 'నమః' అనునట్లు విధేయులనుగా చేసుకొనుట. ''తామరై క్కణ్ణన్''- జనులను వశీకరించు కొనుటకు ఆయన వద్దగల గొప్ప సాధనము నేత్ర సౌందర్యమే. అది బ్రహ్మాస్త్రము వంటిది. ఆ నేత్ర సౌందర్యమును చూచిన వారెవ్వరును 'దాసోహం' అనవలసినదే తప్ప వెనకడుగు వేసిపోలేరు. 'జితంతే పుండరీకాక్ష !' 'రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః' ఇత్యాది వాక్యము లిందుకు ప్రమాణములు. సంసారులలో అధమస్థాయికి చెందిన నన్ను గూడ వశపరచుకొన్నది ఈ సౌందర్యమే.

''కనియిరుందనైయ శెవ్వాయ్''- ఆ చూపులతో వశపరచుకున్నవారిని పలుక రించుటకోయన్నట్లు చిరునవ్వుతో కూడిన ఎర్రని దొండపండు వంటి అధరము కలవాడు

''కణ్ణనై క్కండ కణ్గళ్''- ఈ శ్రీరంగనాథుడు ఆ కృష్ణుడే గదా ! కృష్ణా వతారమున ద్వాపరయుగమున ఆయన దివ్యమూర్తిని దర్శింపలేక పోయిన తరువాత కాలము వారికి గూడ తన దర్శన భాగ్యము కలిగించుటకే శ్రీరంగనాథుడై ఇచట నిత్యవాస మొనర్చుచున్నాడు. శ్రీపరాశరభట్టరు వారిట్లు ప్రసాదించిరట- ''యశోదా దేవి బాలకృష్ణుని తనసును చిన్నబుచ్చకుండుటకై అల్లరితోనే ఆ పిల్లవానిని

పెంచెనుగదా! భక్తుల హృదయములను దోచుకొనెడు శేషశాయియగు శ్రీరంగ నాథుని (మూలమూర్తిని) సేవించినపుడు తొట్టెలో నిదురించు ఆ బాలకృష్ణుని దివ్య సౌందర్యమే స్మరణకు వచ్చునట. ఇక అర్చక పరాధీనమై స్నాన-అలంకార-నైవేద్య వీధ్యుత్సవాదులను స్వీకరించుచూ ఆయా మండపములకు త్రిప్పబడుచుండు నంబెరు మాళ్ళను (ఉత్సవమూర్తిని) సేవించినపుడు వశిష్ఠాదిమహర్షులచే సుశిక్షితుడై వినయముతో వారిని అనువర్తించు శ్రీరామచంద్రుని దివ్యసౌందర్యము స్మరణకు వచ్చునట. ఇది భట్టరువారి అనుభవము.

"పనియరుంబు ఉదిరుంఅలో" ఇట్లు బాలకృష్ణుని శయన సన్నివేశమును స్మరింపజేయు శ్రీరంగనాథుని శేషశాయిమూర్తిని కన్నులార తృప్తిగా సేవించవలెనని ఆశపడు నాకు సంతోషాతిశయముచే చల్లని ఆనందబాష్పము నేత్రములలో పొంగి వచ్చుచున్నది. ''అహ్లాద శీత నేత్రాంబుః- పులకీకృత గాత్రవాన్" అని చెప్పబడినట్లు చల్లని ఆనందాశ్రువులు పులకాంకురములను ఆవిర్భవించుట పరమ సాత్త్వికులగు భక్తులకు సహజమే గదా!

"ఎన్ శెయ్‌గేన్ పావియేనే"- నదీప్రవాహములవలె అవిచ్ఛిన్నముగావచ్చు ఈ కన్నీరు ఆ దుర్లభమగు స్వామిని దర్శింప నీయకుండా అడ్డుపడు చున్నదే! అయ్యో! ఏమిచేయుదును ఇది నా పాపమేనా! అని వాపోవుచున్నారు. స్వామియొక్క సౌందర్యము అమృతము వలె అతి భోగ్యమై అపారమైనది. ఇక నా ఆర్తి "ఇంత కాలమునకు స్వామి లభించెనుగదా'' యని హృదయము నుండి కట్టలు తెంచుకొని పొంగి వచ్చుచున్నది, ఇంతకు ముందు అనాది కాలము గడిచినను దర్శింపలేక పోవుటకు నా పూర్వ పాపము హేతువైనది. ఇపుడుగూడ ఆ పాపమే కన్నీటి రూపమున అడ్డువచ్చు చున్నట్లున్నది. అని "పావియేనే'' అను పదమునకు తాత్పర్యము. ఇంతకు ముందు అనాదిగా అనావృష్టి. ఇపుడు అతివృష్టి. రెండు దశలలోను పంటలు లేక చెడిపోయినట్లున్నది నా దౌర్భాగ్యము- అని ఈ ఆళ్వారుల మధురవేదన.

**(19)** అవతారిక. శ్రీరంగనాథుని సేవచే ఒక్క చక్షురింద్రియమేకాదు. అన్ని అవయవములతోపాటు నా శరీరమంతయు శిథిలమై పోవుచున్నది- అని ఈ పాశురమున స్వామి యొక్క శయన సన్నివేశమును వర్ణించి తమ పారవశ్యమును తెలుపుచున్నారు.

పా॥ కుడతిశై ముడియైవైత్తు కుణతిశై పాదం నీట్టి
వడతిశై పిన్నుకాట్టి తెణ్ తిశై ఇలంగైనోక్కి
కడల్ నిరక్కడవుళెన్దై అరవణై త్తుయిలుమాకండు
ఉడలెనక్కురుగుమాలో! ఎణ్ శెయ్ గే నులగత్తీరే ॥

ప్రతి : కడల్ నిరం - సముద్రమువలె నీలమగు దేహముగల, కడవుళ్ ఎన్దై - సర్వేశ్వరుడగు నాతండ్రి రంగనాధుడు, కుడతిశై - పశ్చిమదిక్కునకు, ముడియైవైత్తు (శిరస్సును) కిరీటమునుచాపి, కుణతిశై - తూర్పుదిక్కునకు, పాదంనీట్టి - శ్రీపాదములనుచాపి, వడతిశై - ఉత్తర దిక్కునకు, పిన్నుకాట్టి - వీపును చూపించి, తెణ్ తిశై - దక్షిణదిక్కున, ఇలంగైనోక్కి - విభీషణుని లంకానగరమును కటాక్షించుచూ అరవు అణై - ఆదిశేషుడను పాన్పుపై, తుయిలుమాకండు - శయనించియున్న సన్నివేశమును సేవించి, ఎనక్కు - నాయొక్క, ఉడల్ ఉరుగుం - శరీరము శిథిలమైపోవుచున్నది ఆలో - అయ్యో! ఉలగత్తీరే - లోకులారా! ఎణ్ శెయ్ గేణ్ - ఏమిచేయుదును.

వివరణము : "కుడతిశై" ఇత్యాది తన దివ్యావయవ సౌందర్యమును సేవించి నాలుగు దిక్కులలోనివారు నుజ్జీవించునట్లు శ్రీరంగనాధుడు శయనించియున్నాడు. భూలోకమును సృష్టించినది పుణ్యపాప మిశ్రముగను పాపప్రచురముగను జీవించు మనుష్య తిర్యక్ స్థావరములగు ప్రాణులనివాసము కొరకనియు, ఆకాశ ప్రదేశమును సృష్టించినది పుణ్యశాలురైన దేవతల నివాసముకొరకనియు కొందరు భావింతురు. ఇట్లు ఊర్ధ్వ- అధో దిశలు పోగా మధ్యగానున్న మిగిలిన దిక్కులకు వేరే ప్రయోజనమేదియు లేదు. వాటిని సృష్టించుట వ్యర్థమేనని ఆ కొందరి భావన. ఇపు డట్లుకాదు శ్రీరంగనాధుడు ఇచటికి వేంచేసిన పిదప భూమ్యాకాశములకు మధ్యనున్న ఈ నాలుగు దిక్కులుగూడ భగవత్సేవచే సార్థకమైనవి. ఎట్లనగా, జీవులను దేవ మనుష్యాది రూపమున సృష్టించుట వారికి మోక్షేచ్ఛ కలుగునట్లు చేయుటకొరకును, లోకసృష్టి. వారు నివసించుకొరకును అయినట్లే ఈ నాలుగు దిక్కులను సృష్టించుట గూడ శేషశాయియగు తన నాలుగు ప్రక్కలగల దివ్య శరీర సౌందర్య దర్శనమును వారికి కలిగించి వారిలో తినపై రుచియు, భక్తియు వృద్ధియగునట్లు చేయుటకేనని ఇపుడు స్పష్టమైనది. "కుడతిశై ముడియైవైత్తు"- పశ్చిమదిక్కునకు తన సర్వలోకాధిపత్యసూచకమగు కిరీటమును ధరించిన శిరస్సును చాచినాడు. ఆ దిక్కుననుండువారికి కిరీటసేవచే పరత్వజ్ఞానము కలుగునని భావించబడెను.

"కుణదిశై పాదంనీట్టి"— సకల లోకముల నుజ్జీవింపుటకు ఆశ్రయింపవగిన శ్రీపాదములను తూర్పు దిక్కున నుండువారికొఱకై చాపినాడు. శ్రీరంగమునకు తూర్పుగానే ఈ విప్రనారాయణు లవతరించిన "మండంగుడి" అనబడు గ్రామము ఉన్నందున తూర్పునకు పాదములను చాచినది తమ కొరకేనని వీరి భావన శిరస్సును చాచిన ప్రదేశమగు దుర్యోధన స్థానమున నున్నవారే ఉజ్జీవింపగా పాదములను చాచిన అర్జునస్థానమగు దిక్కులోనున్న నాకు ఉజ్జీవన విషయమున సందేహమేలేదని అభి ప్రాయము

"భగవద్రామానుజులకు పరమాచార్యులగు శ్రీ యామునాచార్యులు రంగనాధుని సేవించుటకు వచ్చినపుడు దుర్యోధన స్థానమిదియని చెప్పి స్వామి యొక్క శిరస్సు ప్రక్కకు వచ్చి ఎన్నడును నిలుచువారు కాదట. పాదముల ప్రక్కనే నిలచి శ్రీముఖ మండలమునుగూడ సేవించి పోవువారట. మరియు శ్రీరంగ క్షేత్రమునకు తూర్పున వారు వేంచేయని ప్రదేశమే లేదట. కాని పశ్చిమమున (దుర్యోధన స్థానముకనుక) గల ప్రదేశములకు వారెప్పుడును వెళ్ళలేదు" అని శ్రీపరాశరభట్టరువారు చెప్పుచుండిరి

"వడదిశై పిన్బుకాట్టి"— ఉత్తరదిక్కు ఆర్యభూమి గనుక అచట సంస్కృత భాష మాత్రము వ్యవహారములోనుండి ఆళ్వారుల దివ్య ద్రవిడ సూక్తులకు ప్రచా రము లేనందున ఆ ప్రాంతమువారికి తనపై భక్తిని కలిగించుటకు పృష్ఠ (వీపు) భాగ శోభను దర్శింపజేయు విధముగా స్వామి శయనించెను. ముందుభాగమునకంటె వెనుక భాగమున నుండు శరీరశోభయే అతి రమణీయమై యుండునని "పూర్వాంగాదధికా పరాంగ కలహం" అను సూక్తివలన తెలియుచున్నది గదా!

"తెఱాదిశై ఇలంగై నోక్కి"— దక్షిణాభిముఖముగా లంకానగరమును కటా క్షించుచున్నట్లుగా శయనించుట లంకాధిపతియగు విభీషణునిపైగల ప్రేమాతిశయ ముచేతనని గ్రహింపదగును. ఇంతకుముందు మూడు దిక్కులలోను ఉన్నవారి అపేక్షను తీర్చుటకై ఆయాదివ్యావయవములను వారికి దర్శింపజేసెను. ఇపుడు తన భక్తుడగు విభీషణుని సదా కటాక్షింపవలెనను తన అపేక్షను నెరవేర్చుకొనుటకై దక్షిణాభిముఖ ముగ శయనించుట. "అన్నాదు తెఱాదిశై నోక్కిప్పళ్ళికొళ్ళుం" అను సూక్తిని బట్టి విభీషణునిపైగల వాత్సల్యముతో దక్షిణ దిక్కును (లంకను) కటాక్షించుచున్నట్లు స్పష్టమేగదా! విభీషణుని దుఃఖమునుబాపి అతనికి రాజ్యమునిచ్చి అతని ఐశ్వర్యాభి వృద్ధిని నిత్యము ప్రేమతో చూచుచుండవలెనని స్వామి కోరిక. తల్లి తన పాపకు

పాలిచ్చి ఆ శిశువుయొక్క ముఖ శోభను చూచుచూ సంతోషముగా ఆ ప్రక్కకే పరుండునట్లు.

విభీషణుడు శరణాగతి చేయుటకు వచ్చినపుడు ఆతనిని స్వీకరింపరాదని వాదించిన సుగ్రీవుడు శ్రీరామునితో "విభీషణుని స్వీకరించినచో నేను నా పరివారము మీకు దూరమై పోవలసివచ్చును" అని తెలిపెను. అపుడుపుట్టిన దూడపైగల వాత్స ల్యముతో మునుపటి తన దూడలను గూడ కొమ్ములతో పొడిచి తరిమికొట్టు ఆవువలె శ్రీరాముడును "నిన్ను సపరివారముగా విడిచిపెట్టవలసివచ్చిననూ సరేగాని విభీషణుని మాత్రము విడువను"అని జవాబు చెప్పెనట. ఆసుగ్రీవుడే రావణుని ఎదిరింపబోయి చివరకు ప్రమాదము నుండి తప్పించుకొని వచ్చినపుడు శ్రీరాముడు ''ఎంత పని చేసితివి? నీకు కొద్ది అపాయము జరిగినను నేను భరింపగలనా? అపుడు సీతమాత్రము నాకెందులకు ?'' (త్వయికించిత్సమాపన్నే- కింకార్యం సీతయా మమ) అని తన ఆవేదనను ప్రకటించుకొనెను. స్వామికి ఆశ్రితులపైగల వాత్సల్యమపారముగదా!

"కడల్‌నిర క్కడవుళ్ ఎందై"- దర్శించువారికి సముద్రమువలె ఆహ్లాద కరమైన దివ్య శరీరముగల సర్వేశ్వరుడు. సర్వజ్ఞులగు నిత్య సూరులు ఎందరు అనుభవించిననూ తరగని శరీర సౌందర్యము కలవాడు సంసారినగు నన్ను వశీకరించు టకై తన సౌందర్యమును సాక్షాత్కరింప జేయుచున్నాడు.

''అరవణై తుయిలుమాకండు"- ఆదిశేషునిపై ఆయన శయనించి యున్న సన్నివేశమిది. స్వర్ణాభరణములో మరకత మాణిక్యమును పొదిగినట్లున్నది. "ఉడలె నక్కు ఉరుగుం ఆలో"- జడమైన నాశరీరము ఆ శేషశాయి విగ్రహమును చూచిన పిదప శిథిలమై పరవశించు చున్నది. ''భగవత్స్వరూపతిరోధాన కరీ" అని శ్రీరామా నుజులు గద్యమున తెలిపినట్లు బ్రహ్మజ్ఞానము కలుగకుండ కప్పిపుచ్చు నట్టి తమో గుణమయమగు ఈ ప్రాకృత శరీరమే భగవద్దర్శనముచే కలిగిన ప్రహర్షాతిరేకము చేత పరవశమగుచున్నదే. ఇదేమి ఆశ్చర్యము! ''ఎన్‌శెయ్‌గేన్ ఉలగత్తీరే'' లోకులారా ! నన్నేమి చేయమందురు? మీలో నావలె ఈ శరీర శైథిల్యము కలుగ నందున మీరెంతో అదృష్టవంతులు- నాకును మీవలె స్థిరత్వము కలుగుటకు ఉపా యము తెలుపు మన్నట్లు లోకులను అడుగుచున్నారు. తోటి ఆళ్వారులను ఈ పార వశ్యమును తప్పించు కొనుటకు మార్గమేమని అడిగినను అది చిల్లులుపడిన నావతో పగిలిన నావ చేరినట్లే యుండును రోలుపోయి మద్దెలతో మొరపెట్టుకున్నట్లుండును.

వారు గూడ నిట్లే భక్తి భావముచే శిథిల గాత్రులే కదా! ఇక "నీ దర్శనముచే నాకు ఇట్టి స్థితి కలిగినది- స్వామీ! నివారింపు"మని భగవంతుని ప్రార్థించినచో ఆయన "ఇది నా పరిభావమేగదా" యని మరింత దర్పమును కనబరుచును గాని నాకీఅవస్థను తొలగించునా? అని భావించి, ఈ ఆళ్వారులు భగవద్దర్శనము చేసినను మార్పు నొందని దృఢవైఖరి గల లోకులనే నాకును అట్టి ఉపాయమేదో తెలుపుమను చున్నారు.

ఈపాశురమునకు మా సంస్కృతానువాద శ్లోకములు-

యుగ్మం : ప్రాచ్యాం ప్రసారితపదం, దిశిచ ప్రతీచ్యాం
విన్యస్తమౌళి, ధృత పృష్ఠమధోత్తరస్యామ్।
లంకాభిముఖ్య మసృణం ప్రణయాదవాచ్యాం
జ్యోతిః ఫణీన్ద్రశయనే శ్రితయోగ నిద్రమ్॥ (1)

ఇన్ధాన మర్ణవ సవర్ణరుచా నివిష్టం
శ్రీరంగధామని విలోకితుముత్సుకస్య।
వైవశ్యమేతి మమ గాత్రమిదం ప్రసహ్య
లోకాః! కిమస్మి కరవాణి విమూఢ చిత్తః? (2)

**(20)** అవతారిక. వీరు అడిగిన ప్రశ్నకు లోకులిచ్చిన సమాధానమేమనగా- "మావలెనే మీరును భగవంతునిపై వ్యామోహమును వదులుకొని శరీరేంద్రియ పోషణ పరులై లౌకిక విషయములపై మనస్సును లగ్నము చేయుడు. అపుడు మీకు ఈ అవస్థ యుండదు-" ఈ మాటకు సమాధానముగా ఈ పాశురమున వీరు "తత్త్వ జ్ఞానము నొంది అహంకార మమకారములు వదులుకున్న మావంటి వారికి భగవంతుని విడచి దూరముగా పోవుట సాధ్యముకాదు. అని నొక్కి చెప్పుచున్నారు.

పా॥ పాయునీర్ అరంగం తన్నుళ్ పాంబణై ప్పళ్ళి కొండ
మాయనార్ తిరు నన్మార్వుం మరకత పురువుం తోళుమ్॥
తూయ తామరై క్కణ్గళుం తువరితళ్పవళ వాయుం
ఆయశీర్ ముడియుం తేశుం అడియరోర్క్కగల లామే॥

ప్రతి : పాయునీర్ - ప్రవహించు కావేరీ జలముగల, అరంగంతన్నుళ్ - శ్రీరంగమునందు, పాంబు అణై - ఆదిశేషుడను పాన్పుపై, పళ్ళికొండ - శయనించి యున్న, మాయనార్ - ఆశ్చర్యశక్తిమంతుడగు స్వామియొక్క, తిరునన్మార్వ్వం - లక్ష్మీ శోభి వక్షస్థలము, మరకత వురువుం - మరకతమణి వంటి శరీరము, తోళుం - భుజములును, తూయ తామరై క్కణ్గళుం - శుద్ధమగు తామర రేకులవంటి నేత్రము లను, తువర్ ఇతళ్ - ఎర్రని అధరమును, పవళవాయుం - పగడము వంటి ఎర్రని నోరును, ఆయ శీర్ ముడియుం - అనాది సిద్ధమగు శోభగల కిరీటమును, తేశుం - లావణ్యమనబడు తేజస్సును, అడియరోర్క్కు - స్వరూపము నెరిగిన మావంటి వారికి, అగలలామే ! విడిచిపెట్టుట సాధ్యమా !

వివరణము : "పాయునీర్ అరంగంతన్నుళ్" - నీరు పల్లమెరుగును అన్నట్లు సహజముగనే కావేరీనదికి పల్లపు ప్రాంతము ఈ శ్రీరంగ క్షేత్రము. నీటికి అడ్డుకట్టనువేసి పై మెట్టభూములకు ఎక్కించనవసరము లేదని భావము. మరియు నిర్మలమైనది ఈ ప్రవాహము "రమణీయం ప్రసన్నాంబు - సన్మనుష్యమనో యథా" అని స్వచ్ఛమగు పంపాజలమునకు ఉత్తమ పురుషుల నిర్మల మనస్సు ఉపమానముగా చెప్పబడినది. కాని ఈ కావేరీజలము "ఉపమానస్యాపి ప్రత్యుపమానం" అన్నట్లు ఆ సత్పురుషుల మనస్సులకు గూడ ఉపమాన మనదగినంత స్వచ్ఛమైనది. అట్టి కావేరీజలముతో ఉభయ పార్శ్వములలో పరివేష్టితమైనది శ్రీరంగక్షేత్రము.

"పాంబుఅణై ప్పళ్ళికొండమాయనార్" - ఆ నదీజలముయొక్క తాకిడి లేకుండుటకై పరచుకొన్న పరుపువలె ఆదిశేషుని కోమల శరీరము అమరియున్నది. "వెళ్ళై వెళ్ళత్తిన్ మేల్ ఒరుపాంబై మెత్తైయాగ విరిత్తు ఏత్తి" అని శ్రీవిష్ణుచిత్తమునీంద్రులు గూడ ఇట్లే ఈ సన్నివేశమును తమ ప్రబంధమున ప్రసాదించియున్నారు గదా! దానిపై యోగనిద్రలో సుఖశయనము కలిగియున్న ఆముఖ సౌందర్యము ఆశ్చర్యావహమైనది. ఇచట మాయాశబ్దము ఆశ్చర్యార్థకము "స మయాబోధితః సమ్యక్ సుఖసుప్తః పరంతపః" అని శ్రీరామాయణమున తన తొడపై తలనుంచుకొని సుఖశయనములోనున్న శ్రీరాముని ప్రసన్న ముఖ శోభను సీతమ్మవారు "శ్రీమాన్" అను పదముతో వివరించియున్నదిగదా! సుఖనిద్రితుడైన బాలరాముని ముఖసౌందర్యమును కన్నులార ఆస్వాదించిన విశ్వామిత్రుడు "ఈ అందగానినికన్న కౌసల్య ఎంత తపముచేసెనో" యన్నట్లు "కౌసల్యా సుప్రజాః రామ" అని నోరార కీర్తించెనుట ప్రసిద్ధమేగదా! "ఏరార్ కోలంతిగళక్కిడందాయ్" అనియు "అనైయిల్

కిడన్దకిడక్కైక్కండు ఇడప్పెత్తిరేణా" అనియు చెక్కిన ఆళ్వారులను మదగజము వలె రీవిగా సుఖనిద్ర నొందియున్న భగవంతుని దివ్య సౌందర్యమును ఉగ్గడించి యున్నారు

"తిరునన్మార్వుం" నిత్యవాసము చేయుచున్న లక్ష్మీదేవియొక్క శ్రీపాద లాక్షారసముచే శోభితమగు వక్షస్థలము మరియునది ఆమెకు విహారదోలికయగు (డోలా తే వనమాలయా హరిభుజే) వైజయంతీమాలచే విభూషితమైనది ఆ లక్ష్మీదేవియు 'క్షణమైనను దీనిని విడిచియుండలేను' అని భావించునంతటి సౌకుమార్య వైశాల్య సౌగంధ్యాదులతో నొప్పునది స్వామి వక్షస్థలము. "అకలకిల్లేన్ ఇఱైయుం ఎన్ఱు అలర్ మేల్ మంగై యుఱై మార్పా!" అని శ్రీ శఠకోప మునీన్ద్రుల సూక్తి యిచట అనుసంధేయము.

"మరకత వురువుంతోళుం" చూపరుల నేత్రములకు చల్లదనమునిచ్చు మరకత మణివంటి దేహకాంతియు గుండ్రని పొడవైన భుజములును - "తూయ తామరై క్కణ్ణుం" - పరిశుద్ధమగు తామర రేకులవంటి నేత్రములును - అనుకూలురు ప్రతికూలురు అను తారతమ్యము లేక నందరిని సౌహార్దముతో కటాక్షించునవి. "దేవానాం దానవానాంచ సామాన్య మధిదైవతమ్" అని జితన్తా స్తోత్రమున కీర్తింపబడినట్లు దేవతలకు రాక్షసులకును పరమాత్మ సమానముగనే అనుగ్రాహకుడైనను రాక్షసులపై ఆ యనుగ్రహము పని చేయక పోవుట ఆయన దోషము కాదు. వారిలోగల స్వభావదోషమే వెన్నెల అందరికిని చల్లనిదే అయినను పద్మము ముకుళించుకు పోవుట వాటి లోపమేగదా। ఎరుపు-చల్లదనము- సౌగంధ్యము ఈ గుణములను బట్టి నేత్రములకు పద్మము ఉపమానము లైనను భక్తులపై వర్షించు దయారసము ఆపద్మ పత్రములలో లేదు "తువరితళ్ పవళవాయుం" ఎర్రని అధరము మరియు చిరునవ్వును వెలార్చు దంతములతో కూడిన ముఖము ఆశ్రితులను దుఃఖములను తీర్చి ఓదార్చునట్లున్నవి. "అవాకీ అనాదరః" అని శ్రుతి చెప్పినట్లు పరమపదమున గంభీరముద్రను దాల్చియుండు స్వామి ఇచట భక్తులకు దివ్యమంగళ విగ్రహ సాక్షాత్కారమునిచ్చి వారి పూర్వాపరాధ భయమును తీర్చు విధముగా చిరునవ్వుతో క్షమా గుణమును ఆవిష్కరించు చున్నట్లున్నది "ఆయశీర్ ముడియుం" అనాది సిద్ధమగు సర్వలోకాధిపత్యమును సూచించు సువర్ణ కిరీటము. ఇట్లు ఇంతవరకు చెప్పబడిన ఒక్కొక్క అవయవ శోభయే దృష్టిచిత్తాపహారియై యున్నది "శేళుం" ఇది లావణ్య మనబడు సమగ్ర సముదాయశోభ.

''అడియోర్కు అగలలామే"- "ఆయన నా స్వామి- నేను దాసుడను" అను పరమార్థజ్ఞానము కలిగిన నావంటి వారికి అంగ ప్రత్యంగ సంపూర్ణానుభవము కలిగిన పిదప ఆ భోగ్యతను విడుచుటకు సాధ్యమగునా? నేను నాది- అను అహంకార మమకారములు సాంసారిక విషయములపై నాటుకొనియున్న మీ వంటి వారికి దీనిని విడిచి పోవుట సాధ్యముకాని నాకు సర్వస్వమైన ఈ రంగనాధుని దర్శనమును విడచి నేను జీవించ జాలనని సారాంశము.

**(21)** అవతారిక . శేషశాయిమూర్తిని దర్శించినపుడు నా దేహము పట్టుతప్పి పరవశమగుచున్నదనియు, అందులకై దర్శించుటనే పూర్తిగా మానుకొందమన్నచో అది నాకు అసలే సాధ్యముకాదనియు, ఈ ఆళ్వారులు విచారించుచుండగా- వీరి మనస్సులో "పరిమితముగా కొన్ని వేళలలోనే దర్శించుచుండినచో సరిపోవునుగదా" యని ఒక ఊహతట్టినది. కాని ఈఊహయు సరికాదని మరల తామే తమ మనస్సును గూర్చి సమాధానపరచుకొనుచున్నారు. అవిచ్ఛిన్నముగా రెప్పపాటు లేకుండా సేవించి ఉజ్జీవించవలసిన విషయమును పరిమితకాలములో దర్శించుట యనగా- అనాది కాల ముగా ఈ దర్శనమునకు నోచుకోలేని దౌర్భాగ్యముతో సమానముగదా- అని వీరు తమ మనస్సులో ఈ పాశురమున చెప్పుకున్న సమాధానము.

పా॥ పణివినాల్ మనమదొన్ఱి ప్పవళవాయ రంగనార్కు
తుణివినాల్ వాళ మాట్టాతొల్లై నెంజే! నీశొల్లాయ్ ।
అణియినార్ శెంబొనాయ వరువరై యనయకోయిల్
మణియనార్ కిడందవాత్తై మనత్తినాల్ నినైక్కలామే!

<u>ప్రతి</u> : పవళవాయ్- పగడమువలె ఎర్రని అధరముగల, అరంగనార్కు- శ్రీరంగనాధునికి, మనమదు- చిత్తవృత్తిని పణివినాల్ ఒన్ఱి- కైంకర్యమునందు లగింపజేసి, తుణివినాల్- విశ్వాసముతో, వాళ మాట్టా- (ఇంతకాలముగా) ఉజ్జీవించ లేకపోయిన తొల్లై నెంజే। చిరకాలముగా నన్ను అనువర్తించియున్న ఓ మనసా। నీ శొల్లాయ్- నీవే ఈ సంగతిని (సాధ్యమేనా) చెప్పుము. అణియినార్- సౌందర్య ముతో అలరారుచున్న, శెంబొనాయ ఎర్రని సువర్ణ మయమైన, వరువరై యనయ- మేరు పర్వతము వంటి. కోయిల్- శ్రీరంగమునందు, మణియనార్- ఇంద్రనీలమణి వలెనున్న స్వామి, కిడంద వాత్తై- శయనించియున్న సన్నివేశమును, మనత్తినాల్- మనస్సుతో, నినైక్కలామే। పరిచ్ఛేదించి అనుభవింపదగునా (తగదుఅనియర్థము)

వివరణము : ''పణి వినాల్ మనమ దొన్ఱి''- ఇతర విషయములపై వ్యామోహముతో చిక్కుకొనియున్న మనోవ్యాపారమును అచటి నుండి మరల్చి భగవత్కైంకర్యముపై ఇష్టపడునట్లు గట్టి ప్రయత్నము చేయుటయే ఈ జీవుని ప్రధానకర్తవ్యము దేవతాంతరములకు గాని రాజుల వంటి అధికారులకుగాని సేవలు చేసినను వారు పూర్ణముగా దయనుచూపి అభిముఖులగుట సందేహాస్పదమే. వారొకవేళ దయాశీలురేయైనను కోరిన ఫలితము నిచ్చుట పూర్తిగా అసంభవము ఇక భగవంతుని సంగతియన్ననో అట్లు కాదు. "ననమేయం" అన్న రావణునివలె వ్యతిరేకించకుండినంత మాత్రముననే ఆయన అనుగ్రహింపగలడు. జీవవర్గమునంతయు తన కభిముఖముగ త్రిప్పుకొనుటకై సృష్ట్యాది వ్యాపారములను అవతారములను చేయుచున్న ఆ స్వామికి వీడు అనుకూలతను ప్రదర్శించినంత మాత్రము చాలును. దయతో ఫలమునిచ్చువాడు ఆయనయే గాని, వీనిలోగల జ్ఞాన వైరాగ్యాదులో వీడుచేయు ప్రణామ-అంజలి బంధాదులో కావు. ఇతనిలో నుండవలసిన ఈ గుణములు వినీత వ్యవహారములును తనపై ఆయనకు దయయేర్పడుటకు మాత్రమే కారణములు. ''ఫలమత ఉపపత్తేః'' అను బ్రహ్మసూత్రము- 'సాక్షాత్ ఫలప్రదాత ఈశ్వరుడే. యజ్ఞాది కర్మలు ఏవియు కావు. అవి ఈశ్వరుని మనస్సు ప్రసన్నమగుటకు మాత్రమే కారణము' లని స్పష్టముగా తెలుపుచున్నది. అది యెట్లనగా- తనవద్దకు వచ్చు యాచకుడు చేయి జాచగా దానము చేయలేని వ్యక్తికి అది కోపహేతువగును. అచట చేసిన యాచన ఫలితము నివ్వలేదు. పైగా ఒకటికి రెండు సార్లు దీనముగా యాచించుటతో 'ఈ యాచకుడు నన్నవమానించుచున్నా'డని ఆ లుబ్ధునికి ఆగ్రహము హెచ్చును. ఇక భగవంతునికి అంజలినిచేసినపుడు 'అంజలిః పరమాముద్రా-క్షిప్రం దేవ ప్రసాదినీ' అను ప్రమాణమును బట్టి అది ఆయన హృదయములో ప్రసాద గుణమును కలిగించునని తెలియుచునేయున్నది. 'ధాతుః ప్రసాదాత్'' ఇత్యాది శ్రుతిగూడ భగవంతుని ప్రసాదగుణమే ఫలప్రదమనుచున్నది.

శ్రీ యామునాచార్యులవారును తమ స్తోత్రరత్నమున-

శ్లో॥ త్వదంఘ్రిముద్దిశ్య కదాపి కేన చిత్
యథా తథావాపి సకృత్ కృతోంజలిః ।
తదైవ ముష్ణాత్యశుభాన్యశేషతః
శుభాని పుష్ణాతి నజాతు హీయతే ॥

అను శ్లోకములో అంజలి వైభవము నుగ్గడించిరి. భగవత్పాదారవిందము నుద్దేశించి ఎప్పుడైనను ఎవడైనను ఏవిధముగనైనను ఒక్కసారి అంజలిని జోడించినచో, అది వెంటనే సర్వానర్థములను నివారించి అనేక శుభములను పరిపోషించును. ఉత్తరోత్తరశుభవృద్ధి హేతువేగాని ఎన్నటికిని తరిగిపోదుసుమా ! అని శ్లోకార్థము.

ద్రవిడ వ్యాఖ్యానము నందు శ్రీ పెరియవాచ్చాంపిళ్లై అను ఆచార్యులవారు శ్రీవైష్ణవ సంప్రదాయ సారార్థ సర్వస్వముగా ఈ సందర్భమున తేల్చిన సిద్ధాంత మేమనగా- జీవునిలో పూర్వపు నాస్తిక్యబుద్ధియు భగవద్వ్యతిరేక భావము గూడ పోయి అనుకూల్య సంకల్పము ఉండిన చాలును. నిరపేక్ష రక్షకుడగు భగవంతుని కృప తప్ప మరేదియు ఫలము నివ్వజాలదు. ఈ పాశురమున గల ''ఒన్ఱు'' అను పదము ఈ ప్రధాన విషయమును బోధించు చున్నది సమ్మతించుట అని ఆ పదమున కర్థము. భగవంతుని స్వామిత్వమును తన దాస్యమును సూచించునట్లుగా అంజలిని చేసినను ఆయన వశుడగునని భావము

''పవళవాయ్ అరంగనార్కు''— ఆయంజలి మాత్రముచేతనే మనస్సు కరిగి పూర్వాపచారములన్నిటిని క్షమించితినన్నట్లు చిరునవ్వుతో స్వామి ఓదార్పును ప్రకటించుచున్నాడని ప్రవాళమువంటి అధరము సూచించుచున్నది

''తుణివినాల్ వాళ మాట్టా''- తుణివు అనగా విశ్వాసము శ్రీరంగనాథుని తేజోమయ మధుర సౌందర్యమే ''ఈయన సర్వస్వామి''యను విశ్వాసమును ప్రేక్షకులకు కలిగించుచున్నది. ఆపైన ''ఈ స్వామికే నేను సేవను చేయుదును'' అను దాస్య భావమునుగూడ పుట్టించుచున్నది. భగవదనుభవమును పొందుటకు స్థిరవిశ్వాసరూపమగు ఆయానుకూల్య సంకల్పమే అత్యావశ్యకము సుమా! ఈ విషయమున తన ఆచార్యుడగు వేదవ్యాసునికంటెగూడ సంపూర్ణావగాహన కలిగిన జనకుడు భగవత్ప్రాప్తికి అమోఘ సాధనము అనుకూల్య సూచకమగు మహావిశ్వాస రూపస్థిరసంకల్పమేనని ఉపదేశించుచూ ఇట్లు వివరించెను. ''వ్యవసాయాదృతే బ్రహ్మ- నాసాదయతి తత్పరమ్''— వ్యవసాయమనగా- ఆ స్థిరసంకల్పమే.

''తొళ్లై నెంజే! నీకొల్లాయ్''— గడచిపోయిన అనాదికాలములో అట్టి భగవదానుకూల్య సంకల్పములేక ఉజ్జీవించలేని ఓ మనసా! ఇప్పుడైనను లభించిన ఈ సదవకాశమును పూర్తిగా వినియోగించుకొని సౌందర్యరాశియగు ఈ రంగనాథమూర్తిని నిరంతరానుభవము చేయవద్దా! నీవే చెప్పుము. ''అణియనార్ శెంబొనాయ....''

ఇత్యాది. నిరతిశయ సౌందర్యము కలిగి బంగారపు కొండయగు మహామేరువువలె శోభించునది శ్రీరంగనగరము. మేరువువలె సర్వాధారమై సుస్థిరమై స్వర్ణతేజోవిరాజమానమైనది గనుక దానితో శ్రీరంగమునకు సామ్యము తెలుపబడినది. ఇందులో ఆదిశేషుని పై శయనించియున్న మరకతమణినీల విగ్రహుడైన స్వామి పెద్ద బంగారపుటాభరణములో పొదగబడి అందముగా అమరియున్న నీలరత్నమువలె శోభించుచున్నాడు. యోగనిద్రాంచిత సుప్రసన్న ముఖారవిందముతో దర్శనమిచ్చుచున్న ఈ మూర్తిని ఒక్కసారి దర్శించినచో ఇక చాలుననిపించునా? విడిచిపోవలెనని బుద్ధి పుట్టునా? "సదాపశ్యంతి" అన్నట్లు నిరంతరానుభవముచేయు నిత్యసూరులకే తనివి తీరని "ఆరావముదు" అన్నట్లు అపర్యాప్తామృతమగు దీనిని ఎప్పుడో ఒకసారి పరిమితముగా అనుభవించిన చాలుననుట ఎట్లు సంభవము? భగవంతుని జ్ఞానానందాత్మ స్వరూపమునో దివ్యకల్యాణగుణములనో కొంత కొంత పరిమితముగా అనుభవించవచ్చునేమోగాని ఈ దివ్యసౌందర్యమును మాత్రము రుచి యెరిగినవాడెవ్వడును పరిచ్ఛేదించి యనుభవింపజాలడు. ఓ మనసా! అంతఃకరణమైన నీవేగదా అనుభవమునకు ముఖ్య సాధనము. నీవుగాక మరొక సాధనమేదైనయుండినచో అది పరిమితానుభవమునకు ఉపయోగపడునేమో! కాని అట్టిది గగనారవిందమేగదాయని భావము.

**(22)** అవతారిక. తిరిగి ఆ మనస్సును గూర్చియే ఈ పాశురముగూడ వ్రాయబడినది. "పరిమితముగా మనస్సుతో ననుభవించుటకు సాధ్యముకాని పక్షమున ఆ పనిని వదలిపెట్టి. కేవలము వాగింద్రియముతోనే (మనస్సహాయము అవసరము లేకుండా) సంకీర్తనము చేయుడు- చాలును.'' అని తమ మనస్సే సలహానివ్వగా, "ఓ మనసా అది నీ అజ్ఞానమే సుమా!" యని ఆక్షేపించుచున్నారు. ఎందుకనగా- "మనః పూర్వో వాగుత్తరః'' అనియు "యద్ధి మనసా ధ్యాయతి తద్వాచా వదతి" యనియు శ్రుతులలో చెప్పబడినట్లు ముందు మనస్సు తలంచిన దానినేగదా పిదప వాగింద్రియము కీర్తించునది. మనస్సులేనిచో వాగింద్రియ ప్రేరణము జరుగునా? ఇది నీకు తెలియని విషయమా? అని ప్రశ్నించుచున్నారు. మరియు లౌకిక విషయములనెన్నింటినో మనము నోటితో చెప్పుకొనుచున్నాముగదా! అట్లే భగవంతుని గూర్చియు చెప్పుకొనవచ్చునే అన్నచో, ఔను అవి పరిమిత పదార్థములు. వాటి స్వరూపమో గుణములో పరిమితములు. భగవత్తత్త్వము అట్లుగాక అపరిమితము, అనన్తము. కనుక అది వాగింద్రియముచే ఇట్టిదని కీర్తింపబడదు. అయితే- "సాజిహ్వా, యా హరిం స్తౌతి'' అన్న సూక్తి వ్యర్థమేనా? భగవంతుని కీర్తించిన నాలుకయే నాలుక- అని చెప్పుట ఎందు

లకు? అనంతమైన బ్రహ్మమును కీర్తించుటయే సాధ్యముకాదు గనుక మానుకొన వలెనా? అనిగూడ శంకింపవచ్చును. ఆ శంకనుగూడ ఇందులో తీర్చుచున్నారు.

పా॥ పేశిత్తే పేశలల్లాల్ పెరుమై యొన్రుణరలాగాదు
ఆశత్తార్ తంగళ్కల్లాల్ అరియలావానుమల్లన్
మాశత్తార్ మనత్తుళానై వణంగి నామిరుప్పదల్లాల్
పేశత్తానావదుండో పేదై నెంజే! నీ శొల్లాయ్ ॥

ప్రతి : పేతై నెంజే-అజ్ఞానము గల ఓ మనసా, పేశిత్తే- వేదములు వైదిక పురుషులును చెప్పినదానినే, పేశలల్లాల్- చెప్పుట తప్ప, పెరుమై- భగవద్వైభవము, ఒన్రు- కొద్దిభాగము గూడ, ఉణరలాగాదు- తెలిసికొనుటకు సాధ్యముగాదు, ఆశు అత్తార్ తంగళ్కు అల్లాల్- అహంకారాది దోష విహీనులైన వారికి తప్ప, అరియలా వానుం అల్లల్- (ఇతరులకు) తెలుసుకొనుటకు సాధ్యపడువాడుకాడు. మాశు అత్తార్ మనత్తుళానై- నిష్కపట స్వభావముగల వారి మనస్సులలో నివసించు ఆ స్వామిని వణంగి- సేవించి, నాం ఇరుప్ప దాగిల్- మనము జీవయాత్రను గడుపుటయే దప్ప పేశత్తా నావదుండో- ఏదో చెప్పి యేమి ప్రయోజనము? నీ శొల్లాయ్- నీవే చెప్పుము.

వివరణము పూర్వము వేదమో వేదార్థమునెరిగిన మహానుభావులో చెప్పిన దానినే మనము గూడ పిష్టపేషణముగా చెప్పినట్లగునుగాని నిజముగా ఆ బ్రహ్మ తత్త్వమునకు తగిన విధముగా శబ్దప్రయోగమునుచేసి కొత్త అంశమును చెప్పగలమా? ఆ వేదాదులలో చెప్పబడిన రీతిగనే ఎవరైనను చెప్పుచుందురు 'నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా' అని శ్రుతి చెప్పినది. 'నీలముండ మిన్నన్న మేని' ఇది ఆళ్వారులసూక్తి. విద్యుల్లేఖా పరివృత నీలమేఘ శ్యామల దివ్యదేహుడని రెంటికివి ఒకే అర్థము. 'హిరణ్మయః పురుషః-'రుక్మాభం' అని శ్రుతి. "శుట్టురైత్త నన్ పొన్ను ఉన్ తిరుమేని యొళి యొవ్వాదు"అని ఆళ్వారుల సూక్తి. అగ్ని సంతప్తమైన బంగారము వంటి మేను కలవాడనియే ఆ రెండు ప్రమాణముల కర్థము. వాస్తవమునకు ఆ నీలమేఘమో కాచిన యీ బంగారమో భగవన్మూర్తికి సరియగు నుపమానములుకావు. అయిన ప్పుడు ఈ ప్రాకృత పదార్థములను అప్రాకృత భగవద్విగ్రహమునకు ఉపమానముగా చెప్పుట యెందులకు? అని సందేహింప వచ్చును అతీన్ద్రియమగు దానిని తెలిసికొను టకు ఒక ఉపమాన పదార్థమును నిదర్శనముగా చూపియే వివరింపవలసి యున్నందున "ఆ మేఘాదులవంటి వాడు" అని చెప్పబడెను గాని అంతమాత్రముచే అయన స్వరూ

పము పూర్తిగా వివరింపబడదు. లేక- 'యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ' అని వేదము పరబ్రహ్మమును వాక్కులకు మనస్సునకు అందని వాడని చెప్పినట్లే మనమును వాఙ్మనస్సుల కతీతుడని చెప్పుట తప్ప మరేమి చెప్పగలము? అని గూడ అర్థము చెప్పవచ్చును. అట్లేల చెప్పవలెనన్నచో- 'పెరుమై ఒన్ఱు ఉణరలాగాదు' ఫలానా వస్తువువంటిది అని నిష్కర్షించి చెప్పుటకు (పరిచ్ఛేదించుటకు) ఈ బ్రహ్మముతో సదృశమైన దృష్టాంత వస్తువేదియు లేదు. కనుక మన మనోవాక్కులకందనిది యని మాత్రమే చెప్పవలసియుండునని భావము. కేవలము లౌకిక పదార్థములనే వర్ణించినపుడు ప్రసిద్ధమైన చంద్రపద్మాద్యుపమానములు అధిక గుణములై ఉపమేయము అంతకంటె కొంచెము తక్కువయై ఉండును. 'అధికగుణ ముపమానం న్యూన గుణ ముపమేయం' అని సామాన్యముగా అలంకార శాస్త్రకారులు చెప్పుచుందురు. కాని పరమాత్మ విషయమున ఉపమేయమగు ఆయనయే అత్యధిక గుణశాలియై ఉపమాన మనదగిన వస్తువులు అత్యల్ప గుణవంతములై యుండును కాబట్టి వాటితో పరమాత్మకు ఏకదేశ సామ్యమే గాని పూర్తిసామ్యము లేనందున 'ఆయన అట్టివాడని, 'ఇట్టివాడని' పరిచ్ఛేదింపరాదని, అప్రమేయములగు స్వరూప-రూప-గుణ-విభూతులు కలవాడని ఇంత మాత్రము చెప్పదగును.

అయితే ఎవరికినీ తెలియరానిదేనా బ్రహ్మము అన్నచో- అట్లుకాదు. "అఱు అత్తార్ తఙ్గట్కల్లాల్ అరియలావానుమల్లన్''- అఱు అన్నను, మాఱు అన్నను, దోషము అని యర్థము. మనస్సునందు కల్మషములేనివారికి తప్ప ఇతరులకు తెలిసికొనసాధ్యముకానిది బ్రహ్మతత్త్వమని యర్థము. ఆ దోషమేదియనగా- ''నేను కర్మజ్ఞాన భక్త్యాదులతో సాధించి తెలుసుకోగలనని'' అహంకారముతో ఉపాయాంతరములను సాధనముగాగొనుట. భగవంతునికి పూర్తిగా పరతంత్రుడైన తాను అట్లహంకారముతో స్వతంత్రించుట తన స్వరూపమునకు విరుద్ధమే గదా! ''యమేవైష వృణుతే- తేన లభ్యః'' అని శ్రుతి ఖండితముగా చెప్పినట్లు ఎవనికి ఆయన తన సాక్షాత్కారమిచ్చి అనుగ్రహింపదలంచునో అతనికి మాత్రమే సంపూర్ణముగా బ్రహ్మతత్త్వము నెరుంగుటకు సాధ్యమగునని భావించవలెను. కనుక ఆయనను తెలిసికొని మనముజ్జీవించుటకు ''స్వామీ! నీవే తప్ప నాకు ఉపాయాంతరములేదు"అని ఆయనపై భారముంచి "సర్వధర్మాన్ పరిత్యజ్య'' అన్నట్లు ఉపాయాంతరములను త్యాగము చేసి నిర్భర విశ్వాసము కలవారే ''అఱుఅత్తార్"- అనగా ప్రపన్నులు. ''త్వమేవోపాయ భూతో మే- భవ ఇతి ప్రార్థనామతిః శరణాగతిః" అనిగదా శాస్త్రము శరణాగతి లక్షణమును నిష్కర్షించినది. ఇతరోపాయములనదగు ఆ కర్మ జ్ఞానాదులుగూడ

నేరుగా ఫలప్రదములుకావు. స్వామి ప్రసన్నుడుకానిచో అవి ఫలితము నివ్వజాలవు. దయాశాలియగు ఆయనయే ఫలప్రదాత. అని స్పష్టముగా వెనుకనే నిరూపించితిమిగదా!

"మాశు అత్తార్ మనత్తుళానై"— ఇక్కడ మాశు అన్నను దోషమే ఉత్తమ భక్తులలో ఉండకూడని మరొక దోషమిది. కొందరు భగవంతుని సేవించిగూడ లౌకిక క్షుద్రఫలములనే ఐశ్వర్యాదులనే అపేక్షింతురు. వారి దృష్టి పూర్తిగా కోరిన ఫలితముపైననే. అది లభింపగనే ఆయనను విడిచిపోవుదురు "ఆయనయే నాకు ప్రాప్యము, సర్వస్వము, ఆయన సేవ తప్ప మరేదియు నాకు వద్దు" అని భావింపరు. ఇట్టి ఫలాంతరాభిలాషలేనివారే ఉత్తమ భక్తులు. "ఉనక్కే నాం ఆళ్ శెయ్వోం-మత్తైనం కామంగళ్ మాత్తు" అని శ్రీగోదాదేవి వ్రతము నాచరించి "నీ సేవ లభించుటయే మాకు ప్రధానఫలము మా మనస్సులలో ఇతర ఫలాపేక్ష అసలే కలుగకుండ చేయుము" అని ప్రార్థించెనుగదా! అట్టి వారి మనస్సులలోనే ఆ స్వామి నిత్య వాసము చేసియుండునట ఇట్టి భక్తుల హృదయములే ఆయనకు అంతరంగ భవనములు. ఆనందప్రదములు. ఇతరస్థలములన్నియు ఆయనకు వనవాసము అగ్నిమధ్య వాసమువంటివేనట. జలచరమైన మత్స్యము జలమును విడచి జీవించలేనట్లు ఆయనయు భక్తుల హృదయమును విడచినచో భరింపలేడట. "శ్రీరంగం కరిశైలం అంజనగిరిం" ఇత్యాది దివ్య క్షేత్రములలో ఆయన లేడా! ఉందురేమో, ఉన్నాడు "పరిశుద్ధమనస్కులైన భక్తులెవరైననూ నన్ను సేవించి తమ హృదయములలో నాకు చోటు ఇవ్వకపోదురా" యని ప్రతీక్ష సేయుచూ అచటనుండునట. అంతే ఈ సంగతినే స్పష్టముగా శ్రీభక్తిసారమునీంద్రులు తమ తిరుచ్చంద విరుత్తమను ప్రబంధమున 64 పాశురమున "నిన్ఱదెన్దై యూరగత్తు ఇరున్దదెన్దై పాడగత్తు- అన్ఱు వెఃంకణై క్కిడందదు, ఎన్నిలాదమున్నెలాం" అని నిరూపించియున్నారు. "స్వామి నా హృదయములో చేరియుండుటకు పూర్వము ఆ ఉరగ క్షేత్రమునను పాండవ క్షేత్రమునను తిరువెఃంకా అనబడు వేగవతీ క్షేత్రమునను ఉండెను. ఇపుడు ఇక నా హృదయములో స్థిర ప్రతిష్ఠను పొందియున్నాడు" అని ఆ పాశురమునకు భావము. "వణంగి నాం ఇరుప్పదల్లాల్".... ఇత్యాది. ఆశ్రితులపై విడువలేనంతటి వాత్సల్యముగల ఆ స్వామిని మనము నమస్కారపూర్వకముగా సేవించుచుండుట తప్ప మరేమి చేయగలము? ఇతరాల్ప విషయములగూర్చి చెప్పినట్లే ఈ భగవద్విషయమును గూడ చెప్పవచ్చుననుచుంటివేమో, కాని అజ్ఞానియగు నీకు ఊహించుటకే సాధ్యము కానపుడు నోటితో కీర్తించుటకెట్లుసాధ్యమో నీవే చెప్పుము. అని తమ మనస్సు గూర్చి ప్రబోధించిరి.

**(23)** అవతారిక : మనస్సుతో అనుభవించుటకుగాని వాక్కుతో కీర్తించుటకుగాని నాకు సాధ్యము కాకున్న దనుచుంటిరే ; అయినచో అట్టి భగవంతుని మీరు పూర్తిగా మరచిపొండు. ఇక మీకు ఏబాధయు నుండదు. అని కొందరు సూచింపగా సర్వలోక విలక్షణమగు శ్రీరంగనాథుని శయన సౌందర్యమును ఒకసారి దర్శించిన పిదప ఇక మరచుట సంభవమా ? అని ఈ పాశురమున ఎదురు ప్రశ్నను వేయుచున్నారు.

పా॥ కంగ్గై యిల్ పునితమాయ కావిరి నడువు పాట్టు
పొంగునీర్ పరందు పాయుం పూంపొళిలరంగంతన్నుళ్ ।
ఎంగళ్ మాలిరైవనీశన్ కిడందదోర్ కిడక్కైక్కండుం
ఎంగనం మరందువాళ్గేన్ ఏళై యేనేళై యేనే ॥

ప్రతి : కంగ్గై యిల్ - గంగానది కన్నను, పునిదమాయ - అతిపవిత్రమగు, కావిరి నడువు పాట్టు - ఉభయ కావేరులకు మధ్యమున, పొంగునీర్ - పొంగుచూ వచ్చు నీరు, పరందు పాయుం - విస్తారముగా ప్రవహించు నటువంటి, పూంపొళిల్ - పుష్పోద్యానములతో కూడిన, అరంగం తన్నుళ్ - శ్రీరంగ నగరమందు, ఎంగళ్మాల్ - మాపై వ్యామోహము కలవాడును, ఇరైవన్ - సర్వజగత్ప్రభువును, ఈశన్ - నియామకుడును అగుస్వామి కిడందదు - నిదురించియుండు, ఓర్కిడక్కైక్కండు - శయన సన్నివేశమును సేవించి, ఏళై యేన్ ఏళై యేన్ - మిక్కిలి పిచ్చివాడనగు నేను, ఎంగనం మరందు వాళ్గేన్ - ఎట్లు మరచిపోయి జీవించగలను.

వివరణము : "కంగ్గై యిల్ పునిదమాయ కావిరి" - చూడముచ్చటగా నున్న ప్రవాహ రామణీయకతను బట్టి జలమాధుర్యమును బట్టి మాత్రమే గాక పవిత్రతలో గూడ గంగానదిని మించినది ఈ కావేరీనది.

"గంగా సామ్యం పురా ప్రాప్తా - దేవ దేవ ప్రసాదతః ।
రంగావతరణాదూర్ధ్వం - ఆధిక్యం చాప్యవాప సా" ॥

అను ప్రమాణమునుబట్టి ఈ విషయము స్పష్టము. గంగకు భగవత్పాదసంబంధము చేతనే పవిత్రత కలదు. తనలోని అపవిత్రతను పోగొట్టుకొనుటకై రుద్రుడు దానిని శిరసావహించెనని "పావనార్థం జటామధ్యే - దధార శిరసా హరః" అను పౌరాణిక

వాక్యమునుబట్టి తెలియుచున్నది. మధుసూదన సరస్వతియను అద్వైత మహాపండితుడు తన ఆనందమందాకినీ స్తోత్రమున "యత్పాదాంబు నిధాయ మూర్ధని చితావాసః శివత్వం హఠాత్- ప్రాప్తః ..." అని వర్ణించెను. శ్మశానవాసముచే తనకు ఏర్పడిన అపవిత్రతను తొలగించుకొనుటకై విష్ణుపాదోద్భవయగు గంగను శిరస్సుపై ధరించెనట. కాని ఆ రుద్ర స్పర్శము కలిగిన గంగకు రౌద్రియను పేరు వచ్చెననెడు లోపమొకటి కలదు. రుద్ర శరీర స్పర్శమునొందిన పదార్థములు నిర్మాల్యాదులు అస్పృశ్యములని ఆయన భక్తులుగూడ వాటిని ధరింపక పరిహరించుట ప్రసిద్ధమేగదా! గంగకు కలిగిన అలోపమువంటిదేమియు కావేరికి లేదనుట ఒక విశేషము. శ్రీరంగనాథుడుభయ కావేరి మధ్యమున వచ్చి శయనించుట మరొక విశేషము. స్వపాద స్పర్శచే ఇతర వస్తువులకును పవిత్రతనాపాదించు స్వామియే వచ్చి స్వయముగా శయనించినపుడు ఇక దీని వైభవమెట్టిదో వేరే చెప్పవలెనా? యశోద యొడిలో శయనించినట్లు స్వామి ఈ నదీ మధ్యమున సుఖముగా శయనించెను.

శ్రీ పరాశరభట్టరువారు శ్రీరంగరాజస్తవములో 5 శ్లోకములతో కావేరీ వైభవమును ప్రశంసించుచూ "...ఫేనైర్హసంతీవ తద్గంగాం విష్ణుపదీత్వమాత్రముఖరాం ..." అని బహుధా శ్లాఘించియుండుట ఇచట స్మరణీయము.

"పొంగుపీర్ పరందు పాయుం పూంపొழில్" - అట్టి కావేరి జలసమృద్ధిచేతను స్వామి సన్నిధికి వచ్చితినిగదాయను హర్షాతిశయముచేతను పొంగిపొరలుచూ ఇచటి ఉద్యానవనములను పుష్ప ఫలవంతములనుగా చేయుచున్నది. భగవద్దివ్యదేహసౌకుమార్యమునకు తగినట్లు తోమాలలకు కావలసిన వివిధ పుష్పములను అర్పించుచూ ఉద్యానవనములు నిత్యము వసంతశోభను కలిగియున్నవి. దీనినిబట్టి శ్రీరంగక్షేత్రము యొక్క పవిత్రతయు రామణీయకతయు నిరూపితమైనది. "ఎంగళ్ మాల్ ఇఱైవన్ ఈశన్" - నావలె ఎందరో పరమ ప్రపన్నులైన ఆశ్రితులపైగల వ్యామోహముతో సర్వవియామకుడైన ఆ స్వామి యిచట వేంచెసియున్నాడు. ఈ కావేరీ సౌందర్య సౌగంధ్య శీతలత్వ పావనత్వములకు పరవశుడై ఇది శ్రీమహరమైన ప్రదేశమని యెంచి మక్కువతో స్వామి ఇచటికి రాలేదు. మరేమనగా- ఇచటనున్న నావంటి పరమ ప్రపన్న జనులపైగల వ్యామోహముతోనే ఇచటికి వచ్చెను. వ్యామోహముతో పాటు 'వీరు నావారు' అను ఆత్మీయత సర్వలోక రక్షణ సామర్థ్యము ఆయనలో నిండియున్నవి.

''కిడందదోర్ కిడక్కై కండుం" వెనుక చెప్పిన ఆశ్రిత వ్యామోహ సర్వ నియామకత్వాది గుణము లటుండనిండు. ఆయన నీటుగా శయనించియున్న ఆ విగ్రహ సౌందర్యమే ప్రేక్షకులను మైమరపించును. స్వామి యొకప్పుడు నిలుచుండి మరొ కప్పుడు కూర్చుండియు సన్నివేశము మారుచుండినచో ఈ శయన సౌందర్యమునకు భంగమే కలిగెడిది. పూర్తిగా ఒక ప్రక్కకు గాక వెల్లికెలయు గాక రెంటికిని మధ్య స్థాయిగా ఉన్న శయన సన్నివేశమే 'ఓర్కిడక్కై' అని ఇచట చెప్పబడిన్నది. "ఎంగనం మరందువాళ్గే" ఇత్యాది- ప్రాకృతమైన ఒక అద్భుత సన్నివేశమును ఒక్కసారి చూచినచో జీవితాంతము మరువలేము గదా. శేషశయ్యపై శ్రీరంగనాధుని ఈ దివ్యశయన సౌందర్యమును చూచిన పిదప మరచుటకు శక్యమగునా: "ఏళై యేన్ ఏళై యేఁ" అను ద్విరుక్తిచేత స్వామియొక్క సౌందర్య సాక్షాత్కారముచే తమకు కలిగిన వ్యామోహాతిశయమును పారవశ్యమును తెలిపినట్లయినది. వీరు పూర్వము లౌకిక విషయ సౌందర్యమునకు పరవశులై, అది లేనిచో జీవించలేనంతటి శైథిల్య మునొందిరి ఇపుడు పరమ భక్తిచేత భగవద్దర్శన వ్యామోహము పెరిగి 'ఇది లేనిచో నెట్లు జీవించి యుండగలను.' అనివాపోవుచున్నారు. పూర్వదశ కర్మ వశముచేత నేర్పడినది. ఇప్పటి స్థితి అప్రాకృత సౌందర్య సాక్షాత్కారముచేత కలిగినది.

**(24)** అవతారిక : తత్త్వజ్ఞాన మేర్పడి భక్తి పరిపాకము నొందిన వారికి ఒక్కొక్కప్పుడు వాఙ్మనస్సులకు అతీతమగు భగవత్ప్రభావమును తమ అత్యల్ప స్థాయిని గూడ తలంచుకున్నచో 'ఛీ ఛీ నేను ఆ స్వామిని తలంచుకొనుటకు గూడ అనర్హుడను' అని వెనుకాడుట జరుగును. శ్రీ యామునాచార్యుల వారు స్తోత్రరత్న మున భగవద్వైభవమును మహోన్నతముగా వర్ణించి అట్టి నా స్వామికి వివిధ సేవలు చేయుదునని ఆశించి చివరకు ఒక్కసారిగా తమస్థితిని తలచుకొని నైచ్యానుసంధానముతో దిగజారిపోయి ఇట్లనిరి.

శ్లో॥ ధిగశుచిం అవినీతం నిర్దయం మామలజ్జం
పరమపురుష! యోహం యోగివర్యాగ్రగణ్యైః ।
విధిశివసనకాద్యైః ధ్యాతుమత్యంతదూరం
తవ పరిజన భావం కామయే కామవృత్తః ॥

ఓ పురుషోత్తమా! నేనెంతటి అవివేకిని సిగ్గులేనివాడను. నాలో పవిత్రత గాని దయాగుణముగాని అణుమాత్రమైనను లేవే. ఛీ ఛీ! ఇంతటి అయోగ్యతయు ధూర్తతయు కలిగిన నేను నిన్ను సమీపించి సేవజేయనపేక్షించుటయా! ఎంతమాట! యోగీశ్వరులలో మొదటివారనదగిన బ్రహ్మ రుద్ర సనకాదులచేత గూడ తలంచుకొనుటకు సాధ్యముకాని మహోన్నతమగు నీ సేవాఫలమును పరమనీచుడనగు నేనపేక్షించుటయా! అని పై శ్లోకమునకు భావము. ఇట్లే శ్రీ శఠకోపమునీంద్రులును తమ తిరువాయ్మొళి ప్రబంధమున మొదట భగవంతుని అప్రమేయ వైభవమును నోరార కీర్తించి సౌలభ్య సౌశీల్యాది గుణములను కొనియాడి తత్పరవశులై ఆరాటపడి, పిదప ఒక్కసారిగా తమ స్థితిని తలంచుకొని "ఇంతటి అజ్ఞానిని దుర్వృత్తుడను అగు నేను స్వామిసేవను కోరుటకు అర్హుడనా? ఛీ ఛీ! ఇంతకంటె అవివేకము మరేమైనా ఉండునా!" అని నైచ్యానుసంధానముతో వెనుకడుగు వేయుచూ "వళవేళ్ ఉలగిన్ ముదలాయ" ఇత్యాదిదశకమును ప్రసాదించిరి "అడియేన్ శిరియ జ్ఞానత్తన్.... ఇతనిల్ మిక్కు ఓరయర్వుండే" అను పాశురమున ఈ విషయము సుస్పష్టము. ఇది మహాభక్తులలో కాదాచిత్కముగా కలుగు స్వభావోన్మేషము.

ఇట్లే ఈ శ్రీ విప్రనారాయణ మునీంద్రులును "మనత్తినాల్ నినైక్కలామే" "పేశత్తానావదుండో" ఇత్యాది వాక్యములలో వెనుక "వాఙ్మనసాతీతమగు ఆ దివ్య సౌందర్యమును ధ్యానించుటకుగాని కీర్తించుటకుగాని నేనెంతటివాడను" అని తమ అశక్తతను పురస్కరించుకొని "అగాధమగు ఈ భగద్విషయమును మరచి మనము దూరముగా నుండుటయే ఉచితము" అన్నట్లు వెనకకుమరలిరి కాని ఇంతటి ఆర్ద్ర భావముగల మహాభక్తులను ఆ స్వామి వదులునా? వారి మనస్సును సమాధానపరచి తిరిగి తన ప్రక్కకు త్రిప్పుకొనును. ఇట్టివారిని వశపరచుకొని స్వీకరించుటయే ఆయనకు అలభ్యలాభము. అపారకృపాసముద్రుడగు శ్రీ రంగనాధుడు వీరిపై తనకుగల వాత్సల్యరూపమగు ఉత్కట ప్రేమను ఆవిష్కరించి "నా సౌందర్యామృతమును కన్నులార ఆస్వాదింపుడు" అని తన సాక్షాత్కారమును విశదముగా కలిగించి వీరి మనస్సును ఆకర్షించెను. మరలకుండునట్లు దృఢముగా వశపరచుకొనెను.

ఆయనకు తమపై గల అవ్యాజప్రేమను చూచి మురిసిపోయిన వీరును తమ మనస్సునకు గట్టిశిక్షణను ఈ పాశురములో నేర్పుచున్నారు. 'ఓ మనసా : నీవెంతటి కఠినురాలవు. ఇతర లౌకిక వ్యక్తులపై వ్యామోహముతో ఇంతవరకును నీవు చూపి

యుండిన కపట ప్రేమమును ఈ స్వామిపైగూడ చూపకుము. నీ నిష్కపట భక్తిని ప్రకటించు కొనుము కాలమును వ్యర్థము చేయకుము' అని మందలించుచున్నారు.

పా॥ వెళ్ళనీర్ పరందు పాయుం విరిపొళిలరంగం తన్నుళ్
కళ్వనార్ కిడందవారుం కమలనన్ముకముం కండుమ్ ।
ఉళ్ళమే వలియైపోలుం ఒరువనెన్ఱుణరమాట్టాయ్
కళ్ళమే కాతల్ శెయ్దు ఉన్ కళ్ళత్తే కళిక్కిన్ఱాయే ॥

ప్రతి : వెళ్ళనీర్- కావేరీజల ప్రవాహము, పరందుపాయుం- విస్తరించి పారుటచేత, విరిపొళిల్- విశాలమగు తోటలతో నొప్పుచున్న, అరంగంతన్నుళ్- శ్రీరంగక్షేత్రమందు, కళ్వనార్- ఆశ్రితదోషములను హరించు స్వామి యొక్క, కిడందవారుం- శయనించియున్న సన్నివేశమును, కమలనన్ముకముం- కమలము వంటి సుందరముఖమును, కండుం- సేవించునవకాశమునొందిగూడ, ఉళ్ళమే- ఓ మనసా! వలియైపోలుం- నీవు కఠినురాలవైనట్లున్నావు, ఒరువనెన్ఱు- ఆస్వామి సాటిలేనివాడని, ఉణరమాట్టాయ్- ఎరుగలేకున్నావు, కళ్ళమే కాతల్ శెయ్దు- కృత్రిమ మగు భక్తినిచూపి, ఉన్కళ్ళత్తే- నీ కపట వ్యాపారముతోనే, కళిక్కిన్ఱాయే- కాలముగడుపుచుంటివే.

వివరణము : సహ్యమను పర్వతము నుండి పుట్టి బయలుదేరిన కావేరి అతి దూర ప్రయాణము సాగించి శ్రీరంగక్షేత్రము వరకును వచ్చినపుడు ఇచట స్వామిని సేవించితినను సంతోషముప్పొంగగా నాలుగు ప్రక్కల వ్యాపించినది. ఆ ప్రాంతము లనన్నిటిని ఫల పుష్పభరితోద్యాన శోభితముగా చేసినది. ఇచటికి స్వామి వేంచేసి జల సమృద్ధికి పుష్ప ఫల సమృద్ధికి మెచ్చి స్థిరవాసము నొందెనని కొందరు భావింతురు కాని అది పైకి కనబడు కారణము మాత్రమే. అదొక వ్యాజమును పెట్టుకొని ఆయన చేతన సంగ్రహార్థమై ఇచటనున్నాడు. పాశురములోని "కళ్వనార్" అను పదము ఈ విషయమును సూచింపుచున్నది కళ్వనార్ అనగా- దొంగస్వామి అని యర్థము.

శ్రీ వైకుంఠములోని నిత్యముక్త పురుషులు నిష్కపట భక్తితో ఆర్ద్రభరితులై స్వామిని సేవింపగా వారికి తను అట్లే దివ్యానుభవమును ప్రసాదించుచున్నాడు కాని ప్రకృతిమండలములోని సాంసారిక జీవులట్లుకాదు. వీరందరును దొంగలు ఆత్మాప

హారులు. వీరివి వశీకరింపుటకు ఆయనగూడ దొంగవేషమునే వేయుచున్నాడు కాబోలు "....దృష్టి చిత్తాపహారిణం" అనునట్లు చూపరుల చూపులను మనస్సులను హరించు టయే ఆయనచేయు దొంగతనము. సామాన్యజనమేగాక భక్తులువచ్చి సేవించినపుడు గూడ మొదట వారికి ఆయన ముఖమున ఈ చౌర్య లక్షణములే గోచరించును. ఫలా పేక్షతో తనవద్దకు వచ్చినవారికి ఆఫలమిచ్చి వారికి తెలియకుండనే ఆయన ఈ దృష్టి చిత్తాపహారమును లేక ఆత్మాపహారమును (ఆత్మలను వశీకరించుకొనుటను) చేసి తన కవచము లోపల జేబులో దాచుకొనును. వారినిగూడ క్రమముగా తన అంతరంగ భక్తులను చేసుకొనునని భావము

సర్వస్వామియగు భగవంతునికి స్వతఃదాసులైన జీవులు అనాదిగా మేమే స్వతంత్రులమని అహంకరించి భగవత్ప్రద్వామగు ఆత్మలను (తమను) అపహరించి ఆత్మాపహారవిషయమున రాటుతేలినవారైరి కనుకనే తన వస్తువులగు ఈ ఆత్మలను తిరిగి తాను స్వాధీనము చేసుకొనుటకు ఆయనగూడ ఈ చౌర్యవృత్తినే అవలంబించ వలసివచ్చెనని "కళ్వనార్" అను పదమునకు రసోక్తిగా వ్యాఖ్యాతలు ప్రసాదించిన స్వారస్యము భగవంతునికి కొందరు ఆత్మసమర్పణము చేసితిమని ఘనముగా చెప్పు కొందురు అది తప్పే. భగవంతువి వస్తువును దొంగిలించి తిరిగి ఆయనకు నేను సమర్పించితిననుకొనుట దోషమేగదా! బలి చక్రవర్తి చేసినది నిజముగా దానము కాదు. సర్వేశ్వరుని వస్తువగు భూమిని తిరిగి ఆయనకు సమర్పించుట దానమా? "త్వదీయం వస్తు గోవింద! తుభ్యమేవ సమర్పయే" అని వినయముతో నివేదించ వలసియుండగా "నేను దానము చేసితి"నని అతడు అహంకరించుట ఆత్మాపహార దోష పరాకాష్ఠయే అగును.

"కిడందవారుం కమలనన్మఖముంకండుం"— ఇట్టి సాహంకార జీవులను వశీకరించుకొనుటకై స్వామి రెండు విధములైన వలను విసరెను. అందొకటి శయన సన్నివేశ సౌందర్యము రెండవది కమలమువంటి ముఖ సౌందర్యము. "స మయా బోధితః శ్రీమాన్-సుఖసుప్తః . అన్నట్లు శయనకాలికమగు రీవియు ప్రసన్న ముఖ ముద్రయు ప్రేక్షకులను ఆకర్షించునవి వికాసము- కాంతి- పరిమళము- చల్లదనము ఈ గుణములను బట్టి తామరపుష్పము స్వామియొక్క ముఖ సౌందర్యమునకు కొద్ది మాత్రము ఉపమానము కావచ్చునేమోగాని, సంపూర్ణ సామ్యము సంభవము కాదు. అప్రాకృత తేజోమయ ముఖమునకు నిజముగా కమలము సమానము కాగలుగునా?

ఆశ్రితుల విషయమున ఆలస్యమును భరింపలేక ప్రతి క్షణము దయారసము నొలికించు చల్లని ఈ ముఖ సౌందర్యము సర్వథా అసదృశమే.

"ఉళ్ళమే: వలియైపోలుం" ఓ మనసా! ఈఅందమును చూచిన నీవు ఇంకను స్వామికి "జితంతే" "దాసోహం" అనకుండ ఇనుమువలె దృఢముగా నుంటివేమి? సేవించినతోడనే ఈయనయే "ఏకమేవా ద్వితీయం" అనబడిన పరమాత్మయని నీవు గుర్తించవలెను. ఆతత్త్వమునెరిగిన వెంటనే నీలో ఆర్తి కలుగవలెను. ఈ మార్పు లను పొందని నీవు కఠినురాలవే సుమా! "కణ్ణమే కాదల్ శెయ్దు" ఇత్యాది. సౌందర్య మాస్వాదించిన నా నేత్రములు తృప్తి నొందినవనియు ఆనందబాష్ప ప్రవాహమును పొందితిననియు మీలో కలిగిన మార్పును రెండు పాశురములలో "కళిక్కుమారే" "పనియరుంబు ఉదిరుంఆలో" అనియు తెలిపియుంటిరిగదా! అన్నచో అది నీ కపటనాటకమే ఎందుకనగా, వెనుక నీవే "మాదలార్ కయల్ గణ్ణేన్నుం వలై యుళ్పట్టు ఆళుందువేనై" అని చెప్పినట్లు సామాన్య యువతుల సౌందర్యమునుచూచి గూడ ఇట్లే ఆనందబాష్పాది వికారములను పొందలేదా? ఇపుడును అట్లె నటించు చుంటివి. ఇది నిష్కల్మష భక్తి కాదేమో! కనుక క్షణిక సుఖమునకై వారిపై చూపిన కపట ప్రేమను వీడి, శ్రీ రంగనాథుడే నా సర్వస్వమను పూర్ణ విశ్వాసము నుంచి నిష్కపట భక్తితో స్వామిని సేవింపుము.

**(25)** అవతారిక : వెనుకటి పాశురమున- తమ మనస్సులో ఇంతవరకు కలి గినది కృత్రిమభక్తియేగాని నిష్కపట స్థిరభక్తి కాదని తామే శంకించి, అట్టి కపట ప్రవృత్తి నిమాని స్థిర విశ్వాసముతో స్వామిని సేవింపుమని మనస్సునకు శిక్షణనిచ్చి మందలించిరి. వీరు ఇకపైన ఆత్మ విమర్శలో పడిరి. నానా దుఃఖహేతువగు ఈ ప్రకృతి సంబంధము సమూలముగా పోవలెను గదా! అది తొలగిపోయినపుడే శ్రీ వైకుంఠధామము చేరుట- అచట శాశ్వతానంద రూప మోక్ష ఫలప్రాప్తియు సంభవము. "సమాహితైస్సాధు సనందనాదిభిః సుదుర్లభం" అన్నట్లు దుష్కర యోగ సమాధినిష్ఠులైన సనకసనందనాదులకే లభింపని ఆ మహాఫలమును ఆశించుటకు నాలో అణుమాత్రమైన యోగ్యతయులేదే! నిత్య సంసారినై సంసారకూపమున పడియుండ వలసినదే తప్ప నేనాముక్తిని పొందుటకు నోచుకొనలేదుగదా! అని వీరిలో నైరాశ్య ముతోపాటు దుఃఖము కలిగినది. వీరి శోకమును తీర్చుచూ శ్రీరంగనాథుడు "నేను మీవంటివారికొరకే శాస్త్రదీపమును ఇచ్చితినిగదా! అందులో చెప్పబడిన సాధనముల

నేవై నలనుష్ఠించినచో మీరు తప్పక నా సన్నిధికి చేరగలరు. శోకమెందులకు? అట్లు శాస్త్రసిద్ధమగు మార్గమునవలంబించి సాధన చేయుడు"– అని సముదాయించెను.

దానికి సమాధానముగా ఇచటినుండి పై 10 పాశురములలో ఆ యోగ్యతను పొందగల అవకాశము తమలో అసలేలేదని విన్నవించుకొనుచున్నారు. ఇచట నొక చిన్న ఆశంక- "అయ్యప్పాడు అరుత్తుత్తోన్లుం అళగణా" "ఆదరం పెరుగవైత్త అళగణా" అని వెనుక వీరే తమకు స్వామి సర్వసంశయచ్ఛేదన పూర్వకముగా జ్ఞానమును భక్తిని కలిగించినట్లు చెప్పిరిగదా! ఆ జ్ఞాన భక్తులే సాధనములు గావున- ఇప్పుడెట్టి యోగ్యతయులేదని చెప్పుట పరస్పర విరుద్ధమేగదా! దీనిపై సమాధాన మేమనగా: భగవదనుగ్రహముచే తమకు కలిగినట్లు వెనుక చెప్పిన ఆ జ్ఞానభక్తులు ప్రేమరూపములై ఇచట భగవద్గుణానుభవ రుచిని కలిగించి పెంచుటకు ఉపయోగించునవి మాత్రమే. శాశ్వతానందానుభవ రూప మోక్ష ఫల ప్రాప్తికి సాధనములగు జ్ఞానయోగ భక్తియోగములు అష్టాంగయోగరూప ధ్యానరూపములు. ఇవి నాలో లేవని ఇపుడు చెప్పుచున్నారు. కావున విరోధములేదు.

ఇపుడీ 25 పాశురమున కర్మ- జ్ఞాన- భక్తియోగములు మూడింటియందును నాకు సంబంధములేదని తెలుపుచున్నారు.

పా॥ కుళిత్తు మూన్ఱనలై యోంబుం కురికొళందణమై తన్నై
యొళిత్తిట్టేన్, ఎన్గణిల్లై, నిన్గణుం పత్తనల్లేన్ ।
కళిప్పదెన్ కొండు నంబీ! కడల్వణ్ణా! కదరుగిన్ఱేన్ ।
అళిత్తెనక్కరుళ్ శెయ్ కండాయ్ అరంగమానగరుళానే ॥

<u>ప్రతి :</u> కుళిత్తు- స్నానముచేసి, మూన్ఱు అనలై- త్రివిధాగ్నులను, ఓంబుం- హోమముతో అర్చించుచూ, కురిగొళ్- సక్రమముగా కాపాడుకొనవలసిన, అన్దణమై తన్నై బ్రాహ్మణత్వమును, ఒళిత్తిట్టేన్- పోగొట్టుకొంటిని, ఎన్గణిల్లై- నన్ను గురించిన ఆత్మజ్ఞానములేదు నిన్గణుం- నీ విషయమై, పత్తన్ అల్లేన్- సాధన భక్తి లేనివాడనైతిని ఎన్కొండు కళిప్పదు- ఏ కారణమునుబట్టి తృప్తినొందుదును? నంబీ! సద్గుణ పరిపూర్ణుడా! కడల్వణ్ణా! సముద్రమువంటి నీలవర్ణము కలవాడా! అరంగ మానగరుళానే! శ్రీరంగనాధుడా! కదరుగిన్ఱేన్- ఆక్రోశించుచున్నాను ఎనక్కు అళిత్తు- నా విషయమై అనుగ్రహమును చూపి, అరుళ్శెయ్కండాయ్- కటాక్షింపుమా.

వివరణము : బ్రాహ్మణ్యసిద్ధికి స్నాన- సంధ్యావందన- అగ్నిహోత్ర హోమాదులు అవసరము. అందు స్నానము నిత్యకృత్యమే గాక, నైమిత్తికము ప్రాయశ్చిత్తార్థముగూడ కలదు. గ్రహణ సంక్రమణాదులలో నైమిత్తిక స్నానము. అశుచిత్వ హేతువగు క్రియాలోపాదులు కలిగినపుడు ప్రాయశ్చిత్త స్నానము దేనికది ప్రత్యేకమేగాని, ఒక్కదానితోనే అన్నియు సమకూరవు. ఇక స్నానానంతరము సంధ్యావందన పూర్వకముగా త్రివిధాగ్నులలో హోమ వ్యాపారము. దాక్షిణాత్య ఆహవనీయ- గార్హపత్యములని అగ్నులు త్రివిధములు. మూడింటిలోను ఆయా దేవతల నుద్దేశించి సస్వర మంత్రోచ్చారణపూర్వకముగా చేయవలసిన హోమములను వేరువేరే. పాశురమున "అనలై" అనుపదము ప్రయోగించుటలో ఒక విశేషమున్నది. (అలం-న- అనలః) ఎంత హోమ ద్రవ్యములను వేసినను "చాలును అనదు" కావున అగ్నికి ఆ పేరు వచ్చెనట. అగ్నిదేవత తృప్తిలేనివాడని యర్థము. (నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం) అను శ్లోక ఖండము ప్రసిద్ధమేగదా! అట్టి అగ్నులు ఒకటికాదు- మూడు. మన్త్రలోపమో క్రియాలోపమో ద్రవ్యలోపమో ఏది జరిగినను మహాదోషమే. ఆ దోషములను పరిహరించుకొనుటకు కఠోర ప్రాయశ్చిత్తములను ఆచరించుటకు చచ్చినంత ప్రయాసపడవలెను ఒక్కొక్కప్పుడు ఈ లోపములచే బ్రహ్మరాక్షసత్వమే ఏర్పడును. ఇట్లు నిత్యము యజ్ఞాది కర్మలచే దేవతల నారాధించినగాని బ్రాహ్మణ్యము సిద్ధింపదు. తాను ఎన్ని అపచారములను చేసినను చివరకు పశ్చాత్తాపపడి "స్వామీ! క్షమించుము" అన్నచో క్షమించగల దయార్ద్ర హృదయులు కారుగదా ఇతర దేవతలు. అట్లు ఎంతో శ్రమపడి నిలుపుకొనవలసిన బ్రాహ్మణ్యమును పోగొట్టుకొని నేను జాతిభ్రష్టుడనైతిని. నా దుశ్చర్యలచే జాతికే కళంకమును తెచ్చితిని.

"ఎణాగణిల్లై"— ఇక జ్ఞానయోగ సాధ్యమగు ఆత్మజ్ఞానముగూడ నాకులేదు. శమదమాది గుణ సంపత్తి కలిగి సాధించవలసిన జ్ఞానయోగము సిద్ధించుటకు వెనుక చెప్పిన కర్మయోగము అంగము. "యజ్ఞశిష్టాశినః సన్తః ముచ్యంతే సర్వకిల్బిషైః" అని గీతలో చెప్పినట్లు యజ్ఞశిష్టాహారముతోనే పాపక్షయమై మనోనైర్మల్యము ఏర్పడగా ఈ జ్ఞానయోగసిద్ధి గదా! ఆ కర్మయోగమే లేనపుడు జ్ఞానయోగము లేదని మరల వేరే చెప్పవలెనా! అని శంకించెదరేమో! కొందరికి ఈ జన్మలో కర్మాచరణము లేకున్ననూ పూర్వ జన్మకృత బహు యజ్ఞాది కర్మలచేత ఈ జన్మలో జ్ఞానయోగసిద్ధి కావచ్చును. నాకు అదియులేదని ఇచట తాత్పర్యము.

“విన్నణుంవత్తనర్లేళ”- దయానముద్రుడవగు నీపైనగూడ నాకు భక్తి లేదు. “ఉభయవరికర్మిత స్వాంతస్య” అని శ్రీ యామున మునీంద్రులు వ్రిసాదించినట్లు కర్మ- జ్ఞాన- యోగములు రెంటిచేతను లభించవలసినది ఈ అష్టాంగ భక్తి యోగము ....తపోజ్ఞాన సమాధిభిః- నరాణాం క్షీణపాపానాం కృష్ణే భక్తిః ప్రజాయతే” అన్నట్లు ఈ జన్మలో ఆరెండు లేకున్నను పూర్వజన్మకృతములైన వాటినిబట్టి కొందరిలో భక్తి ఉదయించవచ్చును. నాలో అవేమియు బొత్తిగా లేవు. లేక- మరొక విధముగా సమన్వయమేమనగా: కర్మ- జ్ఞానములు భక్తికి అంగములు అనురీతిగాక, ఈమూడు యోగములు ప్రత్యేకించి మోక్షమునకు సాక్షాత్తుగా (నేరుగా) ఉపాయములే అను పద్ధతియు కలదు. ‘‘కర్మణైవ హి సంసిద్ధిం- ఆస్థితాజనకాదయః’’ అనియు, “సర్వం కర్మాఖిలంపార్థ: జ్ఞానే పరిసమాప్యతే’’ అనియు, ‘‘భక్త్యాత్వనన్యయా శక్యః- అహమేవం విధోర్జున” అనియు గీతలోనే చెప్పబడెనుగదా: ఆ మూటిలో నేదియు నాలో లేదని తాత్పర్యము నోత్తనోన్పిలేళ, నుణ్ణరివిలేళ’’ అని శ్రీ శఠకోప మునీంద్రులును. “కరవైగళ్పిళాళెన్ఱు కానంశేర్న్దు ఉణ్బోం” అని శ్రీ గోదాదేవియు, ‘‘న ధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ- న భక్తిమాఞ్ త్వచ్చరణారవిందే” అని శ్రీ యామునా చార్యులవారును ఇట్లే తమ అయోగ్యతను పురస్కరించుకొని శరణాగతిని చేసిరి

‘‘కళిప్పదు ఎళాకొండు”- “అనుతాపేనశుద్ధ్యతి” అని శాస్త్రములో చెప్పినట్లు తీవ్రమగు పశ్చాత్తాపము ఉండినచో భగవదనుగ్రహ పాత్రుడు కావచ్చును. కాని నాలో అదిగూడ లేదే. ఇకనేమని నేను మనస్సమాధానము చేసికొందును? ఏదో ఒక అర్హతయైన నాలో కలదని తృప్తిపడుటకు నాకు అస్కారమే లేదు. నేను పూర్తిగా ‘అకించనుడను’ అని భావము.

అట్లయినచో ఇక మీకు మోక్షార్హతలేదు పొమ్మని స్వామి యనవచ్చును. వెంటనే “నంబీ:”యని వీరు సంబోధించుచూ “నేను అయోగ్యుడనైనను నీవు నిర పేక్షరక్షకుడవు గదా: దయాది సద్గుణపూర్ణుడవు గదా: రక్షింపలేవా,” అను భావమును ప్రకటించుచున్నారు. నేను దోషపూర్ణుడను. నీవు సౌశీల్యాది గుణపూర్ణుడవు. నంబి- యనగా పూర్ణుడని యర్థము. ఇట్లే శ్రీ గోదాదేవియు తిరుప్పావై ప్రబన్ధమున “అరి వొన్ఱుమిల్లాద....” అని చెప్పి వెంటనే “కుఱై వొన్ఱుమిల్లాద” అని సంబోధించెను. “కడల్వణ్ణా” సముద్రమువలె నీలమగు నీ దేహసౌందర్యమే మాకు అహ్లాదమునిచ్చి ఆకర్షించుచున్నది. ఈ సౌందర్యమే నీ పరత్వమును మాకు తెలిపి మాలో భక్తిని గూడ పెంచినది. “కదరుగిన్ఱేళ”- ఏమేమో కర్ణకఠోరముగా పలుకుచున్నాను. అన్ని

సాధనములను ఆచరించి ఫలమునకై ఎదురుచూచుచూ ఎప్పుడెప్పుడని ఆక్రోశించు భక్తు వివలె ఏ సాధనానుష్ఠానమును చేయని నేననూ "స్వామీ రక్షింపు"మని ఆక్రోశించుట చోద్యమే నా ఆక్రోశమును ఆరాటమును విన్న లోకులు "స్వామికి దయలేదా. పాప ఏతనిని రక్షింపడేమి?" అని నిన్ను నిందించునట్లు నేను నీకు అవద్యమునే కలిగించుచుంటిని. "అయితే ఏమిచేయమందువయ్యా!" అందువేమో! "అళిత్తు ఎనక్కు అరుళాయ్" అనుగ్రహ పూర్వకమగు నీ శీతల కటాక్షమును నాపై ప్రసరింపజేయుము. "అన్నియు నేనే నీకు చేసిపెట్టవలెనా కొద్ది మాత్రమైనను యోగ్యతను నీవు సాధించుకొనిరమ్ము" - అందువేమో! "అరంగమానగరుళానే!" నీవు పరమపదమునుండి ఇచటికి పనిగట్టుకొని వచ్చియున్నదెందులకు? మావంటి అకించన వ్యక్తులకు నీ సౌందర్యమును చూపి ఆకర్షించి భక్తిని కలిగించి రక్షించుటకేగదా! లేనిచో నీవు అక్కడనే యుండవచ్చును గదా! నీవే మావంటివారికి శరణ్యుడవని సారాంశము.

**(26)** అవతారిక : కర్మజ్ఞాన భక్తియోగములు లేకున్ననూ అందరికినీ అవకాశముగల అర్చనము - స్తుతించుట - మొదలగువాటి ననుష్ఠించి ఉజ్జీవించవచ్చును గదా! అందువేమో! స్వామీ! అవియు నాలో లేవు అని ఇందు విన్నవించుచున్నారు.

పా॥ పోదెల్లాం పోదుకొండు ఉన్పొన్నడి పునైయమాట్టేన్ ।
తీదిలా మొళిగళ్కొండు ఉన్తిరుక్కుణంశెప్పమాట్టేన్ ।
కాదలాల్ నెంజుమన్బు కలన్దిలేన్ అదుతన్నాలే ।
ఏదిలేనరంగర్కెల్లే యెన్ శెయ్వాన్ తోన్రినేనే ॥

ప్రతి : పోదెల్లాం - సర్వకాలములయందును, పోదుకొండు - పుష్పములను తెచ్చి, ఉన్పొన్నడి - నీ సుందర శ్రీపాదములను, పునైయమాట్టేన్ - పూజించలేకుంటిని. తీదుఇలా - దోషములులేని, మొళిగళ్కొండు - శబ్దములను కూర్చుకొని. ఉన్తిరుక్కుణం - నీయొక్క సద్గుణములను, శెప్పమాట్టేన్ - చెప్పలేకపోయితిని, కాతలాల్ - అభినివేశముతో, నెంజం - మనస్సులో, అన్బుకలన్దిలేన్ - నీపై ప్రేమను పొందలేకపోయితిని. అదుతన్నాలే - ఆకారణముచేత, అరంగనార్కు - శ్రీరంగనాథునికి, ఏదిలేన్ - ఏమియు చేయలేకపోయితిని, ఎల్లే - అయ్యో! ఎన్శెయ్వాన్ తోన్రినేన్ - ఏమి సాధించవలెనని పుట్టితిని?

వివరణము : అందమైన పుష్పములనుతెచ్చి నీ శ్రీపాదపద్మములను వాటితో సర్వకాలమును అర్చించవలసియుండగా నాకు అందులో శ్రద్ధగాని శక్తిగాని లేవు.

ఇతర విషయములలో మాత్రము శ్రద్ధాశక్తులు పూర్తిగానున్నవి. "యౌ తత్పూజా కరౌకరౌ" అన్నట్లు నీ పాదసేవచేయవలసిన చేతులతో అనర్థావహములగు పాపకార్యములనెన్నింటినో చేయుచుంటిని. "పోతుఎల్లాం" అనుటచేత సర్వకాలములయందును నీ అర్చన చేయజాలకుంటినని తాత్పర్యము. మునుపు అనియో ఇపుడనియో భవిష్యత్తులోనవియో చెప్పక, "సర్వకాలములయందును" అని ఎందుకు తెలిపిరనగా- ఎప్పుడైనను ఒకసారి స్వామి నర్చించినను అంతమాత్రముచే స్వామి రక్షించగలడు- నేనా ఒకసారియైననూ చేయులేని స్థితిలోనుంటినని సూచన చేయుటకై అట్లనిరి. "సకృదుచ్చరితం యేన- హరిరిత్యక్షరద్వయమ్" అనియు "సకృత్స్మృతోపి గోవిందః" అనియు "సకృదేవ ప్రపన్నాయ" అనియు ఈ ప్రమాణములు ఒకసారి అర్చనచేసినను ముక్తికి అవకాశమును తెలుపుచున్నవి గదా.

సరే! అర్చన ప్రణామాది శరీర వ్యాపారములు చేయలేకున్ననూ ఒకచోటనే కూర్చొని వాక్కుతో నన్ను స్తుతింపవచ్చును గదా! మీరు రసవంతముగా నిర్దుష్టముగా కవితనల్లుదురుగదా! అట్లు స్తుతింపుడు- అని స్వామి కోరగా— "తీదిలా మొళిగళ్" ఇత్యాది సమాధానము. నా కవిత నిర్దుష్టమేయైనను నీ కల్యాణ గుణములను వర్ణించమన్నచో అందులకు నా నాలుక సిద్ధపడదు. దుర్గుణభూయిష్ఠులైన క్షుద్రులను ఎంతైనను వర్ణించునుగాని "సా జిహ్వా- యా హరిం స్తౌతి" అన్నట్లు నీ సద్గుణములను వర్ణింపనొల్లదు. ఇది నా పాపము.

శరీరమో వాగింద్రియమో ఇష్టపడకున్నను మీ మనస్సును నాపై ప్రేమభరితమగునట్లు చేయరాదా! అందువేమో! అదియు నా మాట వినదు అని "కాదలాల్ నెంజం అన్బుకలన్దిలేన్" అని బదులు చెప్పుచున్నారు. అభినివేశ పూర్వకముగా నిష్కపట ప్రేమను చూపుటయన్ననేమో నా మనస్సునకిప్పటివి తెలియదు. "సంగాత్సంజాయతే కామః" అన్నట్లు ప్రేమయన్నది నాకొకరిపై నిజముగానున్నచో దానిని నీపై మరల్చియుందును. పూర్వము యువతులనో ఇతరులనో ప్రేమించినట్లు నటించితినిగాని అది నిస్స్వార్థముగా కాదు. వారి ధన మానముల నపహరించుటకే ప్రియుని వలె నటించితిని. వారిపై నాకు నిజమైన ప్రేమలేదు నీపైగూడనంతే

"పరమ సుహృది బాంధవే కళత్రే-
సుతతనయా పితృ మాతృ భృత్యవర్గే
శఠమతి రుపయాతి యోర్థతృష్ణాం
తమధమచేష్ట మవైహి నాస్య భక్తమ్" ॥ అని

విష్ణు పురాణమున తెలిపినట్లు నేను అధముడనేగాని నీపై భక్తి కలవాడనుకాను. నమ్మిన మిత్రుని బంధువును భార్యను పుత్ర పుత్రీవర్గమును మాతా పితరులను భృత్యులనుగూడ ధనాశతో నెవడు బాధపెట్టునో. అట్టివాడు అధముడేగాని విష్ణుభక్తుడుకాడని గుర్తింపుమని యముడు తన భృత్యులకు చెవిలో చెప్పెనట.

“కాయేన వాచా మనసా” అన్నట్లు కరణత్రియమును నీపై లగ్నము చేయవలసియుండగా, అందులో నొక్కటియును నీకు ఉపయోగముగా అనుకూలింపకున్నదియని “అదుతిన్నాలే అరంగర్కు ఏదుమిలేన్” అను వాక్యములో వివరించిరి. “ఎల్లే”- అయ్యో! నా స్థితి ఎంత నీచమైనది.

“సుహృదం సర్వభూతానాం” అన్నట్లు అందరిపైనను సమానముగా సౌహార్దము కలిగి, “ఋజుః” అన్నట్లు మనోవాక్కర్మలలో కపటములేని సమత్వము (ఆర్జవము) కలిగి, ఆ మహాగుణములను నామమాత్రమేనన్నట్లుగాక ఆచరణలోగూడ చూపించుటకై నీవు శ్రీరంగక్షేత్రమునకు వచ్చి మాకు సన్నిహితుడవైయున్నను నా మనోవాక్కాయములలో ఏ ఒక్కదానినైననూ నీకుపయోగించలేకపోయితినే! స్వామీ! నీవు అతిదూరస్థుడవగుటచేతనో, సన్నిహితుడవైనను నా తప్పులెంచువాడవగుటచేతనో, నాకు ఆప్తబంధువువు కాకపోవుటచేతనో, నేను నీకు దూరమైనచో సరేలెమ్మని మనస్సమాధానము చెప్పుకొనవచ్చును. కాని అన్నియు ఉండి నీ సేవకు దూరమగుటకు నా ప్రబలపాపమే కారణము. కౌస్తుభరత్నమువలె నీకు స్పృహణీయమైన నాపరిశుద్ధాత్మ బురదలోపడి నిరుపయోగమై పోవుచున్నది. హితబుద్ధితో ఒకడు ఆరోగ్యప్రదమగు మందును ఇచ్చి త్రాగమన్నచో, అది ఆరోగ్యహేతువేయైననూ చేదుమందైనచో విడుచుటలో అర్థమున్నదిగాని, పాలను త్రాగమన్నచో ఎవడైన వద్దనునా? నేను అందులకుగూడ నోచుకొనని భ్రష్టుడను అని “ఎల్లే” అను ఆశ్చర్యార్థపదసూచితమగు భావము

“ఎన్ శెయ్‌వాన్ తోన్దినేన్”– “విచిత్రా దేహసంపత్తిః- ఈశ్వరాయ నివేదితుం” శరీరేంద్రియ ప్రాప్తిరూపజన్మము ఈశ్వరసేవకై ఉపయోగపడి ఈ ఆత్మను ఉజ్జీవింపవలెనని శాస్త్రములు ఘోషించుచుండగా- ఎందుకును కొరగాని ఈ జన్మము కలిగి యేమి ప్రయోజనము? “పిరన్దేన్” పుట్టితిని- అని ప్రయోగింపక “తోన్దినేన్” అని చెప్పుటకేమికారణమనగా- “తోన్దినేన్” అను పదమునకు -అభాసముగా తోచి అంతర్థానమగుటయని అర్థము. ఆకాశమున తోకచుక్కలు మొదలైనవి ఆభాసించి

(ఆవిర్భవించి) అంతర్థానమగుచు లోక వినాశహేతువులే అవిగాని, వేరే ప్రయోజనము లేదు. నేనుగూడనట్లు ఇతరులకును అనర్థమును కలిగించుటకే పుట్టితినిగాని ప్రయోజనమేమియు లేదని భావము. "నిర్వేదమాయాత్" అను శ్రుతిలో చెప్పినట్లు ముముక్షువునకుండవలసిన సంపూర్ణనిర్వేదము వీరిలోకలదని ఈ పాశురము సూచించుచున్నది'

**(27)** అవతారిక : మనుష్యులకొరకై శాస్త్రోక్తములైన విశేషధర్మములో సామాన్య ధర్మములో మీకు లేకున్నను ఆదిశేషుడు గరుడుడు హనుమంతుడు వానరములు మొదలైనవారు చేసిన సేవలవలె మీరును ఏదో చేయలేరా. నేను వానరులతో పాటు వివిధ తిర్యగ్జంతువులనుగూడ అనుగ్రహించుతలంపుతో రాముడనై అవతరించినపుడు నిర్మలమైన ప్రేమతో ఉడతలుగూడ సేతుబన్ధమునందు శక్తికొలది కించిత్సేవను చేసినట్లుగా మీరును చేయవచ్చునుగదా! అని శ్రీరంగనాధుడు పలికినపుడు, ఆ జంతువులవలెగూడ నేను కించిత్కారమును చేయలేకుంటినని ఈ పాశురమున వీరు నివేదించుచున్నారు.

పా॥ కురంగుగళ్ మలైయై నూక్క క్కుళిత్తు తాంపురండిట్టోడి
తరంగనీరడైక్కలుత్త శలమిలావణిలుం పోలేన్ ।
మరంగళ్ పోల్ వలియనెంజం వంజనేన్ నెంజుతన్నాల్
అరంగనార్కాళ్ శెయ్యాదే యళియత్తే నయర్కిన్ఱేనే ॥

ప్రతి : కురంగుగళ్ - వానరములు, మలైయై - పర్వతములను, నూక్క - మోసుకొనితేగా, తాంకుళిత్తు - తాముగూడ నీటిలోమునిగి, పురండిట్టు - బైట ఇసుకలో పొర్లి, ఓడి - పరుగెత్తివచ్చి, తరంగనీర్ - తరంగములుగల సముద్రమున, అడైక్కలుత్త - సేతుబంధమునకు ఉద్యమించిన, శలమిలా - కపటములేని, అణిలుం - ఉడతలనుగూడ, పోలేన్ - పోలియుండనైతిని, మరంగళ్ పోల్ - చెట్లవలె, వలియనెంజం - కఠినమగు మనస్సుగల, వంజనేన్ - వంచకుడనైన, అళియత్తేన్ - దయనీయుడనైన నేను, అరంగనార్కు - శ్రీరంగనాధునికి, నెంజుతన్నాల్ - హృదయపూర్వకముగా, ఆళ్ శెయ్యాదే - సేవనుచేయక, అయర్కిన్ఱేనే - కష్టపడుచుంటినే.

వివరణము : వానర వీరులు సేతువును బన్ధించు సమయమున ఉడతలుగూడ తమవంతుగా చేతనైనంత సహాయపడి శ్రీరామ కైంకర్యముచే ధన్యతనొందవలెనని

ఆరాటపడినవట. అవి మొదట నీటిలో మునిగి పిదప బైటవడ్డున నున్న ఇసుకలో పొర్లి తమ శరీరమునకంటిన ఆ ఇసుక రేణువులను పర్వతములతో కట్టబడుచున్న సేతువుపై విదలించుచున్నవట. వాటికిగూడ స్వామిపై నిజముగా ఎంత నిష్కల్మష భక్తియో! ఈ కథ వాల్మీకి రామాయణమున లేదుగాని, ఇతర రామాయణములలో నున్నది. లోకములో విపుల ప్రచారమునొందినది. వాటివలెనైనను స్వామిని సేవించ గల భావశుద్ధి నాలో కించిత్తైన లేదేయని ఈ ఆళ్వారుల నిర్వేదము

"కురంగుగళ్ మలైయై నూక్క"- అగాధమైన సముద్రమున అట్టడుగు నుండి నీటిపైవరకును, ఈ ఒడ్డు నుండి లంకానగరము వరకును, సేతువును బంధించుట మానవశక్తికి మించిన విషయము. కాని శ్రీరాముని ప్రభావము వానరవీరుల అసాధారణ శక్తియు ఆ ఘన కార్యసాధనకు దోహదపడినవి. పర్వతములతో సముద్రమును పూడ్చునపుడు ప్రపంచములోని పర్వతముల సంఖ్య పరిమితము, వానరుల సంఖ్య అనంతమునై యున్నందున ఒక్కొక్క పర్వతమును అనేకులు వానరులు మోసుకొని వచ్చుచుండిరి. అట్లు పలువురు కలసి మోయుట ఒక్కొక్కడే అంత పర్వతమును మోయలేక కాదు. వారిలో అవలీలగా ఒక్కొక్కనికే అసహాయముగా అంత పర్వతమును మోయగల శక్తియున్నను శ్రీరామ కైంకర్యమును అందరమును కలసి పంచుకొనవలెనను భక్తియే వారు అట్లు కలసి ప్రవర్తించుటకు కారణమైనది వరమానందయ్యగారు సూదిని తెమ్మని ఆజ్ఞాపింపగా శిష్యులందరు కలసి గురుభక్తితో ఆ చిన్న కార్యమున నన్వయించినట్లుగా వానరులును తామందరును ఈ కైంకర్యమున అన్వయించవలెనను ఆదరముతో పనిచేసిరి. కొందరిచేతనే ఈ కార్యము ముగియునపుడు తక్కిన వారందరికిని ఈ సేవాభాగ్యము లభించకపోవునుగదా! ఆ వానరులకుగాని ఉడతలకుగాని స్వామిపై అంతటి గౌరవభావము సేవాప్రవృత్తియు కలుగుటకు ముఖ్యకారణము ధనుస్సుపై భుజమునానించి ప్రత్యాలీఢపాదుడై ఠీవిగా నిలిచి యున్న శ్రీరాముని దివ్య మంగళ విగ్రహ సౌందర్య సందర్శనమేగదా! ఈ పరమ పురుషునికి సేవను చేయనిచో మన జన్మ యెందులకు? అనే అభినివేశము వారిలో ఉత్సాహరూపమున ఉరకలు వేసినది.

"మలయైనూక్క"— సముద్రమున విసిరివేసి అని చెప్పక (నూక్క) మోసుకొనితెచ్చి యనుటలో ఒక విశేషము కలదు. వానరులు బారులుగా నిలబడి ఒకరికి మరొకరు గుంపులు గుంపులుగా చేతులతో నందించుచుండగా క్రమముగా మోయుచూ పర్వతములను సముద్రములో వేసిరని భావము.

"అవగాహ్యార్ణవం స్వప్స్యే" అని శ్రీరాముడు సీతా విరహ సంతాపమును భరింపజాలక తాపశాంతికై సముద్రములో మునిగి శయనింతునని ఆవేశపడుచున్నాడు. ఆ ఉద్వేగమును చూచి ఊరుకొనలేక వానరులందరును త్వరపడుచూ సేతుబంధన కార్యమున వ్యగ్రతనొందిరిగావి, కొందరు ప్రవర్తించిరిగదా ఇక మనయవసరము లేదు అని ఉదాసీనతను ఎవరును చూపలేదు.

"కుళిత్తు త్తాంపురండిట్టోడి ..." ఇత్యాది. ఇక ఉడతలు చేసిన వ్యాపారమేమనగా- సముద్రములో వేయబడు పర్వతములకు రాళ్ళకునడుమ మట్టిని ఇసుకను వేసి పూడ్చవలెను గదా! ఆ పనిని వానరులు చేయుటలేదని తలచి అవి నీటిలో మొదట మునిగి ఆ తడితో ఇసుక తమ దేహమున అద్దుకొననట్లు బైట ఇసుకలో పొర్లి పిదప వచ్చి ఈ పర్వత శిలలపై తమ దేహమును దులుపుకొనుచున్నవి. అట్లు వేగముగా మట్టిని పూడ్చుట తమ పనియని భావించినట్లు (తాం) అనుపదము సూచించుచున్నది. వాటిలోగల ఆ తొందరను చూచి ఎవరైనను "ఎందులకు మీకీవేగ"మని యడిగినచో "మా శ్రీరామచంద్రస్వామికి నేడు మధ్యాహ్న భోజనము లంకానగరపు ఉత్తర ద్వారమువద్దనే జరుగవలెను. అప్పటివరకీ సేతు కార్యము పూర్తికావలెను" అని సమాధానమిచ్చుచున్నవి అయితే నిజముగా ఈ ఉడతలు దులుపు మట్టితోనే ఈ పని పూర్తియగునాయని చూచినవారు పరిహసింతురేమో! కాని ఏ ప్రాణికైనను మనస్సులో ఒకరిపై ఏర్పడిన ఆదరాభిమానములు ఆ ప్రాణిని ఉదాసీనముగా ఉండనీయవుగదా! యథాశక్తి తామును పనిని సాధించవలెనను ఉత్సాహమును పుట్టించి ప్రవర్తింపజేయును.

"శల మిలావణిలుంపోలేణ" ఫలముపై అపేక్ష కలిగి భగవత్సేవను చేయు భక్తులలో ఆ భక్తి నిష్కపటముకాదు. అది ఫలప్రాప్తికై వచ్చిన తాత్కాలికభక్తియే. కాని ఈ ఉడతలలో అట్టి ఫలాపేక్ష లేక ఆచరించు కైంకర్యమైనందున ఇది పరిశుద్ధమైన భక్తి. భగవంతుడును తనను ఆశ్రయించువారిలో ఇట్టి భావశుద్ధినే పరీక్షించి సంపూర్ణానుగ్రహమును ప్రసాదించును. ఇదిలేని భక్తులకు చేసిన పనికి కూలి ఇచ్చినట్లుగా కోరిన ఫలమును ఇచ్చి వారిని వదిలించుకొనునుగాని ఆత్మీయతను చూపడు. లోకములో కొందరు ఆత్మజ్ఞానము సేవింపగల శక్తియు తమలో ఉన్నను సోమరితనముతో "పరమాత్మకేమిలోటు? మనమర్పించు ఫలపుష్పాదులో సేవలో ఆయనకు ఒక లెక్కయా" అను వ్యాజముతో సేవా విముఖులగుదురు. అట్టివారు వాస్తవముగా భాగ్యహీనులే. మరికొందరు "నా స్వామి ఏ లోటును లేని సంపత్పరిపూర్ణుడు గనుక నే

నేనేమి సమర్పించినను ఇచ్చినది స్వీకరించి నా ఆకించన్యమును గమనించి ప్రేమతో అనుగ్రహించు''ననియు "యథాశక్తి నేను సేవించి ధన్యుడనగుటయే ముఖ్యము'' అనియు భావించి నిరంతర సేవాతత్పరులగుదురు. అట్టివారు నిజముగా భాగ్యవంతులు ఈ భావశుద్ధియే చాలామందిలో కొరవడును ఉడతలలో గల ఈ పరిశుద్ధ భక్తి నాలో లేదేయని ''అణిలంపోలేన'' అను వాక్యమున తెలుపుకొనుచున్నారు.

"మరంగళ్ పోల్ వలియనెంజం వంజనేన" చెట్లవలె నా మనస్సు అతి కఠినమైనది. ఇంతకుముందు ఒక పాశురములో "ఇరుంబు పోల్ వలియనెంజం" అని ఇనుముతో తమ మనస్సును పోల్చుకొనిరి. ఇపుడా ఇనుముకంటెను కాఠిన్యమును ఇందు తెలుపుచున్నారు. ఇనుము నిప్పులో వేసినచో కాగి మార్దవ మేర్పడి అవసరమైన విధముగా వ చుటకు వీలగును. కర్ర అట్లుగాక నిప్పులో బొగ్గు మశియై పోవును గాని వంగజాలదు నీచమగు నా మనస్సు ఇట్టిది ఇక నేను పచ్చిమోస గాడను. నీవును లోకులును నన్ను చూచి "అబ్బో! ఇతడు నిజముగా ఎంత భక్తుడో యని భ్రమపడునట్లు కపట నటనను చేయుచున్నాను. అంతేగాని ఉడతలవలె భావ శుద్ధి నాలో లేదు. "అశియత్తేన-అయర్కిన్టేన" నా స్వరూపమును నీ స్వరూపమును గూడ ఇంతకలముగా మరచినందుననే ఇట్లు అనేకానర్థములను పొందుచూ దీనస్థితిని పొందితిని. ''అహం సర్వం కరిష్యామి" అన్న లక్ష్మణస్వామివలె అంతరంగ సేవకుడుగా వర్తించవలసిన నా ఆత్మ ఇట్లు ఏ విధమగు అర్హతయు లేనందున భ్రష్టమైనది

**(28)** అవతారిక : తిర్యగ్జంతువులైన ఉడతలకుగల భావశుద్ధి మీలో లేకున్ననూ, పూర్వము సరస్సులో మొసలివాతపడిన గజేంద్రునికి "ఇక నన్ను సర్వేశ్వరుదేవచ్చి రక్షించగలడు" అను మహా విశ్వాసముతో కూడిన తలంపు కలిగి ఆక్రోశించినట్లు మీకును నారక్షకత్వమునందు విశ్వాసమున్న చాలును అది మీలో ఉన్నదా తెలుపుడు అని స్వామి ప్రశ్నింపగా, అదియు నాలో లేదని ఇందు తెలుపుచున్నారు.

పా॥ ఉంబరాలరియలాగా వొళియుళారా నైక్కాకి
శెంబులాలుండు వాళుం ముతలై మేల్ శీరివందాయ్
నంబరమాయతుండే నాయ్కళోం, శిరుమైయోరా
వెంబిరార్కు ఆళ్ శెయ్యాదే ఎణ శెయ్వాన తోన్టినేనే?

ప్రతి : ఉంబరాల్- దేవతల చేతగూడ, అరియలాగా- తెలిసికొనుటకు సాధ్యముకాని, ఒళియుళార్- తేజోమయ శ్రీ వైకుంఠలోకమున వసించు సర్వేశ్వరుడు అనైక్కాగి- గజేంద్రుని కొరకు, శెంపులాల్ ఉండువాళం- ఎర్రని మాంసముతిని జీవించునట్టి, ముదలై మేల్- మొసలిపైన, శీరివన్దార్- కోపావేశమున(రక్షించుటకై) వచ్చెను. నంవరమాయదుఉండే- (ఇక) మనకు భారమేమున్నది! నాయ్‌గళోం- కుక్కలవలె నీచులమగు మనయొక్క, శిఱుమైఓరా- అల్పత్వమును లెక్కచేయని, ఎంబిరార్కు- మన హితపరుడైన స్వామికి, ఆళ్‌శెయ్యాదే- సేవనుచేయక, ఎణ్ శెయ్‌వాన్ తోన్రినేనే- ఏమి చేయుటకు జన్మించితిని?

వివరణము · "ఉంబరాల్" ఇత్యాది. బ్రహ్మాది దేవతలకును తెలియరాని తేజోమయ దివ్యలోకము శ్రీ వైకుంఠము. "అథయదతః పరోదివోజ్యోతిర్దీప్యతే" ఇత్యాది శ్రుతి వాక్యమును "అత్యర్కానలదీప్తం తత్- స్థానం విష్ణోః మహాత్మనః" అను స్మృతి వాక్యమును ప్రకృతి మండలమునకావల ఒక తేజోమయ లోకము పర మాత్మావాసస్థానము కలదని తెలుపుచున్నది గదా! ప్రకృతి మండలమున స్వర్గాది లోకములలో నుండు ఆ బ్రహ్మాది దేవతలు "నేను అధిపతిని" (ఈశ్వరోహం) అను అహంకారము కలవారైనందున, అట్టివారికి ప్రకృతి మండలమునుదాటి ఆ లోకమునకు చేరుటకు సాధ్యముకాదు. చేరుటకే కాదు- "అది ఇట్లుండు"నని ఊహిం చుటకుగూడ వారికి సాధ్యముకాదట"

"యన్నదేవా న మునయో- న చాహం న చ శంకరః ।
జానంతి పరమేశస్య- తద్విష్ణోః పరమం పదమ్ ॥

అను పౌరాణిక శ్లోకమున "దేవతలుగాని, మునులుగాని నేనుగాని శంకరుడుగాని పర మాత్మయగు విష్ణువుయొక్క దివ్యలోకమును ఎట్లుండునో ఎరుగము" అని చతుర్ము ఖుడు చెప్పినట్లు నిరూపితమైనది. ఈ విషయమునే శ్రీ వత్సచిహ్నమిశ్రులును

శ్లో॥ సమాహితైస్సాధు సనందనాదిభిః-
సుదుర్లభం, భక్తజనైరదుర్లభమ్ ।
అచింత్యమత్యద్భుత మప్రతర్కణం
వరప్రద! త్వత్పదమాప్నుయాం కథమ్?

అను వరదరాజస్తవ శ్లోకమున ప్రసాదించిరి. అట్టి శుద్ధ సత్త్వమయ మహాలోకమున నిత్య సూరిజన సంసేవితుడై యుండు స్వామి ప్రకృతి మండలములో ఒక లోకములో ఎక్కడనో ఒక మూలనుండు ఆర్త గజేంద్రుని రక్షించుటకై క్షణములో వచ్చినాడట

''అనైక్కాగి''— ఏనుగుకొరకు. ప్రియురాలైన అమ్మవారి కొరకో ప్రియ భక్తులైన ఆదిశేషుడు హనుమంతుడు మొదలగువారి కొరకోకాదు ఒక తిర్యగ్జంతువు కొరకు. ఆ స్వామియొక్క పరత్వమునకు ఈ గజము యొక్క అల్పత్వమునకు ఎంతో అంతరమున్నది. ఐనను ఆ తారతమ్యమును గమనించక మొసలి వలన కలిగిన దాని ప్రాణాపాయ స్థితిని 'అది నాకై ఆక్రోశించెనుగదా' యను సంగతిని మాత్రమే భావించి ఆరాటముతో అతివేగముగా ఆ పరమాత్మ వచ్చెను.

''శెంబులాలుండువాళుం....'' ఇత్యాది. రక్తముతో నెత్రని పచ్చిమాంసమును తిని జీవించు మొసలిపై కోపముతో దానిని వధింపవచ్చెను. బ్రహ్మాది దేవతలు హిరణ్యాక్షాది రాక్షసుల వలన క్షోభనొందినపుడే వచ్చెదనని తలంపక, ఒక చిన్న నీటి పురుగు (మొసలి) తన భక్తుడగు గజేంద్రుని బాధించుచుండగా భరింపలేక క్రోధావిష్టుడై వచ్చెను. ''ప్రశాన్తాత్మా'' అన్నట్లు ఎన్నడును కోపమెరుగనివాడు ''క్రోధమాహారయత్తీవ్రం'' అని వాల్మీకి తెలిపినట్లు తనలోలేని కోపమును తెచ్చి పెట్టుకొన్నాడు ఉన్నచోటనేయుండి సంకల్పమాత్రముచేత మొసలిని వధింపలేడా అన్నచో- అట్లే వధింపవచ్చునుగాని, తన రాకకై ఎదురుచూచు ఆ గజేంద్రుని కోరిక తీరదుగదా! ''నాహం కళేబరస్యాస్య- త్రాణార్థం మధుసూదన! కరస్థకమలాన్యేవ పాదయోరర్పితుం తవ''అన్నట్లు సరస్సులోనున్న కమలములను తన చేతితో (తొండముతో) స్వామి పాదారవిందములపై నర్పించవలెనని తలంచెడు దాని కోరిక స్వామి వచ్చి సాక్షాత్కరించనిచో ఎట్లు తీరును? ఆ మొసలి వలన బాధ తమకే వచ్చినట్లును ఆ స్వామియు తమ రక్షణకే వచ్చినట్లును ఈ ఆళ్వారుల భావన. ఈ భావన కలిగి యుండుటయే విష్ణుభక్తుని లక్షణము. ఇదిలేనిచో అవైష్ణవుడే

''నంబరమాయదుండే''— మనను రక్షించు భారము స్వామియగు ఆయన పైననే కలదుగాని, మనపైనలేదు. తన వస్తువును రక్షించుకొను భారము యజమానిదేగదా!

''నాయ్‌గళోం శిరుమైయోరా వెంబిరార్కు....'' మనలో నుండు నైచ్యమును గూడ గమనించక మనకు ఎన్నో ఉపకారములు చేయు ఉదారుడాయన. నైచ్యము

నందు మనము కుక్కలకు ఎంతమాత్రమును తీసిపోము. ద్వారములు తెరచియున్న ప్రతి ఇంటిలోను జొరబడి ఇంటివారిచే 'ఛీ' యని తరుమబడు ఆ హీన జంతువు మాకు ఉపమానము. భోగ్యములగు ఇతరుల వస్తువులపై కన్నుపడినప్పుడు వెంటనే వాటిని దొంగిలించవలెనను దుర్బుద్ధి మాలో పూర్తిగా కలదుగదా! అన్నమును పెట్టి పోషించు యజమాని గూడ ఆ కుక్కలను స్పృశింపడు తాకినచో అతడును స్నానము చేయవలసినంతటి నిహీనమైన జంతువది. నన్ను కనిపెంచిన మాతాపిత్రాది బంధువులకు గూడ నా దుర్వృత్తమునుబట్టి నేనట్లు దూరమైతిని. ఇట్టి నావంటివారిని గూడ దోషముల నెంచక వాత్సల్యముతో దగ్గరకు తీసుకొనుచూ కాపాడుచుండు హిత పరుడైనవాడు శ్రీరంగనాథుడు. ''అవిజ్ఞాతా సహస్రాంశుః''అని సహస్రనామములలో చెప్పబడినట్లు ఆ స్వామి పూర్తిగా అజ్ఞానముతో నిండియున్నవాడు- మరియు సర్వ వ్యాపి తేజశ్శక్తిగల సూర్యునివలె సర్వ విషయ పరిజ్ఞానము కలిగిన సర్వజ్ఞుడు. ఇదేమి? పరస్పర విరుద్ధముగా నున్నదే అని ఆశ్చర్యపడనవసరము లేదు. భక్తులలో నుండు దోషముల విషయమున ఆయనయొక్క బుద్ధి ప్రసరింపదు గనుక అవిజ్ఞాత. వారిలో ఏ ఒక్క చిన్న గుణమున్నను దానిని గమనించగల శక్తి కలవాడు గనుక సహస్రాంశుః. కనుకనే స్వామి తన భక్తులకు కలుగు ఆపదలను చూచిన క్షణముననే గుణదోష పరీక్షను చేయక రక్షణకై పరుగెత్తివచ్చును. అట్టి స్వామికి సేవ చేయుట మనకు ఉచితమైయుండగా ఇంతవరకును నేనా సేవకు నోచుకొనని అభాగ్యుడను. మన రక్షణ భారము ఆయనపై వేసికొని యుండగా మన స్వరూపమును సేవా వృత్తిలో నన్వయించి కాపాడుకొనవద్దా! ''ఎకాశ్త్రైవాకా తోణ్ణినేనే''- అది చేయని నేను ఎందుకు జన్మించినట్లు? నాపుట్టుకయే వ్యర్థమైనది. ''సృష్టస్త్వం వనవాసాయ'' అని చెప్పి రామ సేవకై కన్నకొడుకును లక్ష్మణుని వనవాసమునకంపిన సుమిత్ర కడుపు పండినది. ఆ భగవత్సేవకు దూరమైన మావంటివారి జన్మము తల్లి కడుపుచేటు మాత్రమే సుమా!

**(29)** అవతారిక: వెనుకటి పాశురములో చెప్పినట్లు ''ఆపదలోనైననూ స్వామియే రక్షకుడు'' అనెడు గజేంద్రుని భావన మీలో లేకున్ననూ ''అయోధ్యా మధురా మాయా'' ఇత్యాది దివ్య దేశములలో జన్మించియున్నను చాలును. ఆ కారణముగా నేను రక్షించుట తప్పనిసరి. అట్టి పుణ్యక్షేత్ర జన్మావకాశమైనను మీలో లేదా! లేక నా భక్తులకు అభిమానపాత్రుడగు సన్నిహితబంధువువైనచో వారిని బట్టి రక్షింపగలను. ఆ అవకాశమైన లేదా? అని స్వామి ప్రశ్నింపవచ్చును. అందులకు సమాధానముగా

పా॥ అమరవోరంగమాఱుం వేదమోర్ నాన్గుమోది।
తమర్గళిల్ తలై వరాయ శాతియందణర్గళేనుం।
నుమర్గళై ప్పళిప్పరాగిల్ నోడిప్పదోరళవిలాంగే।
అవర్గళ్తాం పులై యర్ పోలుం అరంగమానగరుళానే॥

ప్రతి : అరంగమానగరుళానే- శ్రీరంగనాథా! ఓర్ అంగం ఆఱుం- సాటి లేని శిక్షా వ్యాకరణాది షడంగములను, ఓర్‌నాన్గు వేదం- సాటిలేని చతుర్వేదములను అమరఓది- సక్రమముగానే నేర్చుకొని, తమర్గళిల్ తలై వరాయ- జ్ఞానవంతులైన భక్తులలో శ్రేష్ఠులై, శాతిఅందణర్గళేనుం- జాతినిబట్టి బ్రాహ్మణులే అయినను, నుమర్గళై - నీ భక్తులగు వారిని పళిప్పరాగిల్- దూషించిరేని నోడిప్పదోరళవిల్- ఒక్క చిటికె కాలములోనే, అంగే- అక్కడనే, అవర్గళ్తాం- ఆ బ్రాహ్మణ జన్మ మునవే, పులై యర్‌పోలుం- చండాలురైపోదురు సుమా!

వివరణము : ఓ రంగనాథా! నీ భక్తులైనవారు ఒకవేళ జాత్యాదులనుబట్టి నిహీనులేయైనను వారిని దూషించుట మహాపచారమే యగును. ఈ భాగవతాపచారము మహాఘోరమైనది. దీనికి నిష్కృతిలేదు. వీరిని దూషించువారు షడంగములతోపాటు వేదాధ్యయనం పూర్తిగా చేసినవారైనా సరే, బ్రహ్మవేత్తలుగా పేరుప్రతిష్ఠలు పొందిన వారైనా సరే ఈ అపచారఫలితముగా అప్పటికప్పుడే అక్కడే ఉన్నబ్రాహ్మణత్వము పోయి చండాలురై పోవుదురు. ఇది పరమ సత్యము. గురుపుత్రుల శాపంచేత త్రిశంకు మహారాజు క్షణములో చండాల రూపమును పొందినట్లు వీరున్నూ కర్మ చండాలురుగా మారిపోవుదురు. ఈ అపచారమునుండి వీరి శాస్త్రజ్ఞానంగాని బ్రహ్మ జ్ఞానముగాని వీరిని కాపాడలేవు. చండాల వంశమున జన్మించినవానికి ఎప్పటికైననూ ఉజ్జీవించుట కవకాశము కలదుగాని, ఈ భాగవతాపచారముచేసి కర్మ చండాలుడైన వానికి ఆ యోగ్యతగూడ లేదు గనుక ఇతడు జాతి చండాలునికంటెను అధముడు అనాదికాల సంచితములైన పాపరాశులనుగూడ దహింపచేయగలదని ప్రశంసింపబడిన బ్రహ్మవిద్యగూడ ఈ భాగవతాపచారముతో నిష్ఫలమైపోవునని బ్రహ్మసూత్రకర్త వ్యాసుడు ముక్తిఫలానియమమను అధికరణములో సూచించియున్నాడు అక్కడ శ్రీవేదాన్తదేశికులవారు అధికరణసారావళిలో "మైవం, తస్మాద్బలీయాన్ యదిభవతి పరబ్రహ్మభక్తాపరాధః తచ్ఛాన్త్యై తత్ప్రసూతిః ..." అనే శ్లోక ఖండమున ఈవిషయ మును వివరించిరి.

శ్రీ వచన భూషణమున శ్రీ లోకాచార్యులవారు భాగవతాపచారము ఎంతి క్రూరమైనదో వివరించుచూ ఈ పాశురమునే ఉదాహరించి పిళ్లైపిళ్లైయాళ్వార్ అను ఆచార్యులవారి జీవితములో జరిగిన ఒక మధుర సన్నివేశమును దృష్టాంతముగా ఉట్టంకించిరి. సంగ్రహముగా ఆ చరిత్ర యేమనగా-

శ్రీరంగమున పిళ్లై పిళ్లైయాళ్వాన్ అను ఒక శ్రీవైష్ణవులుండిరి వారు శ్రీకూరత్తాళ్వాన్ స్వామివారికి శిష్యులు. సుప్రసిద్ధమగు ఆచార్య పురుష వంశమున జన్మించుటచేతను శాస్త్ర పాండిత్యాదులచేతను తాము గొప్పవారమని అభిమానము కలిగిన వీరు ఇతర శ్రీవైష్ణవులను దూషించుచుండిరి. వీరి ఆచార్యులైన శ్రీ కూరత్తాళ్వానులు "వీరిలో ఎంత జ్ఞానానుష్ఠానములున్ననూ ఈ భాగవతాపచార దోషము ఆ యోగ్యతలన్నింటిని అధఃకరించి ప్రబలమై ఆత్మవినాశ హేతువు కాగలదు. కనుక వీరిలో ఈ దోషమును పూర్తిగా అణచివేయవలెను'' అని నిశ్చయించుకొని సమయమునకై వేచియుండిరి. ఇంతలో ఉత్తరాయణ పుణ్యకాలము మకర సంక్రమణము వచ్చెను. ఆ సందర్భమున అందరును కావేరిలో స్నానముచేసి యథోచితముగా దానధర్మములు చేయుచుండిరి. అపుడు ఆచార్యులవారు శిష్యులగు పిళ్లైపిళ్లై ఆళ్వాను వద్దకుపోయి మీరు నాకు ఈ పుణ్య సమయమున ఒక దానము చేయవలెనని కోరిరి. అపుడాయన- "అయ్యా! నేను- నాది- అనదగు సమస్తము దేవరవారి శేషభూతులమే గదా! ఇక నేను దానము చేయుటయేమి?'' అని విన్నవింపగా, ఆచార్యులవారు మరల ఇట్లనిరి. ''అది నిజమేగాని, ఇకపైన నేను మనోవాక్కాయములతో యెట్టి భాగవతాపచారమును చేయను అని మీరు నా చేతిలో జలధారను విడిచి వాగ్దానము చేయవలెను". ఈ మాటను విన్నంతనే వారును కావేరిలో స్నానమాడి ఆ ఉత్తరాయణ సంక్రమణ దినమున ఆచార్యాజ్ఞానుసారము ఇకముందు అట్లు ప్రవర్తింపబోనని వాగ్దానముచేసి ఆచార్యులవారి చేతిలో జలధారను విడిచిరి. ఆచార్యులును సంతసించిరి.

అది మొదలుకొని భాగవతోత్తముల విషయమున వీరు అతి జాగ్రత్తగా ప్రవర్తించుచున్ననూ ఒకనాడు పూర్వ వాసననుబట్టి హఠాత్తుగా ఒక శ్రీ వైష్ణవుని దూషించి వెంటనే ఆచార్యులవారికిచ్చిన వాగ్దానమును గుర్తుచేసుకొని భాగవత దూషణమే గాక ఆచార్యాజ్ఞోల్లంఘనమను మహాపచారమునుగూడ చేసితినే యని మిక్కిలి

మనస్సులో భయపడి ఇక నాకు ఆత్మవినాశమేగాని సద్గతి లేదని నిశ్చయించుకొని తమ ఇంటనే ఆ రోజంతయు ముసుగు పెట్టుకొని పరుండి వెక్కి వెక్కి ఏడ్చు చుండిరి. ప్రతినిత్యము తమ ఇంటికి వచ్చి సేవించు ఈ శిష్యుడు ఆనాడు రాక పోవుటచే ఆచార్యులవారే స్వయముగా వీరింటికి వచ్చి చూచి విచారగ్రస్తులై యుండు టకు కారణమేమని ప్రశ్నించిరి. అపుడాయన జరిగిన అపచారమును గూర్చి తెలిపి "మనోవాక్కాయములతో ఎట్టి భాగవతాపచారముగూడా జరుగకుండునట్లు మసలు కొనుట నా జీవితమున అసాధ్యమగుచున్నది దేవరవారికిచ్చిన వాగ్దానమును పాటింప లేని అభాగ్యుడనైతిని. ఇకనేమి చేయుదును" అని ఆచార్యులవారి రెండు పాదము లను గట్టిగా పట్టుకొని అతి దీనముగా దుఃఖించెను ఆచార్యులవారు అపుడు వారికిట్లు సముదాయించిరి- "చేసినదానికి మీరు ఇంతిగా పశ్చాత్తాపపడుచున్నందులకు నేను చాలా సంతోషించుచున్నాను. భగవంతుడు మానసికముగా చేసిన అపచారములను గట్టి పశ్చాత్తాపము కలిగినచో "పశ్చాత్తాపేన శుద్ధ్యతి" అన్నట్లుగా క్షమించగలడు. ఇక శారీరకముగా మీరు ఏ భాగవతులనుగూడ హింసింపరు. అట్లయినచో ప్రత్యక్ష ముగా రాజు దండించునను భయము మీలో సహజముగా నున్నది. కనుక కాయిక మానసికాపచారములు మీకు ఇకపైన సంభవింపబోవు. అందుచేత ఒక వాక్కును మాత్రము జాగ్రత్తగా మీరు నిగ్రహించుకొనుడు. చాలును." ఈ సందర్భమునుబట్టి ఆనాడు శిష్యులలో గల దోషములను తొలగించి సంస్కరించుటకు ఆచార్యులు ఎంతగా పాటుపడువారో, శిష్యులుగూడ ఆచార్యులపై ఎంత ప్రగాఢమగు గౌరవభావము కలిగి వారుచూపిన మార్గము నుండి రేఖామాత్రముగూడ తొలగకుండ జీవించుచూ బంధ విముక్తులైనారో, విశదమగుచున్నది. భాగవతాపచారము అతి క్రూరమైనది అనియు అది ఎట్టివారికైనను వినాశహేతువనియు స్పష్టమైనది.

**(44)** అవతారిక : వెనక- ప్రపన్నులగు భాగవతుల వైభవము, భాగవతాప చారమును "నక్షమామి వసుంధరే" అన్నట్లు ఎన్నటికిని భగవంతుడు క్షమింపడను విషయము, వివరింపబడినది. ఇదంతయు అతివాస్తవము. ఇందు అసంభవమేమియు లేదు. సమర్థులైన బ్రహ్మ రుద్రాదులకును దుర్లభమైన భగవదనుగ్రహమును ఒక సామాన్యమైన తిర్యగ్జంతువు (గజము) శరణాగతిచేసి లభించుకొనగా వేరుచెప్పవల సినదేమున్నది? అని గజేంద్ర వృత్తాంతమును దృష్టాంతముగా చూపి, తామును అట్టి పరమ దయాళువు భక్తసులభుడునగు శ్రీరంగనాథునే శరణముగా నమ్ముకొన్నట్లు ఇందు నిరూపించుచున్నారు.

పా॥ పెణ్ణులాం శడై యినానుం, పిరమనుం, ఉన్నైక్కాణ్బాన్ ।
ఎణ్ణిలావూళియూళి తవం శెయ్దార్ వెళ్గినిర్ప ।
విణ్ణుళార్ వియప్పవన్దు ఆనైక్కన్ఱు అరుళై యీన్ద
కణ్ణరా! ఉన్నైయెన్నో కళై కణాక్కరుదుమాఱే ॥

ప్రతి : పెణ్ ఉలాం- గంగాదేవితో అలంకృతమైన, శెడై యినానుం- జడలు ధరించిన శివుడును, పిరమనుం- బ్రహ్మయును. ఉన్నైక్కాణ్బాన్- నిన్ను సాక్షాత్కరించుట కొరకై, ఎణ్ణిలా ఊళియూళి- లెక్కలేనన్ని యుగములలో, తవం శెయ్దార్- తపస్సు నాచరించినవారై, వెళ్గినిర్ప- సిగ్గుపడుచుండగా, విణ్ణుళార్ వియప్ప- నిత్యసూరులుగూడ ఆశ్చర్యపడునట్లు, వన్దు- వచ్చి, అన్ఱు- మొసలిచే బాధపడిన ఆనాడు, ఆనైక్క- గజేంద్రునికి అరుళై ఈన్ద- నీ అనుగ్రహమును ప్రసాదించిన, కణ్ణరా! ఓ నిర్దయుడవగు రంగనాథా ఉన్నై- నిన్ను, కళై కణా- రక్షకుడవగునట్లు, కరుతుమాఱు- భావించవలసిన పద్ధతి, ఎన్నో- ఏదో! (ఎరుగకున్నాను )

వివరణము : రుద్ర బ్రహ్మేంద్రాదులుగూడ ఎన్నో యుగములు తపస్సుచేసి నిన్ను దర్శింపలేకపోయినందులకు సిగ్గుపడుచున్నారు. మేమింత శక్తికలవారము కదా యని అహంకరించినవారికి నీవు దుర్లభుడవని భావము. అట్టి నీవు గ్రాహగ్రస్తమైన గజేంద్రుడు ఒక్కసారి శరణాగతుడైనంత మాత్రముననే చెప్పలేనంత ఆ వేగముతోవచ్చి దర్శనమిచ్చి రక్షించితివి. ఈ అకించనునిపై చూపిన దయ ఎంతో శ్రమించిన ఆ దేవతలపై కలుగలేదే? ఎంత నిర్దయుడవయ్యా రంగనాథా! అని భగవంతుని దయాగుణమును విపరీత లక్షణతో నిరూపించుచున్నారు. ఇది వ్యాజస్తుతి.

"పెణ్ణులాం శడై యినానుం"- పెణ్- అనగా స్త్రీ- ఇచట గంగాదేవియని అర్థము. ఆమెను తలపై నెక్కించుకొనియుండు రుద్రుడు. భార్యను తలపై నెక్కించుకొని తిరుగు కాముకునికి భగవంతుని సాక్షాత్కారము సాధ్యమా? అని భావము. లేక - మహావేగముతో ఆకాశమునుండి వచ్చిపడిన బ్రహ్మాండమైన గంగా ప్రవాహమును జడలో బన్ధించగలిగిన శక్తి కలవాడను నేనే అని అహంకరించువానికి భగవంతుడు దర్శనమిచ్చునా? అని భావము. లేక- భగవత్పాదోదకమైన గంగను సదా శిరమున

పేక్షరూపదోషములను) చెప్పించి మీరు నిస్సంగ బుద్ధిలోనే వాటి నాచరించినట్లు భావించి అనుగ్రహింతును, అని భగవంతుని ప్రశ్న. అట్టిదేమియు నేను చేయలేద నియు- "నీవిచ్చిన దేహేంద్రియాదులను ఆ స్వర్గాది ఫలసాధక వైదికకర్మల నాచరించు టకై వినియోగింపక క్షుద్రములైన ఇహలోక భోగములకే ఉపయోగించుచూ దేహ బంధువులకు గూడ దూరమై నశించితిని" అనియు ఇచట విన్నవించు చున్నారు.

పా॥ తవత్తుళార్ తమ్మిలల్లేన్ తనంపడైత్తారిలల్లేన్ ।
ఉవర్త్తనీర్పోల వెన్దనుత్తవర్క్కొన్ఱు మల్లేన్ ।
తువర్త్తశెవ్వాయినార్క్కే తువక్కఱ త్తురిశనానేన్ ।
అవత్తమే పిఱవి తన్దాయ్ అరంగమానగరుళానే ॥

ప్రతి · తవత్తుళార్ తమ్మిల్ అల్లేన్- స్వర్గాద్యర్థమై తపస్సు నాచరించినవారి కోటిలో నేను చేరలేదు. తనంపడైత్తారిల్ అల్లేన్- ధనమును సంపాదించినవారి కోటిలోను చేరలేదు. ఉవర్త్తనీర్పోల- సముద్రములో ఉప్పునీటివలె, ఎన్దన్ ఉత్త వర్క్కు- నా బంధువులకుగూడ, ఒన్ఱుమల్లేన్- ఏ విధముగను ఉపకరించకపోతిని. తువర్త్త శెవ్వాయినార్క్కే- నన్ను వశీకరించుకున్న ఎర్రని అధర సౌందర్యముగల యువతులకొరకే, తువక్కఱ- బన్దు ప్రేమనుగూడ పోగొట్టుకొని, తురిశనానేన్- చోరుడనై ప్రవర్తించితిని, అరంగమానగరుళానే- శ్రీరంగనాథః అవత్తమే- వ్యర్థముగా, పిఱవితన్దాయ్- నాకో జన్మము నిచ్చితివి.

<u>వివరణము :</u> 'యజ్ఞేన దానేన తపసాఽనాశకేన బ్రాహ్మణా వివిదిషన్తి' అను ఉపనిషద్వాక్యము యజ్ఞదాన తపస్సులను మోక్షార్థమై భక్తియోగాంగముగా ఆచ రింపుడని విధించు చున్నది. నేను అట్లు మోక్షార్థమై తపస్సు నాచరించువారి వర్గము లోను చేరలేదు. అట్లే కొందరు స్వర్గాది ఫలసిద్ధికై తపస్సుచేసిన వారును, ఆ తపస్సునారంభించి మధ్యలోనే ఆయుష్యముతీరి మరణించినవారు కొందరును ఉందురు. నేను అట్టివారెవ్వరిలోను చేరలేదని 'తవత్తుళార్ తమ్మిలల్లేన్' అను వాక్యమునకు భావము.

'తనం పడైత్తా రిలల్లేన్' మరికొందరు ఏదోవిధముగా ధనమార్జించి కీర్తిప్రతిష్ఠల నొందుటకై ఆలయ గోపుర ప్రాకారాదులను నిర్మించుటయో అన్నదాన సత్రాదులను ఏర్పరచుటయో చేయుచుందురు. నేనట్లుగూడ ధనమార్జించి దానమును చేయలేదు.

పురుషార్థములు నాల్గింటిలో (అర్థము) ధనార్జనము గూడ చేరియున్నది. ఆ ధనమును భగవద్భాగవతాచార్యాది సత్కైంకర్యములకై ఉపయోగించినచో అది 'తద్దానం సాత్త్వికంస్మృతమ్' అని ప్రశంసింపబడినట్లు ఉత్తమ కార్యముగా పరిగణింపబడును. ఇట్లు సత్కార్య నిర్వహణమే ప్రధానోద్దేశ్యముగా భావించి చేయు ద్రవ్యార్జనముగూడ భిక్షతోగాని చౌర్యముతోగాని వంచనతోగాని ఏ విధముగా జరిగినను తప్పుకాదన్నట్లు "తస్మాత్ యయా కయాచవిధయా బహ్వన్నం ప్రాప్నుయాత్" అని ఉపనిషత్తు వివరించినది. తిరుమంగై ఆళ్వార్ మొదలగువారు ఈ విధముగనే ధనమార్జించి ప్రాకార గోపుర మంటపాదులను భగవంతునికి నిర్మించిరి. వారి ఉద్దేశ్యము పవిత్రమైనందున వారు ధనమార్జించిన పద్ధతిని తప్పుగా భావింపరాదు. ఈ సంగతిని వెనుక 14వ పాశురమునకు వ్యాఖ్యను వ్రాయుచూ చివర "యోఽసాధుభ్యోర్థమాదాయ సాధుభ్యః సంప్రయచ్ఛతి" అను శ్లోకము నుదాహరించి వివరించియున్నాము నేను అట్లు ధనమార్జించి సత్కర్మలకై వినియోగించిన సాత్త్విక దాతల వర్గములోగూడ చేరనైతిని- అని భావము. లేక "యత్తు ప్రత్యుపకారార్థం- ఫలముద్దిశ్య వా పునః" అని తెలుపబడినట్లు ఇతరులవలన ఒక కార్యసిద్ధి నపేక్షించిగాని స్వర్గాది ఫలము నపేక్షించిగాని చేయు రాజస దానమునుగూడ నేను చేయలేదు. మరియు "అసత్కృత మవజ్ఞాతం" అన్నట్లు చీదరించుకొనుచునైన తామస దానమును చేసియుండలేదు.

''ఉవర్త్తనీర్ పోల....'' ఇత్యాది- ఇతరులకు దానధర్మములు చేయకున్నచో నీ దగ్గరి బంధువులకైననూ ధనమిచ్చి ఉపకరించితివా అందువేమో ; స్వామీ ; అదియు నేను చేయలేదు. సముద్రములోని నీరు వంటికి తాకినచో బాధాకరమైనట్లు నేను నా హితమును ప్రీతిని కోరు బంధువులను గూడ బాధించి వారికి దూరమైతిని బంధువులకు దూరమైనను కొందరు కాము వ్యసనశీలురై సౌందర్యవతులగు ప్రియ యువతుల నాశ్రయించి వారికి తమ సంపదలిచ్చి సుఖింతురు నేనట్లు వ్యామోహముతో వారివద్ద చేరి చివరకు వారిగూడ మోసగించి దూరమైతినని "తువర్త్తశెవ్వాయి నార్కే....'' ఇత్యాది తృతీయ పాదమునకు అర్థము ఆ యువతులు హృదయములో నిజమగు అనురాగము లేకున్ననూ చిరునవ్వులు చిందించుచూ ఎర్రని తమ అధర సౌందర్యమును ప్రకటింతురు. ఆ బాహ్య సౌందర్యమునకే కాముకుడు పరవశుడగును. సన్నిహిత బంధువులనుగూడ వదిలి వారినాశ్రయించును. వారి ప్రీతికొరకై చౌర్యాద్య కృత్యముల నెన్నియైనచేసి ధనమార్జించును పిదప అతడే మరొకయువతిచే ఆకర్షితుడై ఆ మొదటి యువతిని వంచించి దాని ధనమునుగూడ అపహరించి రెండవదానికిచ్చును. చివరకు వారందరికిని క్రమముగా దూరమగును. నేనట్లే నిహీన స్థితిని పొందితిని.

"అవత్తమే పిరవి తందాయ్ అరంగమానగరుళానే!" ఇట్లు ఎందుకును కొరగాని జీవితమునుగడుపుచున్న నాకు నీవు వ్యర్థమగు జన్మమునేల ఇచ్చితివి ? ఈ మానవ జన్మచే నాకు కలిగిన దుఃఖ పరంపరకంతటిని నీవే కారణమని భగవంతునిపై మృదువుగా ఆక్షేపమును చేయుట వీరి అభిప్రాయము. కారకుడవైన నీవే ఈ బంధము నుండి విముక్తి నిగూడ నాకు కలిగించగల సమర్థుడవు తప్ప ఇతరులకు ఇది సాధ్యము కాదని భావము.

చిన్న సందేహము తాము పూర్వజన్మలలో చేసియున్న వివిధ పాపకర్మలకు ఫలితముగా లభించిన ఈ అనర్థమునంతయు భగవంతునిపై నెట్టివేసి నీవే కారకుడవనుట సమంజసమా ? ఇచట ద్రవిడ వ్యాఖ్యానకర్తలగు శ్రీ పెరియవాచ్చాంబిళ్ళై స్వామివారు మధురమగు సమాధానమునిచ్చి ఇది సమంజసమేనని సమర్థించిరి. ఆ సమాధానమేమనగా— ఈ అళ్వారులు పుణ్య పాప రూప కర్మ స్వరూపమెట్టిదో, తమ స్వరూపము ఈశ్వర స్వరూపముగూడనెట్టిదో నిష్కృష్టముగా ఎరిగినవారుగనుక ఇట్లు ఈశ్వరునిపై ఆక్షేపము చేయుటలో తప్పులేదు. కర్మ- అనగానేమి? ఈశ్వరుని హృదయములో నిగ్రహానుగ్రహములను కలిగించి ఫలితమునిచ్చునది. ఈశ్వరుడెవ్వడు? సర్వప్రాణులకు హృదయములలో అంతర్యామియై యుండి వారి ప్రవృత్తి నివృత్తి- రూప వ్యవహారములకు మూలకారణమైనవాడు. సర్వేశ్వరుడగు ఆయన "క్షమించితిని" అన్నచో ఈ కర్మలన్నియు క్షణములో నశించిపోవును. ఆయనయే గీతలో చెప్పినట్లు "దదామి బుద్ధియోగం తం" అను రీతిలో మానవునికి సద్బుద్ధిని తానే కలిగించి మంచి మార్గమున నడిపించదలచినచో కాదని అడ్డగించువారెవరు? ఈ పరమార్థమును వీరెరిగిన తత్త్వవేత్తలు గనుక "స్వామీ ! సర్వసమర్థుడవై యుండిగూడ, నా అశక్తతను తెలిసియుండిగూడ, నాకీ దుఃఖభూయిష్ఠమైన జన్మము నిచ్చి నన్నేల ఏడిపించెదవు? నీ లీలారసమునకుగాక దయారసమునకు నన్ను పాత్రునిగా చేసికొనుము- అని వేడుకొనుటలో ఈ ఆక్షేపమునకు తాత్పర్యము. బావిలో అజ్ఞానముచే పడిన తన పిల్లవానినిచూచి తల్లి పట్టించుకొనక ఉదాసీనతను చూపినచో ఆమెయే బాలుని అనర్థమునకు హేతువనుట లోక ప్రసిద్ధమే కదా! ఈ విషయముపై విస్తృతమగు చర్చను మా తత్త్వోపహారగ్రన్థమున శ్రీ వచన భూషణముపై వ్రాసిన మూడవ వ్యాసములో 61వ పేజీలో చేసియున్నాము. పాఠకులు అందు గమనింప ప్రార్థన.

''అరంగమానగరుళానే''— ఇది సార్థకమైన సంబోధనము. ప్రబలమైన అజ్ఞానముచే కర్మ పరతంత్రులమై క్షుద్ర విషయములలోపడి దుఃఖించు మమ్ములను శాస్త్రాదులచే సంస్కరించుటకు అవకాశములేనందున, నీ సౌందర్యమును సౌలభ్య సౌశీల్య వాత్సల్యాది మహాగుణములను ప్రకటించి వశీకరించుకొనుటకేగదా నీవు శ్రీరంగమున స్థిరవాసమును గైకొంటివి— అని దీని భావము.

**(32)** అవతారిక : బంధువులకు స్నేహితులకు ప్రియులగు యువతులకు గూడ దూరమైతినని వెనుక చెప్పబడినది. అయితే మరి నా వద్దకు ఇపుడెట్లు వచ్చి సన్నిహితులైతిరి? అన్న రంగనాధుని ప్రశ్నకు సమాధానముగా "మూర్ఖుడనై వచ్చితి" నని తెలుపుచున్నారు. మంచి-చెడు- అను వివేకములేక ఎప్పుడేది తోచినచో అపుడు దానిని చేయువాడు మూర్ఖుడు. తనకు తోచినదే తప్ప ఇతరులు చెప్పినను వినడు. నేనట్టి మూరుడనేనని స్థిరపరచుచున్నారు.

పా॥ ఆర్తు వండలంబుంశోలై అణి తిరువరంగంతన్నుళ్
కార్తిరళన్నైయ మేని కణ్ణనే! ఉన్నైక్కాణుం
మార్క్కమొన్నారియమాట్టామనిశరిల్ తురిశనాయ
మూర్క్కనేన్ వన్దునిన్రేన్ మూర్క్కనేన్ మూర్క్కనేనే ॥

ప్రతి · వండు- తుమ్మెదలు, ఆర్తు- ధ్వనించుచూ, అలంబుం- సంచరించెడు శోలై- ఉద్యానములు కలిగిన, అణి- భూలోకాభరణమగు, తిరువరంగం తన్నుళ్- శ్రీరంగక్షేత్రమునందు. (వేంచేసియున్న) కార్ తిరళ్ అన్నైయ మేని- మేఘసముదాయమును పోలిన దేహము కలవాడా! కణ్ణనే!- శ్రీకృష్ణా, ఉన్నైక్కాణుం- నిన్ను దర్శింపగలిగిన, మార్క్కమొన్రు- ఉపాయమేమియును, అరియమాట్టా- ఎరుగలేనివాడనై, మనిశరిల్- మనుష్యులలో, తురిశనాయ- వంచకుడనై, మూర్క్కనేన్- మొండివాడనై వన్దునిన్రేన్- నీ ఎదుట వచ్చి నిలిచితిని, మూర్క్కనేన్ మూర్క్కనేనే- నిజముగానే నేను అతిమూర్ఖుడనే.

వివరణము : ఉద్యానములలో మకరందపానము చేయవచ్చిన తుమ్మదలు పూలగుత్తులపై వ్రాలి తృప్తిగా గొంతువరకును మధుపానముచేయును. ఆ సంతోషాతిశయముతో ఝుంకారధ్వనిని చేయుచుండును. శ్రీవైకుంఠమున భగవంతుని దివ్య మంగళ విగ్రహమును కన్నులార సేవించుచూ ఆనందాతిశయముచే "హాలివూలి హాలివూలి

హాళేవూళే" అని సామగానముచేయు ముక్తపురుషులవలెనే ఈ మధుపానమత్తము లైన తుమ్మెదల స్థితియు నుండుటకు కారణము ఉద్యానవనశోభయే గదా! సీతమ్మ వారి జాడను కనుగొని వచ్చితిమను హర్షాతిరేకముతో వానరయూధము సుగ్రీవుని మధు వనమున ప్రవేశించి తృప్తిగా మధుపానమును పక్వఫల భక్షణమునుచేసి "గాయన్తి కేచిత్ ప్రణమన్తి కేచిత్ నృత్యంతి కేచిత్" అనునట్లు ఆడుచూపాడుచూ విహరించిన దట ఈ తుమ్మెదలునట్లే పాడుచూ ఎగురుచున్నవి

"అలంబుం"- అనగా తేలియాడుట. తుమ్మెదలు మకరందరస ప్రవాహము లపై తేలియాడుచున్నవి ప్రళయకాలమున ప్రపంచమంతయు ఏకార్ణవమై యుండగా మార్కండేయుడొకడు మాత్రమే భగవదనుగ్రహముచే నీటిపై తేలియాడుచూ వట పత్రశాయిమూర్తిని సేవించి ఆనందించెనట. మకరంద ప్రవాహములో ఈ తుమ్మెదల స్థితియునంతే అట్టి ఉద్యానములతో శోభించునది శ్రీరంగము. ఇది భూలోకమంత టికి ఆభరణమనదగిన క్షేత్రము. సముద్రముపై జలాహరణమునకై వ్రాలిన మేఘ సమూహమువలె శ్రీరంగనాథుడచట శేషునిపై శయనించియున్నాడు. నల్లని దేహ కాంతినిబట్టియు అయాచితముగా స్వార్థనిరపేక్షముగా పరోపకారమునుచేయు స్వభావ మును బట్టియు చల్లదనమును బట్టియు మేఘములతో భగవన్మూర్తికి సామ్యమును చెప్పవచ్చును కాని "కణ్ణనే" అను సంబోధనము ఆ మేఘమునకంటె ఒక ప్రత్యేక తను స్వామిలో సూచించుచున్నది. మేఘము ఆకాశములో దూరముగా నుండియే లోకులకుపకరించును. భగవానుడు అట్లుగాక అవతారముల ద్వారా సన్నిహితుడై అందరితో కలసి మెలసి తిరుగుచూ అనుగ్రహించును. శ్రీరంగనాథుడు ఆ కృష్ణుడే గదాయని భావము. శేషశాయియగు మూలమూర్తియైన శ్రీరంగనాథుని సేవించినప్పుడు తొట్లెలో శయనించిన చిలిపి చిన్ని కృష్ణుని మూర్తి స్ఫురణకు వచ్చునని శ్రీ పరాశర భట్టరువారు భావించుచుండినట్లు వెనుక 18 పాశురములో వ్యాఖ్యానమున వ్రాసిన సంగతిని ఇచట స్మరింపదగును. వెన్నను దొంగిలించి ఏమియు నెరుగనివానివలె దొంగ నిద్రను నటించు బాలకృష్ణునికిని. భక్తుల దృష్టి చిత్తాపహారియగు సౌంద ర్యము కలిగి శేషశాయిగనుండు మూలమూర్తికిని ఇచట సామ్యము ఊహనీయము

"ఉన్నైంకొణ్డు మార్గమొన్నరియమాట్టా"— నీ సన్నిధికి చేరి సేవించు టకు అనేక మార్గములను నీవే గీతాదులలో తెలిపియున్నావు. కర్మ- జ్ఞాన- భక్తి యోగములు- అవతార రహస్య జ్ఞానము- పురుషోత్తమ విద్య, నామ సంకీర్తన- క్షేత్రవాసాదులు, ఇట్లెన్నో మార్గములు నీచే ప్రతిపాదింపబడినవి. ఆయా జీవులలో

గల శక్తి తారతమ్యమునుబట్టి ఈ భేదము ఏర్పడినని. కాని నేను వీటిలో నొక్క దానినైననూ అనుష్ఠింపలేకపోవుటయే కాదు- చివరకు తెలసికొనుటకైననూ అశక్తుడనైతిని. వీటిని ఎరిగి అనుష్ఠింపలేని పశుపక్ష్యాది జాతిలోగాక జ్ఞాన-శక్తులు గలిగిన మానవులలో జన్మించినాను కాని ఈ జన్మలోగూడ పరమ ప్రయోజనము సాధింపలేక వ్యర్థుడనైనాను "అయితే మరి నావద్దకు ఎట్లు రాగలిగితి"వని ప్రశ్నింతువేమో స్వామీ! నేను పరమమూర్ఖుడనుగదా! యథార్థము నెంతమాత్రము నెరుగక తనకు తోచినది చేయుచుండువాడు మూర్ఖుడు. నేను క్షుద్రుడనని మహానుభావుడవగు నీ సన్నిధికి చేరుటకు అనర్హుడనని నాకు వాస్తవముగా తెలిసియున్నచో నేను ఇచటికి వత్తునా? మంచి నీటిలో విషమును కలిపిన విధముగా తత్త్వజ్ఞులైన భక్తులు సేవింపవలసిన నీ గోష్ఠిని నారాకచే మలినము చేసితిని. మరల రెండు సారులు మూర్ఖపదమును ప్రయోగించుటచే నన్ను మించిన మూర్ఖుడులేడని సూచితమైనది కృష్ణుడనగా- సర్వసులభుడుగదాయని తలంచి వచ్చితిని.

**(33)** అవతారిక. మంచిగుణములేమియు లేకపోగా అన్నియు దోషములే నాలో నిండియున్నవనియు, కనుక ఏ విధముగా చూచిననూ నేను నీకు చెందని వ్యక్తినైపోయితిననియు ఇంతవరకును తెలిపిరి. ఇటుపైన స్వామి ప్రశ్నించెను- "మూర్ఖుడనంటిరిగదా! ఆ మాటను హృదయపూర్వకముగా చెప్పితిరా? అందులోగూడ మోసమున్నదా!" ఈ ప్రశ్నకు ఇచట "పొయ్యనేన్ పొయ్యనేనే" అని సమాధానమిచ్చి తమ అసత్యారోపయణత్వమును ప్రకటించిరి అన్ని దోషములేయైనను ఏ అర్హతలు లేకున్ననూ, కపీసము చెప్పిన మాటయైన నిజమైనచో "నిజమునే చెప్పినాడు గదా"యని ఆ ఒక్క యోగ్యతనే ప్రాథమికముగా గ్రహించి అనుగ్రహింపవచ్చును. అదిగూడ అబద్ధమేయైనచో ఇక రక్షించుట ఎట్లన్నచో- వినుము మూర్ఖుడనై నీ సన్నిధికి చేరితిని గనుక నీవు పరమ దయాళుడవు గనుక నీ దయనే ఇక చివరకు నాకు గతియని వచ్చితినని వేడుకొనుచున్నారు.

పా॥ మెయ్యెల్లాం పోగవిట్టు విరికుళలారిల్ పట్టు
పొయ్యెల్లాం పొదిందుకొండు పోళ్కానేనావన్దు నిన్రేన్ ।
అయ్యనే! అరంగనే! ఉన్నరుళెన్ను మాశైతన్నాల్
పొయ్యనేనావన్దు నిన్రేన్ పొయ్యనేన్ పొయ్యనేనే ॥

ప్రతి : మెయ్ఎల్లాం- వాఙ్మనఃకాయములందు పూర్తిగా సత్యమును, పోగవిట్టు- విడిచిపెట్టి, విరికుళరాలారిల్ పట్టు- విపుల కేశసౌందర్యముగల స్త్రీలనెడు వలలోపడి,

పొయ్యెల్లాం- అసత్యమునంతయును. పొదిందుకొండు- నాలోనింపుకొని, పోక్క నేశా- మర్యాదలేనివాడనై, వందునిన్దేశా- నీ ఎదుటవచ్చి నిలిచితిని. అయ్యనే! అరంగనే! స్వామియగు రంగనాథా! ఉశాఅరుళ్- నీ దయయేగతి, ఎన్నుం ఆశై తన్నాల్, అను ఆశతోనే వన్దునిన్దేశా- వచ్చినిలిచితిని, పొయ్యనేశా పొయ్యనేనే- ముమ్మాటికిని నేను అసత్యపరుడనే.

<u>వివరణము:</u> మెయ్ అనగా సత్యము. దానిని నేను పూర్తిగా విడిచితిని. "సత్యం భూతహితం వాక్యం" అని శాస్త్ర కారనిర్ణయము. ప్రాణులకు మేలును కలిగించుచూ యథార్థమైనదానిని మాత్రమే సత్యమందురు. నిజమైనను ఇతరులకు అపాయకరమైనచో వాస్తవము కాజాలదు అట్టిసత్యము "సత్యమూలమిదం సర్వం" అన్నట్లు సర్వలోకములకు ఆధారము. మరియు మానవుని నడతకు అది మొదటిమెట్టు

హీనజాతిలో జన్మించినవాడైన కైశికుడు తనను భక్షింపవచ్చిన బ్రహ్మరాక్ష సునితో ప్రతిజ్ఞ చేయుచూ "భగవద్భక్తుడైనవాడు ఎన్నడునూ అసత్యమును చెప్పడు" అని పలికినట్లు కైశిక పురాణము చెప్పుచున్నది. జాతిహీనుడైనను భక్తిమంతుడు గనుక అతనిలో అంతటి సత్యనిష్ఠ యున్నది. నేను ఆ సత్యమును పూర్తిగా విడి చితిని. మనస్సులో తలంచినది నోటితో చెప్పినది చేసినదిగూడ సత్యమై యుండుట అను త్రికరణశుద్ధి "ఎల్లాం" అను శబ్దముచే గ్రాహ్యము. తన బంధువులకు నిజ మును చెప్పిబయటివారికి అసత్యమును చెప్పువారు కొందరుందురు నేనట్లుగాక అంద రికిని బాధాకరమై నిజముకాని మాటనే (త్రికరణశుద్ధిలేని మాటనే) చెప్పుదును. లోకులు అజ్ఞానులు గనుక వారివద్ద అసత్యమును చెప్పినను చెల్లుబాటగును. కాని సర్వజ్ఞుడవగు నీ ఎదుటనే అసత్యమును పలుకుచుంటిని.

"విరికుళలారిల్ పట్టు"- మీకీ అబద్ధాలకోరుతనము ఎప్పటినుండి ఎక్కడ అబ్బినది? అందువేమో. యువతులతో సహవాసము కలిగినప్పటినుండి ఏర్పడినది. భగవద్భక్తుల గోష్ఠిలో అసత్యమునకు చోటులేనట్లే స్త్రీ గోష్ఠిలో సత్యమునకు చోటు లేదు. నిజమును చెప్పువాడు స్త్రీల గోష్ఠిలో ఒక్క క్షణకాలమైనను గడపలేడు గదా! "విరికుళలార్"- అనగా విరబోసిన కురుల సౌందర్యము కలవారు యువతులు. వారి కురులు ముడివేయబడి పుష్పాలంకృతములైనప్పుడు "ఓహో ఏమి అందము" అని ఈ కాముకుడు ముగ్ధుడగును. ముడి విడిపోయి విరబోసియున్నప్పుడు గూడ "ఆహా ఎంత అందము" అని పరవశుడగును.

కణ్వాశ్రమమున శకుంతల ఆశ్రమ వృక్షములకు కుండతో నీరు పోయు చున్నది మధ్యలో కొప్పు ముడి విడిపోగా ఒక చేతిలో నీటి కుండ యుండుటచేత ఒక్కచేతితోనే తొందరగా గజిబిజిగా ముడి వేసికొన్నది. ఆ కొప్పును చూచియే దుష్యంతుడు "ఓహో ఎంత అందము" అని ఆ సహజ కేశపాశ సౌందర్యమునకు ముగ్ధుడై ఇట్లు "బన్దే స్రంసిని చైక హస్తయమితాః పర్యాకులా మూర్ధజాః" అని వర్ణించెనట. దశరథుడు గుర్రముపై వేటాడబోయి వివిధ జంతువులను అతి దూరమునుండియే కనిపెట్టి గురిచూచి శరప్రయోగము చేయుచుండెను. ఇంతలో నొక నెమలి తన పింఛమును విప్పుకొని ఆడుచూ ఇతని గుర్రమునకు దగ్గరనుండియే నడచిపోవుచుండెను. వెంటనే దానిని బాణముతో గురిచూచి కొట్టబోయిన దశరథుడు పలు రంగులతో అందమైన కన్నులుగల దాని విప్పారిన పింఛ సౌందర్యమును చూచి పూర్వపు మధుర సన్నివేశ మొకటి గుర్తుకురాగా దానిని తలంచుకొనుచూ స్తబ్ధుడై నిలిచిపోయెను అంతగా అతనికి గుర్తువచ్చిన ఆ మధుర సన్నివేశ మేమనగా- వివిధ పుష్పమాలాలంకృతమైన కైకేయి కేశపాశము సంభోగ సమ్మర్దమున విడి పోయెను. పిదప పాన్పుపైనుండి లేచిన ఆమెయొక్క విప్పారిన కేశములు విచ్ఛిన్న పుష్పమాలాలంకృతములై యుండగా ఆ దృశ్యమును చూచిన యతని హృదయము పరవశమయ్యెను. పింఛమును విప్పుకొని నాట్యమాడుచూ దగ్గరినుండి పోయిన ఈ నెమలిని చూచినపుడు ఆ మధుర దృశ్యమే కనులకు గట్టినట్లు స్మృతికిరాగా స్తబ్ధుడై నెమలిపై బాణమును విడువలేక నిలిచిపోయెనట

శ్లో॥ అపితురగ సమీపాదుత్పతంతం మయూరం
న స రుచిరకలాపం బాణలక్షీ చకార ।
సపది గతమనస్కః ఛిన్న మాల్యానుకీర్ణే
రతి విగళితబన్ధే కేశపాశే ప్రియాయాః ॥

ఇది రఘువంశ కావ్యమున కాళిదాస వర్ణనము. నేనుగూడ నిట్లే విప్పారిన యువతీ కేశసౌంర్యమను వలలో చిక్కుకొనినట్లుగా పరవశుడనైతినని "విరికుళ లారిల్‌వటు" అనుదాని భావము

"పొయ్యెల్లాం పొదిందుకొండు"- ఇట్లు యువతీ సంసర్గముచే సత్యగుణమును దూరముగా విసరికొట్టినట్లు అసత్యమును మూటగట్టుకొంటిని. నా వాఙ్మనఃకాయములు మూడింటిలోను అసత్యమే అలవడినది భగవత్సన్నిధికి వచ్చిన అసత్యవాదులుగూడ

సత్యవాదులుగా మారినట్లు స్త్రీల సన్నిధికి చేరిన సత్యవాదులుగూడ అసత్యవాదులుగా మారిపోవుదురు కాబోలు. "పోక్కనేఱవన్దు నిన్నేఱ"- ఇట్టి నేను మర్యాదలేని వాడనై సిగ్గునువిడిచి ఎవరేమనుకొందురో అను సంకోచముగూడ లేక సర్వేశ్వరుడ వగు నీ ఎదుటవచ్చి నిలిచితిని. యోగ్యతగల శమదమాది సద్గుణవిశిష్టులు నిన్ను ఆశ్ర యించినట్లు నేనుగూడ నిర్భయుడనై వచ్చితిని

"అయ్యనే! అరంగనే"- నావద్దకు రానేల? ఆయువతులవద్దకేపోరాదా' అని రంగనాధుడు ఈసడింపగా ఇట్లు సంబోధించుచున్నారు. నీవు మా స్వామివి. మేము నీవారము. మన ఈ స్వస్వామి భావసంబంధము ఏనాటికినీ విడదీయరానిది. ఈ మన సంబంధమును ఇంతకాలముగా నేనెరుంగకనే దూరమై పోవుచుండగా నీవు మావంటి వారి నుద్ధరించుటకై దూరమును కష్టమును లెక్కింపక ఈ శ్రీరంగమున వచ్చి నిలచి తివి. కుమారుడు దుష్టుడై మొదట తిరిగినను, వివేకోదయమై తల్లిదండ్రులను గుర్తించిన పిదప సిగ్గుచే సర్వజన సమక్షమున రాలేకున్ననూ దొడ్డిదోవన వచ్చి వారి కాళ్ళపైబడినట్లు, నేననూ ఇప్పటికి సంబంధ జ్ఞానోదయమై వచ్చి ఆశ్రయించితిని. "శాస్త్రముచేతనా! ఆచార్యోపదేశముచేతనా! నీకిప్పుడు ఈ మన సంబంధజ్ఞానము ఎట్లు కలిగెను?" అన్నచో- అదేమియు లేదు. యాదృచ్ఛికముగా నేను ఇచట శేషశాయి యగు నీ మూర్తిని పాదాది కేశాన్తము సేవింపగా కలిగినది.

"ఉన్నరుళెన్నుమాశైతన్నాల్ వన్దునిన్తేఱ"- "సరే, వచ్చినను రక్షింతునను నమ్మకమెట్లు నీకు ఏర్పడినది? నేను తిరస్కరింపవచ్చునుగదా" అని స్వామి అన వచ్చును దానికిది సమాధానము నిర్హేతుకమగు నీ కృపావిశేషముపైగల నమ్మకముతో "తప్పక రక్షింతు"వను ఆశతో వచ్చితిని. తలను నరికివేయదగినంతటి మహాఘోరాప చారమును చేసినవారినిగూడ రక్షించునట్టిది నీ కృప "వధార్హ మపి కాకుత్థ్సః- కృపయా పర్యపాలయత్"- అగతికుడై వచ్చిన కాకాసురుని రక్షింపలేదా! కనుక రక్షింపుము స్వామి యిట్లనెను- "మీలో ఒక్క మంచి గుణమైనలేదని ఎరిగి, అన్నియు దోషములేకలవని యెరిగి, చివరకు మన సంబంధమునెరిగి వచ్చిన మీరు ఉన్న వాస్తవమును చెప్పుకొనుటచేత తప్పక మీరు అధికారులేనని గ్రహించితిని రక్షింతును. మీ మనస్సులోను మాటలోను చేష్టలోను నాకు సత్యము గోచరించినది". అను ఈ రంగనాధుని మాటలకు ముగ్ధులై- పొయ్యానేన్‌వన్దునిన్నేఱ పొయ్యానేన్ పొయ్యనేనే" అని వీరు తమ వాస్తవస్వరూపమును దాచుకొనక చెప్పుచున్నారు. స్వామీ! నీవు సర్వజ్ఞుడవు. నేను పూర్తిగా అబద్ధాలకోరును. నీకు తెలియనిదేము

న్నది? ఇంతవరకు నేను చెప్పిన మాటలన్నియు హృదయపూర్వకముగా చెప్పినవి కావు సర్వజ్ఞుడవగు నీవుగూడ నమ్మునట్లు భ్రమ కలుగు విధముగా పైకి ఈ మాటలను చెప్పితిని గాని, నాలో సత్యమెక్కడిది? ముమ్మాటికినీ నేను అసత్యసంధుడనే వీరి ఆర్తికి పరాకాష్ఠ యిది.

**(34)** అవతారిక : నా హృదయములోనే నిత్యవాసముచేయు అంతర్యామియగు స్వామికి తెలియనిదేమున్నది? సర్వజ్ఞుడగు ఆయనను నేను మోసముతో భక్తునివలె నటించి నమ్మించితిని. ఇది తీరని అపకారము. అని తమలో తామే సిగ్గుతో నవ్వుకొనుచున్నారు

పా॥ ఉళ్ళత్తే యురైయుం మాలై యుళ్ళువానుణర్వొన్నిల్లా
కళ్ళత్తే నానుం తొండాయ్ తొండుక్కే కోలం పూండు ।
ఉళ్ళువారుళ్ళత్తెల్లాం ఉడనిరున్దు అరుతియెన్ఱు
వెళ్గిప్పో యెన్నుళ్ళే నాణ విలవఱచ్చిత్తిట్టేనే ॥

ప్రతి : ఉళ్ళత్తే - మనస్సునందు, ఉరయుంమాలై - వేంచేసియుండు స్వామిని, ఉళ్ళువాన్ - యథాతథముగా, ఉణర్వొన్నిల్లా - తెలిసికొను జ్ఞానము లేనివాడనై, కళ్ళత్తే - మోసముతో, నానుంతొండాయ్ - నేనును దాసుడనై, తొండుక్కే కోలం పూండు - భక్తులకుండు వేషభాషలు ధరించి, ఉళ్ళువార్ ఉళ్ళత్తువెల్లాం - నిన్ను ధ్యానించువారి మనస్సులోనిదంతయు, ఉడనిరున్దు - (హృదయములో) కూడా నేయుండి, అరుతి ఎన్ఱు - నీవు ఎరుగుదువు అని తెలిసి, వెళ్గిపోయ్ - సిగ్గువిచిపోయి, ఎన్నుళ్ళే నాన్ - నా మనస్సులో నేనే విలవర - ప్రక్కలు విరగబడి, శిరిత్తిట్టేనే - నవ్వుకొనుచున్నాను.

వివరణము . "ఉళ్ళత్తే ఉరైయుంమాలై"- ఇత్యాది. పరమాత్మ హృదయమున నుండువాడని యెరుగకుంటిని. నా హృదయముననే నిత్యము నుండి నా సంగతిని సర్వము నెరిగినవాడాయన. జీవుడు హృదయమందే యున్నందున బాహ్య విషయముల నెరుంగలేడు. ఆకాశము సర్వవ్యాపియైనను జ్ఞానములేని జడపదార్థము. పరమాత్మ సర్వజ్ఞుడు సర్వవ్యాపియును గనుక సర్వనియామకుడునై యున్నాడు. నేనీ విషయము నెరుంగక నేజేయు పాపకృత్యముల నెవరునూ చూడరని భావించుచుంటిని. "కళ్ళత్తే నానుం తొండాయ్" ఇత్యాది. నా అజ్ఞానమును లోకులెరుగకుండునట్లు కప్పి

పుచ్చితిని. నాకు ఏమైనా తెలియని విషయములను గూర్చి మాట్లాడునపుడు "అవి నాకు తెలియవు" అని చెప్పక "నా అంతరాత్మకు అవేమియు తెలియవు" అనుమంటిని దానితో లోకులు "అబ్బో! వీనికి ఆత్మజ్ఞానము పరమాత్మజ్ఞానముగూడా కలదుసుమా!" యని వారు భావించునట్లు మోసగించితిని. నేను నీ దాసునివలె నటించితిని. భావశుద్ధిగల నీ దాసులుచేయు సేవలో అన్వయించుటకు నేనర్హుడను కాకున్ననూ చండాలుడు వేదాధ్యయనమును చేయుటకు కపటవేషముతో వచ్చినట్లు నేనునూ నీ సేవకు వచ్చితిని. ఇప్పుడు వీరు తమ మోసమును దాచుకొనుటకు మనసొప్పక "స్వాత్మాపేృనం విగర్హతే" అన్నట్లు తామే ఇట్లు ఆత్మనిందను చేసుకొనుచున్నారు.

"తొండుక్కోలంపూండు"- సాత్వికులైన భాగవతులందరును నన్ను చూచి ఆదరించునట్లు వేషభాషలను ఆరోపించుకొంటిని. పెద్దగా నామాలు పెట్టుకొంటిని. చక్రాంకనాది ముద్రలు దాల్చితివి. భజనపరుడనై నామసంకీర్తన మారంభించితిని. నీ గుణ వైభవమును ఎంతో తెలిసినవానివలె కొనియాడితిని యమభటుల తలపై నా కాలు పెట్టెదనని ప్రగల్భములు పలికితిని. సదాచార్యునివలెనే ఏవేవో పరోపదేశ వాక్యములు పలికితిని. ఇదంతయు నా దొంగ నటనయే.

"ఉళ్ళువార్ ఉళ్ళత్తెల్లాం"- ఇత్యాది- ప్రతి జీవుని హృదయములోను నీవు అంతస్సాక్షివై యున్నావుగదా! నా దుస్సంకల్పములన్నింటికి కారణమైన మనస్సుతో నీవు వెంటనే కలిసి ఉన్నావని, "అయ్యో నా మోసము భగవంతునికి తెలిసెనేమో" అని ఇప్పుడు సిగ్గుపడుచున్నాను. పూర్వము "ఏకోహమస్మీతి చ మన్యసే త్వం" ఓరి మూర్ఖుడా! చాటుగా నేనొక్కడనే ఈ పాపము చేయుచున్నాను. ఎవరికినీ నా సంగతి తెలియదు లెమ్మని భావించుచుంటివా! నీవు ఒంటరివి కాదు. నీ హృదయములో సాక్షిగా నుండి పరమాత్మ గమనించుచున్నాడు సుమా!- అని పెద్దలు మందలించినట్లు నేను ఇప్పుడే గుర్తెరిగి సిగ్గుపడుచుంటిని. సర్వజ్ఞుడవు సర్వనియామకుడవైన నీవు హృదయ సన్నిహితుడవై యుండగనే నీముందే ఈ దిగంబర నాట్యమును ఆడినందులకు సిగ్గుపడుచున్నాను.

"వెళ్గిప్పోయ్"- ఈ సిగ్గుతో నీ ఎదుటనే తలఎత్తుకొని నిలువలేక ప్రక్కకు తొలగితిని. నీవక్కడ లేవేమోనని నా భ్రమ. ఇతరులను మోసగించినపుడు వారు చూడకుండుటకై చాటుకు తొలగినట్లు సిగ్గుతో తొలగితినిగాని, నీవు సర్వవ్యాపివని గుర్తెరిగి నా మోసము తెలిసిపోయినదే యని బిక్కమొగము వేసుకొంటిని.

''ఎన్నుశ్శే విలవరచ్చిరితి_ష్ట్రనే''- చివరకు నాలో నేనే నవ్వుకొంటిని. నవ్వుకొనుట కైనను నాకు సహాయమెవ్వరును లేరు. లోకులకు నావంటి పరిస్థితి లేదు గనుక వారికి నా నవ్వు అర్థముకాదు కాబట్టి నా నవ్వులో పాలు పంచుకొనలేరు. నేను ముఖము వాటుచేసుకొన్నందున దగ్గరనే యున్ననూ భగవంతుడు గమనించి యుండడు. గమ నించిననూ ''అవాకీ అనాదరః'' అన్నట్లు గంభీర స్వభావుడు గనుక ఈ నవ్వులో కలవబోడు. కనుక నాలో నేనే నవ్వుకొంటిని. విలవర- అనగా ప్రక్కలు విరగ బడునట్లు నవ్వితిని. అట్టహాసము చేయుచూ వికట నాట్య మాడువారు తమలపాకులు తిని పూలమాలలు ధరించి గంతులు వేయుచూ ఆడినట్లు నేనునూ పొర్లుచూ గెంతుచూ నవ్వితిని.

పూర్వము అర్జునుడును తన కర్మజ్ఞాన యోగాదులు వేటిలోను తనకు అర్హత లేకపోయెనని గుర్తించి శోకముతో చతికిలపడెను. వీరు తమ అనర్హతకు తామే నవ్వుకొనుచూ వెనుదిరిగిరి.

**(35)** అవతారిక : వెనుక- వీరు తమ అనర్హతను తలంచుకొని సర్వజ్ఞు డైన భగవంతుని ముందు నిలుచుటకే తమకు అధికారములేదని సిగ్గుపడి తమలో తామే నవ్వుకొని భగవత్సన్నిధానము నుండి వెనుకకు మరలిపోయిరి ఇక వీరు ఈ నైచ్యానుసంధానముతో మరల సంసారులలో కలసిపోయి నాకు దూరమగుదురేమోనను భయము రంగనాథునిలో ఏర్పడినది ''మీరు వెనుదిరిగిపోవుటకు కారణమే''మని ఆయన వీరిని ప్రశ్నించెను.

''స్వామీ! సర్వజ్ఞుడవగు నీముందే ఎంతో కపటనాటకమాడుచున్న నాకు నిన్ను ఆశ్రయింపగల యోగ్యతయే లేదుగదా! పాపిష్ఠుడనగు నా సంసర్గముచే నీ సన్నిధికి మాలిన్యమును కలిగించుటకంటె నీకు దూరమై సంసారులలో ఏకమై నా పాట్లు నేను పడుటయే మంచిదని తలంచితిని'' అని వీరు సమాధానమిచ్చిరి.

ఆపైన సర్వేశ్వరుడు- ''అయ్యా: మీరు నన్నాశ్రయించుటయే గొప్ప విశే షము. నేను ఆశ్రితుల దోషముల నెంచువాడనుకాను. ''అవిజ్ఞాతా సహస్రాంశుః'' అని సహస్రనామావళిలో నా పేర్లను వినలేదా! ఇతర దేవతలు ఆశ్రితుల దోషములలో సర్వజ్ఞులు నేను గుణ సర్వజ్ఞుడను కనుక నా ఆలయమున ప్రవేశించుటకు అందరికి ద్వారములు తెరచియే యుండును. రండు. నేనేదో మాటవరసకు ఇట్లనుటలేదు. పూర్వము వామనావతారమున వారు వీరు అను తారతమ్యమును చూపక వసిష్ఠ చండా

లాది సర్వజీవులను అనుగ్రహింపనట్లు అందరి శిరస్సులపైననూ నా పాద స్పర్శ మును కలిగించలేదా! ఇట్టి సౌశీల్యమే నా సహజ స్వభావము. మీవంటి భక్తులను దూరము చేసికొన్నచో ఇక నా సౌశీల్య సౌలభ్య దయా వాత్సల్యాది కల్యాణ గుణ ములెందులకు"— అని పలు విధములుగా వీరిని సమాధానపరచి పరల తన ప్రక్కకు త్రిప్పుకొనుచున్నాడు. వీరును ఆ వామనావతార ప్రకటితమైన మహాగుణమును తలంచుకొని, "ఇట్లు పరమోదారుడవగు నిన్ను విడచి ఇక నేను ఇతరుల నాశ్రయింపబోను" అని ఈ పాశురమున వివరించుచున్నారు.

పా॥ తావియన్రులకమెల్లాం తలైవిళాక్కొండ వెందాయ్!
శేవియేనున్నై యల్లాల్ శిక్కెనచ్చెంగణ్ మాలే!
ఆవియే! యముతే! ఎన్ఱనాడయి రన్నైయ వెన్దాయ్!
పావియే నున్నై యల్లాల్ పావియేన్ పావియెనే॥

ప్రతి: అన్రు- అనాడు, ఉలకమెల్లాం- లోకములన్నింటిని, తావి- కొలిచి నట్లు చేసి, తలైవిళాక్కొండ- శిరస్సులపై పాద స్పర్శముకలిగించిన, ఎందాయ్ శెంగణ్ మాలే! నా స్వామివగు ఓ పుండరీకాక్షా! ఉన్నైయల్లాల్- నిన్ను తప్ప ఇతరులను, శేవియేన్ శిక్కెన- సేవింపబోను, ఇది నా దృఢ నిశ్చయము. ఆవియే!- నాకు ప్రాణమైనవాడా! అముదే! అమృతమువలె భోగ్యమై, ఎన్నారుయిరన్నైయ- నా అంత రాత్మగా నాలో వ్యాపించియున్న, ఎందాయ్! నా స్వామీ!, పావియేన్ పావియేనే- మహా పాపినైన నేను, ఉన్నైయల్లాల్ పావియేన్- నిన్నుతప్ప ఇతరుల నెవ్వరిని మనస్సులోగూడ తలంపను.

వివరణము: ఇక నిన్నెన్నటికిని విడిచిపోజాలను అని తమ మనో నిశ్చయ మును ఇందు తెలపుచున్నారు. వామనావతారమున సర్వ ప్రాణుల శిరస్సులపై శ్రీపాద స్పర్శమును కలిగించుచూ నీవు చూపిన మహౌదార్యమే నాకు రక్షకము అనుచున్నారు,

"తావి, అన్రు ఉలకమెల్లాం"- ఇత్యాది. ఈశ్వరుడు "మీ అందరి తలలపై నా పాదములనుంచెద"నన్నచో ఈ మూర్ఖలోకము దురహంకారముచే వద్దు పొమ్మని తిరస్కరించును మహాభక్తులైనవారు నీ శ్రీపాదములను నా తలపైనుండి తీయవద్దని పట్టుబట్టుచూ "తిరువాణై- నిన్నాణై" అని ఒట్టుపెట్టుచూ స్వామిని ఎంత నిర్బంధిం

తురో, ఈ అజ్ఞానులైన లోకులను అహంకారముతో అంతగట్టిగా మా తలలపై నుంచరాదని ప్రతిఘటింతురు. ఇది గమనించియే సహజవాత్సల్యశీలుడైన స్వామియు (తావి) లోకములను కొలుచుట అను వ్యాజముతో ఎవరికినీ తెలియకుండా తన పాద స్పర్శమును అందరికినీ కలిగించినాడు. బలిచక్రవర్తి అహంకారముచే నేనే ఈశ్వరుడనని సర్వలోకముల నాక్రమించినపుడు భగవంతుని సర్వేశ్వరత్వము మరుగునపడినది. జీవులెవ్వరుగూడ మేము భగవద్దాసులము అనుకొను అవకాశము లేకుండ అడుగంటిపోయినది. అపుడు దేవతల ప్రార్థనచే ఉపేంద్రుడై అవతరించి బ్రహ్మచారి వేషముచే, తన సౌందర్యమునుచూపి బలిచక్రవర్తిని ఆకర్షించి మూడడుగుల వరమునుగొని బ్రహ్మలోక పర్యంతముగల సకలలోకములను తన శ్రీపాదములచే కొలిచి వసిష్ఠ చండాలాది విభాగము లేకుండా సర్వప్రాణుల తలలపై తన పాద స్పర్శమును కలిగించిన కథా వైభవము ప్రసిద్ధమేగదా! "అమరర్ శెన్నిపూవినై" అన్నట్లు నిత్యముక్తుల శిరస్సులలో పుష్పములవలె అలంకరించుకొనబడు శ్రీపాదములను ఈ మూర్ఖ సంసారుల శిరస్సులపై నుంచనేల? అన్నచో- "ఎందాయ్"- ఆయన మన కందుకి "పితాచ రక్షకశ్శేషీ" అన్నట్లు సర్వవిధబంధువు గనుక వాత్సల్యముతో మన హితమునుకోరి యట్లు చేసెనని సమాధానము. నిదురించు తన పిల్లలపై ప్రేమతో చేయివేసుకొని కౌగలించుకొని పరుండు తల్లివలె స్వామియు వాత్సల్యముతో ఇట్లు పాదస్పర్శచే అందరినీ అనుగ్రహించెను. ఆనాడు పాదస్పర్శను పొందిన సకలప్రాణులలో తాముగూడ చేరియున్ననూ అజ్ఞానముచే తాము అపుడు తెలిసికొనజాలకపోయిరి. ఇపుడు ఆ సంగతిని తెలిసికొన్నందున ఉపకార స్మృతితో "ఎందాయ్" అని వీరు సంబోధించుచున్నారు.

"శేవియేనున్నైయల్లాల్ శిక్కెన..." ఇత్యాది. నీలోగల ఇట్టి మహాగుణము నెరుంగలేక మరలిపోవ జూచితివి కాని ఇపుడిక నిన్ను విడచిపోయి ఇతరుల నెన్నటికిని ఆశ్రయింపను. "శిక్కెన"- ఇది నా దృఢాభిప్రాయము- నమ్ముము. "మాశుచః" అని భగవంతుడు అర్జునుని ఓదార్చినట్లు వీరును భగవంతునికి "మాశుచః" చెప్పుచున్నారు. "ఈ భక్తుడు నాకు దూరమైపోవునేమోనని నీకు బెంగవద్దు. ఇక ముమ్మాటికినీ విడిచిపోను అని మాట యిచ్చుచున్నారు. ఈ మాటను విన్న వెంటనే ఆయనకు సంతోషముతో కన్నులు విప్పారినవి. అది చూచి "శెంగణ్‌మాలే!" పుండరీకాక్షుడవగు స్వామీ! అని సంబోధించిరి. విభీషణుడు శరణాగతుడై వచ్చినపుడు సుగ్రీవుడు "వధ్యతాం" వీడు శత్రుపక్షీయుడు గనుక వధ్యుడని తెలుపగా శ్రీరాముని మనస్సు చివుక్కుమనెను. పిదప హనుమంతుడు ఇతడు మంచివాడు

గనుక స్వీకరింపుడని చెప్పగా స్వామి మనస్సు కుదుటపడెనట. అట్లే ఈ ఆళ్వారులు మొదట ''విలవరచ్చిరిత్తిట్టనే" అని తమలో తామే నవ్వుకొని సిగ్గుతో వెనుకడుగు వేయగా, రంగనాథుని మనస్సు చివుక్కుమనెను. ఇప్పుడు "శిక్కెన" అని తమ దృఢాభిప్రాయమును ప్రకటించగానే స్వామి మనస్సుగూడా కుదుటపడెను.

''ఆవియే! అముదే!" నీవే నా ప్రాణము. ప్రాణమును విడిచి నేనెచటికి పోగలను? వీరికి ప్రాణము అనగా- మనవంటి ఉచ్ఛ్వాస నిశ్వాస రూప వాయు విశేషముకాదు. లక్ష్మీచరణాలాక్షాంక సాక్షి శ్రీవత్సవక్షస్కుడైన శ్రీరంగనాధుడే వీరికి ప్రాణము. కేవలము ప్రాణము మాత్రమేకాదు- అమృతమువలె అతిభోగ్య భూతుడు ధారకుడు జన్మ మరణాదులను తొలగించు బలవర్ధక రసాయనము గూడ ఆయనయే అంతేకాదు- "ఎందన్ ఆరుయిర్ అన్నైయ ఎందాయ్"- నేను నీకు శరీరమునుకాగా, నీవు నాకు అంతరాత్మవు ఆత్మను విడచి శరీరముండగలదా! అనుచున్నారు విశేషణములైన ఒక్కొక్క సంబోధనము నిన్ను విడచి పోజాలనను సంగతిని దృఢీకరించుచున్నవి.

"పావియేన్ ఉన్నైయల్లాల్ పావియేన్ పావియేనే"- ఇందు మొదటి "పావియేన్" అను పదము క్రియావాచకము నిన్ను తప్ప ఇతరులెవ్వరినిగూడ మనస్సులో తలంపను- అని దాని యర్థము ఇపుడు మరల రంగనాధునికనుమానము కలిగెను. "అయ్యనే! అరంగనే!" అనియు ''ఎన్నై ఆళుడైయ కోవే" అనియు వెనుకగూడ చెప్పితిరి. మరల అవన్నియు పైపైమాటలేగాని నిజమైన భక్తి నాలో లేదంటిరి మరి ఇప్పుడు చెప్పినవిగూడ అట్టి పొల్లుమాటలేనా? నమ్మదగినవేనా! ఏక్షణములోనైనా మనస్సు మారి నన్ను విడిచి పోవుదురా"— ఈ అనుమానమును తీర్చుటకే ''పావియేన్ పావియేన్" అని రెండుమారులు నొక్కిచెప్పుచున్నారు. నీవు పాపిష్ఠులనుగూడ అనుగ్రహించుటకై తారతమ్యము లేకుండా అందరి శిరస్సులలో శ్రీపాదములుంచిన పరమోదారుడవనియు ఆశ్రితుల దోషములను అసలే గుర్తించనివాడవనియు తెలిసికొనలేక నిన్ను విడచిపోవుటకు వెనుకడుగు వేసితిని. నా పాప ప్రాబల్యమే నన్ను అట్లు వెనుకకు లాగినది. ఇపుడు త్రివిక్రమాపదానముచే నీ ప్రభావమును గుర్తెరిగితిని గనుక ఇక ఎన్నటికిని విడిచిపోవ ప్రసక్తియే లేదు ఆత్మ వినాశహేతువుగా నాలో కలిగిన ఆ చెడు తలంపునకు పాప ప్రాచుర్యమే కారణము. ఇకపైన నిన్ను విడచి పోజాలను— ఇది 'శిక్కెన' నా గట్టి నిర్ణయము.

(**36**) అవతారిక తమలోగల దోషములనుబట్టి తమ అయోగ్యతను తలంచు కొని వెనుకడుగు వేసిన వీరిని తప్పిపోకుండునట్లు భగవంతుడు తన త్రివిక్రమావతార వైభవమును సౌశీల్య సౌలభ్యాది గుణములను ప్రదర్శించి మరల తన ప్రక్కకు త్రిప్పుకొని చేరదీసినట్లు వెనుకటి పాశురములో చెప్పబడినది. దానితో వీరికి స్వామి నన్ను అనుగ్రహించెనని పూర్ణ విశ్వాసమేర్పడినది. ఇంక ఆలస్యమేల? వెంటనే స్వామి ముముక్షువులకు ప్రాప్యమగు తన దివ్యధామమునకు (శ్రీవైకుంఠమునకు) చేర్చుకొని సర్వవిధ కైంకర్యములను ప్రసాదించగలడని ఆశపడిరి. ఎప్పుడెప్పుడా యని త్వరపడిరి. వీరి తొందరయేగాని వెంటనే ఫలితము సిద్ధింపలేదు. అందులకేమి ప్రతిబంధకము? అనుగ్రహించినవాడు ముక్తినిచ్చుటలో ఏల ఆలసించుచున్నాడు?

వీరిని దూరము కాకుండ తన దరికి చేర్చుకొనుటకు తాను ఎన్ని పాట్లు పడ వలసి వచ్చెనో ఆయనకే తెలియును నిదానమెరిగిన వైద్యుడు రోగము తగ్గినదని చెప్పి వెంటనే పథ్యమును పెట్టించడు. రోగము తిరుగబెట్టకుండుటకై సమయమును ప్రతీక్షించును. ఆమదోషముపోయి రోగికి ఆకలి పుట్టినదా లేదా యని గమనించును. "నిర్వాణం భేషజం భిషక్" పరమాత్మ గొప్ప వైద్యుడుగదా! బాహ్య విషయములపై వైరాగ్యముతోపాటు వీరిలో ఆర్తి పెరుగవలెనని స్వామి కొంచెము ఔదాసీన్యము వహించెను క్రమముగా వీరిలో ఆరాట మధికమయ్యెను. ఇంకను ఈ ప్రకృతి మండలములోనే దుఃఖముల ననుభవించుచూ పడియుండవలెనేమోయని భయము పెరుగ జొచ్చెను. ఇక ఆలస్యమును క్షణమైనను సహింపలేక శేషశాయియగు స్వామికి నిద్ర పట్టనీయకుండ చూచువారి మనస్సులు కరిగిపోవునట్లు "స్వామీ! రక్షింపుము" అని గొంతెత్తి ఈ పాశురమున ఆక్రోశించుచున్నారు.

పా॥ మழைக்కన్ఱు వరైమున్నేందుం మైందనే! మదురవాఱే!
ఉழைక్కన్ఱేపోల నోక్కముడైయవర్ వలైయుళ్పట్టు!
ఉழைక్కిన్ఱేర్కెన్నై నోక్కాదొழிవదే యున్నైయెన్నై
అழைక్కిన్ఱనాదిమూర్తి! అరంగమానగరుళానే!

ప్రతి : మழைక్కు- వర్షబాధ నివారించుటకు, అన్ఱు- ఆనాడు వరై-పర్వతమును, మున- ఏందుం- బాధ కలుగకముందే ఎత్తిన, మైందనే- బలవంతుడా! మదురవాఱే- మధురమగు నదీజలమువలె భోగ్యమైనవాడా! ఉழைక్కన్ఱేపోల- లేడి

పిల్లలవంటి, నోక్కముడైయవర్ - చూపులు కలిగిన స్త్రీలయొక్క, వలైయుళ్ పట్టు వలలోపడి ఉళైక్కిన్ఱేన్కు - ఎన్నై - బాధపడుచున్న నన్ను, నోక్కాదొళివదే - కటాక్షింపవేమి? ఆదిమూర్తి అరంగమానగరుళానే - జగత్కారణభూతుడవగు రంగనాథా! ఎన్నై - రావేమయ్యా!

వివరణము: ఇన్ద్రుడు రాళ్ళవానను కురిపించినపుడు గో-గోప- సంతతిని కాపాడుటకై గోవర్ధనపర్వతము నెత్తిన చరిత్రమును జ్ఞాపకము చేసుకొనుచున్నారు. ఆ చరిత్రము నిపుడు ప్రస్తావించుటకు కారణమేమనగా- ఆయనవల్లనే తమ కష్టములన్నియు తీరునని భావించినవారు గనుక ఆయనయొక్క ఆపత్సఖత్వమను గుణమును కీర్తించుచున్నారు. గొల్లజాతికంతటికిని పెద్ద ఆపదవచ్చినపుడు మిత్రునివలెవచ్చి గోవర్ధనమెత్తి రక్షించినవాడు గదా! సంసారమను ఆపదలో పడిన నన్నును అట్లే రక్షింపగలడని వారి యభిలాష. ఆకలిగొన్నవాడు ఆకలితీర్పు శ్రీమంతుని పిలుచును గాని వైద్యునో యోగీశ్వరునో వీరునో పిలుచునా? "గో గోప జనసంకులం అతీవార్తం" అని చెప్పబడినట్లు ఆవులు దూడలు గొల్లలు రాళ్ళవానచే తల్లడిల్లిపోయినట్లు నేనునూ "బహుధా సంతత దుఃఖవర్షిణి- భగవన్! భవదుర్దినే" అని తెలుపబడిన విధముగా దుఃఖపరంపరను వర్షించు సంసారమను వర్షాకాలములోపడి ఎన్నోపాట్లు పడుచున్నాను. అప్పుడు వారందరికినీ కలిగినంతటి దుఃఖము ఇప్పుడు తమ ఒక్కరికే కలిగినదని వీరి ఆరాటము. ఇన్ద్రుడు సంవర్తకమను మేఘమును పంపి రాళ్ళవానను కురిపింపగా చక్రాయుధమును ప్రయోగింప నిది సమయముకాదని యెంచి శ్రీకృష్ణుడు చేతికందిన ఒక పర్వతమును పెకలించి ఎత్తి గొల్లలను కాపాడెనట. దీనినిబట్టి- సర్వసమర్థుడగు పరమాత్మకు కార్యమును సాధించునప్పుడు ఫలానా ఆయుధమే ఉపకరణమగునను నియమము లేదనియు చేతికందిన ఏ వస్తువైనను ఆయనకు ఆయుధమే యగుననియు స్పష్టమైనది. "అస్త్రీమాన తృణం ప్రియాద్రుహి" సీతమ్మవారిపై ద్రోహమునకు తలపెట్టిన కాకాసురునిపైన శ్రీరాముడు గడ్డిపరకనే మహాస్త్రముగా ప్రయోగించెను గదా! ఏడేండ్ల బాలుడవైయుండి ఆనాడు పూబంతిని ఎత్తినట్లు అనాయాసముగా పర్వతమునెత్తి వారిని కాపాడలేదా. నన్ను నట్లే రక్షింపరావేమి? మైందన్- బలశాలి. "మదురవాతే"- ఆఱు అనగా నది. మధురమగు నది వలె ఉన్నచోటికి వచ్చి రక్షించువాడా! అని యర్థము. ఇచట స్వామిని సముద్రము వంటివాడాయని పోల్చక నదితో పోల్చుటలో విశేషమున్నది. సముద్రము దప్పిని తీర్చుటకుగాని స్నానాదులకుగాని ఉపయోగపడదు. నది దప్పిగొన్నవారికి పానార్హమైన చల్లని నీటినిచ్చుటయేగాక సంతాపము తీరునట్లు దేహమాలిన్యము పోవునట్లు

స్నానమాడుటకును ఉపయోగపడును. సముద్రము ఉన్నచోటినుండి కదలదు. నది వివిధ ప్రదేశములకు ప్రవహించి సంతాపహరముగా జీవనము నిచ్చును. అట్లే పరమాత్మయు పరమ పదమునుండి వ్రేపల్లెకు వచ్చి గోపజాతిని రక్షించెనుగదా!

''ఉళైక్కన్నెపోల.. '' ఇత్యాది. ఉళైక్కన్ను-అనగా లేడిపిల్ల. దానికన్నుల వలె చంచలము సుందరము అమాయకమునైన కన్నులు కలవారు యువతులు. ''బాలమృగాక్షీ'' అని సంస్కృతములోనందురు. హృదయములో నిజమగు ప్రేమ లేకున్నను ప్రేమను ప్రకటించు చంచలాక్షులు అని భావము. వారి వలలోపడి బైటికి రాలేని విధముగా చిక్కుపడితిని. ఇక నాకు నీవే రక్షకుడవని ఆక్రోశించు నన్ను కటాక్షింపవా. రాళ్లవానతో వచ్చిన ఆపదను రాతి పర్వతముతో తొలగించితివి స్త్రీ నేత్ర సౌందర్యమను ఎలచే వచ్చిన నా ఆపదను నీ నేత్ర సౌందర్యమును కటాక్ష రూపమున చూపి రక్షింపుమని కోరుట భావచమత్కృతి.

ఇట్లు వీరు వేడుకొన్ననూ ఆయన ఉలకలేదు పలుకలేదు. వీరి హృదయమున ఇంకను ఆర్తి పెరుగవలెనని ఆయన భావన వ్యాధి తగ్గిన పిదప బాలుడు ఆకలితో "అన్నము అన్నము" అని అలమటించినపుడే తల్లియు రోగశాంతిని గమనించి సంతోషించి అన్నము పెట్టినట్లు ఆయనయు వీరికి నిజమైన ఆర్తి కలిగి ఆక్రోశించ వలెనని ప్రతీక్షించెను.

''ఉన్నైయెన్నైయళైక్కన్నే''— స్వామీ! నిన్నేనయ్యా నేను పిలుచునది. ఏ క్షుద్రపురుషుని వాకిటికో పోయి నేను మొరపెట్టలేదు. సమర్థుడవని నిన్నే ఉద్దేశించి మొరలిడుచున్ననూ వినిపించుకొనక ఏమరపాటును చూపెదవేల? నీ జగత్సృష్ట్యాది కార్యకలాపము అవతారాది ప్రయోనము ఇదంతయు మమ్ము రక్షించుటకేగదా!

"ఆదిమూర్తి అరంగమానగరుళానే" ప్రళయకాలమున నిశ్శబ్దముగా నీలో లీనమైయుండు చరాచరములను నీవే దయతో "బహుస్యాం ప్రజాయేయ" అని సృష్టించి రక్షించినవాడవు- ఇప్పుడు నేను గొంతెత్తి పిలుచుచున్ననూ వచ్చి రక్షింపవేల? "నారుపోసినవాడు నీరుపోయడా" యన్నట్లు తన సంతానమును రక్షించుకొనుట, కన్నవారి బాధ్యతయే గదా! వీరిట్లు ఉచ్చైస్స్వరముతో మొర పెట్టుచున్ననూ స్వామి ఏమియుతెలియనట్లు విననివానివలె నటించుటకు కారణ మేమనగా! ఆయన శ్రీవైకుంఠమున నిత్య సూరులందరునూ తనను సేవించుచూ

ఆనందాతిరేకముతో "హావూ హావూ హావూ" అని గట్టి కోలాహలము చేయు ధ్వనిని వినియున్నాడు అట్లే సంసారులైన లోకులు తమకు కావలసిన ఫలితము అంది రానపుడు దుఃఖముతో పెట్టిన కేకలనుగూడ వినియున్నాడు కాని తన కృషిఫలిత ముగా మనస్సుమారి ఆర్తితో చేయు ఇట్టి ఆక్రందనమును తాను ఇతఃపూర్వము విని యుండలేదు ఇదేదో కొత్తగా తోచి కొంచెము ఉపేక్షించినాడు.

**(37)** అవతారిక వీరంతగా ఆక్రందించినను శ్రీరంగనాధుడు దయతో "మాశుచః" అనలేదు ఆయన తను తప్ప నాకు వేరే ఆప్తబన్ధువులున్నారని యెంచి నాడా? తనవద్ద ఇతర లౌకిక ఫలితము నపేక్షించుచుంటినని భావించినాడా? వీడు నావాడని నన్ను ఆయన అంగీకరించిన చాలును. నేను ధన్యుడనయ్యెదను గదా! ఆ మాత్రము సాంత్వన వాక్యమైనను పలుకక స్వామి నిదురించుచున్నాడే ఆయన హృదయమంత కఠినమైనదా! అని ఈ పాశురమున వాపోవుచున్నారు—

పా॥ తెళివిలాక్కలంగల్ నీర్ శూళ్ తిరువరంగత్తుళోంగుం
ఒళియుళార్ తామే యన్ఱే తన్దైయుం తాయుమావార్।
ఎళియదోర్ అరుళుమన్ఱే ఎన్ఱిరత్తెంబిరానార్
అళియన్ నంపైయలెన్నార్ అమ్మవో కొడియవారే॥

ప్రతి. తెళివుఇలా- స్వచ్ఛతలేక, కలంగల్ నీర్ శూళ్- కలుషితమైయున్న కావేరీ జలముచే చుట్టబడిన, తిరువరంగత్తుళ్- శ్రీరంగ నగరమందు, ఓంగుం ఒళి యుళార్- అతిశయించిన తేజస్సుగల, తామేయన్ఱే- స్వామివారేగదా! తన్దైయుం తాయుం ఆవార్- నాకు తండ్రియు తల్లియునై యున్నారు. ఎన్ఱిరత్తు- నాపై చేయ వలసినది, ఎళియదు- సామాన్యమగు, ఓర్ అరుళుం అన్ఱే- ఒక్క కృపనేగదా! ఎంపిరానార్- నాకు మహోపకారకులైన ఆ స్వామివారు, అళియన్- దయనీయుడైన వీడు, నంపైయల్- మన పిల్లవాడు, ఎన్నార్- అని పలుకకున్నారే. అమ్మవో- ఓయమ్మా, కొడియవారే- కఠినాత్ములేనే.

<u>వివరణము</u> కావేరీ పరివేష్టితమైన శ్రీరంగమున శయనించియున్న స్వామియే నాకు తండ్రియు తల్లియునుగదా! ఆయన కృపయే నాపై కొంత ప్రసరింపవలెనని నేను కోరుకొనునది. వీడు నావాడని ఒక్కసారి నన్ను గూర్చి ఆయన చిన్నమాట

పలికిన చాలును. అదే నాకు పదివేలు. ఆ మాత్రమైన పలుకదేమి? ఇంత కఠినుడా? ఇది వీరి ఆవేదన.

కావేరీనది తేటనీరు కలిగియుండక సర్వదా కలవరపాటుతో కలుషితముగానే యుండునట ఒక ప్రవాహము కొంచెము తగ్గగానే మరొక ప్రవాహము పైనుండి వచ్చి పడుచుండుటచేత నీరు తేటపడు అవకాశము లేదు. మరియు శ్రీరంగనాథుని పై ఈ కావేరీనదికి ఎంతో సాదరమగు ప్రేమ కలదు. కనుకనే స్వామికి ఏమి పరిచర్యలు చేయవలెనాయని పలు విధముల విచారపడుచుండుటచే ఎల్లప్పుడును వ్యాకులతతోనే యుండును. కావేరియు ఈ ఆళ్వారుల (విప్రనారాయణుల) వంటిదేనట. స్వామి సన్నిధికి చేరుటకు ముందు ఎప్పుడు చేరుదునోయని కలతజెందుట, చేరిన పిదప ఎట్లు సేవింపవలెనా యని అయోమయ స్థితి. ఈ ఆళ్వారుల స్థితియే కావేరికిని పట్టినది. శ్రీరంగము వరకు రాకపూర్వము ఈనదియు స్వామిని సేవింతునను ఉత్సాహముతో పరవళ్లు త్రొక్కుచు వచ్చినది సమీపించిన పిదప రెండు పాయలై స్వామిని చుట్టి వేసినది. శ్రీరంగరాజస్తవమున భట్టరువారు కావేరినిట్లు వర్ణించిరి.

శ్లో॥ దుగ్ధాబ్ధిర్జనకః, జనన్యహం, ఇయం శ్రీరేవ పుత్రీ, వరః
శ్రీరంగేశ్వరః, ఏతదర్హ మిహ కింకుర్యాం, ఇతీవాకులా ।
చంచచ్చామరచంద్ర చందన మహామాణిక్యముక్తోత్కరా
కావేరీ లహరీ కరై ర్విదధతీ పర్యేతి సా సేవ్యతామ్ ॥

నదులకు సముద్రుడు పతి అను దృష్టితో ఈవర్ణనము. క్షీరసముద్రుడు తండ్రి- నేను (కావేరి) తల్లిని. మా అమ్మాయి శ్రీరంగనాయకి. మా అల్లుడే శ్రీరంగ నాథుడు. వీరిద్దరికి (బిడ్డకు అల్లునికి) నేను పరిచర్యలు చేయవలెనను ఆరాటముతో కావేరి తన తరంగ హస్తములతో చామరములు కర్పూరహారతులు చందనాదులు రత్నములు ముత్యములు మొదలగు అనర్ఘవస్తువులను పట్టుకొని అరణముగా తెచ్చు చున్నదట.

ఇట్లు కావేరీనదిచే పరివేష్టితమైన శ్రీరంగమందిరమున ఉజ్జ్వల తేజశ్శాలియై స్వామి ప్రకాశించుచున్నాడు. ప్రకృతి మండలములో గల ఈ శ్రీరంగమునకు వచ్చిన పిదపనే చీకటిలో దీపమువలె స్వామి తేజస్సు ప్రకాశించినది. ఇక్కడనే అర్తులగు సంసారులను రక్షించుటచే దయా వాత్సల్యాది గుణములు ప్రకాశితము

లైనవి. పరమపదమున దోషులను దుఃఖితులను ఎవరునూ లేరు— గనుక ఆ దయావాత్సల్యాది గుణములచట ప్రకాశించుటకు అస్కారమేలేదు. అచట నందరును స్వామివలె జ్ఞానానందాది గుణశోభితులే. దివ్యమంగళ విగ్రహధారులే. వారినడుమ ఆయనకు పగటి దీపమువలెను (ఆదిత్యానామహం విష్ణుః) ద్వాదశాదిత్యులలోనుండు విష్ణురూప సూర్యమూర్తివలెను ప్రత్యేక ప్రకాశములేదు. ఇచటనే స్వామియొక్క ప్రభావరూపమగు తేజస్సు ఉజ్జ్వలమైనదని భావము.

"ఒళియుళార్ తామేయన్టే తన్దైయుం తాయుమావార్"- సుబాలోపనిషత్తు "మాతా పితా భ్రాతా సుహృద్గతిశ్చ నారాయణః" అని చెప్పుచూ, సర్వజీవులకును నారాయణుడే తల్లియు తండ్రియు ఇతర విధమగు ఆప్తవర్గమంతయునని తెలిపినది. నాకు మాత్రము ఆ పరవాసుదేవుడో క్షీరసాగరశాయి వ్యూహమూర్తియో రామ కృష్ణాద్యవ తారమూర్తులో అపేక్షయుకాదు. ఈ శ్రీరంగనాథమూర్తియే సర్వవిధబన్ధువని వీరి అధ్యవసాయము. దేహబన్ధువులుగాని దేవతాన్తరములుగాని తమకు ఆప్తులుకారని శ్రీరంగనాథుడే తమ సర్వస్వమని వీరి ప్రగాఢ విశ్వాసము.

శ్లో॥ సర్వేషామేవలోకానాం - పితా మాతాచ మాధవః ।
గచ్ఛధ్వమేనం శరణం - శరణ్యం పురుషర్షభాః ॥

ఇది మహాభారతములోని శ్లోకము పాండవులు వనవాసముచేయు సమయమున శ్రీకృష్ణుడు సత్యభామతో కలసి వారిని చూడవచ్చెను. అది విని పరాశరాది మహర్షులును శ్రీకృష్ణ దర్శనార్థమై వచ్చిరి. వారిలో మార్కండేయ మహర్షియు నుండెను. అపుడందరును సభ చేసియుండగా ధర్మరాజు- "మాకీ కష్టసమయమున మనశ్శాంతికై ఏవైన మంచి మాటలను ఉపదేశింపు"డని ప్రార్థించెను. వారు ఏవేవో కొన్ని మాటలను చెప్పగా వారిలోనున్న మార్కండేయ మహర్షి వారి వాదములనన్నిటిని తిరస్కరించి పై శ్లోకమును ఉపదేశరూపముగా పాండవులకు చెప్పెను. సర్వలోకములకు తండ్రియు తల్లియు ఈ శ్రీకృష్ణభగవానుడే. రక్షకుడైన ఈయననే మీరు శరణు పొందుడు. ఆ ప్రకారమే ఈ ఆళ్వారులును రంగనాథుడే తమకు సర్వవిధ బంధువని విశ్వాసము కలిగియున్నారు. ఇట్లే శీరామప్పిళ్లై (వ్యాసభట్టర్) అను పేరుగల తమ తమ్ములు అనారోగ్యగ్రస్తులైయున్న సమయమున శ్రీ పరాశరభట్టరువారు పై శ్లోకమునే ఉపదేశించినారట.

"ఏళియదోరరుళమన్నే యెణాతిరత్తు"– కొద్ది దయను నాపై ప్రసరింపజేయ మనియేగదా ప్రార్థించితిని. నాకోసమై పర్వతమెత్తవలెనా? నేను క్షుద్ర లౌకిక ఫలిత మేదియు కోరలేదే. చల్లగా నొకసారి కటాక్షింపుమంటిని. అంతేగదా! ''ఎంపిరానార్ అళియనంపైయల్ ఎన్నార్"– పిరాన్ అనగా ఉపకారకుడు స్వామి నాకు జ్ఞాన వైరాగ్యాదులను కలిగించి నన్నీస్థితికి పైకితెచ్చిన మహోపకారకుడు. ఇంత చేసి "వీడు మంచివాడు- మా చిన్నవాడు" అని ప్రేమతో ఒక్కమాటయన్నచో నేనెంతో సంతోషింతునుగదా! ఒక్కమాటైన పలుకడేమి? ఇంత కఠినుడా? నేను దాసుడనని తాము భావించినను స్వామి నోటినుండి ఆమాట వచ్చినపుడే తమ దాసత్వము స్థిర మైనట్లు వీరి భావన.

**(38)** అవతారిక మహాభారతమునకు ''సర్వధర్మాణ్ పరిత్యజ్య... " అను చరమ శ్లోకము సారమైనట్లు ఈ తిరుమాలై ప్రబంధమునకు ఈ 38వ పాశురము సారమైనది.

శ్లో॥ మతిమన్థానమావిధ్య – యేనాసౌ శ్రుతిసాగరాత్ ।
జగద్ధితాయ జనితో – మహాభారతచన్ద్రమాః ॥

అను శ్లోకమున ప్రశంసింపబడినట్లు శ్రీ వేదవ్యాసుడు తన బుద్ధియను మందర పర్వతముతో వేదరాశియను మహాసాగరమును మథించి చంద్రునివలె ప్రకాశమాన మగు ఈ మహాభారత గ్రంథమును ఆవిష్కరించెనట. పరమాత్మ క్షీరసముద్రమును తరచి అమృతమును దేవతలకిచ్చెను. వ్యాసుడు వేదరాశిని మథించి సర్వజనాహ్లాద కరమైన మహాభారతమును ఆత్మోజ్జీవన హేతువుగా లోకమునకందించెను దేవతలకు పరమాత్మ యిచ్చిన అమృతము బన్ధకము. వేదవ్యాసుడిచ్చిన మహాభారతామృతము సంసారబన్ధ విమోచకము.

అట్టి మహాభారతముగూడ పైపై చెత్తయే యనదగినట్లు భగవద్గీతయే అందు లోని ప్రధానసారము. ఆ గీతలోగూడ పై చరమ శ్లోకము సారతమము. ఈ చరమ శ్లోకమున శరణాగతి తత్త్వమును నిరూపించుటకే భారతములోని పూర్వభాగమంతయు ఉపోద్ఘాతమువలె అవతరించినది. ''ఇదంతే నా తపస్కాయ"– ఇత్యాది పై భాగ మంతయు చరమ శ్లోకార్థగౌరవమును నిరూపించుటకై వ్రాయబడినది. అట్లే దీనికి ముందున్న 37 పాశురములు ఉపోద్ఘాత రూపములుకాగా తరువాతనున్న 7 పాశురము

యను ఇందు ప్రతిపాదితమైన అర్థమునందు దృఢనిష్ఠగలవారి వైభవమును వివరించి నవి కనుక ఈ ప్రబంధమునకు ఈ పాశురము భారతమునకు చరమ శ్లోకమువలె సారమైనదని గ్రహింపదగును

ద్వయమంత్రములోని శరణాగతి తత్వమిందు నిరూపితమైనది. ఆ మంత్రమున ఉపాయమగు ప్రపత్తి ప్రథమ వాక్యములోను ప్రాప్యమైన భగవత్కైంకర్య రూప ఫలము రెండవ వాక్యములోను ప్రతిపాదితము కాగా ఈ పాశురమున ఆ క్రమము తారుమారై మొదట ఫలము చెప్పబడి పిదప ఉపాయానుష్ఠానము తెలుపబడినది ఇట్లు చెప్పిననూ తప్పులేదు. విషయమును నిరూపించుటలో వ్యుత్పత్తిదశ- ప్రయోగదశ- అని రెండు విధములు. వ్యుత్పత్తి దశ యనగా విషయ స్వరూపమును తెలుపుదశ దాని అనుష్ఠాన పద్ధతిని తెలుపునది ప్రయోగదశ. అందు మొదటి వ్యుత్పత్తి దశలో మొదట ఫలమును చెప్పి పిదప దానిని పొందుటకు ఉపాయము విధింపబడును. "స్వర్గమును కోరువాడు జ్యోతిష్టోమ యాగమును చేయవలెను" అను వాక్యముచే ముందు ఫలము చెప్పబడి అనంతరము యాగము విధింపబడినది. ఫలాకాంక్ష మొదట సహజముగా కలిగి, పిదప దానికి సాధనోపాయ మేదియని సాధనాకాంక్ష కలుగును గదా ఇది వ్యుత్పత్తిదశ. ఈ యాగమును ఆచరించి ఆ స్వర్గ ఫలమును పొందుమనుట ప్రయోగదశ. కారణము పూర్వము- కార్యమనంతరము అనుక్రమము లోకసిద్ధమేయైనను, కారణ స్వరూపమును తెలుపుటకు ముందుగా "ఈ కార్యమును సాధించునదియే కారణ"మని వివరించుట అవసరమే గదా! ద్వయ మంత్రమున ప్రయోగదశయు, ఈ పాశురమున వ్యుత్పత్తి దశయు కలదు గనుక ఈ క్రమ వ్యత్యాసమున్ననూ అర్థము రెంటిలోను ఒకటియేనని గ్రహింపదగును.

ఇక శ్రీ శఠకోప మునీంద్రులు తమ ప్రబంధములో "అగలగిల్లే నిరైయుం" అను పాశురమున సంపూర్ణ శరణాగతిని చెప్పిరిగాని అందు ప్రాప్యమగు కైంకర్య ఫలమును తెలుపలేదు. శ్రీ ఆండాళమ్మవారు "శిత్తంశిరుగాలే" అను పాశురమున కైంకర్య రూప ఫలమును తెలిపిరిగాని శరణాగతి రూప సాధనమును తెలుపలేదు. అనగా- ద్వయమంత్రములోని పూర్వ వాక్యము నొకరు వివరింపగా ద్వితీయ వాక్యమును మరొకరు వివరించిరి ఈ విప్రనారాయణ మునీంద్రులు ఈ పాశురములో ద్వయమంత్రములోని రెండు వాక్యముల అర్థములగు శరణాగతిని ఫలమునుగూడ వివరించి ఆ మంత్రార్థమును సమగ్రముగా అనుసంధించుకొనిరనుట విశేషము.

వెనుకటి పాశురముతో దీనికి సంబంధమేమనగా– "అళియఙా నం పైయల్ ఎన్నార్– అమ్మవోకొడియవారే" అని వీరు "వీడు నావాడు" అన్నట్లు ఒక్కమాట నైన పలుకదేమాయని వ్యాకులత నొందగా భగవంతుని మనస్సుగూడ ప్రసన్నమైనది క్షుద్రఫలములకై పరుగులిడు ఈలోకులలో వీరు ఒక్కరే స్వార్థనిరపేక్షతో కైంకర్యము కోరుచున్నారనియు, ఆ ఫలితమునకై నాపై ఆత్మార్పణము (నీవే ఫలితము నిమ్మని శరణాగతి) చేసి భారమునుంచిరనియు, పైగా ఆలస్యమును భరింపలేక ఆరాట పడుచున్నారనియు, భావించి ఆయన ఈ పరిపాకదశ కలిగిన వీరికి ఇక ఫలితము ఆలసింపక తప్పక ఇత్తునని ప్రసన్నచిత్తుడయ్యెను. ఇట్టి అధికారి లభించుటచే మిక్కిలి సంతోషము ఆయన శ్రీముఖములో ప్రస్ఫుటమయ్యెను. చిరునవ్వుతో ముఖపంకజము వికసితమయ్యెను.

ఆ సంతోష లక్షణమును గుర్తించి వీరు– "స్వామీ! నిన్నాశ్రయించి నీ చరణారవిందములపై భరన్యాసముచేసి ఉపాయాంతరములను విడచి నీ కైంకర్యమునకై ఎదురుచూచు ప్రపన్నులను చూచినచో నీ మనస్సు ఇంతగా ఉప్పొంగినదే! నీ వెంత ఆశ్రితపక్షపాతివయ్యా!" అని ఇందు ప్రస్తుతించుచున్నారు. భగవద్గీతలోని చరమ శ్లోకము శరణాగతి ప్రక్రియను విధించునది కాగా, దాని నాచరించినవారు ప్రీతితో నిత్యము అనుసంధించు కొనవలసినది ద్వయమంత్రము. ఆ ద్వయమంత్రనిష్ఠులపై ఈశ్వరునికిగల హర్షాతిశయమును ఆవిష్కరించునది ఈ పాశురము ఇక దీని అర్థమును గ్రహింతము.

పా॥ మేంపొరుళ్ పోగవిట్టు మెయ్మ్మైయై మిగవుణర్న్దు
ఆంపరిశు అరిన్దుకొండు ఐంపులనగత్తడక్కి ।
కాంపరత్తలై శిరైత్తు ఉఱాకడైత్తలై యిరుందువాళుం
శోంబరై యుగత్తిపోలుం శూళ్పునలరంగత్తానే ॥

ప్రతి : శూళ్పునల్ అరంగత్తానే– కావేరీ పరివేష్టిత శ్రీరంగనగర నివాసా! స్వామీ! మేంపొరుళ్– ఆరోపితముగా వచ్చిన దేహమును ప్రాకృత భోగములను పోగవిట్టు– సమూలముగా తొలగించుకొని మెయ్మ్మైయై– ఆత్మస్వరూపమునే, మిగ వుణర్న్దు– బాగుగా తెలుసుకొని ఆంపరిశు– స్వరూపోచితమైన కైంకర్యమును, అఱిందుకొండు– తెలిసికొని, ఐంపులన్– పంచేంద్రియములను, అగత్తు అడక్కి– లోపలే నిగ్రహించుకొని, కాంబుఅర– సమూలముగా నశించునట్లు, తలై శిరైత్తు–

తలను గొరిగించుకొని, (అనగా అహం- మమ- అను భావములను తొలగించుకొని) ఉకాత్తిలైకడై యిపస్తు- నీ ముఖద్వారము ముందుండి, వాళ్లం- ఉజ్జీవించువారగు, శోంబరై- సర్వాప్రాపరులైన ప్రపన్నులనుచూచి, ఉకత్తిపోలుం- నీవు ఎంతో ఇష్ట పడుచుందువుగదా !

విపరణము : దేహమును దానితోపాటు కర్మఫలముగా వచ్చిన గృహారామ క్షేత్రాది భోగములను స్థిర పురుషార్థములు కావని భావించి, ఆత్మస్వరూపమను (తన నిజస్వరూపమును) భగవచ్ఛేషభూతమని యెంచి, అట్టి తనకు భగవత్కైంకర్యమే తగిన వృత్తియని అదే నిత్య పురుషార్థమనియు తలంచి, పంచేంద్రియ నిగ్రహము నొంది, స్వరూప విరుద్ధములైన సాధనాంతరములను సమూలముగా పరిత్యజించి, నీవే ప్రాప్య ప్రాపకములని నీపై భారమునుంచి నీ పాద సన్నిధికి చేరి నిశ్చింతగా నుండు వారెవరో- అట్టివారేగదా పరమ ప్రపన్నులు. అట్టివారిని చూచినచో నీవు ఎంతగానో అభిమానపడి ఆదరింతువుగదా! "స మే ప్రియః" "స మే యుక్తతమః" అని చెప్పుకొందువుగదా!- అని సంగ్రహముగా ఈ పాశురమునకు భావము ఇక వివరముగా వ్యాఖ్యానించుకుందము.

"మేంపొరుళ్‌పోగవిట్టు"- ఇచట "మేంపొరుళ్" అనుదానికి మూడు విధ ములుగా అర్థము చెప్పవచ్చును. ఎట్లనగా- (1) (మేల్ ఎఱుందపొరుళ్-మేం పొరుళ్) పొరుళ్ అను పదమునకు వస్తువు అని యర్థము పుణ్య పాపాది కర్మ వశముచే క్రమముగా పైపైన ఆరోపితముగా వచ్చినది పదార్థము అని మొదటి అర్థము అట్టిది దేహము దానితోపాటు వచ్చు గృహారామ క్షేత్రాది ప్రాకృత భోగ్య పదార్థములను అన్నమాట. (2) (మేవినపొరుళ్-మేంపొరుళ్) అది ఇది యన్నట్లు కలసిపోయి అమరియుండు పదార్థము- అని రెండవ యర్థము దేహము ఆత్మతో విడదీయరాని విధముగా కలసియుండి 'అహం' శబ్దవాచ్యమై, దేహమే ఆత్మ (నేను) అన్నట్లు అమరియుండును గనుక, ఈ విధముగా "మేంపొరుళ్" అనబడినది దేహ మగును ఇక (3) వ అర్థము- (మెయ్‌ప్పాట్టైవిళైక్కుం పొరుళ్- మేంపొరుళ్) ఆత్మకు "నేనే దేవుడను, స్వతంత్రుడను, ఈశ్వరుడను, ఇదంతయు నాదే" అను అహంకార మమకారములను పెంచునట్టి పదార్థము "మేంపొరుళ్" అనబడుటచేత, దేహము, గృహారామ క్షేత్రాది రూపమగు ఐశ్వర్యముగూడ గ్రహింపబడును. ఇట్టి ప్రాకృత దేహ- భోగ్య పదార్థములను "పోగవిట్టుళ్"- విడచి, అని యర్థము. వాస్తవమునకు వీటిని తనంతట తానై విడిచిపెట్టుట ఏ జీవునికిని సాధ్యము కాదు.

వీని కర్మానుసారముగా ఈశ్వరుడు కర్మఫల భోగార్థమై ఇచ్చిన వీటిని "మమ మాయా దురత్యయా" అన్నట్లు ఎవడు త్రోసివేయగలడు? "మామేవ యే ప్రపద్యంతే" అన్నట్లు ఇచ్చిన ఈశ్వరుడే ఈ సంకెళ్ళను తొలగించవలెను. కావట్టి ఇచట "పోగవిట్టు" అన్నదానికి ఆ దేహేంద్రియాదులయందు ప్రాకృత భోగ్యముల యందును అహంకార మమకారములను భోగ్యతా బుద్ధినిగూడ విడిచిపెట్టి యుండవలెనని భావము దేహమాత్మకాదు స్వతంత్రము కాదు- అట్లనుకొనుట భ్రమ- గృహారామ క్షేత్రాదులు శాశ్వతానంద రూప పురుషార్థములు కావు. అట్లు భావించుటయు భ్రమయే- అను వాస్తవ జ్ఞానమును వాటిపై కలిగి యుండుటయే "మేంపొరుళ్ పోగవిట్టు" అను దానిచే బోధితమైన సారాంశము.

ఇక- "మెయ్‌మ్మైయై మిగవుణర్‌న్దు"- "మెయ్‌మై" అనగా- ఆత్మతత్వము దానివి బాగుగా తెలుసుకొనుట యనగా- ఈశ్వరుడు పరమాత్మ, నేను ఆయనకు శేషభూతుడనగు జీవుడను, అని జీవేశ్వరుల స్వరూపమును స్పష్టముగా గ్రహించుట. దేహమే ఆత్మయని చార్వాకాదులును, దేహాతిరిక్త నిత్యాత్మ కలడు కాని- వేరే ఈశ్వరుడు లేడని మీమాంసకులును, జీవేశ్వరులిద్దరును కలరుగాని- జీవునికి జ్ఞానము ఇంద్రియాది సంపర్కముచే కలుగు ఆగంతుక గుణమేనని తార్కికులును, ఇట్లు ఆయా మతస్థులు ఏవేవో చెప్పుదురు. అవేవియు వాస్తవము కావు. జీవుడు స్వయం ప్రకాశ నిత్య జ్ఞానానంద స్వరూపుడు మరియు జ్ఞానగుణకుడు, అణుస్వరూపుడు, ఈశ్వరునికే దాసుడు, ఆయనయొక్క దాసదాసులకును తాను విధేయుడు అను ఇట్టి వేద శాస్త్రోక్త జ్ఞానమును యధార్థముగా తెలసికొనుటయే "మిగవుణర్‌న్దు" అను దాని అభిప్రాయము

"అంపరిశు అరిందుగొండు"— వెనుక చెప్పినట్లు "పోగవిట్టు" అజ్ఞానము తొలగించుకొని, "మిగవుణర్‌న్దు" తత్త్వజ్ఞానము నొందినవానికి కర్తవ్యము, తన స్వరూపమునకు తగినట్లు భగవత్కైంకర్యము చేయుటయే గదా! ఆ భగవత్సేవ తనకు స్థిరఫలముగా వృద్ధినొందు విధము తెలిసికొని అని యర్థము. లోకమున జీవులకు కలుగు ఫలాపేక్ష వారివారి ఆత్మాభిమానానుసారముగా నుండును, పశుపక్ష్యాదులు తమను పశుపక్ష్యాదిరూపముగానే భావించుటచే వాటికి తృణాది రూపమగు ఆహారమే ఫలితముగా అపేక్షితమగును. మానవులకు దేహాత్మాభిమానమును బట్టి దేహవర్ధకమగు అన్నమే అపేక్షితమగును. దేవతలకు మేము దేవతలమను అభిమానముచే అమృతమపేక్షితమగును నేను దాసుడనని తత్త్వమునెరిగినవానికి ఆదాస్యమునకు తగు భగవత్కైం

కర్యమే అనురూప ఫలమగును. ''అరిందు-కొండు''— తన దాసత్వమును భగవంతుని స్వామిత్వమును తెలిసికొనుట, తదనుగుణముగా భగవద్దాస్యమును ఫలితముగా స్వీకరించుట- ఇదే జీవునికి ముఖ్యముగా జ్ఞాతవ్యాంశము.

''ఐంపుల అగత్తడక్కి''— పంచేంద్రియములను బైటికిపోనీయకుండ తన వశమునందేయుంచుకొని అని యర్థము. బాహ్యప్రాకృత పదార్థములపై భోగ్యతా బుద్ధిని విడిచి అనుఅర్థమునిచ్చు "మేంపొరుళ్ పోగవిట్టు" అను దానిలోనే ఇంద్రియ నిగ్రహ రూపార్థము ఇమిడియుండగా మరల నీ విషయమును విడిగా చెప్పనేల? అని సందేహము రావచ్చును. కాని ఇచట తాత్పర్యము వేరు. "అంపరిశు" అన్నప్పుడు చెప్పిన భగవత్కైంకర్యములోగూడ స్వార్థమును చూపక నిస్వార్థబుద్ధితో చేయవలెనని తెలుపుట ఇచట తాత్పర్యము. కైంకర్యరూప భగవత్సేవలో కొన్ని నియమములను చెప్పవలసియున్నది. తనకు ఇష్టమగు కైంకర్యమును చేయుదుననుట-అనగా నేను పుష్పమాలా కైంకర్యమునే చేయుదును- చందనమునే తీయుదును. ఆలయమును ఊడ్చుట, పాత్రశుద్ధి వంటివిచేయుట, మొదలగు పనులు చేయను అని కోరుకొనుట తగదు. మరియు ఈశ్వరునికి తనకును ఇష్టమైన కైంకర్యమునే చేయుదుననుటగూడ తగదు. ఈ రెండు పద్ధతులలోను కొంత స్వార్థమున్నదిగదా! అట్లుగాక ఈశ్వరసంతోషార్థమే ఏ కైంకర్యమైన చేయుదును, నా స్వార్థము అణుమాత్రమైనను లేదన్నట్లు సేవచేయుటయే ఉత్తమ భక్తుని ముఖ్యలక్షణము. ''ఉనక్కే నాం ఆళ్ శెయ్వోం" (మీకొరకే మేము సేవ చేయుదుము, మా కోసముకాదు) అని శ్రీ అండాళమ్మవారును, ''తనక్కేయాగ ఎనైక్కొళ్ళుమీదే" అని శ్రీ శఠకోపమునీంద్రులును భగవంతునికి విన్నవించినట్లు భక్తుడు సేవింపవలెనని ఈ ఇంద్రియ నిగ్రహోక్తిలోని సారాంశము.

ఇంతవరకు ఈ సగము పాశురముచే ద్వయ మంత్రములోని "శ్రీమతే నారాయణాయ నమః" అను ఉత్తర ఖండార్థము వివరింపబడినది అనగా ప్రాప్యమైన కైంకర్య ఫలము చెప్పబడినది. ఇక పై భాగముచేత సాధనాంతర పరిత్యాగ పూర్వకముగా భగవత్పాదారవిందములపై ఆత్మనిక్షేపమును చేయుటయను ఉపాయము చెప్పబడును, ఇదే "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" అను ద్వయమంత్ర పూర్వ ఖండార్థముగదా! ఎట్లనగా ''కాంబు అర తలైశిరైత్తు''- కాంబు అనగా- సాధనాంతరములు. దుష్కరములైన కర్మ జ్ఞాన భక్తి యోగాదులు. వాటిని ఆచరింపవలసిన బాధ్యత నాపైన కలదు అను అభిమానమును సమూలముగా తొలగించుకొని

అని దాని యర్థము. ఇచట "తల్లైశిరైత్తు" అననది గౌణ లాక్షణిక ప్రయోగము. తలను గొరిగించుకొని- అని దాని వాచ్యార్థము తలపై వెంట్రుకలను పెంచుట అభిమాన (అహంకార) హేతువు కాగా, వాటిని తీయించుటచే అభిమానమును తీసి వేసినట్లు భావించబడును రాజులు దోషిని శిక్షించునపుడు అతని తలను గొరిగించి వీధులలో త్రిప్పుమని ఆదేశింతురు. అట్లు చేయుట వాని యహంకారమును అణచు టకే గదా! ఏకాంతులుగాని సన్యాసులుగాని క్షవరము చేయించుకొనుటయు ఈ అభి మాన త్యాగమునకు సూచనమే వారిలో అహంకార మమకారములు పోయినవనుటకు ఆ బాహ్య లక్షణము (క్షవరము) సూచన. కనుక "కాంబర తల్లైశిరైత్తు" అనగా సాధనాంతరములను నేనాచరించి మోక్షము సాధించుకొనగలను అను అహంకార గర్భిత బుద్ధితోపాటు వాటిని (తలవెంట్రుకలు త్యజించినట్లు) తొలగించుకొని అని తాత్పర్యము. చరమ శ్లోకములోని "సర్వధర్మాన్ పరిత్యజ్య" అను దాని అర్థమిదే. అహంకారపూరితమగు ఆ స్వప్రవృత్తిని పూర్తిగా మానుకొనియే భగవంతునిపై సంపూర్ణముగా భారము వేయుట అనునది శరణాగతికి సమగ్ర స్వరూపము. ఇతర ధర్మములను గూడ చేయుచూ శరణాగతిని అనుష్ఠించుట స్వరూప విరుద్ధము. నన్ను నేను రక్షించుకొనగలను అను అభిమానమును ప్రవృత్తితోసహా పూర్తిగా విడిచియే సర్వ రక్షకునిపై భారము నుంచవలెను. వీడు తనపైగూడ కొంతబాధ్యతను ఉన్నట్లు అభిమానించునంతవరకును స్వామియు వీని రక్షణమున ఉదాసీనతను చూపుట సహ జమే. శాస్త్రీయ ప్రక్రియలో దీనినే "భగవత్ప్రవృత్తి విరోధి- స్వప్రవృత్తి- నివృత్తిః ప్రపత్తిః" అని లక్షణ నిర్వచనపూర్వకముగా పెద్దలు చెప్పుదురు.

శ్రీవేదాంత దేశికులవారును తమ పాదుకా సహస్రమున-

శ్లో॥ సాధయన్తి మురవైరిపాదుకే!
సాధవ స్త్వాయ ముపాయ మన్తిమమ్।
త్వత్ప్రవృత్తి వినివర్తనోచిత-
స్వప్రవృత్తి వినివర్తనాన్వితమ్॥

అను శ్లోకములో పై శాస్త్రీయ లక్షణమునే ఇమిడ్చి ఇట్టి శరణాగతియే చరమోపాయ మనిరి. అన్నము తినుటకు పూర్వము విధిగా స్నానమును చేయవలెనని (స్నాత్వా భుంజీత) ఆదేశించినట్లుగా శరణాగతికి పూర్వము ఉపాయాంతర పరిత్యాగము కర్తవ్య మని ప్రపత్తి శాస్త్ర నిర్ణయము.

“ఉ ణాకదై తలై యిరుందు-” సర్వ ధర్మములను విడచిన పిదప చేయవలసినది భగవత్పాదారవింద సన్నిధిని చేరుటయే. అంతేగాని సోమరియై పడియుండుటయో స్వేచ్ఛా సంచారము చేయుటయోగాదు

తమ క్షేమమునకై స్వప్రవృత్తిని మానుకొని, సర్వరక్షకునిదే భారమనియెంచి భగవదాలయ ప్రాంగణమును చేరియుండిన తిరుక్కణ్ణమంగై ఆండాళ్ అను మహా భాగవతుల వృత్తాంతము ఇచట ఉదాహరణముగా వ్యాఖ్యానములో చూపబడినది. ఆ విషయ మేమనగా:

వీరికి సంస్కృతమున శ్రీ లక్ష్మీనాథార్యులు అని నామధేయము. వీరు శ్రీనాథ మునుల శిష్యులలో నొకరు. శ్రీకృష్ణమంగళము అను క్షేత్రమున జన్మించిరి. వైది కోత్తములైన వీరొకనాడు భగవదాలయమునకు పోవుచుండిరి అపుడొక శూద్రుడు తన వాకిటి ముందు కావలియుండు కుక్కను మరియొకడు వధింపగా క్రోధముతో అతనిని వధించి పిదప తన ప్రియమైన శునకము మరణించెనుగదాయను దుఃఖముతో తానుగూడ కత్తితో పొడుచుకొని ఆత్మహత్యను చేసుకొనెను. అత్యాశ్చర్యమగు ఆ సన్నివేశమును అందరును చూచుచుండగా ఈ స్వామివారును తిలకించి, “తాను పెంచిన ఒక క్షుద్రజంతువుపైగల మమకారముచే దాని యజమాని ఇట్లు ఆత్మహత్యకు గూడ పాల్పడెనే సర్వేశ్వరుడు పరమదయాళువునగు భక్తవత్సలుడు తన పుత్ర ప్రాయులైన చేతనులకు ఆపద కలిగినపుడు ఎంతగా బాధపడునోగదా!” అని మన స్సులో ఆవేదనమునొంది, ఆనాటినుండియు భగవదాలయ ప్రాంగణముననే శునకము వలె నిత్యవాసము చేయుచూ స్వప్రవృత్తిని మానుకొని యదృచ్ఛాలాభ సంతుష్టులై జీవిత శేషమును గడిపి పరమపదము నొందిరి శరణాగతినిష్ఠుడిట్లుండవలెననుటకు వీరి చరిత్ర ముదాహరణము.

“ఇరుందువాళ్ణం”— “అథసోఽభయంగతో భవతి” అని శ్రుతి తెలిపినట్లు భగవత్పాద సన్నిధియే అభయస్థానమని యెంచి నిర్భర మనస్కుడై యుండవలెను. అదియే అతనికి ఉజ్జీవనము ‘వాళ్ణం శోంబరై యుగత్తిపోలం”— అట్లు నిన్నే నమ్మకొని స్వప్రవృత్తి విడచియుండు ప్రపన్నులపై నీకెంతటి ప్రేమయోగదా! శ్రీరంగనాథా! అని చిరునవ్వులొలుకు శ్రీరంగనాథుని ముఖారవిందమును చూచి విన్నవించుచున్నారు.

వాళ్లుంశోంబర్"- అనగా విశ్వాసముతో ఉజ్జీవించి స్వప్రవృత్తి రహితులై యుండు స్తబ్ధపురుషులని యర్థము. శోంబర్ అను పదము "సోమరులు" అను అర్థమును బోధించునదైనను ఇచట శాస్త్రవిశ్వాసములేక నాస్తికులై సర్వధర్మములను త్యజించి సోమరులై చెడి తిరుగునట్టి లౌకికులవలెగాక- భగవద్విశ్వాసముతో ఆయనయొక్క సన్నిధిని చేరి స్వప్రవృత్తినిమాని ఉజ్జీవించియుండు వారినే బోధించునని "వాళ్లుం" అను పదమునుబట్టి గ్రహింపదగును.

"అరంగమానగరుళానే"- ఈ శ్రీరంగక్షేత్రమున జల సమృద్ధియు చల్లని ఉద్యానవన తరుచ్ఛాయయు కలదని సంబరపడి నీవిచటికివచ్చి స్థిరవాసమొనర్చినట్లు అమాయకులు తలంతురు. కాని నీవు ఇట్లు ద్వయమంత్ర నిష్ఠులైన ప్రపన్నులెపుడు వచ్చి యాశ్రయింతురాయని వారికై ఎదురుచూచుచూ వీరు స్వప్రవృత్తిని మాని స్తబ్ధులైయున్ననూ నీవు రక్షణమునందు మాత్రము సోమరివికాక నిత్యజాగరూకుడవై యున్నావని తాత్పర్యము. "నిద్రాముద్రాం- నిఖిల జగతీ రక్షణే జాగరూకాం" అని భోజరాజు వర్ణించినట్లు శేషశాయియగు స్వామి యొక్క నిద్ర మానవులవలె మైమరచియుండు నిద్రకాదు అది యోగనిద్ర. సర్వజగద్రక్షణమును సావధానముగా జాగరూకతతో ఆలోచించుచుండు కపట నిద్రయని భావము

ఇట్లు పాశురము ఈ ప్రబంధమున చరమశ్లోకమువలె ప్రాధాన్యము వహించి అహంకార గర్భితములైన ఉపాయాంతరములను పరిత్యజించి శరణాగతిని చేసి భగవత్సేవయే నాకు పరమ పురుషార్థమని యెంచవలెనని ఉపదేశించు ద్వయ మంత్రార్థమును ప్రతిపాదించినది.

**(39)** అవతారిక : వెనుకటి పాశురము ద్వయ మంత్ర ప్రతిపాదితమైన అర్థమున సంపూర్ణనిష్ఠకలిగిన వారిపై స్వామికిగల అపారప్రేమను వివరించినది. అట్టి వారి ప్రభావమే ఇకపై పాశురములచే తెలుపబడుచున్నది. శ్రీశఠకోపమునీంద్రులు "పయిలుంశుడరొళి" "నెడుమాఱ్కడిమై" అను దశకములలో తెలిపినట్లు వీరును శరణాగతి నిష్ఠులగు భాగవతులు నిహీనజాతి వృత్తస్వభావములు కలిగియున్ననూ పూజనీయులేనని వీటిలో చెప్పిరి. అందు ప్రకృతగాథలో, నీచకులమున జన్మించిన వారుగూడ ఇట్టి నిష్ఠకలవారైనచో భక్తిహీనులై వేదవేత్తలైన బ్రాహ్మణులకంటె భగవంతునికి అత్యంతప్రియులై తులసీమాలవలె ఆయనచే శిరసావహింపబడుదురని నిరూపింపబడుచున్నది.

పా॥ అడిమైయిల్ కుడిమైయిల్లా అయల్ శతుప్పేది మారిల్
కుడిమైయిల్ కడైమై పట్టకుక్కరిల్ పిరప్పరేలుం ।
ముడియినిల్ తుళపం వైత్తాయ్ మొయ్కళర్కన్బుశెయ్యుం
అడియరై యుగత్తిపోలుం అరంగమానగరుళానే ॥

ప్రతి : అరంగమానగరుళానే! శ్రీరంగనాథా!, అడిమైయిల్- నీ సేవయందు, కుడిమైయిల్లా- ఆసక్తి లేనివారై, అయల్ శతుప్పేదిమారిల్- తద్భిన్నముగా చతుర్వేద పారకులై యుండే బ్రాహ్మణులకంటెను, కుడిమైయిల్- నీ సేవయందు, కడైమైపట్ట తత్పరులైన, కుక్కరిల్ పిరప్పరేలుం- శూద్రుల కులమున జన్మించినవారైనను, మొయ్ కళర్కు- నీ దివ్య పాదారవిందములకు, అన్బుశెయ్యుం అడియరై- భక్తితో కైంకర్యము సేయు భాగవతులను, ముడియినిల్- శిరస్సునందు, తుళబం వైత్తాయ్- తులసిమాలతో సమానముగా ఆదరించినవాడవై, ఉగత్తిపోలుం- సంతోషించెదవు గదా!

వివరణము : చతుర్వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణులైనను నీపై భక్తిలేనివారైనచో వారిని నీవు ప్రేమింపవు. భక్తిపూర్ణ హృదయులైనచో చండాలాది నీచ వంశ సంభూతులైననూ తులసిమాలవలె పవిత్రులని యెంచి వారిని శిరసావహింతువు. శ్రీరంగనాథా! నీవు "భక్తిక్రీతో జనార్దనః" అన్నట్లు భక్తులకు అమ్ముడుపోయిన వాడవు సుమా! అని దీని భావము.

భగవంతుడు సర్వ స్వామియనియు నేను ఆయనకు దాసుడననియు ఆయన సేవయే నాకు కర్తవ్యమనియు తెలిసికొనుటయే వేదాధ్యయనమునకు ప్రయోజనము. ఇట్టి జ్ఞానములేని వేదవేత్తలను బ్రాహ్మణులని చెప్పదగదు- అని ఈ క్రింది ప్రమాణము చెప్పుచున్నది.

శ్లో॥ విష్ణుభక్తి విహీనో యః-సర్వ శాస్త్రార్థవేద్యపి ।
బ్రాహ్మణ్యం తస్య న భవేత్-తస్యోత్పత్తిర్నిరూప్యతామ్॥

ఉన్నతకులమున జన్మించిననూ సంపూర్ణ వేదాధ్యయనము చేసిననూ భగవద్భక్తి హీనులు పూజనీయులు కారనియును- ఇక నీచకులమున జన్మించి తదనుగుణమగు వృత్తికలవారైనను భక్తిపరిపూర్ణ మనస్కులైనచో అందరికినీ పూజనీయులేననియు

సారాంశము. బ్రహ్మజ్ఞానము కలిగియుండుటకు కులముతో పనిలేదు. "సర్వత్ర ఖలు దృశ్యంతే" అన్నట్లు అన్ని కులములలోను బ్రహ్మవేత్తలు ఉందురు- అను విషయము శ్రీరామాయణమున గుహుడు- శబరి- వానరులు విభీషణాది రాక్షసులు- మొదలగు వారినిబట్టి స్పష్టమగుచున్నది. మరియు భారతమున విదురుడు- ధర్మవ్యాధుడు- గొల్లలు- గోపికలు మొదలగువారిని బట్టియు తెలియుచున్నది. తమోగుణ భూయిష్ఠమైన ఈ ప్రకృతి మండలమున అవిర్భవించిన ఇట్టి పరమ భాగవతులు సత్త్వగుణ ప్రచురమగు పరమపదమున నుండు నిత్యసూరులకంటెను చాలా గొప్పవారు సుమా! యని "శీతనై యే తొళువార్ విణ్ణుళారిలుం శీరియరే" అను ఆళ్వారుల సూక్తి నిబట్టి సువ్యక్తమగుచున్నది.

నిరహంకారు నిష్కళంక ప్రేమతో స్వామిని సేవించు ఇట్టి భక్తులే ఆయనకు అత్యంత ప్రీతి పాత్రులను విషయమును శ్రీకృష్ణకర్ణామృతమున లీలాశుకుడును ఇట్లు సమర్థించెను.

శ్లో॥ "గోపాలాజి రకర్దమే విహరసే, విప్రాధ్వరే లజ్జసే
బ్రూషే గోకుల హుంకృతైః స్తుతిశతై ర్మౌనంవిధత్సే సతామ్।
దాస్యం గోకులపుంశ్చలీషు కురుషే, స్వామ్యం న దాన్తాత్మసు
జ్ఞాతం కృష్ణ! తవాంఘ్రిపంకజయుగం ప్రేమ్ణా చలం మంజులమ్॥

కృష్ణా! నీవు గొల్లఇండ్ల ముంగిట బురదలో ఆడెదవుగాని బ్రాహ్మణోత్తములు చేయు యజ్ఞమునకు రమ్మని పిలిచినచో సిగ్గుపడెదవేల? గొల్లలు హుంకారముతో అదలించినను మాట్లాడెదవుగాని మహర్షులు మంత్రములతో స్తుతించినచో మాట్లాడవేల? గోపస్త్రీలకు సేవను చేయుటకు ఇష్టపడెదవుగాని జితేంద్రియులగు యోగీశ్వరులకు స్వామిగానుండుటకు ఇచ్ఛగింపవేల? ఓహో నీ సంగతి నాకు ఇప్పుడు అవగతమైనది. నిన్ను ప్రేమించువారికి మాత్రమే నీవు వశ్యుడవగుదువు. ఆ ప్రేమరూపమగు భక్తిలేనిచో ఎన్ని యజ్ఞ దాన తపఃకర్మలను చేసిననూ అట్టివారికి నీసేవ దుర్లభమే గదా! అని ఆ శ్లోకమునకు భావము

**(40)** అవతారిక : వెనుకటి పాశురమున చెప్పినట్లు నీచకులమున జన్మించుటయేగాక మొదట అతినింద్యమగు నడవడి కల్గియున్నవారుగూడనైనను, అనంతరము

భగవచ్ఛరణాగతిని చేసినవారైనయెడల పూర్వకృత పాపములన్నియు వారిని అంట కుండ నశించిపోవునని ఇందు నిరూపించుచున్నారు.

పా॥ తిరుమఱుమార్వ! నిన్నైచ్చిందైయుళ్ తిగళవైత్తు
మరువియ మనత్తారాగిల్ మానిలత్తుయిర్గళెల్లామ్,
వెరువఱ కొన్ఱు శుట్టిట్టు ఈట్టియ విన్నైయరేలుం,
అరువినైప్పయనదుయ్యార్ అరంగమానగరుళానే॥

ప్రతి : తిరు మఱు మార్వ!- లక్ష్మీదేవితోను శ్రీవత్సమను పుట్టుమచ్చతోను శోభితమగు వక్షస్సు కలిగిన, అరంగమానగరుళానే!- శ్రీరంగనాథా!, మానిలత్తు ఉయిర్గళెల్లాం- లోకమునందలి సర్వప్రాణులను, వెరువఱ- భయకంపితులగునట్లు కొన్ఱు- హింసను చేసియు, శుట్టిట్టు- తగలబెట్టియు, ఈట్టియ విన్నైయరేలుం- క్రూర పాపరాశిని (పూర్వము) ఆర్జించియున్నవారైనను, విన్నై- నిన్ను, చిందైయుళ్ తిగళవైత్తు- తమ హృదయములో ఉజ్జ్వలముగా నిలుపుకొని, మరువియ మనత్త రాగిల్- భక్తిపూరిత హృదయులైనయెడల, అరువినైప్పయనదు- ఆ క్రూర పాప ఫలమును, ఉయ్యార్- అనుభవింపరు.

వివరణము : తిరు- లక్ష్మి, మఱు- మచ్చ, వీటిని తన హృదయమున ధరించి యున్నవాడు గనుక భగవంతునికి శ్రీనివాసః అనియు శ్రీవత్స వక్షః అనియు నామములు ఏర్పడినవి ఆ రెండు లక్షణములును ఈయనయే సర్వేశ్వరుడనుటకు ముఖ్య చిహ్నములు. రెంటిని కలిపి ఇచట వీరు "తిరుమఱుమార్వ!" అను ఒకే సంబోధనములో చేర్చిరి. ఇట్టి ఓ రంగనాథా!- ఆశ్రితులలోని పూర్వ పాపములను చూచి స్వామి త్రోసివేయకుండునట్లు ఈమె నిత్య సన్నిహితురాలైయుండి ఆయన హృదయములో దయా వాత్సల్యాది గుణములను పెంపొందించి అనుగ్రహింప జేయునని సూచించుటకు ఈ సంబోధనము చేయబడినది. జీవుడు శరణాగతిని చేసినప్పుడును మోక్షదశలో కైంకర్యము నాచరించునపుడును గూడ ఈమె స్వామికి నిత్యాన పాయినియై యుండునని ద్వయమంత్రములోని రెండు వాక్యములలోను "శ్రీమత్" శబ్దము తెలుపుచున్నది గదా. ఈ వాస్తవమును శ్రీ శఠకోప మునీంద్రులు "అకల గిల్లేనిఱైయుం" అను పాశురములోను, శ్రీ విష్ణుచిత్తులు "నిళా వలమార్వినిల్వాళ్ గిన్రమంగైయుం పల్లాండు" అను చోటను ఆవిష్కరించిరి. వీరు వెనుక శరణాగతి

తత్వమును తెలిపిన "మేంపొరుళ్ పోగవిట్టు" అను పాశురమున గుంభనగా నుంచిన ఈ లక్ష్మీ వైశిష్ట్యమును ఇచట ప్రకటింపజేసిరి.

"నిన్నై చిందైయుళ్ తిగళ్ వైత్తు"- శ్రియఃపతివగు నిన్నే సాక్షాదుపాయమని మనస్సులో నిశ్చయించుకొని, ఆయనతోపాటు ఇతర సాధనములనుగూడ మనస్సులో తలంచి యున్నయెడల ఆయన సాక్షాత్సాధనమనునది మరుగునపడి పోవుటయే గాక బ్రహ్మాస్త్రమువలె ఫలితముగూడ వివ్వకుండ పోవునని గ్రహింపవలెను. ఈ శరణాగతి సఫలము కావలెనన్నచో పురుషకారభూతురాలగు లక్ష్మియు రక్షకుడగు భగవంతుడును మంత్రోపదేష్టయగు ఆచార్యుడును కర్తయగు తానును తప్ప మరెవ్వరి సంబంధముగూడ ఇచట అవసరమేలేదని సారాంశము.

"మఱువియమనత్తరాగిల్"- తాను స్వామికిచేయు కైంకర్యముచేత తనకేదో వేరే ఫలము కావలెనని స్వార్థభావన కలిగియుండుట కళంకమే. స్వామికి ముఖోల్లాసము కలుగుటయే నా సేవకు పరమార్థమైన ఫలమని ప్రపన్నుడు భావించవలెను. అట్టి మనశ్శుద్ధి కలిగియున్నయెడల- అని "ఆగిల్" అను పదము బోధించుచున్నది. ఆ పవిత్రభావన అందరిలోను ఉండదని భావము.

"మానిలత్తుయిర్ గళెల్లాం వెరువఅక్కొన్ఱు శుట్టిట్టు ..." ఇత్యాది. ఆ శరణాగతి నిష్ఠులైనవారు పూర్వము అనేక క్రూర హింసాది పాపములను చేసియున్నవారైనను అని వారి పూర్వపరిస్థితిని వివరించుచున్నారు. చూచినవారికిగూడ భయము కలిగించునంత క్రూరముగా జంతుహింసను చేయుట వాటిని జీవించియుండగనే అగ్నిలోవేసి తగులబెట్టుటవంటి ఘోరపాపమలను పూర్వము (పవిత్ర శరణాగతి రూప భావ శుద్ధి కలుగుటకు పూర్వము) చేసియున్నవారైనను- అని గ్రహింపవలెను. ఇట్టి సద్భావన కలిగిన పిదప మరల పాపప్రవృత్తి సంభవముకాదు గదా!

"అరువినై ప్పయనతుయ్యార్"- అట్టి పాపఫలమగు నరకాది దుఃఖములను పొందజాలరు. కర్మ ఫలప్రదుడు భగవంతుడే గనుక, ఆయన వీరికి పూర్వము కలిగించవలెనని సంకల్పించిన ఆ శిక్షలనన్నిటిని ఇతరులపైకి మరలించును. సముద్రునిపై క్రోధముతో ఎక్కుపెట్టిన బాణమును ఆ సముద్రుడు శరణాగతుడు కాగా అతని శత్రువులైన మరు కాన్తార ప్రాంతవాసులగు అసురులపై మరలించినట్లు ఆ భక్తుల శత్రువులపైకి సంక్రమింపజేయునని "ద్విషంతః పాపకృత్యాం" అను ఉపనిషద్వాక్యము తెలుపుచున్నది. లేక- కర్ణుడు ప్రయోగించిన సర్పశిరస్సును అస్త్ర

మును అర్జునునికి ప్రాణాపాయము లేకుండునట్లు తప్పించి అతని కిరీటమును మాత్రము పడవేయునట్లు కృష్ణుడు చేసెననియు భగదత్తుడు ప్రయోగించిన శక్తిని కృష్ణుడు తానే తన రొమ్ముతో అడ్డుకొని అర్జునుని కాపాడెననియు ప్రసిద్ధమే గదా! అట్లే పరమాత్మ ఈ భక్తులకును ఆ పాపఫలముల నంటనీయక రక్షించునని తాత్పర్యము. ఆ స్వామి "సర్వపాపేభ్యో మోక్షయిష్యామి" అని ఈ శరణాగతులకు అభయమిచ్చుచుండగా ఇక వీరికి పాపఫలానుభవ మెక్కడిది? "న కశ్చిన్నాపరాధ్యతి" (లోకములో అపరాధములు చేయనివారుందురా!) అని అర్థాపరాధులనుగూడ క్షమింపజేయు జగన్మాతయే ఒకప్పుడు పరిహాసమునకై స్వామితో "నీ దాసులందరు మహాదోషులే" అని ఛలోక్తిగా చెప్పినను ఈ స్వామి అందులకు సమాధానముగా "నా దాసులెన్నడును అట్టి పాపములు చెయ్యరు. అథవా చేసినను నా కొరకు (మన్నిమిత్తం కృతం పాపం- అపిధర్మాయ కల్పతే) అన్నట్లు మంచినే చేసిరి లెమ్ము" అని సమర్థించునని శ్రీ విష్ణుచిత్తులు తమ ప్రబంధమున "తామరై యాళాగిలుంశితకురై కక్కుమేల్.....- ఎన్నడియారదు శయ్యార్ శెయ్‌దారేల్ నన్ఱుశెయ్‌దార్" అను పాశురమున ప్రసాదించియున్నారు గదా! అట్టి మహోదారులగు దివ్య దంపతులు అభయప్రదులైన పిదప వీరికి నరకాది యాతనలెట్లు కలుగును? రాజాశ్రయము నొందిన వారిని బాధించగలవారెవరు?

**(41)** అవతారిక : భగవచ్చరణారవిందములపై శరణాగతిని చేసినవారు ఏజాతికిచెందినవారైనను ఎట్టి నడవడికలవారైనను పూజనీయులేనని చెప్పబడినది. అంతేకాదు. వారు తమ సంసర్గముచే నితరులకుగూడ పవిత్రతను కలిగించగలరు. అని ఈ పాశురమున నిరూపింపబడుచున్నది.

పా॥ వానుళార్ అరియలాగా వానవా! ఎన్బరాగిల్
తేనుళాం తుళపమాలై శెన్నియా! ఎన్బరాగిల్ ।
ఊనమాయినగళ్ శెయ్యుం ఊనకారకర్గళేలుం
పోనగంశెయ్‌ద శేడం తరువరేల్ పునిదమన్ఱే ॥

ప్రతి : వానుళార్- స్వర్గవాసులగు దేవతలచేత, అరియలాగా- తెలిసికొనరాని, వానవా! వైభవము కలవాడా! ఎన్బరాగిల్- అనికీర్తించెదరేని, తేనుళాం- మకరందమును స్రవించు, తుళపమాలై- తులసీమాలికను, శెన్నియా! శిరస్సున ధరించినవాడా ఎన్బరాగిల్- అని కీర్తించెదరేని, ఊనమాయినగళ్‌శెయ్యుం- నీచ వ్యాపారములను

చేసియున్నవారైనను, ఊనకారకర్గళేలుం- ఇతరులచే అట్టిపనులు చేయించువారైనను పోనగంశెయ్దశేడం- తాము భుజించగా మిగిలిన శేషమును, తరువరేల్- ప్రసాదించిన యెడల, పునిదమన్త్- అది మనకు పవిత్రముగదా! లేక-అన్తేపునిదం- ఆక్షణమునందే పవిత్రము చేయును.

<u>వివరణము</u> : ''వానుళారరియలాగావానవా''– ఇత్యాది. బ్రహ్మాదిదేవతలచేతగూడ నెరుంగరాని దివ్యధామము శ్రీవైకుంఠము. అందు నిత్యవాసము చేయువాడవు నీవు, అని నీ ప్రభావమును ఎవరు నోరారకీర్తింతురో తెలసికొనుటకే సాధ్యము కానపుడు ప్రవేశించుటకు అసలే అసాధ్యమని తాత్పర్యము. ఇతర విషయములలో మనుష్యులకంటే ఆబ్రహ్మాదులకు కొంత అధికశక్తియుండవచ్చునేమోగాని, భగవద్వైభవమును ఎరుంగలేకపోవుటలో వారు మనకు సమానులేగదా! మేడపై ఉన్నత స్థానమున ఉన్నంతమాత్రమున ఆ పరమపదము చేతికందునా! ఈత వచ్చినవాడుగాని రానివాడుగాని సముద్రమును ఈదలేకపోవుటలో అందరును సమానమేయైనట్లు శక్తి కలవారికి లేనివారికిగూడ భగవత్తత్త్వమును పూర్తిగా ఎరుగగలుగుట అసాధ్యమే. ''యమేవైషవృణుతే- తేన లభ్యః'' అని ఉపనిషత్తు తెలిపినట్లు ఆయన అనుగ్రహించినవారికి మాత్రమే అది సాధ్యముకాని "నేను ఈశ్వరుడను-లోకనాయకుడను" అని యహంకరించువారికి ఆయన సులభుడుకాడు.

"ఎన్నరాగిల్" హృదయపూర్వకముగా నిన్ను ఇట్లు ప్రార్థించిన యెడల- మరియు- "తేనుళాం తుళబమాలై శెన్నియా యెన్నరాగిల్"– మకరందమును స్రవించు తులసీమాలాలంకృత శిరస్కుడా! యని కీర్తించిన యెడల ఈ రెండు సంబోధనములచేతను ఆయనను పొందుటకు ఆయనయే ఉపాయమనియు, సర్వేశ్వరత్వ సూచకతులసీమాలనుబట్టి ఆయనయే పొందదగిన ప్రాప్యభూతుడనియు సూచితమైనది. ఇట్లు భగవంతుని కీర్తించువారు పరమపావనులు. అంతేగాక ఇతరులనుగూడ పవిత్రము చేయగలరు. "ఊనమాయినగళ్ శెయ్యుం ఊనకారకర్గళేనుం" ఇత్యాది. వారు పూర్వము బహునీచవృత్తికలవారును ఇతరులచే అట్టి పాపకార్యములే చేయించువారును అయియుండవచ్చుగాక. అయినను ఆ వృత్తి నిమాని ఇపుడు భగవన్నిష్ఠులైరి గనుక పూజ్యులే. అపుడు పొట్టకోసమై పరప్రాణి హింసను చేసిరి. నడిరాత్రి మాంసమును కొనుక్కొనుటకై ఎవరైన వచ్చినచో వారికై బ్రతికియున్న జంతువు శరీరమునుండి మాంసము కోసి అమ్మెడివారు. తమ వద్ద నుండు నౌకరులతోగూడ అట్టి పనినే చేయించేవారు. ఇది పూర్వం వారుచేసిన దుర్భర క్రూరప్రాణిహింస. పూర్వయుగము

లలో పరమదయాళువులైన వీరి ప్రవృత్తి మొదలగువాని తెలుపు శరీరమునందలి మాంస మును కోసి దానముచేయగా పీడ పూర్తిగా అందుకు భిన్నమైన హింస కలిగినవారు ఇది వారి పూర్వప్రవృత్తి కాని ఇపుడు భగవద్భక్తిపరులుగా మారిపోయిన పిదప మచ్చుకైనను ఆ లక్షణములు వారిలో లేవు. పైగా ఇపుడు ఇతరుల దుఃఖముతో మూర్ఛపోయినట్లో అతిశయించిన భక్తితో [illegible] మృదుస్వభావులైనారు.

ఒకనాడు భగద్రామానుజుల ముఖ్య శిష్యులైన శ్రీ కూరత్తాళ్వాన్ అనువారు కావేరికి స్నానమునకై పోవుచుండగా త్రోవలో నొక పాము కప్పను నోటితో కరచు చుండెను. ఆ కప్ప విలవిలలాడుచూ అరచుచుండెను అది చూచిన ఈ స్వాములవారు "అయ్యో! తన ఆక్రందన విని ఎవరో వచ్చి రక్షింతురని అరచుచున్నది కాబోలు! పాపము దీనినెవరు కాపాడగలరు" అని దుఃఖముతో మూర్ఛపోయినారట. అట్లు మృదుచిత్తులై యుండుటయే శ్రీ వైష్ణవ లక్షణమందురు. పూర్వ ప్రవృత్తికి భిన్న ముగా ఇంతటి మార్పు వారిలో కలిగిన పిదప వారు ఇపుడు ఆ పాపకృత్యములు చేయగలరా!

"పోనకం శెయ్‌ద శేదం...." ఇత్యాది- భగవంతునితో సమానముగా వీరును మనకు పూజ్యులే. భగవంతుడారగించిన శేష ప్రసాదమును మనము స్వీకరించునట్లు వీరు ఆరగించి యిచ్చిన శేష ప్రసాదమునుగూడ ఉచ్ఛిష్టమని యెంచక సుపావనమని భావించి స్వీకరింపవలెను. శ్రీ వైకుంఠనాధుడారగించిన శేషప్రసాదమునే నిత్యము భక్షించుటచేత శ్రీ విష్వక్సేనులవారిని "శేషాశనులు" అని పెద్దలు వ్యవహరింతురు. "త్వదీయ భుక్తోజ్ఝిత శేష భోజినా" అని స్తోత్ర రత్నమున శ్రీ యామునార్యులు ఈ పంగతినే తెలిపిరి గదా! శ్రీ విష్ణుచిత్తులును 'పల్లాండు' ప్రబంధమున "కలత్తు దుండు" అని ప్రసాదించి భగవద్భుక్త శేషమే తమకు భోజనమని తెలిపిరి ఆ భగ వచ్ఛేషమువలెనే ఇట్టి పరమపావనులైన భాగవతులయొక్క భుక్త శేషముగూడ మనకు స్వీకార్యమని భావము. ఇచట భుక్త శేషమనగా- ఆ భాగవతులు అరగించి విడిచిన పాత్రలోని ఉచ్ఛిష్ట ప్రసాదమేనని భావింపదగును.

అద్వైత సంప్రదాయమున ప్రచండ పండితులైన శ్రీ మధుసూదన సరస్వతీ స్వామివారు తమ కృష్ణభక్తిని ప్రకటించుకొనుచూ వ్రాసిన ఆనంద మందాకినీ స్తోత్ర ములలోని ఈ క్రింది శ్లోకమును సహృదయులు గమనింపుడు.

శ్లో॥ మధ్యాహ్నే యమునాతటే విటపినాం మూలే వయస్యైస్సమం
దధ్యన్నాన్యవభుజ్య రజ్యతి పునస్తత్క్రీడనే చ త్వయి
సాకేశః త్రిపురాంతకః కమలభూ రన్యేచ నాకాలయాః
కాకాకారజుషో ముహుః కబళయన్త్యుచ్ఛిష్టమిష్టం తవ॥

ఓ బాలకృష్ణా! నీవు మధ్యాహ్న సమయమున యమున యొడ్డున చెట్టు నీడలో పెరుగన్నము తిని గోపబాలురతో ఆడుకొనుచుండగా ఇంద్రుడు రుద్రుడు చతుర్ముఖుడు మొదలగు దేవతలు కాకుల రూపమునవచ్చి నీవు పారవేసిన విస్తరిలోని ఉచ్ఛిష్టాన్నపు మెతుకులను మాటిమాటికిని ఇష్టముగా తినుచుందురు- అని పై శ్లోకమున కర్థము.

ఇట్లు భగవత్ప్రసాదమును స్వీకరించగలుగుట సర్వసాధారణమేగాని భాగవత ప్రసాదము లభించుటయే అలభ్య లాభము. ఒకప్పుడు శ్రీ పరాశరభట్టరువారు "మెయ్ ప్పడి మేనియుం" అను తిరువిరుత్త ప్రబంధములోని పాశురమును గూర్చి వ్యాఖ్యానించుచుండగా వారి శిష్యులైన నంజీయర్‌స్వామివారు ఆచార్యులు తెలిపిన అర్థమునకు సంవాదముగా "ఇన్నారెన్నరియేన్" ఇత్యాది పరకాల మునీంద్రుల పాశురమును సూచించిరట. అందులకు మిక్కిలి సంతోషించిన భట్టరువారు అతి ప్రేమతో వారిని పిలిచి తాము ఆరగించిన భుక్తశేషమును (తళిగప్రసాదమును) అనుగ్రహింపగా శిష్యులగు నంజీయరువారు ధన్యోస్మియని స్వీకరించిరట.

"పునిదమన్దే"- ఆ భాగవత ప్రసాదము అతి పవిత్రము గదా! "తదుచ్ఛిష్టం సుపావనం" అను ప్రమాణమున చెప్పబడినట్లుగా భగవత్ప్రసాదము పావనమైతే భాగవత ప్రసాదము సుపావనమని భావింపవలెను. అన్దే- అప్పుడే, పునిదం- పవిత్రము చేయును. కాలాన్తరముననో దేశాన్తరముననోగాక స్పర్శవేధి ఇనుమును తక్షణమే బంగారముగా చేసినట్లు ఈ ప్రసాదము పవిత్రముగా చేయును.

<u>ఆశంక</u> : "ఉచ్ఛిష్టమపిచామేధ్యం- భోజనం తామస ప్రియమ్" అని భగవద్గీతలో ఇతరుల ఉచ్ఛిష్టము (ఎంగిలి) ను భక్షింపరాదని నిషేధింపబడెను గదా! అట్లు నిషిద్ధమైనది సుపావనమెట్లగును?

సమాధానము : "ఉచ్ఛిష్టం-గుర్వాదిభ్యోన్యేషాం భుక్తశిష్టమ్" అని పై గీతా శ్లోకము వద్ద శ్రీమద్రామానుజులవారి భాష్యసూక్తి. ఇతరులందరి భుక్తశేషము ఉచ్ఛిష్టమగునుగాని, పంచసంస్కారప్రదాతలైన ఆచార్యులు- ఉపనయన కర్తయైన

తండ్రి, జ్యేష్ఠభ్రాత - మరియు భార్యకు భర్త - వీరు భుజించిన పాత్రశేషము ఉచ్ఛిష్టము కాదని పై భాష్యసూక్తి తాత్పర్యము. అయితే భగవదేకనిష్ఠులైన భాగవతుల భుక్త శేషము ఈ పాశురములో చెప్పబడినట్లు స్వీకార్యమగునా కాదా అన్నది నిర్ణయింప వలసియున్నది. ఈ విషయమున శ్రీవైష్ణవ సంప్రదాయమునగల వడగలై-తెన్గలై శాఖలలో అభిప్రాయ భేదములున్నవి. మరియు భుక్తశేషమనగా భుజించిన పాత్రము లోని (విస్తరి- లేక కంచములోని) శేషమని కొందరును పాక పాత్రములో ఇతరు లకు వినియోగింపగా మిగిలినదేనని మరికొందరును అర్థము చెప్పుకొనుట జరుగు చున్నది.

(౧) శ్రీవేదాన్తదేశికులవారు పై గీతా భాష్యమును వివరించుచూ తెలిపిన అభిప్రాయమును సంగ్రహముగా మొదట వివరింతును. "ఉచ్ఛిష్టాశనవర్జం ఆచార్య వత్ ఆచార్య పుత్రే వృత్తిః" అను ఆపస్తంబసూత్రము ఆచార్యునివలె ఆచార్యపుత్రుని గూడ అభ్యుత్థానప్రణామాదులతో గౌరవింపవలెనని చెప్పుచూ ఉచ్ఛిష్టశేషమును మాత్రము ఆచార్యునివద్దనేగాని ఆచార్యపుత్రుని వద్ద స్వీకరింపరాదని నిర్ణయించు చున్నది. ఈ నిషేధమును బట్టి శాస్త్రవిహిత పద్ధతిలో మంత్రప్రదుడైన ఆచార్యుని వద్దనో తండ్రివద్దనో అన్నవద్దనో భార్య భర్తవద్దనో తప్ప ఇతరులవద్ద ఉచ్ఛిష్టమును స్వీకరింపరాదు. మరియు ఆగమప్రామాణ్యమను గ్రంథమున శ్రీ యామునమునీంద్రులు సనత్కుమారీయసంహితలోనిదిగా ఉదాహరించిన ఈ క్రింది శ్లోకమిచట పరిశీలింప వలసియున్నది.

శ్లో॥ "నిర్మాల్యం భక్షయిత్వైవ - ముచ్ఛిష్టమగురోరపి
మాసం పయోవ్రతోభూత్వా - జపన్నష్టాక్షరం సదా ।
బ్రహ్మకూర్చం తతః పీత్వా శుద్ధోభవతి మానవః" ఇత్యాది-

భగవద్భక్తుడైనవాడు గురువు వద్ద తప్ప ఇతరునివద్ద శేషవస్త్రము శేష మాలిక చందనము మొదలగు నిర్మాల్యమునుగాని భుక్తశేషమైన ఉచ్ఛిష్టమునుగాని స్వీకరించినచో ఒక మాసము రోజులు జలపాన మాత్రము చేయుచూ సదా అష్టాక్షరీ మంత్రమునే జపించుచూ బ్రహ్మకూర్చ తీర్థమును పానముచేసి- ఈ విధముగా ప్రాయశ్చిత్తమును చేసుకొనవలెనని ఈ శ్లోకమున కర్థము. ఈ ప్రాయశ్చిత్త విధిని బట్టి భగవద్భక్తునికి ఇతరోచ్ఛిష్టమును స్వీకరించుట అసలే పనికిరాదు. ఇక ఆచార్యు

డనగా గాయత్రీ ఉపదేష్టయో పంచసంస్కార ప్రదుడో గాని, ఇతర సామాన్య విద్యలు నేర్పినవాడు కాడు.

ఈ విషయమున కొందరు- ''నారాయణైకనిష్ఠస్య.... తత్పాదామ్బు అతులం తీర్థం, తదుచ్ఛిష్టం సుపావనమ్, తదుక్తి మాత్రం మంత్రాగ్ర్యం- తత్స్పృష్టమఖిలం శుచి''- ఇత్యాది ప్రమాణవచనము చూపి పరమైకాంతులగు భగవన్నిష్ఠులైన మహా భాగవతుల శ్రీపాద తీర్థమును వారి ఉచ్ఛిష్ట ప్రసాదమును పరమపావనముగా స్వీకరించ వచ్చుననియు, వారు రచించిన ప్రబంధములను వైదిక మంత్రములతో సమానముగా అనుసంధింపవచ్చుననియు, వారి శ్రీహస్త స్పర్శము పావనమగుననియు, ఏమేమో చెప్పుచున్నారు. కాని అది సరికాదు. ఆ ప్రమాణ శ్లోకము భగవన్నిష్ఠులగు ఆ భాగ వతుల వైభవమును ప్రశంసించుటకే చెప్పబడినది గాని, వారివద్ద విధిగా శ్రీపాదతీర్థ సేవన- భుక్త శేష స్వీకారాదులను చేయవలెనని తెలుపజాలదు. పై శ్లోకములో వారి హస్తస్పర్శము కలది అఖిలము పవిత్రమనియే చెప్పబడినదిగదా యని వారి హస్త స్పర్శచే చండాలుని పవిత్రుని చేయవచ్చునా? వారి స్పర్శనొందిన లశున- మాంస- సురాభాండాదులను పవిత్రములగునా? కనుక ఆ ప్రమాణము భాగవత ప్రభావమట్టిదని కేవలము ప్రశంసకొరకే చెప్పబడెనుగాని విధివాక్యము కాజాలదు. ఈ సందర్భమున పరమాప్తులలో పరిగణింపబడిన శ్రీ విప్రనారాయణ మునీంద్రులు రచించిన ఒక ద్రవిడ గాథను (అనగా- ''వామళారగియలాగా'' అను ప్రకృత పాశురమును) గూడ ఇట్లే సమన్వయించుకొనవలెను. ఆ పాశురమునకు మా సంస్కృతానువాదమిది-

శ్లో॥ దివ్యైరవేద్య విభవేతి యది బ్రువన్తి ।
మాధ్వీ మనోజ్ఞ తులసీక యదీతి చాహుః ।
ఊనక్రియాఅపి పరానపి కారయన్తః ।
భుక్తాధికం దదతిచేన్ననుతత్పవిత్రమ్ ॥

ఈ పాశురముగూడ అట్లు భగవన్నామ సంకీర్తమునందు గల ప్రభావమును ప్రశంసించినది మాత్రమేగాని విధి వాక్యము కాజాలదు. మరియు ఈ పాశురములో చెప్పిన భుక్త శేష పదమునకు పాకపాత్రస్థ శేషము అని యర్థమును చెప్పవచ్చును. శ్రాద్ధమునందు నియోగింపబడిన బ్రాహ్మణుల భోజనమైన పిదప ''అన్నశేషః కిం క్రియతాం? ఇష్టైస్సహ భుజ్యతామ్'' ఇత్యాది శ్రాద్ధ ప్రయోగ వాక్యములలో అన్న శేషమనగా పాకపాత్రస్థ శేషమనియే అర్థము గదా! ఆ శ్రాద్ధ భోక్తలు భుజించిన

తరువాత పాత్రలలో మిగిలిన ప్రసాదమును ఏమి చేయవలెనని ప్రశ్నింపగా దానిని బంధుమిత్రులతో కలసి భుజింపుడని సమాధానము చెప్పబడినది. అంతేగాని వారి ఎంగిలి విస్తళ్ళలోని మిగిలిన దానిని మీరు తినుడని ఆ వాక్యమునకు అర్థముకాదు అట్లే ఈ పాశురములోగూడ భగవన్నామ సంకీర్తన మొనరించిన భాగవతులు మొదట భుజించినను ఆ పాకపాత్రములోని మిగిలిన ప్రసాదమును స్వీకరింపవచ్చును అని యర్థమేగాని వారి ఉచ్ఛిష్టము స్వీకార్యమని యర్థము కాదు. ప్రపన్నుడగు వ్యక్తి ఇతరులు భుజించిన అనంతరము మిగిలిన పాకపాత్రములోని శేష పదార్థమునుగూడ భుజింపరాదు. ఈ నియమమును సడలించుటకే భగవన్నిష్ఠులైనవారు భుజించిన శేషము పాకపాత్రస్థమైనచో స్వీకరింపవచ్చునని ''నారాయణైకనిష్ఠస్య'' ఇత్యాది పూర్వోదాహృత శ్లోకమునకు ఈ పాశురమునకును అర్థము చెప్పవలెను. భోజన పాత్ర శేషము మాత్రము అసలే పనికిరాదు భగవదేకనిష్ఠుడు కానిచో అట్టి ఆచార్యుడు గూడ పరిత్యాజ్యుడే. మరియు ఉపనయనకర్తయగు తండ్రిగూడ భగవన్నిష్ఠుడుకానిచో భర్తయు అట్టివాడు కానిచో వీరందరి ఉచ్ఛిష్టము పరిత్యాజ్యమేనని ఈ సంప్రదాయస్థుల అభిప్రాయము.

(౨) ఇక తెన్గలై శాఖవారు- ఆచార్య శేషమునువలె పంక్తి పావనులైన పరమ భాగవతుల శేషమునుగూడ స్వీకరింపవచ్చుననియు, భగవత్ప్రసాదమును పరిహరించుట అపచారమైనట్లు ఈ భాగవత శేషపరిహారముగూడ అపచారమేననియు, భావింతురు. ఇందులకు ప్రమాణముగా వెనుక ఉదాహరించిన శ్లోకములను— "నారాయణైకనిష్ఠస్య.... తత్పాదాంబు అతులం తీర్థం- తదుచ్ఛిష్టం సుపావనమ్ ..." ఇత్యాదికములను చూపుదురు. ఇందులో విధిగా పాద తీర్థ ప్రసాదములను స్వీకరించవలెనని చెప్పు పదములేనందున ఇది ఆ భాగవతుల ప్రభావ ప్రశంస కొరకు చెప్పబడినదేననుట సరికాదు. ఎందుకనగా: "భగవద్భుక్త శిష్టం యత్- భుక్తం భాగవతేన యత్, తదేవ భోజ్యముద్దిష్టమ్...." అను మరొక ప్రమాణ శ్లోకములో స్పష్టముగా ''తదేవ భోజ్యం'' అని ఏవకారముతోను విధి ప్రత్యయముతోను భగవద్భాగవత శేషమునే తప్పక భుజించవలెనని ఇతర శేషము ముముక్షువునకు పనికిరాదని నిరూపింపబడియున్నదనియు, దీనినిబట్టి "నారాయణైక నిష్ఠస్య....తదుచ్ఛిష్టం సుపావనం"— అను శ్లోకము గూడ కేవలము అర్థవాద వాక్యములవలె ప్రభావ ప్రశంసాపరముగాగాక ప్రమాణముగానే పరిగణింపవచ్చుననియు భావింతురు.

మరియు- శ్రీయామునాచార్యులవారు చూపిన "నిర్మాల్యం భక్షయిత్వైవ ముచ్ఛిష్ట మగురోరపి-" ఇత్యాది శ్లోకమున గురుభిన్నులయొక్క ఉచ్ఛిష్ట-నిర్మాల్యాదులను గ్రహించినచో తద్దోష పరిహారార్థమై ప్రాయశ్చిత్తము విధింపబడినందున, "నారాయణైకనిష్ఠస్య"- ఇత్యాది శ్లోకమునుగూడ నారాయణైకనిష్ఠుడైన ఆచార్యుని పరముగానే అన్వయించుకొనవచ్చుననుటయు సరికాదు. "నారాయణైకనిష్ఠస్య" అను శ్లోకమునగాని ఆ శ్లోకముగల ప్రకరణమునగాని ఎక్కడను ఆచార్యుని గూర్చి ప్రస్తావనయే లేనందునను భగవన్నిష్ఠులగు వారి వైభవమే అంతట అసందర్భములో కనబడుచున్నందుననూ సర్వభాగవత విషయముగానే ఆ శ్లోకమును గ్రహింపవలెను గాని కేవలాచార్య విషయముకాదు. మరి యామునాచార్యులవారు చూపిన శ్లోకములో గురుభిన్నులైన వారి ఉచ్ఛిష్టభక్షణము పనికిరాదనియు అట్లు స్వీకరించినచో ప్రాయశ్చిత్తము చెప్పబడెనుగదా అనియు ఆక్షేపించుట సరికాదు. "ఆచార్యవత్ సన్తో ద్రష్టవ్యాః" ఇత్యాది ప్రమాణములనుబట్టి బ్రహ్మవేత్తలైన సత్పురుషులనుగూడ ఆచార్య సమానులుగానే భావించుట అవసరముగనుక, ఆశ్లోకములో 'అగురోరపి' అను పదమునకు 'గురువు' గురుసదృశులైన భాగవతులు- వీరివద్ద తప్ప ఇతర అభాగవతుల వద్ద శేష ప్రసాదమును స్వీకరింపరాదని అర్థమును గ్రహింపవలెను. ఒకవేళ స్వీకరించినచో ప్రాయశ్చిత్తమని భావము. ఇక "భుక్తశిష్ట"మనగా భోజనము చేసిన పాత్రమని (విస్తరి యని)గాక వారు తినగా మిగిలిన పాకపాత్రశేషమని అర్థమును చెప్పి "అన్నశేషః కిం క్రియతాం"- ఇత్యాదులను ఉదాహరణముగా చూపుటయు అనవసరమే. ఆ పదము భోజనము చేసిన పాత్రమని యర్థమునందు ప్రసిద్ధముగా వాడుకలోనున్నది గాని వంటపాత్రములోని శేషమని యర్థమున కాదు. భగవద్భుక్తశేషమనగా పాక పాత్రశేషమని అర్థముకాదుగదా! అచట భోజన పాత్రమని, ఇతరుల విషయమున పాకపాత్రమని, అర్థమును మార్చి చెప్పుట అనవసరము. కావున ఈ తిరుమాలై పాశురములో గూడ "పోనగంశెయ్దశేడం" అనగా భోజన పాత్రశేషమేననియు, పూర్వజన్మలలో హీనాచారులైనను భగవదేకనిష్ఠులై సద్వర్తనము కలిగిన అర్హతగల భాగవతుల శ్రీపాదతీర్థము, భుక్తశేషమగు ప్రసాదము స్వీకార్యమేగాని ఉచ్ఛిష్టమని పరిహరింపరాదనియు గ్రహింపవలెను. కనుక ఈ పాశురము భగవన్నామ సంకీర్తనపరుల వైభవమును మాత్రమే చెప్పునదియని భావింపరాదు. శ్రీరామానుజాచార్యులు తమ ఆచార్యులకు సబ్రహ్మచారులైన తిరుక్కచ్చినంబి (కాంచీపూర్ణులు)గారి వద్ద శేషప్రసాదమును స్వీకరింపదలంచి వారిని తమ గృహమునకు సాపాటునకై వేంచేయుమని ప్రార్థించుటయు, చివరకు తమ భార్య యొక్క అత్యాచారమువలన వారి తళిగ

ప్రసాదమును లభించలేకపోయితినేయని పశ్చాత్తాపము నొందిరనుటయు చరిత్ర ప్రసిద్ధమేగదా!!

**(42)** అవతారిక : జన్మమునుబట్టి నడవడినిబట్టి పూర్వము హీనస్థితిలోనుండిన వారైనను ద్వయమంత్ర బోధిత శరణాగతినిష్ఠులైన యెడల అట్టివారు ఇట్టి నిష్ఠలేని ఉన్నత కులాచారవంతులకుగూడ భగవంతునివలె పూజనీయులగుదురనియు, వారి వలన ఉపదేశమును ఆదాన ప్రదానాది వ్యవహారములను పొందుదగనియు ఇందు నిరూపింపబడుచున్నది.

పా॥ పళుదిలా వొళుగలాత్తుపలశతుప్పేదిమార్గళ్
ఇళికుత్తలవర్గశేలుం ఎమ్మడియార్గళాగిల్ ।
తొళిమినీర్ కొడుమిణ్ కొణ్మిణ్ ఎన్రునిన్నోడుమొక్క
వళిపడవరుళినాయ్పోల్ మదిళ్ తిరువరంగ తానే ॥

ప్రతి : మదిళ్‌తిరువరంగత్తానే!- ప్రాకార పరివేష్టితమగు శ్రీరంగమున వేంచేసి యున్న ఓ స్వామీ! ఒళుగల్ఆత్తు- అతి దీర్ఘమై ప్రవాహమువంటి వంశమునందు (జన్మించిన) పళుదుఇలా- దోషరహితులైన, పలశతుప్పేది మార్గళ్- చతుర్వేద వేత్తలైన ఓ బ్రాహ్మణులారా! ఇళికులత్తవర్గశేనుం- హీనకులమున జన్మించినవారైనను సరే- ఎమ్మడియార్గళాగిల్- మాకు దాసులైనయెడల (వారిని) నీర్ తొళుమిణ్- మీరు నమస్కరింపుడు, కొడుమిన్- కానుకలు సమర్పింపుడు, కొణ్మిణ్- వారి శేషమును స్వీకరింపుడు, ఎన్రు- అని, నిన్నోడుం ఒక్క- నీతో సరిసమానులుగా (భావింపుడని) వళిపడ- సద్గతి కలుగునట్లు, అరుళినాయ్‌పోల్- ఉపదేశించితివిగదా!

వివరణము : వరాహపురాణంలో శ్రీమన్నారాయణుడు భూదేవికి ఉపదేశించినట్లుగా చెప్పబడిన ఈ క్రింది శ్లోకానికి అనువాదంగా ఈ పాశురం అవతరించినది.

శ్లో॥ భక్తిరష్ట విధాహ్యేషా - యస్మిణ్ మ్లేచ్ఛేపి వర్తతే ।
తస్మైదేయం, తతోగ్రాహ్యం, సచ పూజ్యో యథాహ్యహమ్ ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! మీరు చతుర్ముఖుడు మొదలుకొని మీ వరకు వచ్చిన చతుర్వేదవేత్తలైన హరి పరిశుద్ధ వంశములో జన్మించిన వారైనను సరే-

మేమెంత గొప్పవారమని గర్వింపకుడు. "ఇక్ష్వాకు కులత్తు వర్గశేషం" - నిహీన వంశము నందు జన్మించిన మాదాసులెవరైనను కనపడినచో అట్టివారికి సాదరవందనము చేయుడు విదుర ధర్మవ్యాధాదులవలె నాపై సంపూర్ణ భక్తిభావన కలిగినవారు మీవలె ఉన్నత కుల జన్మము వేదాధ్యయనము కలిగినవారు కాకపోవచ్చును. సహజముగనే క్రింది కులమున జన్మించినవారు గనుక వారిలో ఇతరుల నవమానించి చెడిపోవుటకు హేతువులైన అహంకారాదులు ఉండవు. మీలో అవి కలుగుటకు అవకాశమున్నది. దానితో మీరు "విద్యామదో ధనమదః- తథా అభిజనజోమదః" అన్నట్లు గర్వించి ఆ భక్తులను అవమానింపక అనువర్తింపుడు నమస్కరించి సేవింపుడు. నాకు పత్రపుష్పాదులు సమర్పించి శేషమును స్వీకరించినట్లు వారికిని సమర్పించి వారిచ్చిన శేషమును మహాప్రసాదమని గ్రహింపుడు. అందువలన మీరు పవిత్రులగుదురు. హీన కులజుడైన కైశికుని అనుగ్రహముచే ఒక బ్రహ్మరాక్షసుడు తిరిగి పోయిన తన బ్రాహ్మణ్యమును పొందిన సంగతిని కైశిక పురాణములో మీరు విని యున్నారు గదా ! భగవత్సంబంధము యావదాత్మభావి గనుక వారితో కలుగు ఆ సంబంధమే నిత్యము ఉజ్జీవనహేతువుగూడ. మరియు వారు కోరినచో మీ వేదాన్త విజ్ఞానము నుపదేశింపుడు. మీకు తెలియని అంశమును వారివలన ఉపదేశ రూపమున తెలుసుకొనుడు.

ఓ రంగనాథా ! నీవిట్లు భూదేవికి తెలిపినట్లు పై వరాహ పురాణ శ్లోకమును బట్టి తెలియుచున్నది. హీనకులమున పుట్టినను పరమ భక్తులైన పాణన్ అనబడు తిరుప్పాణాళ్వారుల విషయమున శ్రీ రంగనాథాలయ ప్రధానార్చకులైన లోక సారంగ మునీంద్రులు అపచారము చేయుటయు తత్పాప పరిహారముగా భగవదాజ్ఞచే ఆయన స్వయముగా ఆ యాళ్వారులను తన భుజములపై నెక్కించుకొని వచ్చి భగవద్దర్శనము కలిగించి ఆదరించుటయు ఇచట స్మరణీయము. కైశికపురాణ కథ మా తత్త్వోపహారమున ఆముక్తమాల్యదా వ్యాసములోను శ్రీవచనభూషణాది మహా ప్రబంధములలోను పాఠకులు గ్రహింతురుగాక.

**(43)** అవతారిక : హీనకుల జనితులైననూ భగవదేకనిష్ఠులైన ఆ మహానుభావుల విషయమున అహంకారముతో ఉన్నత విద్యా జాత్యాదులు కలిగినవారెవరైనను దూషణకు దిగినయెడల ఉన్న బ్రాహ్మణ్యార్హత పోయి తక్షణమున చండాలత్వమును పొందుదురని ఈ పాశురమున తెలుపబడుచున్నది.

పా॥ అమరవోరంగమాఱుం వేదమోర్ నాన్గుమోది।
తమర్గళిల్ తలై వరాయ శాతియందణర్గళేనుం।
నుమర్గళై ప్పళిప్పరాగిల్ నొడిప్పదోరళవిలాంగే।
అవర్గళ్తాం పులై యర్ పోలుం అరంగమానగరుళానే॥

ప్రతి. అరంగమానగరుళానే- శ్రీరంగనాథా! ఓర్ అంగం ఆఱుం- సాటి లేని శిక్షా వ్యాకరణాది షడంగములను, ఓర్ నాన్గు వేదం- సాటిలేని చతుర్వేదములను అమరఓది- సక్రమముగానే నేర్చుకొని, తమర్గళిల్ తలై వరాయ- జ్ఞానవంతులైన భక్తులలో శ్రేష్ఠులై, శాతిఅందణర్గళేనుం- జాతినిబట్టి బ్రాహ్మణులే అయినను, నుమర్గళై- నీ భక్తులగు వారిని పళిప్పరాగిల్- దూషించిరేని నొడిప్పదోరళవిల్- ఒక్క చిటికె కాలములోనే, అంగే- అక్కడనే, అవర్గళ్తాం- ఆ బ్రాహ్మణ జన్మముననే, పులై యర్పోలుం- చండాలురైపోదురు సుమా!

వివరణము : ఓ రంగనాథా! నీ భక్తులైనవారు ఒకవేళ జాత్యాదులనుబట్టి నిహీనులేయైనను వారిని దూషించుట మహాపచారమే యగును. ఈ భాగవతాపచారము మహాఘోరమైనది. దీనికి నిష్కృతిలేదు. వీరిని దూషించువారు షడంగములతోపాటు వేదాధ్యయనం పూర్తిగా చేసినవారైనా సరే, బ్రహ్మవేత్తలుగా పేరుప్రతిష్ఠలు పొందిన వారైనా సరే ఈ అపచారఫలితముగా అప్పటికప్పుడే అక్కడే ఉన్నబ్రాహ్మణత్వము పోయి చండాలురై పోవుదురు. ఇది పరమ సత్యము గురుపుత్రుల శాపంచేత త్రిశంకు మహారాజు క్షణములో చండాల రూపమును పొందినట్లు వీరున్నూ కర్మ చండాలురుగా మారిపోవుదురు. ఈ అపచారమునుండి వీరి శాస్త్రజ్ఞానంగాని బ్రహ్మ జ్ఞానముగాని వీరిని కాపాడలేవు. చండాల వంశమున జన్మించినవానికి ఎప్పటికైనను ఉజ్జీవించుట కవకాశము కలదుగాని, ఈ భాగవతాపచారముచేసి కర్మ చండాలుడైన వానికి ఆ యోగ్యతగూడ లేదు గనుక ఇతడు జాతి చండాలునికంటెను అధముడు. అనాదికాల సంచితములైన పాపరాశులనుగూడ దహింపచేయగలదని ప్రశంసింపబడిన బ్రహ్మవిద్యగూడ ఈ భాగవతాపచారముతో నిష్ఫలమైపోవునని బ్రహ్మసూత్రకర్త వ్యాసుడు ముక్తిఫలానియమమను అధికరణములో సూచించియున్నాడు. అక్కడ శ్రీవేదాన్తదేశికులవారు అధికరణసారావళిలో "మైవం, తస్మాద్బలీయాన్ యదిభవతి పరబ్రహ్మభక్తాపరాధః తచ్ఛాన్త్యై తత్ప్రసూతిః ..." అనే శ్లోక ఖండమున ఈవిషయ మును వివరించిరి.

శ్రీ వచన భూషణమున శ్రీ లోకాచార్యులవారు భాగవతాపచారము ఎంత క్రూరమైనదో వివరించుచూ ఈ పాశురమునే ఉదాహరించి పిళ్లైపిళ్లైయాళ్వాన్ అను ఆచార్యులవారి జీవితములో జరిగిన ఒక మధుర సన్నివేశమును దృష్టాంతముగా ఉట్టంకించిరి. సంగ్రహముగా ఆ చరిత్ర యేమనగా-

శ్రీరంగమున పిళ్లై పిళ్లైయాళ్వాన్ అను ఒక శ్రీవైష్ణవులుండిరి. వారు శ్రీకూరత్తాళ్వాన్ స్వామివారికి శిష్యులు. సుప్రసిద్ధమగు ఆచార్య పురుష వంశమున జన్మించుటచేతను శాస్త్ర పాండిత్యాదులచేతను తాము గొప్పవారమని అభిమానము కలిగిన వీరు ఇతర శ్రీవైష్ణవులను దూషించుచుండిరి. వీరి ఆచార్యులైన శ్రీ కూరత్తాళ్వానులు "వీరిలో ఎంత జ్ఞానానుష్ఠానములున్ననూ ఈ భాగవతాపచార దోషము ఆ యోగ్యతలన్నింటిని అధఃకరించి ప్రబలమై ఆత్మవినాశ హేతువు కాగలదు. కనుక వీరిలో ఈ దోషమును పూర్తిగా అణచివేయవలెను'' అని నిశ్చయించుకొని సమయమునకై వేచియుండిరి. ఇంతలో ఉత్తరాయణ పుణ్యకాలము మకర సంక్రమణము వచ్చెను. ఆ సందర్భమున అందరును కావేరిలో స్నానముచేసి యథోచితముగా దానధర్మములు చేయుచుండిరి. అపుడు ఆచార్యులవారు శిష్యులగు పిళ్లైపిళ్లై ఆళ్వాను వద్దకుపోయి మీరు నాకు ఈ పుణ్య సమయమున ఒక దానము చేయవలెనని కోరిరి. అపుడాయన- "అయ్యా! నేను- నాది- అనదగు సమస్తము దేవరవారి శేషభూతులమే గదా! ఇక నేను దానము చేయుటయేమి?'' అని విన్నవింపగా, ఆచార్యులవారు మరల ఇట్లనిరి, ''అది నిజమేగాని, ఇకపైన నేను మనోవాక్కాయములతో యెట్టి భాగవతాపచారమును చేయను అని మీరు నా చేతిలో జలధారను విడిచి వాగ్దానము చేయవలెను". ఈ మాటను విన్నంతనే వారును కావేరిలో స్నానమాడి ఆ ఉత్తరాయణ సంక్రమణ దినమున ఆచార్యాజ్ఞానుసారము ఇకముందు అట్లు ప్రవర్తింపబోనని వాగ్దానముచేసి ఆచార్యులవారి చేతిలో జలధారను విడిచిరి. ఆచార్యులును సంతసించిరి.

అది మొదలుకొని భాగవతోత్తముల విషయమున వీరు అతి జాగ్రత్తగా ప్రవర్తించుచున్ననూ ఒకనాడు పూర్వ వాసననుబట్టి హఠాత్తుగా ఒక శ్రీ వైష్ణవుని దూషించి వెంటనే ఆచార్యులవారికిచ్చిన వాగ్దానమును గుర్తుచేసుకొని భాగవత దూషణమే గాక ఆచార్యాజ్ఞోల్లంఘనమను మహాపచారమునుగూడ చేసితినే యని మిక్కిలి

మనస్సులో భయపడి ఇక నాకు ఆత్మవినాశమేగాని సద్గతి లేదని నిశ్చయించుకొని తమ ఇంటనే ఆ రోజంతయు ముసుగు పెట్టుకొని పడుండి వెక్కివెక్కి ఏడ్చు చుండిరి. ప్రతినిత్యము తమ ఇంటికి వచ్చి సేవించు ఈ శిష్యుడు ఆనాడు రాక పోవుటచే ఆచార్యులవారే స్వయముగా వీరింటికి వచ్చి చూచి విచారగ్రస్తులై యుండు టకు కారణమేమని ప్రశ్నించిరి. అపుడాయన జరిగిన అపచారమును గూర్చి తెలిపి "మనోవాక్కాయములతో ఎట్టి భాగవతాపచారముగూడా జరుగకుండునట్లు మసులు కొనుట నా జీవితమున అసాధ్యమగుచున్నది దేవరవారికిచ్చిన వాగ్దానమును పాటింప లేని అభాగ్యుడనైతిని. ఇకనేమి చేయుదును" అని ఆచార్యులవారి రెండు పాదము లను గట్టిగా పట్టుకొని అతి దీనముగా దుఃఖించెను ఆచార్యులవారు అపుడు వారినిట్లు సముదాయించిరి- "చేసినదానికి మీరు ఇంతిగా పశ్చాత్తాపపడుచున్నందులకు నేను చాలా సంతోషించుచున్నాను. భగవంతుడు మానసికముగా చేసిన అపచారములను గట్టి పశ్చాత్తాపము కలిగినచో "పశ్చాత్తాపేన శుద్ధ్యతి" అన్నట్లుగా క్షమించగలడు. ఇక శారీరకముగా మీరు ఏ భాగవతులనుగూడ హింసింపరు. అట్లయినచో ప్రత్యక్ష ముగా రాజు దండించునను భయము మీలో సహజముగా నున్నది. కనుక కాయిక మానసికాపచారములు మీకు ఇకపైన సంభవింపబోవు. అందుచేత ఒక వాక్కును మాత్రము జాగ్రత్తగా మీరు నిగ్రహించుకొనుడు. చాలును." ఈ సందర్భమునుబట్టి ఆనాడు శిష్యులలో గల దోషములను తొలగించి సంస్కరించుటకు ఆచార్యులు ఎంతగా పాటుపడువారో, శిష్యులుగూడ ఆచార్యులపై ఎంత ప్రగాఢమగు గౌరవభావము కలిగి వారుచూపిన మార్గము నుండి రేఖామాత్రముగూడ తొలగకుండ జీవించుచూ బంధ విముక్తులైనారో, విశదమగుచున్నది. భాగవతాపచారము అతి క్రూరమైనది అనియు అది ఎట్టివారికైనను వినాశహేతువనియు స్పష్టమైనది.

**(44)** అవతారిక : వెనక- ప్రపన్నులగు భాగవతుల వైభవము, భాగవతాప చారమును "నక్షమామి వసున్ధరే:" అన్నట్లు ఎన్నటికిని భగవంతుడు క్షమింపడను విషయము, వివరింపబడినది. ఇదంతయు అతివాస్తవము. ఇందు అసంభవమేమియు లేదు. సమర్థులైన బ్రహ్మరుద్రాదులకును దుర్లభమైన భగవదనుగ్రహమును ఒక సామాన్యమైన తిర్యగ్జంతువు (గజము) శరణాగతిచేసి లభించుకొనగా వేరుచెప్పవల సినదేమున్నది? అని గజేంద్ర వృత్తాంతమును దృష్టాంతముగా చూపి, తామును అట్టి పరమ దయాళువు భక్తసులభుడునగు శ్రీరంగనాథునే శరణముగా నమ్ముకొన్నట్లు ఇందు నిరూపించుచున్నారు.

పా॥ పెణ్ణులాం శడై యినానుం, పిరమనుం, ఉన్నైక్కాణ్బాన్ ।
ఎణ్ణిలావూళియూళి తవం శెయ్‌దార్ వెళ్గినిర్ప ।
విణ్ణుళార్ వియప్పవన్దు ఆనైక్కన్ఱు అరుళై యీన్ద
కణ్ణురా! ఉన్నైయెన్నో కళై కణాక్కరుదుమాఱే ॥

ప్రతి : పెణ్ ఉలాం- గంగాదేవితో అలంకృతమైన, శెడైయినానుం- జడలు ధరించిన శివుడును, పిరమనుం- బ్రహ్మయును. ఉన్నైక్కాణ్బాన్- నిన్ను సాక్షాత్కరించుట కొరకై, ఎణ్ణిలా ఊళియూళి- లెక్కలేనన్ని యుగములలో, తవం శెయ్‌దార్- తపస్సు నాచరించినవారై, వెళ్గి నిర్ప- సిగ్గుపడుచుండగా, విణ్ణుళార్ వియప్ప- నిత్యసూరులుగూడ ఆశ్చర్యపడునట్లు, వన్దు- వచ్చి, అన్ఱు- మొసలిచే బాధపడిన ఆనాడు, ఆనైక్కు- గజేంద్రునికి, అరుళై ఈన్ద- నీ అనుగ్రహమును ప్రసాదించిన, కణ్ణురా! ఓ నిర్దయుడవగు రంగనాథా ఉన్నై- నిన్ను, కళై కణా- రక్షకుడవగునట్లు, కరుతుమాఱు- భావించవలసిన పద్ధతి, ఎన్నో- ఏదో! (ఎరుగకున్నాను )

వివరణము : రుద్ర బ్రహ్మేంద్రాదులుగూడ ఎన్నో యుగములు తపస్సుచేసి నిన్ను దర్శింపలేకపోయినందులకు సిగ్గుపడుచున్నారు. మేమింత శక్తి కలవారము కదా యని అహంకరించినవారికి నీవు దుర్లభుడవని భావము. అట్టి నీవు గ్రాహగ్రస్తమైన గజేంద్రుడు ఒక్కసారి శరణాగతుడైనంత మాత్రముననే చెప్పలేనంత ఆ వేగముతోవచ్చి దర్శనమిచ్చి రక్షించితివి. ఈ అకించనునిపై చూపిన దయ ఎంతో శ్రమించిన ఆ దేవతలపై కలుగలేదే? ఎంత నిర్దయుడవయ్యా రంగనాథా! అని భగవంతుని దయాగుణమును విపరీత లక్షణతో నిరూపించుచున్నారు. ఇది వ్యాజస్తుతి.

"పెణ్ణులాం శడై యినానుం"- పెణ్- అనగా స్త్రీ- ఇచట గంగాదేవియని అర్థము. ఆమెను తలపై నెక్కించుకొనియుండు రుద్రుడు భార్యను తలపై నెక్కించుకొని తిరుగు కాముకునికి భగవంతుని సాక్షాత్కారము సాధ్యమా? అని భావము. లేక - మహావేగముతో ఆకాశమునుండి వచ్చిపడిన బ్రహ్మాండమైన గంగా ప్రవాహమును జడలో బన్ధించగలిగిన శక్తి కలవాడను నేనే అని అహంకరించువానికి భగవంతుడు దర్శనమిచ్చునా? అని భావము. లేక- భగవత్పాదోదకమైన గంగను సదా శిరమున

ధరించి అతి పవిత్రుడనైన నాకు గాక మరెవ్వరికి స్వామి దర్శనము కలుగును? అని గర్వించువాడని భావము. ఆయన శ్మశాన ప్రాంతవాసియైనను "శివుడు" (పవిత్రుడు) అను నామధేయము నొందుట భగవత్పాద సంభూత గంగా జల ధారణముచేత నేనని ప్రసిద్ధమే గదా! శ్రీమధుసూదన సరస్వతీ యతివరుడు ఆనందమ-దాకినీ స్తవమున "యత్పాదాంబు విధాయ మూర్ధ్ని చితావాసః శివత్వం హరాత్ ప్రాప్తః" అని కీర్తించిన సంగతి ఇచట స్మరణీయము.

"విరమనుం"- ఆ శివునికిని తండ్రియగు చతుర్ముఖుడును. "బ్రహ్మా బ్రహ్మ విదాంవరః" అని ప్రశంసింపబడినట్లుగా బ్రహ్మవేత్తలందరికినీ బడినిపెట్టి బ్రహ్మ విద్యను నేర్పిన ప్రథమాచార్యుడను నేనని అహంకరించినవానికిగూడ ఆ పరమాత్మ దర్శనము అలభ్యమే "కడిక్కమలత్తుళ్ళిన్దుం కాణ్గిలా కణ్ణనడిక్కమలంతన్నై అయన్" అని చెప్పబడినట్లుగా సుగన్ధి భగవన్నాభీ పద్మమున సంభవించి అందే యున్నను భగవంతుని పాదపద్మములను దర్శింపలేని అన్నదే బ్రహ్మ అని భావము.

"ఉన్నైక్కాణ్బాన్"- వారిద్దరును నీ దర్శనమునకై గొప్ప తపస్సు చేసిరి. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని చెప్పినట్లు ఒక్క నీ ఆనంద గుణమునకే శ్రుతి అంతు తెలసికొనలేనపుడు అసంఖ్యేయ కల్యాణ గుణములు గల నిన్ను పూర్తిగా తెలసికొనగలుగుట వారికి సాధ్యమా? ఇతరులు తెలసికొనలేక పోవుటయేగాదు- నీవు గూడ నీ ప్రభావమెంతటిదో ఎరుగజాలవని "సో అంగః వేద. యదివా నవేద" అని శ్రుతియే చెప్పుచున్నది గదా! "తనక్కుం తన్ తన్మై అరవరియాన్" అని శ్రీ శఠకోపమునీన్ద్రులును ఆయన ప్రభావ మెంతగొప్పదో ఆయనకే తెలియదు పొమ్మనిరి.

"కాణ్బాన్"- దర్శించుటకై- అని యర్థము. "తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వాం" అని కఠోపనిషత్తు తెలిపినట్లు ఆ భగవంతుడే తానై తన విశ్వరూపము దర్శింపజేసినచో సాక్షాత్కరించుటకు సాధ్యముగాని, స్వప్రయత్నముతో ఎంత గొప్ప వారికైనను అది అసాధ్యమే "న చక్షుషా పశ్యతి కశ్చనైనం" అని శ్రుతియు "న మాంసచక్షుషా ద్రష్టుం- బ్రహ్మభూతస్సశక్యతే" అని స్మృతియు ఈవిషయమునే వెల్లడించినవి.

"ఎణ్ణిలాప్పూళ్లియూళి"– ఇత్యాది ఆ బ్రహ్మరుద్రులిద్దరును ఎన్నో యుగములు తపస్సులు చేసి చేసి చివరకు ఫలితము లేక "ఇక మన శక్తి చాలదు" అని సిగ్గుతో స్వప్రయత్నమును మానుకొనిరి. "యుగకోటి సహస్రాణి- దేవమారాధ్య పద్మభూః" ఇత్యాదిపురాణవాక్యములు ఇచట ప్రమాణము. తపస్సునుచేసిన ఋషులకో దేవాసురులకో ఫలితములనిచ్చు ఈ బ్రహ్మరుద్రులు తాము ఇపుడు తపస్సు చేయవలసి వచ్చినది. అయినను ఫలింపలేదనుటచేత సాహంకారులకు భగవంతుడు దుర్లభుడని తాత్పర్యము.

"పెళ్గినిర్ప"– మహాశక్తి సంపన్నులమగు మాకు అసాధ్యమేమున్నది? అని ప్రగల్భములు పలికి ప్రయత్నించిన వారిద్దరిని ప్రక్కనున్నవారు "అయ్యా! మీకు స్వామి దర్శనమైనదా! మమ్ములను గూడ దర్శింపజేయుడు" అని ప్రశ్నించినపుడు సిగ్గుతో తలవంచుకొనక తప్పలేదు. మొసలి నోటపడి ఆపదలో చిక్కుకొని ఒక్కసారి శరణాగతిచేసిన ఆగజరాజును రక్షించేనే! మనము ఆపాటిగూడ కాకపోయితిమే- అని సిగ్గుపడిరి.

"విణ్ణుళార్ వియప్ప వన్దు"- నిత్యసూరులైన అనంతగరుడ విష్వక్సేనాదులు గూడ గజేంద్రుని ఆక్రోశమును విన్నంతనే తత్తరపాటుతో పరుగులిడిన స్వామి యొక్క ఆరాటమునుచూచి ఆశ్చర్యపడిరి ఈ సందర్భమున భగవంతుని ఆ వేగమును శ్రీరంగరాజస్తవమున "అతంద్రిత చమూపతి ప్రహితహస్తం...." ఇత్యాది శ్లోకములతో శ్రీ పరాశరభట్టరు వారును, "సిరికింజెప్పడు శంఖచక్ర యుగము" ఇత్యాది పద్యములలో ఆంధ్రభాగవతకర్త పోతనామాత్యుడును వర్ణించిన అద్భుత వైఖరిని పాఠకులు ఆస్వాదింప ప్రార్థన.

"ఆనైక్కు అన్ఱు అరుళై ఈన్ద"- గజముయొక్క ఆర్తిని మాత్రమే కారణముగా గొని రక్షణకై వచ్చెను. ఆర్తత్రాణ పరాయణుడు స్వామియని భావము. ఈ ఆర్తియు శరణాగతియు లేనివారికి సాహంకారులైనవారికి స్వామి అనుగ్రహము దుర్లభమే

ఆర్తుడై ఆక్రందించిన ఆ గజేంద్రుని రక్షించినవాడు అంతకంటె ఎన్నోరెట్లు అధికముగా బాధితుడనైయున్న నన్నుగూడ శరణాగతిచేసిన పిదప రక్షింపకపోడు అని ఈ ఆళ్వారుల దృఢ విశ్వాసము. ఆ గజేంద్రుడు ఒక్క మొసలి నోటనే పడెను.

నేను పంచేంద్రియములను ఐదు మొసళ్ళ నోటపడితివి. ఆ గజేంద్రుడు ఒక పెయ్యేండ్లే బాధపడెను. నేను అనాదిగా సంసార బాధలలో పడితివి. ఆయన ఒక చిన్నకొలనులో దిగి మొసలితో బాధపడెను. నేను సంసార సముద్రములోనే వసి ఇంద్రియములనెడు ఎన్నో మొసళ్ళతో బాధపడుచుంటిని? స్వామీ! ఇంతటి ఆపత్తులోనున్న నన్ను చూసి రక్షింపవా?

"అరుళై ఈన్ద"- అనగా- దయను చూపిన అని యర్థము. దయ- అనగా "పరదుఃఖ దుఃఖిత్వము" అని పెద్దల నిర్వచనము. ఇతరుల దుఃఖములచూచి "అయ్యో అయ్యో"యని తానుగూడ బాధపడుటయే దయ ఎంతో ఆరాటముతో వచ్చిన ఆ స్వామి మొసలి నోటినుండి గజము యొక్క కాలును తప్పించి, గాయపడిన దాని కాలును తన శ్రీ హస్తములతో మాటిమాటికిని తడుముచుండెను. "కరస్థ కమలాన్యేవ- పాదయోరర్పితుం తవ" అని ఆక్రందించుచూ ఆ గజేంద్రుడు తన తొండముతో తనకు అర్పించుటకై ఎత్తిపట్టిన తామర పూవులను తానే మెడలో వేసుకొని ఎంతో ఓదార్చెను. అట్లే నన్నును స్వామి ఈ సంసార తాపత్రయమునుండి తప్పించి ఈనాటికి తన కైంకర్యములో అన్వయింపజేసి అనుగ్రహించినాడని వీరి అభిప్రాయము.

"కణ్ణురా!" గజేంద్రునిపై ఇంతటి అపారమైన దయచూపిన స్వామినిగూర్చి "నిర్దయుడా!" అని సంబోధించుట ఒక చమత్కారము స్వామియొక్క ఇట్టి దయా గుణమును ఆస్వాదించి వీరు పరవశులై అతి ప్రేమతో నిట్లనుచున్నారు. ఎంతో తపస్సుచేసి ప్రయత్నించిన బ్రహ్మాదులను కాదని ఈ ఒక తిర్యగ్జంతువును రక్షించితివే! ఇదేమి దయ? ఈ వైషమ్య బుద్ధి దయ యెట్లగును. అని ఆక్షేపించినట్లు పైకి తోచినను ఇది ఒకవిధమగు వ్యాజస్తుతి యనబడును.

"కః స్వర్ధుని వివేకస్తే- నయసే పాపినో దివమ్"- "ఓ గంగాదేవీ! నీకు ఎంత వివేకము లేదమ్మా! పాపిష్ఠులకుగూడ నీలో మునిగినంత మాత్రమున స్వర్గము నిచ్చెదవుగదా!"- అను వాక్యమువలెనే పరమ దయాళువగు భగవంతుని గూర్చి "నీవెంత నిర్దయుడవయ్యా!" అనుటయు వ్యాజస్తుతియే.

"ఉన్నైయెన్నో కన్నైకణా క్కురుడుమారే"- రంగనాథా! ఇట్టి నిన్ను సర్వ రక్షకుడవని ఎట్లు భావింతును? "దేవానాం దానవానాంచ- సామాన్య మధిదైవతమ్"

అని జితంతా స్తోత్రములో చెప్పినట్లు నిన్ను దేవతలకును దానవులకును సమానుడ వేసని భావించుట సరికాదేమో! అగతికులైన శరణాగతులకు మాత్రమే నీవు దయను చూపుదువని గ్రహించుట ఉచితమని భావము.

**(45)** అవతారిక : కృష్ణావతారమున కువలయాపీడమను మదగజమును మర్దించినట్లు ప్రబలమగు నా పాపరాశిని పారద్రోలిన శ్రీరంగనాధుడు సంతోషించునట్లు తులసీ కైంకర్యమును స్తోత్రకైంకర్యమును నెరవేర్చుటయే తమకు ప్రధాన ప్రయోజనమని చెప్పి ప్రబంధమును ముగించుచున్నారు,

పా॥ వళవెళుం తవళమాడ మదురైమానగరంతన్నుళ్
కవళమాలియానై క్కొన్ఱ కణ్ణనై య రంగమాలై
తుళపత్తొండాయ తొల్శీర్ తొండరడిప్పొడిశొల్
ఇళైయపుణ్ కవిత్తైయేలుం ఎంబిరార్కినియవాతే॥

ప్రతి : వళవెళుం- సౌందర్యాతిశయముతో నొప్పుచుండు, తవళమాడ- తెల్లని భవనములుగల, మదురైమానగరంతన్నుళ్ మధురు అను పేరుగల మహానగరమందు కవళమాలియానై - మదించియున్న కువలయాపీడమను ఏనుగును, కొన్ఱ- వధించిన కణ్ణనై- భక్తసులభుడైన, అరంగమాలై- శ్రీరంగనాయకునికి, తుళపత్తొండాయ- తులసీ కైంకర్యమును చేయు, తొల్శీర్- సహజశేషత్వబుద్ధిగల, తొండరడిప్పొడి శొల్- భక్తాంఘ్రిరేణు మునీంద్రుల ఈ ప్రబంధము, ఇళైయ- కొద్ది శబ్దములతోకూడిన పుణ్కవిత్తైయేలుం- దోషములు గల రచనయేయైనను, ఎంబిరార్కు- మారంగనాధ స్వామికి, ఇనియవాతే- భోగ్యముగనే యున్నది.

వివరణము. ఇది ఈ శ్రీమాలికా (తిరుమాలై) ప్రబంధమున చివరి పాశురము. మా రంగనాథునికి ఇది అత్యంత ప్రీతికరమైనది యగుగాక యని వీరి ప్రార్థన. స్తుతిచే ప్రసన్నుడైన స్వామి తమకేదో ఫలితము నివ్వవలెనని వీరి కోరిక కాదు తమ కైంకర్యముచే కలుగు స్వామియొక్క మనస్సంతోషమే తమకు కావలసిన ఫలితమని ప్రపన్నుని ఆశయముగదా! "కదాహ మైకాంతిక నిత్య కింకరః- ప్రహర్షయిష్యామి సనాథ జీవితః" అని స్తోత్రరత్నమున శ్రీ యామునాచార్యులవారు ప్రసాదించిన శ్లోకమునకు తాత్పర్యమిదే. ప్రహర్షయిష్యామి'' అను క్రియాపదమే

ఇపట జీవనాడివంటిది. నేను ఏకాంతమున నీకు నిత్య కింకరుడనై సేవలు చేయుచూ ఎపుడు నిన్ను సంతోషపెట్టగలనో గదా" యని దాసి భావము. "కదా అహం ప్రహృష్యామి" (నీ సేవనుచేసి నే నెప్పుడు సంతోషింతునో) అని చెప్పక "ప్రహర్ష యిష్యామి" నిన్ను సంతోషపెట్టుదునో అనుటనుబట్టి ఆ సేవలో స్వార్థబుద్ధిలేదని స్పష్ట మగుచున్నది గదా! అదేవిధముగా వీరును తమ ఈ స్తోత్రముచే స్వామిని సంతోష పెట్టుటయే పరమ ప్రయోజనమని భావించినట్లు "ఎంబిరార్కినియవారే" అను వాక్యమును బట్టి తెలియుచున్నది. అయితే ఈ స్తుతిలో స్వామిని మెప్పించుటకు ఏమి విశేషమున్నది? అన్నచో, ఏమియు లేదు- ఇది "ఇళైయపుణ కవిశైయేలుం" అన్నట్లు చిన్నచిన్న పదములతోను దోషములతోను కూడిన రచనయేగాని ప్రౌఢమగు శబ్ద సందర్భమో గుణాలంకారాదులో కలది కాదు ఇట్టి రచన హేయమేగాని సంతోష ప్రదమెట్లగును? అన్నచో "తుళబత్తొండాయ... అడిప్పొడిశోల్" "వీడు నాకును నా భక్తులకును విధేయుడగు దాసుడై తులసీ కైంకర్యపరుడై మా పాదధూళిచే పవిత్రుడు" అని స్వామికి నాపైన అపారమైన ఆత్మీయత కలదు. అందుచే బాలుని బుల్లిబుల్లి మాటలను విని యానందించు తల్లిదండ్రులవలె స్వామి నా ఈ రచనను విని ప్రహర్షము నొందగలడు.

ఇంతకునూ ఈ స్తుతి ఎవరినిగూర్చి?- "వళపెళుంతవళ ... అరంగమాలై"- ఆనాడు కృష్ణావతారమున సుందర భవనాలంకృత మధురానగరములో కువలయాపీడ మను మదగజమును మర్దించి సర్వనాగరికులకు నయనానందకరుడైన బాలకృష్ణుడే నేడు శ్రీరంగనాథుడై ఇచట మావంటివారి పాపరాశిని పోగొట్టి రక్షించుటకై వేంచేసి యున్నాడు. అట్టి స్వామినిగూర్చి. ఇట్టి ఈ చిన్న స్తోత్రము స్వామికి సంతోష ప్రదమగుగాక యని ప్రబంధమును ముగించి శ్రీ విప్రనారాయణ మునీంద్రులు తాము సుందరముగా గుచ్చిన తులసీ మాలలతోపాటు ఈ శ్రీసూక్తిమాలికను (తిరుమాలై స్తోత్రమును) గూడ శ్రీరంగనాథుని శ్రీపాదపద్మములపై సమర్పించి కృతార్థులైరి.

వెనుకటి పాశురమున ఒక గజేంద్రుని రక్షించినట్లును, ఈ పాశురమున మరొక గజేంద్రమును శిక్షించినట్లును చెప్పుటవలన, స్వామి ఆర్తత్రాణ పరాయణుడనియు,

భక్తుల ఆపదలను పాపరాశిని సమూలముగా నశింపజేయువాడనియు సూచితమైనది. ఈ చివరి పాశురమున ఫలశ్రుతి యేమియు చెప్పబడలేదేయని కొందరు సందేహింప వచ్చును. దీనిని రచించిన ఈ ఆళ్వారులు ఏ ఫలమును అపేక్షించిరో ఆ భగవన్ముఖోల్లాస రూపమగు ఫలమే ఈ ప్రబంధమును భక్తితో అనుసంధించువారికిగూడ లభించగలదని చెప్పకయే చెప్పినట్లయినది. ఆ యాళ్వారులవలె దీనిని అనుసంధించినవారును సర్వ పుణ్యపాప విధూననమునొంది భగవదనుగ్రహ పాత్రులు కాగలరని సారాంశము. శ్రీ రామాయణ పారాయణము చేసినవారికి "ప్రీయతే సతతం రామః" అని రామానుగ్రహము నిరంతరముగా సిద్ధించునని చెప్పబడెను గదా.

శ్లో॥ ఇతి భాగవతాంఘ్రిరజః కవినా
రచితాం కృతిమద్భుత భావభృతాం।
రఘునాథ బుధోఽత్ర వివృత్య సతాం
హృదయేషు విధిత్సతి హర్షభరమ్॥

శ్లో॥ అల్పాపి గంధబహుళా తులసీవ భూయా
దేషాకృతిః విమలభక్తిమయీ మయాద్య।
శ్రీరంగరాజ పదపంకజయోర్నివిష్టా
తస్య ప్రహర్షభరమాదధతీ చిరాయ॥

49557

# ఆస్వాదించండి

## సత్సంప్రదాయ పరిరక్షణసభ ప్రచురణలు

1. **సత్సంప్రదాయసుధ :** శ్రీ వైష్ణవ సంప్రదాయమునకు చెందిన మధుర ఘట్టములకు వివరణపరమైన 50 వ్యాసములుగల గ్రన్థము
వెల : 10-00

2. **సిద్ధాంతత్రయ సంగ్రహము :** ద్వైత - అద్వైత విశిష్టాద్వైతములపై సంగ్రహ వివరణము వెల : 8-00

3. **తత్త్వోపహారము :** సంప్రదాయ పరములైన కొన్ని మధుర రహస్యములతోను, ఆముక్తమాల్యద కావ్యముపై సాంప్రదాయిక విపుల విమర్శముతోను కూడిన గ్రన్థము వెల : 20-00

4. **క్షమాషోడశి :** సంస్కృతాన్ధ్ర వ్యాఖ్యాన సహితము వెల : 5-00

5. **ఈశావాస్యోపనిషత్ :** ప్రతిపదార్థ, తాత్పర్య, వ్యాఖ్యాన విశేషార్థములతో వెల . 12-00

6. **విశిష్టాద్వైత వైభవము :** భగవద్రామానుజ దర్శనముయొక్క వైశిష్ట్యము- దానిపై వచ్చిన కువిమర్శలకు సమాధానము వెల : 20-00

7. **క్షమాషోడశి :** సభచే ప్రచురింపబడిన ఆంధ్ర వ్యాఖ్యానమునకు ఆంగ్లానువాదము వెల : 3-00

Venkataramana Book Printers, Warangal-2. Phone : 24972